సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 166

గురువారం 2-3-2023




'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'



**నంబర్ వన్ అశ్విన్**


ఐసీసీ టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో భారత్ స్పిన్నర్ - 12లో



**యాక్సిస్ గూటిలో సిటీ రిటైల్**

దేశీ బిజినెస్ కొనుగోలు పూర్తి.. రూ. 11,603 కోట్లు చెల్లింపు - 13లో


SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

**ఢిల్లీ కేబినెట్‌లోకి కొత్త ముఖాలు**

ఆప్ ఎమ్మెల్యేలు ఆతిషి, సౌరభ్ భరద్వాజ్‌లను మంత్రులుగా నియమించాలని ఎల్జీకి ముఖ్యమంత్రి కేజ్రీవాల్ సిఫార్సు చేశారు.

వివరాలు 6లో ▸



**ఘోర రైలు ప్రమాదం**

గ్రీస్‌లో ఎదురెదురుగా వస్తున్న ప్రయాణికుల, సరకు రవాణా రైళ్లు ఢీకొన్న దుర్ఘటనలో 36 మంది మృత్యువాతపడ్డారు.

వివరాలు 6లో ▸



**రాహుల్ నయా లుక్**

బ్రిటన్ పర్యటనలో ఉన్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ గడ్డం ట్రిమ్ చేసుకుని, చక్కని సూట్‌లో కొత్త తరహాలో కనిపించారు.

వివరాలు 6లో ▸



**చట్టాలకు లోబడి పని చేయాల్సిందే**

భారత్‌లో పనిచేసే సంస్థలన్నీ చట్టాలకు లోబడి నడుచుకోవాల్సిందేనని బ్రిటన్‌కు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

వివరాలు 6లో ▸

## న్యూస్‌రీల్

### పెళ్లికి ఒప్పుకోలేదని యువతి దారుణ హత్య



పెళ్లికి నిరాకరించిందన్న కోపంతో ఓ యువకుడు ప్రియురాలిపై దారుణానికి ఒడిగట్టాడు. ప్రియురాలి ఛాతి, పొట్ట, భుజం, గొంతుపై ఇష్టానుసారంగా కత్తితో పొడిచి ప్రాణాలు తీసిన ఘటన బెంగళూరు తూర్పు మురుగేశ్‌పాళ్య రోడ్డు ఒమెగా హెల్త్ కేర్ వద్ద జరిగింది. హతురాలు, నిందితుడు తెలుగువారు కావడం గమనార్హం.

వివరాలు 3 ▸

### తొలిరోజే రూ.1,488 కోట్లు పింఛన్ల పంపిణీ



ఠంఛన్‌గా 1వ తేదీనే రాష్ట్ర వ్యాప్తంగా 54,01,241 మందికి రూ.1,488.02 కోట్ల మొత్తాన్ని ప్రభుత్వం పింఛన్ల రూపంలో పంపిణీ చేసింది. తొలి రోజున 84.84 శాతం మందికి పంపిణీ పూర్తయింది.

వివరాలు 2 ▸

### ఇంధన సామర్థ్యంలో ఏపీనే టాప్



ఇంధన పొదుపు, సామర్థ్యంలో వినూత్న ప్రణాళికలతో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఇంధన సామర్థ్య కార్యక్రమాల అమలుకు ఏపీ అనుసరిస్తున్న 'రాష్ట్ర స్థాయి స్టీరింగ్ కమిటీ (ఎస్ఎల్ఎస్సీ)'కి జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది. ఏపీని ఆదర్శంగా తీసుకుని 18 రాష్ట్రాలు ఈ విధానాన్ని అనుసరిస్తున్నాయని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ తెలిపింది.

వివరాలు 10 ▸

# వనరులు పుష్కలం.. అవకాశాలు అపారం

**974 కి.మీ సుదీర్ఘ తీర ప్రాంతం, నిరంతరాయమైన విద్యుత్ సరఫరా అందుబాటులో**

- పారిశ్రామికవేత్తల అభిప్రాయాలకు అనుగుణంగా ప్రోయాక్టివ్‌గా ముందుకెళుతున్నాం
- అందుకే గతంలో ఎన్నడూ రాని అంబానీ, బిర్లా, అదానీ, బంగూర్, బజాంకా, దాల్మియా ఇప్పుడు వస్తున్నారు
- 11 పారిశ్రామిక కారిడార్‌లు దేశంలో వస్తుంటే.. అందులో 3 మన రాష్ట్రంలోనే వస్తున్నాయి
- ఇక్కడ 48 రకాల ఖనిజాలు లభ్యమవుతున్నాయి.. ఖనిజాధార పరిశ్రమలకిది అనుకూలం
- 82 గిగావాట్ రెన్యూవబుల్ ఎనర్జీ కెపాసిటీ, 34 గిగావాట్ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు అవకాశం ఉంది
- భవిష్యత్తులో గ్రీన్, హైడ్రో ఎనర్జీల్లో ఏపీదే కీలక పాత్ర
- జీఐఎస్ నేపథ్యంలో జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సీఎం వైఎస్ జగన్ వ్యాఖ్యలు



"మేము అమలు చేస్తున్నవి కేవలం ఉచిత పథకాలు కాదు. ఇదంతా మానవ వనరుల మీద పెడుతున్న పెట్టుబడిగా మేం భావిస్తున్నాం. మానవ వనరుల నైపుణ్యాభివృద్ధిగానే చూస్తున్నాం. ప్రభుత్వం అలా ఆలోచించకపోతే ప్రగతి సాధించలేం. మా విద్యార్థులు సొంత కాళ్ల మీద నిలబడి, ఉన్నత స్థానాలకు ఎదగడానికి అవసరమైన వనరులను సమకూరుస్తున్నాం. అందుకోసం విద్యా ప్రమాణాలు పెంపొందిస్తున్నాం. అభివృద్ధిలో వారిని భాగస్వాములను చేస్తున్నాం.

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: 'పరిశ్రమలు నెలకొల్పడానికి అన్ని విధాలా అనువైన వాతావరణం, వనరులు మన రాష్ట్రంలో ఉన్నాయి. 974 కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతం, నిరంతరాయమైన విద్యుత్ సరఫరా, కొత్తగా ఏర్పాటవుతున్న 4 పోర్టులు, నాణ్యమైన వనరులు.. ఇవన్నీ పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత అనుకూలమైన అంశాలు. పోర్టు ఆధారిత పరిశ్రమలకు రాష్ట్రం అత్యంత ఆకర్షణీయం. ఇక్కడ గ్రీన్ ఎనర్జీ రంగంలో అపార అవకాశాలున్నాయి. దేశంలో 11 పారిశ్రామిక కారిడార్‌లు రాబోతుంటే... అందులో మూడు మన రాష్ట్రంలోనే వస్తున్నాయి. మూడు పారిశ్రామిక కారిడార్‌లున్న ఏకైక రాష్ట్రం కూడా మనదే' అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. విశాఖపట్నంలో శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జరిగే 'గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్' నేపథ్యంలో బుధవారం ఆయన కొందరు జాతీయ మీడియా ప్రతినిధులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఇంటర్వ్యూ ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే...

- పెట్టుబడికి ఉన్న అవకాశాలను, పరిశ్రమల ఏర్పాటుకున్న అనుకూలతలను పారిశ్రామికవేత్తలకు వివరించడం ద్వారా ఈ రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావడం సదస్సు లక్ష్యం. పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత సానుకూల వాతావరణం రాష్ట్రంలో ఉంది. ప్రభుత్వం తొలి నుంచీ

మిగతా 2వ పేజీలో ▶

# అతిథుల ఆగమనం..

**విశాఖ జీఐఎస్‌కు తరలి వస్తున్న పారిశ్రామిక దిగ్గజాలు**

- ప్రత్యేక అతిథులుగా అంబానీ, బిర్లా, అదానీ, బజాజ్, జిందాల్, భజాంకా, దాల్మియా, బంగర్ తదితరులు
- రెండు రోజులు నగరం నుంచే కేంద్ర మంత్రుల కార్యకలాపాలు
- వాస్తవ పెట్టుబడులే లక్ష్యంగా గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ నిర్వహణ
- ఇప్పటివరకు 12,000 దాటిన రిజిస్ట్రేషన్ల సంఖ్య



విశాఖలోని ఏయూ గ్రౌండ్స్‌లో జరగనున్న జీఐఎస్‌లో ఏర్పాటు చేసిన స్టాల్స్

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను రప్పించడం, ఉపాధి కల్పనే లక్ష్యంగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ (జీఐఎస్)లో పాల్గొనేందుకు కార్పొరేట్ దిగ్గజాలు విశాఖ చేరుకుంటున్నాయి. విశాఖ సమ్మిట్‌లో పాల్గొనేందుకు బుధవారం ఒక్క రోజే 4 వేలకు పైగా రిజిస్ట్రేషన్స్ నమోదు కాగా ఇప్పటివరకు 12,000కిపైగా నమోదు కావడం గమనార్హం. గత సర్కారు మాదిరిగా ఆర్భాటాలు కాకుండా వాస్తవ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సదస్సును నిర్వహిస్తోంది.

**నగరానికి కార్పొరేట్లు, కేంద్ర మంత్రులు**

దేశవ్యాప్తంగా ప్రముఖ పారిశ్రామికవేత్తలతో పాటు అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలకు విశాఖ నగరం ఆతిథ్యం ఇవ్వనుంది. ఆరుగురు కేంద్ర మంత్రులు, కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులు రెండు రోజులపాటు విశాఖ నుంచే

మిగతా 3వ పేజీలో ▶

### జీఐఎస్‌కి 24 చార్టర్డ్ విమానాల్లో ప్రతినిధుల రాక

- వీటికి విశాఖ, రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుల్లో పార్కింగ్
- నేటి ఉదయానికి వేదికలు సిద్ధం
- పరిశ్రమలశాఖ మంత్రి అమర్‌నాథ్

3లో

# 'మిరాకిల్' భూ కబ్జాలు

**భోగాపురంలో బట్టబయలైన అక్రమాలు**

- 14.22 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ.. కాలువలు, గెడ్డలు కలిపేసి కాలేజీ, సాఫ్ట్‌వేర్ కంపెనీకి రోడ్ల నిర్మాణం
- ఆక్రమించిన భూమి చుట్టూ భారీ ప్రహరీ, పెద్ద గేట్లు
- నెల్లిమర్ల జనసేన నేత లోకం మాధవి భర్త ప్రసాద్ నిర్వాకాలు
- ప్రభుత్వ భూమి స్వాధీనానికి రెవెన్యూ శాఖ సన్నద్ధం



ప్రభుత్వ భూముల్లో అక్రమంగా వేసిన రోడ్డు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటు కానున్న విజయనగరం జిల్లా భోగాపురం మండలంలో భూముల ధరలు బంగారంతో పోటీ పడుతున్నాయి. అలాంటి చోట నెల్లిమర్ల నియోజకవర్గ జనసేన నాయకురాలు మాధవి భర్త లోకం ప్రసాద్ 14.22 ఎకరాల ప్రభుత్వ భూములను గత సర్కారు హయాంలో ఆక్రమించారు. అవన్నీ ఇటు చెన్నై–హౌరా జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 16), విమానాశ్రయ నిర్మాణం కోసం సేకరించిన భూమికి ఆనుకుని ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్ ధరల ప్రకారం అక్కడ ఎకరా విలువ రూ.2 కోట్లకు పైమాటే!

**ఆక్రమించి.. ప్రహరీ కట్టేసి**

భోగాపురం మండలం ముంజేరు గ్రామ పరిధిలో మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, మిరాకిల్ ఇంజనీరింగ్ కళాశాలను లోకం ప్రసాద్ ఏర్పాటు చేశారు. కాలేజీ హాస్టళ్లు, కెఫేటేరియా, సాఫ్ట్‌వేర్ సంస్థ భవనాలు, ఉద్యోగుల వసతి కోసం సమీపంలోని ప్రభుత్వ భూములన్నీ ఆక్రమించేశారు. గెడ్డలు, కాలువలతో పాటు కాలి బాటలన్నీ కలిపేసి రోడ్డు నిర్మించారు. కొన్ని కల్వర్టులను సొంతంగా కట్టుకుని భూముల చుట్టూ ప్రహరీ కట్టేసి పెద్ద గేట్లను పెట్టేశారు.

**కన్నెత్తి చూడని టీడీపీ సర్కారు..**

ముంజేరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 293/1లో ఎకరా, 293/5లో 60 సెంట్లు, 296లో అర ఎకరా, 337లో 0.61 సెంట్లు, 343లో 3.52 ఎకరాలు, 342లో 5.02 ఎకరాలు, 391లో 1.52 ఎకరాలు, 392లో 1.16 ఎకరాలు, సర్వే నంబరు 393లో 29 సెంట్ల మేర ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురైనట్లు తాజాగా రెవెన్యూ అధికారులు గుర్తించారు. ఆ పక్కనే కొంగవానిపాలెం

మిగతా 5వ పేజీలో ▶

# మళ్లీ గ్యాస్ ధర పెంచిన కేంద్రం

- ఒకేసారి రూ.50 పెంపు
- ఎనిమిది నెలల కాలంలో ఎల్పీజీ ధరలను పెంచడం ఇదే తొలిసారి
- వాణిజ్య సిలిండర్‌పై రూ.350.50 వడ్డన



6లో

### ముకేశ్ అంబానీకి విదేశాల్లోనూ
# జెడ్ ప్లస్ భద్రత



రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ భద్రతపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అంబానీ, ఆయన కుటుంబ సభ్యులకు భారత్‌లోనే కాకుండా విదేశాల్లోనూ జెడ్ ప్లస్ భద్రత కల్పించాలని ఆదేశించింది. అయితే.. దీనికి అయ్యే మొత్తం ఖర్చులు అంబానీనే భరించాలని పేర్కొంది.

6లో

### వీడియోల వెనుక విషవలయం!

- చైనా యాప్ టిక్‌టాక్‌పై డేటా చౌర్యం ఆరోపణలు
- దేశ భద్రతకు ముప్పేనంటున్న నిపుణులు

6 లో

### చౌడు నేలలకు సరైన వరి

- ఎంసీఎం–103 వంగడాన్ని అభివృద్ధి చేసిన మచిలీపట్నం వ్యవసాయ పరిశోధనా స్థానం
- చీడపీడలు, తెగుళ్లను తట్టుకునే రకంగా అభివృద్ధి
- 66.70 శాతం నిండు బియ్యం గింజలు
- రెండో పంటకు ఎంతో అనుకూలం
- ఇటీవల మార్కెట్‌లోకి విడుదల

10 లో





### ఇదం జగత్



ఏ చానల్ పెట్టినా ఈ ప్రోగ్రామే వస్తుంది డియర్!

# చెలరేగిన దొంగలు

**గుంటూరులో ఇద్దరు వాచ్‌మెన్‌ల దారుణ హత్య**

- 12 గంటల్లోనే నిందితులను పట్టుకున్న పోలీసులు
- హంతకులిద్దరూ మైనర్లే
- పలు షాపుల షట్టర్లు పగులగొట్టి చోరీకి యత్నం
- మరో నలుగురిపై దాడి, సెల్‌ఫోన్లు, నగదు దోపిడీ
- రాత్రి 2.30 నుంచి 4.30 గంటల వరకు నగరంలో హల్‌చల్
- నగరమంతటా స్కూటీపై తిరుగుతూ ఇనుపరాడ్‌తో దాడులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు నగరంలో మంగళవారం రాత్రి ఇద్దరు దొంగలు చెలరేగిపోయారు. రెండు గంటలపాటు స్కూటీపై నగరమంతా తిరుగుతూ కనపడిన వారిపై ఇనుప రాడ్‌తో దాడి చేశారు. ఇద్దరు వాచ్‌మెన్‌లను హత్య చేసి, పలువురిని గాయపరిచారు. సుమారు పది షాపుల షట్టర్లు పగులగొట్టారు. కొన్ని షాపుల షట్టర్లు తెరుచుకోలేదు. హంతకుల్ని పోలీసులు 12 గంటల్లోనే పట్టుకున్నారు. ఈ దారుణానికి పాల్పడిన ఇద్దరూ మైనర్లే. పోలీసులు వారిద్దరినీ జువైనల్ హోమ్‌కు తరలిస్తున్నారు. రాత్రి రెండున్నర గంటల సమయంలో గుంటూరు నగరం అమరావతిరోడ్డులోని జ్వరాల ఆసుపత్రి ఎదురుగా మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్న యమహా షోరూం వద్దకు స్కూటీపై ఇద్దరు మైనర్లు వచ్చారు. అందులో ఒకడు బండి వద్ద ఉండగా మరొకడు షోరూం వద్ద కుర్చీలో నిద్రపోతున్న

మిగతా 3వ పేజీలో ▶


ఏలూరులో సూర్యకాంతమ్మకు వృద్ధాప్య పింఛను ఇస్తున్న వలంటీర్ వెంకటలక్ష్మి


అనారోగ్యంతో నర్సీపట్నంలోని కుమార్తె వద్ద ఉంటున్న దేముడుకు పింఛను అందజేస్తున్న అనకాపల్లి జిల్లా కర్నూరుపాలెం వలంటీర్ యమున


కడప నగరంలో మెహరున్నీసాకు వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వలంటీర్ మహబూబ్‌చాంద్


శ్రీకాకుళం నగరంలోని 17వ వార్డులో చవిటిపల్లి సుందరమ్మకు వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వలంటీర్ సింహాద్రి మణి


గుంటూరు నగరానికి చెందిన సయ్యద్ బాజీకి వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వార్డు వలంటీరు గౌసియా


ఎన్టీఆర్ జిల్లా విజయవాడ భవానీపురం పరిధి అప్పాబజార్‌లో దివ్యాంగుడు గోపికృష్ణకు పింఛను అందజేస్తున్న వలంటీర్ సంతోషి

## తొలిరోజే రూ.1,488 కోట్లు

# పింఛన్ల పంపిణీ

- ఇంటింటికీ వెళ్లి 54.01 లక్షల మందికి డబ్బులు అందించిన వలంటీర్లు
- 84.84 శాతం మందికి పంపిణీ పూర్తి
- ఆధార్ ముఖ గుర్తింపు ద్వారా లక్ష మందికిపైగా పింఛన్

సాక్షి, అమరావతి: ఠంఛన్‌గా ఒకటవ తేదీనే రాష్ట్ర వ్యాప్తంగా 54,01,241 మందికి రూ.1,488.02 కోట్ల మొత్తాన్ని ప్రభుత్వం పింఛన్ల రూపంలో పంపిణీ చేసింది. మార్చి ఒకటి నుంచి 63,66,280 మంది అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగ, వివిధ చేతి వృత్తిదారులతో పాటు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పింఛన్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రూ.1,754.64 కోట్ల మొత్తాన్ని విడుదల చేసిన విషయం తెలిసిందే. బుధవారం తెల్లవారుజాము నుంచే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ డబ్బులు పంపిణీ చేశారు. తొలి రోజునే 84.84 శాతం మందికి పంపిణీ పూర్తవగా.. మిగిలిన వారి కోసం మరో 4 రోజుల పాటు పంపిణీ కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు. కాగా, పింఛన్ల పంపిణీ సమయంలో వేలి ముద్రల ఇబ్బంది ఎదుర్కొనే అవ్వాతాతలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ఈ నెల నుంచి కొత్తగా ఆధార్ అనుసంధానంతో కూడిన ముఖ గుర్తింపు విధానాన్ని అదనంగా కల్పించిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 1,01,369 మంది అవ్వాతాతలు ఈ విధానం ద్వారా పింఛన్లు అందుకున్నారని అధికారులు తెలిపారు.


నెల్లూరు జిల్లా కలిగిరిలో చికిత్స పొందుతున్న అంబటివారిపాలెం దివ్యాంగుడు మాలకొండయ్యకు పింఛను ఇస్తున్న వలంటీర్ దొరబాబు


అనంతపురం నగరంలోని 33వ డివిజన్‌లో నాగరాజుకు వృద్ధాప్య పింఛను అందజేస్తున్న వార్డు వలంటీర్ నారాయణ


విజయనగరం జిల్లా లెంకవీధిలో వృద్ధురాలు రామయ్యమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ కుసుమ


తిరుపతిలో చికిత్స పొందుతున్న వడమాలపేట మండలం వేమాపురానికి చెందిన పట్టాభికి పింఛను అందజేస్తున్న వలంటీర్ అమ్ములు


నంద్యాల జిల్లా అంకిరెడ్డిపల్లెలో దప్పు కళాకారుడు దస్తగిరికి పింఛను ఇస్తున్న వలంటీర్ శివలక్ష్మి


కాకినాడ జిల్లా ఏలేశ్వరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జువ్విన అప్పలకొండకు పింఛన్ అందజేస్తున్న స్థానిక వలంటీర్ దుర్గబాబు

## స్టాలిన్‌కు సీఎం జగన్ శుభాకాంక్షలు

సాక్షి,అమరావతి: తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ 70వ పుట్టిన రోజు సందర్భంగా సీఎం జగన్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మరింత సక్సెస్ సాధించాలని ఆకాంక్షిస్తూ బుధవారం ట్వీట్ చేశారు. 'తమిళనాడు సీఎం స్టాలిన్‌కు మంచి ఆరోగ్యం, సంతోషంతో పాటు మరింత సక్సెస్ రావాలి' అని ట్వీట్‌లో పేర్కొన్నారు.

## ఆప్కాస్ పరిధిలోకి 411 మంది ఉద్యోగులు

సాక్షి, అమరావతి: పోస్ట్ మెట్రిక్ ఎస్సీ హాస్టళ్లలో దీర్ఘకాలంగా విధులు నిర్వహిస్తోన్న 411 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఏపీ కార్పొరేషన్ ఫర్ అవుట్ సోర్స్‌డ్ సర్వీసెస్ (ఆప్కాస్)తో ప్రభుత్వం అనుసంధానించింది. ఇప్పటివరకు థర్డ్ పార్టీ విధానంలో పనిచేస్తున్న వీరిని ఇక నుంచి ఆప్కాస్ ఉద్యోగులుగా పరిగణిస్తుంది. తమ దీర్ఘకాల డిమాండ్‌ను నెరవేర్చిన సీఎం జగన్, మంత్రి మేరుగు నాగార్జునకు ఉద్యోగులు బుధవారం కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు తెలిపారు. బుధవారం మంగళగిరిలోని గ్రంథాలయ పరిషత్ కార్యాలయంలో తొలి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బడ్జెట్ అంశాల ప్రతిపాదనకు ఆమోదం తెలపడంతోపాటు భవిష్యత్తులో గ్రంథాలయాల్లో సభ్యత్వ శాతాన్ని పెంచాలని నిర్ణయించామని చెప్పారు.

## వధూవరులకు ముఖ్యమంత్రి జగన్ ఆశీర్వాదం


విజయవాడలోని ఏ కన్వెన్షన్‌లో బుధవారం రాత్రి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్(పీసీసీఎఫ్) వై.మధుసూదన రెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్‌కు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. వధూవరులు తేజశ్రీ, అర్జున్‌లను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. – సాక్షి, అమరావతి


తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో బుధవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు కుమార్తె వివాహ రిసెప్షన్ వేడుకలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. వధూవరులు డాక్టర్ సౌమ్యశ్రీ, వెంకట శివతేజలను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. – సాక్షి, రాజమహేంద్రవరం

## నేటి నుంచి మూడు రోజులు సీఎం విశాఖ పర్యటన

- నేడు, రేపు విశాఖలోనే బస
- 3, 4వ తేదీల్లో జీఐఎస్‌కు హాజరు
- 3వ తేదీ రాత్రి డెలిగేట్స్‌కు ప్రత్యేక విందు

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి పెట్టుబడులు సాధించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 3, 4 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నుంచి మూడు రోజుల పాటు విశాఖపట్నంలో పర్యటించనున్నారు. 2వ తేదీ సాయంత్రం 4 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 5.15 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. 3వ తేదీ ఉదయం 9.10 గంటలకు ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్‌కు చేరుకుని గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పాల్గొంటారు. రాత్రి 8 – 9 గంటల మధ్య ఎంజీఎం పార్క్ హోటల్‌లో జీఐఎస్ డెలిగేట్స్‌కు ఏర్పాటు చేసిన ప్రత్యేక విందులో పాల్గొంటారు. 4వ తేదీ ఉదయం 9.10 గంటలకు రెండో రోజు సమ్మిట్‌లో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు విశాఖ నుంచి తాడేపల్లి నివాసానికి బయలుదేరుతారు.

## చిన్నారి వైద్యానికి మరోమారు సాయం

- 'స్పైనల్ మస్క్యులర్' వ్యాధితో బాధపడుతున్న చిన్నారి దయానా
- ఇప్పటికే రూ.లక్ష సాయం, రూ.10 వేల పింఛన్, తల్లికి ఉద్యోగ కల్పన
- తరచూ ఢిల్లీ వెళ్లాల్సి వస్తోందని తాజాగా సీఎం జగన్‌ను కలిసిన చిన్నారి తల్లి.. మరో రూ.2 లక్షల మంజూరుకు ఆదేశం


చిన్నారి దయానా మెడికల్ రిపోర్టులు పరిశీలిస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి, రాజమహేంద్రవరం: ఓ చిన్నారి వైద్యానికి సంబంధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోసారి రెండడుగులు ముందుకు వేసి తన ఉదారత చాటుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు శెట్టిపేటకు చెందిన రెండేళ్ల చిన్నారి దయానా శాంతి 'స్పైనల్ మస్క్యులర్' వ్యాధితో బాధ పడుతోంది. తమ కూతురు వైద్యానికి సహకరించాలని తల్లిదండ్రులు జనవరి 3వ తేదీన రాజమండ్రిలో సీఎంను కలిసి విజ్ఞప్తి చేయడం.. ఆయన వెంటనే స్పందించడం తెలిసిందే. అప్పట్లో తక్షణ సాయంగా రూ.లక్షతో పాటు, చిన్నారికి నెలకు రూ.10,000 పింఛను, తల్లికి అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పించారు. ఈ నేపథ్యంలో బుధవారం నిడదవోలుకు వచ్చిన సీఎంను దయానా తల్లి సూర్యకుమారి మరోసారి కలిసింది. చిన్నారికి న్యూఢిల్లీలోని ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలు చేయిస్తున్నామని, తరచూ వెళ్లి రావాల్సి వస్తోందని.. ఖర్చులు భరించలేకపోతున్నామని గోడు వెళ్లబోసుకుంది. వెంటనే స్పందించిన సీఎం.. రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందజేయాలని ఆదేశించారు. ఆ మేరకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ మాధవీలత తెలిపారు.

# వనరులు పుష్కలం.. అవకాశాలు అపారం

▶ మొదటి పేజీ తరువాయి


స్నేహపూర్వక పారిశ్రామిక విధానంతో ముందుకు వెళుతోంది. ఏ రాష్ట్రంలోనైనా పరిశ్రమలు నెలకొల్పాలంటే ఆ రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వటం సహజం. ప్రభుత్వం నుంచి అందే సహకారం, రాయితీలు, ప్రోత్సాహకాలు, రాష్ట్రంలో ఉన్న అనువైన వాతావరణం, వనరులను పారిశ్రామికవేత్తలు చూస్తారు. రాష్ట్రంలో ఇవన్నీ ఉన్నాయి. 974 కిలోమీటర్ల సుదీర్ఘ తీరం పరిశ్రమలకు అనుకూలం.

- రాష్ట్రంలో 48 రకాల ఖనిజాలు లభ్యమవుతాయి. ఇది ఖనిజాధారిత పరిశ్రమలకు ఎంతో అనుకూలం. సిమెంట్, లైమ్‌స్టోన్ పరిశ్రమలు నెలకొల్పడానికి మన వద్ద ఎంతో అనుకూల పరిస్థితులున్నాయి.
- 6 పోర్టులున్నాయి. కొత్తగా 4 పోర్టులు నిర్మిస్తున్నాం. అందులో 3 పోర్టులను ప్రభుత్వమే సొంత నిధులతో నిర్మిస్తోంది. పోర్టు ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రం అత్యంత అనుకూలం. పోర్టు ఆధారిత పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. పోర్టు రవాణా కారణంగా రాష్ట్రంలో తయారయ్యే వస్తువుల ఎగుమతికి తక్కువ ఖర్చవుతుంది.
- కర్బన ఉద్గారాలను తగ్గించి పర్యావరణ పరిరక్షణకు మేలు చేసే గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, పంప్డ్ స్టోరేజ్... గ్రీన్ ఎనర్జీదే భవిష్యత్ అంతా. ఈ రంగంలో పెట్టుబడులకు రాష్ట్రంలో మంచి అవకాశాలున్నాయి. వీటివల్ల చౌకగా విద్యుత్ అందుబాటులోకి వస్తుంది. రెన్యువబుల్, గ్రీన్ ఎనర్జీకి ఏపీలో పుష్కలమైన వనరులున్నాయి. విండ్, హైడ్రోజన్, సోలార్ విద్యుదుత్పత్తికి ఇక్కడ అపార అవకాశాలున్నాయి. 82 గిగావాట్ రెన్యూవబుల్ ఎనర్జీ కెపాసిటీ, 34 గిగావాట్ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్ట్‌లకు అవకాశం ఉంది. భవిష్యత్తులో గ్రీన్ ఎనర్జీలో ఏపీ కీలక పాత్ర పోషిస్తుంది.
- పారిశ్రామిక వేత్తల అభిప్రాయాలు తీసుకుని, వాటి ప్రకారం ప్రో యాక్టివ్‌గా వ్యవహరిస్తున్నాం. అందుకే ఈ రాష్ట్రంవైపు ఎప్పుడూ చూడని అంబానీ, బిర్లా, అదానీ, బంగూర్, బజాంకా, దాల్మియా.. వంటి వారు ఇప్పుడు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నారు. గతంలో ఇంతమంది దిగ్గజ పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చింది లేదు.
- 2021–22లో 11.43 శాతం వృద్ధిరేటుతో దేశంలోనే ఏపీ మొదటి స్థానంలో నిలిచింది. పలురంగాల్లో అగ్రగామిగా నిలుస్తూ... సులభతర వాణిజ్య విధానాల్లో (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) వరుసగా మూడేళ్లు నెంబర్ వన్‌గా నిలిచింది.

### ఎస్‌డీజీ లక్ష్యాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు

ఉచిత పథకాలు అంటూ కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అభివృద్ధి చేయకుండా కేవలం సంక్షేమ పథకాలే ఇస్తున్నామనుకుంటే దేశంలోనే అత్యధికంగా 11.43 శాతం వృద్ధిని ఎలా సాధిస్తాం? అన్ని రంగాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకుంటూ అభివృద్ధి దిశగా అడుగులేస్తున్నాం. ప్రతి పథకాన్నీ ఎస్‌డీజీ లక్ష్యాలకు అనుగుణంగా డీబీటీ రూపంలో నేరుగా లబ్ధిదారులకే అందిస్తున్నాం. ఉదాహరణకు జీఈఆర్ గణాంకాలు చూస్తే కాలేజీల్లో చేరే వారి సంఖ్య రాష్ట్రంలో ఎక్కువ. 18 నుంచి 23 ఏళ్ల వయస్సులో ఉన్నవారు చదువు మానకుండా కాలేజీలో చేరేలా పర్యవేక్షిస్తున్నాం. విద్యార్థి డిగ్రీ పూర్తి చేస్తే అతని హోదా మారుతుంది. అందుకే తల్లిదండ్రులకు విద్య భారం కాకుండా ఉండేలా 100 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తూ విద్యాదీవెన, వసతిదీవెన, ప్రాథమిక విద్యలో అమ్మఒడి వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. ఈ మొత్తం నేరుగా కళాశాలలకు ఇవ్వకుండా తల్లుల ఖాతాల్లో వేస్తున్నాం. దీనివల్ల ఆ విద్యార్థి చదువు మధ్యలో ఆగదు. పట్టభద్రుడై ఆదాయాన్ని ఆర్జించడం ద్వారా పేదరికం నుంచి మధ్యతరగతి హోదాలోకి ఆ కుటుంబం మారుతుంది. దేశాభివృద్ధిలో ఇది ఎంతో కీలకమైన అంశం.

### బడ్జెట్ పరిమితుల్లోనే.. పారదర్శకంగా..



ఈ పథకాలన్నీ కూడా బడ్జెట్ పరిమితుల్లోనే అమలు చేస్తున్నాం. సాధారణంగా రాజకీయ నేతలు సామాన్యులకు అర్థం కాని రీతిలో బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. గతంలో కూడా ఇదే బడ్జెట్ ఉండేది. ఆ నిధులు ఎక్కడికి వెళ్తాయో ఎవరికీ అర్థమయ్యేది కాదు. లబ్ధిదారులెవరో ఆ దేవుడికే తెలియాలి అనే పరిస్థితి ఉండేది. కానీ రాష్ట్రంలో తొలిసారిగా మేము అందరికీ సరళంగా అర్థమయ్యేలా పారదర్శకంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టాం. ప్రతి పథకాన్నీ బడ్జెట్‌లో కచ్చితంగా నిర్దేశించాం. ప్రతి పథకాన్ని లబ్ధిదారుల ఆధార్ నంబర్, బ్యాంకు ఖాతాలతో అనుసంధానించాం. నేరుగా నగదు బదిలీ విధానంలో పథకాన్ని అమలు చేస్తున్నాం.

- ఏ రాష్ట్రానికైనా కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం. అందుకే కేంద్రంలోని బీజేపీతో మేము స్నేహపూర్వక వాతావరణమే కోరుకుంటున్నాం. మాకు రాజకీయాల కంటే మా రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం. ప్రజలకు ఏం కావాలో అది చేయాలనేది మా ప్రభుత్వ విధానం. అందుకే మా ప్రభుత్వం రియాలిటీలో పేదలకు ఏం కావాలో అదే చేస్తోంది. అందుకే సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో వేగంగా ముందుకెళ్తున్నాం.

## 3 రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు

ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా గత ప్రభుత్వ తప్పులను కొన్నింటిని సరిచేస్తుంది, కొన్ని కొత్త కార్యక్రమాలు ప్రారంభిస్తుంది. మేం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలలు, వ్యవసాయం.. ఈ రంగాల్లో పూర్తి స్థాయిలో విప్లవాత్మక చర్యలు చేపట్టాం. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడు లేని విధంగా 'నాడు–నేడు' పేరిట ప్రభుత్వాసుపత్రులు, ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తున్నాం. ప్రాథమిక విద్యా రంగంలో 'అమ్మ ఒడి' పథకం ఓ విప్లవం. మేము అధికారంలోకి వచ్చేనాటికి ప్రాథమిక విద్య ప్రమాణాల్లో ఆంధ్ర ప్రదేశ్ దేశంలో చివరి రెండు, మూడు స్థానాల్లో ఉండేది. ఈ పరిస్థితి మార్చాలనుకున్నాం. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు మేం అమలు చేస్తున్న పథకాలు చెబుతా. అమ్మ ఒడి పథకం కింద పిల్లల్ని బడికి పంపే తల్లుల ఖాతాలో రూ.15వేలు వేస్తున్నాం. దీనికి కనీసం 75 శాతం హాజరు ఉండాలనే నిబంధన పెట్టాం. ఇంటర్మీడియట్ వరకు అమ్మ ఒడి పథకం ఇస్తున్నాం. తరవాత జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన పథకాలు అందిస్తున్నాం. ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుండటంతో పిల్లల చదువు ఎందుకు ఆపాలని తల్లిదండ్రులు భావిస్తారు కదా?. ఇక ఏటా స్కూళ్లు తెరవటానికి ముందే జగనన్న విద్యా కానుక పేరిట సమగ్ర కిట్‌ను ఇస్తున్నాం. తెలుగు, ఇంగ్లీష్ బైలింగ్వల్ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, స్కూల్ బ్యాగ్, షూ, సాక్సులు, యూనిఫామ్ ఇస్తూ యూనిఫామ్‌కు కుట్టేందుకు మజూరీ చార్జీలూ ఇస్తున్నాం. దీనికి ఏటా రూ.వేయి కోట్లకుపైగా నిధులు వెచ్చిస్తున్నాం. ఇక మధ్యాహ్న భోజన పథకాన్ని పూర్తిగా మార్చాం. టీడీపీ ప్రభుత్వంలో మధ్యాహ్న భోజన పథకానికి రూ.600 కోట్ల బడ్జెట్ ఉండేది. దాన్ని రూ.1,908కోట్లకు పెంచాం. జగనన్న గోరుముద్ద పేరుతో భోజనం నాణ్యత పెంచాం. ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టాం. ఆరో తరగతి నుంచి డిజిటల్ తరగతులు ఏర్పాటు చేస్తున్నాం. నాడు–నేడు మొదటి దశ కింద 15,275 పాఠశాలలను ఎంపిక చేసి వాటి రూపు రేఖలను సమూలంగా మార్చాం. రాష్ట్రంలో 30,230 తరగతుల డిజిటలైజేషన్‌ను ఈ జూన్ నాటికి పూర్తి చేస్తున్నాం. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇస్తున్నాం. ఇప్పటివరకు 60వేల మంది ఉపాధ్యాయులకు, 4.70 లక్షల మంది విద్యార్థులకు మొత్తం 5.30 లక్షల ట్యాబ్‌లు పంపిణీ చేశాం.

అంతేకాదు! అంగన్‌వాడీ కేంద్రాలకు నిధులు పెంచాం. గతంలో అంగన్‌వాడీ కేంద్రాలకు ఏడాదికి రూ.800కోట్లు కేటాయించేవారు. దీన్ని రూ.1,800 కోట్లకు పెంచాం. జగనన్న సంపూర్ణ పోషణ, సంపూర్ణ పోషణ్ ప్లస్ పేరిట అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార నాణ్యతను మెరుగుపరిచాం. ఎందుకంటే ఆరేళ్ల వరకే పిల్లలు శారీరకంగా, మానసికంగా వేగంగా ఎదుగుతారు. ఆ సమయంలో వారికి సరైన పోషకాహారం అందించాలి. అదే చేస్తున్నాం. ఆడపిల్లల పెళ్లికి సహకరిస్తూ... వారు చదువు కొనసాగించేలా నిబంధనలు పెట్టాం. 10వ తరగతి పాస్ అవ్వాలని, 18 ఏళ్లు నిండాలని నిబంధన పెట్టడం వల్ల వారు పది తరవాత ఇంటర్ చదువుతారు. డిగ్రీలోనూ చేరతారు. చేరారు కనక పూర్తి చేస్తారు. ఈ ఉద్దేశంతోనే వివాహానికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం చేస్తున్నాం.

- చదువుల్లో రాణిస్తూ విదేశాల్లో చదువుకోవాలనుకునే వారికి 'విదేశీ దీవెన' పథకాన్ని అందిస్తున్నాం. నిర్దేశిత 21 ఫ్యాకల్టీల్లో ప్రపంచంలోని టాప్–50 యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను అభ్యసించే మన విద్యార్థులకు గరిష్ఠంగా రూ.1.25 కోట్ల వరకూ ఫీజును చెల్లిస్తున్నాం. గత ఏడాది 200మందికి స్పాన్సర్‌షిప్ అందించాం. ఇలాంటి వర్సిటీల్లో చదివిన వాళ్లంతా వచ్చే పదేళ్లలో అత్యున్నత స్థాయికి చేరుకుని, మన రాష్ట్రానికి ఆస్తిగా మారతారన్న విశ్వాసం నాకుంది.
- ప్రభుత్వాసుపత్రులకు కాయకల్ప చికిత్స చేస్తున్నాం. ఎవ్వరూ ఊహించని విధంగా వైద్య రంగంలో ఖాళీగా ఉన్న 48,000 పోస్టులను భర్తీ చేశాం. ప్రతి హాస్పిటల్‌లో డాక్టర్, నర్సులు ఉండేలా విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చాం. జాతీయస్థాయి ప్రమాణాలు ఉండేలా హాస్పిటల్స్‌ను ఆధునీకరించాం. 17 మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తున్నాం. ఆరోగ్య శ్రీ పరిధిలోకి వచ్చే చికిత్సల సంఖ్యను 1,059 నుంచి ఏకంగా 3,255కు పెంచాం. ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ హెల్త్ క్లినిక్, హెల్త్‌కార్డుల డిజిటలైజేషన్ ఇలా అనేక సంస్కరణలు తెచ్చాం.
- వ్యవసాయ రంగానికి వస్తే... రైతు భరోసా కేంద్రంపేరిట రైతులకు సంబంధించిన సేవలన్నీ ఒకేచోట అందిస్తున్నాం. ప్రతి గ్రామానికీ వ్యవసాయ శాస్త్రంలో డిగ్రీ పొందిన అధికారిని నియమించడమే కాకుండా ప్రతి రైతు తాలూకు పంట వివరాలను 'ఈ క్రాప్'లో నమోదు చేస్తున్నాం. రైతులకు విత్తనం దగ్గర నుంచి పంట అమ్ముకోవడం వరకూ ఆర్‌బీకే ద్వారా చేయూత అందిస్తున్నాం. పాలన సంస్కరణల్లో భాగంగా.... ప్రతి 2000 జనాభాకు గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేయడమే కాకుండా ప్రతి 50 మంది జనాభాకూ ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేశాం. ఎటువంటి అవినీతి లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. దేశంలో డీబీటీ ద్వారా నేరుగా నగదు అందుకుంటున్న లబ్ధిదారులు రాష్ట్రంలోనే అధికం. మాకు ఓటు వేశారా లేదా, ఏ పార్టీ అనేది చూడకుండా పథకాలు అందిస్తున్నాం.

## మహిళా ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెటింగ్

**ఐక్యరాజ్యసమితి స్పెషల్ కన్సల్టేటివ్ స్టేటస్ మెంబర్ షకిన్‌కుమార్**


షకిన్‌కుమార్‌తో ఏపీ పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి

సాక్షి, అమరావతి: పట్టణ ప్రాంతాల్లో మహిళలు ఉత్పత్తి చేసే వస్తువులకు ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) ఆధ్వర్యంలో నడిచే 'షీ ట్రేడ్స్' ద్వారా అంతర్జాతీయ మార్కెటింగ్ కల్పించేందుకు సహకారం అందిస్తామని ఐక్యరాజ్యసమితి స్పెషల్ కన్సల్టేటివ్ స్టేటస్ మెంబర్ ఉన్నవ షకిన్ కుమార్ తెలిపారు. ఈ విషయంలో ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. నిరుపేద మహిళలకు షీ ట్రేడ్స్ ద్వారా ఆర్థిక చేయూత కూడా అందిస్తామని చెప్పారు. రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మితో షకిన్ కుమార్ నేతృత్వంలో ఐక్యరాజ్యసమితి బృందం బుధవారం సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పట్టణ ప్రాంత నిరుపేద మహిళల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి శ్రీలక్ష్మి వివరించారు. వైఎస్సార్ చేయూత, ఆసరా వంటి పథకాల ద్వారా ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తోందన్నారు. ఈ పథకాల ద్వారా లబ్ధి పొందే వారు తమ కాళ్ల మీద తాము నిలబడేలా బహుళ జాతి సంస్థలతో కలిసి ముందుకెళ్తోందన్నారు. మెప్మా ద్వారా పట్టణాల్లో జగనన్న మహిళా మార్ట్, జగనన్న ఈ–మార్ట్‌లను ఏర్పాటు చేశామని, వీటి ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలను కల్పిస్తున్నామన్నారు. అనంతరం షకిన్‌కుమార్ మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా బలపడటం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధను కొనియాడారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం సీఎం జగన్ అమలు చేస్తున్న పథకాలు అద్భుతమని కితాబిచ్చారు. మహిళా మార్ట్‌ల ఆలోచన అద్భుతమన్నారు.

**ఏపీ విద్యావిధానాలపై స్విట్జర్లాండ్ ప్రశంసలు**

ఫిబ్రవరి 15, 16 తేదీల్లో స్విట్జర్లాండ్‌లో జరిగిన 'ఎడ్యుకేషన్ ఫర్ ఫ్యూచర్' ప్రపంచ సదస్సులో స్విట్జర్లాండ్ మాజీ అధ్యక్షుడు ఇగ్నాజియా క్యాసిస్ ఏపీ విద్యా విధానాలను ప్రత్యేకంగా ప్రశంసించారని షకిన్‌కుమార్ తెలిపారు. ఏపీ విద్యావిధానం, నవరత్న పథకాలు, నాడు నేడు కింద చేస్తున్న విద్యాభివృద్ధి చాలా బాగుందని మెచ్చుకున్నారని వెల్లడించారు. అందరికీ నాణ్యమైన విద్యను అందించాలన్న సంకల్పంతో సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న నాడు–నేడు, డిజిటల్ ఎడ్యుకేషన్, తదితర పథకాల గురించి ప్రపంచ సదస్సులో తాను వివరించానన్నారు.

## క్లుప్తంగా...

### మేఘాకు 4, కేఎన్ఆర్‌కు 1

- బెంగళూరు–విజయవాడ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు
- ఏపీ పరిధిలో 5 ప్యాకేజీల ఖరారు

సాక్షి, అమరావతి: బెంగళూరు–విజయవాడ ఎక్స్‌ప్రెస్ హైవే టెండర్ల ప్రక్రియను జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) వేగవంతం చేసింది. అందుకోసం ఏపీ పరిధిలో తాజాగా ఐదు ప్యాకేజీలకు టెండర్లను ఖరారు చేసింది. మొత్తం ఆరువరుసలుగా 342 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఈ రహదారి కోసం 14 ప్యాకేజీల కింద పనులు చేపట్టాలని గతంలోనే నిర్ణయించారు.అందులో కర్ణాటక పరిధిలో నిర్మించే 96 కిలోమీటర్ల పనుల కోసం ఇప్పటికే మూడు ప్యాకేజీల కింద టెండర్లు ఖరారు చేశారు. ఏపీ పరిధిలో పనులను 11 ప్యాకేజీల కింద చేపట్టనున్నారు. అందులో ఆరు ప్యాకేజీలకు ఎన్‌హెచ్ఏఐ టెండర్లు పిలిచింది. వారం కిందట తెరిచిన సాంకేతిక బిడ్లలో 8 సంస్థలు అర్హత సాధించాయి. ఫైనాన్స్ బిడ్లలో మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్–మెయిల్) నాలుగు ప్యాకేజీల్లో ఎల్–1గా నిలిచింది. ఆ నాలుగు ప్యాకేజీ పనులను రూ.3,180.85 కోట్లకు దక్కించుకుంది. కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఒక ప్యాకేజీలో ఎల్–1గా నిలిచి రూ.665 కోట్లకు టెండరు పొందింది. మొత్తం 153.44 కిలోమీటర్ల పనులకు టెండర్లను ఖరారు చేశారు. మరో ప్యాకేజీ ఫైనాన్సియల్ బిడ్లను సాంకేతిక కారణాలతో తెరవలేదు. దీనిపై ఎన్‌హెచ్ఏఐ త్వరలోనే నిర్ణయం తీసుకోనుంది. ఏపీ పరిధిలో మిగిలిన ప్యాకేజీలకు కూడా త్వరలో టెండర్ల ప్రక్రియ చేపట్టేందుకు ఎన్‌హెచ్ఏఐ సన్నద్ధమవుతోంది. ఇప్పటికే టెండర్లు ఖరారు చేసిన పనులను త్వరలోనే ప్రారంభించనుంది. మొత్తం ఎక్స్‌ప్రెస్ హైవేను రెండేళ్లలో నిర్మించాలని ఎన్‌హెచ్ఏఐ లక్ష్యంగా పెట్టుకుంది.

### నాదెండ్ల మనోహర్‌ది దిగజారుడు రాజకీయం

కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు విమర్శ

సాక్షి, అమరావతి: జనసేన నాయకుడు నాదెండ్ల మనోహర్ దిగజారుడు రాజకీయం చేస్తున్నారని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు విమర్శించారు. తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. రైతు సంక్షేమం కోసం శ్రమిస్తున్న సీఎం జగన్‌పై అసత్య ప్రచారం చేయడం సిగ్గు చేటన్నారు. కౌలు రైతుల గురించి మాట్లాడే అర్హత నాదెండ్లకు లేదన్నారు. వెన్నుపోటు రాజకీయం నాదెండ్ల కుటుంబం నుంచే ప్రారంభమైందని ధ్వజమెత్తారు. రాజకీయ శూన్యంలో పవన్‌కళ్యాణ్ పంచన చేరి చంద్రబాబుకు తొత్తులా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు హయాంలో లోకేశ్‌కి తప్ప యువతకు ఒక్క ఉద్యోగం కూడా రాలేదని ఎద్దేవా చేశారు. కన్నా లక్ష్మీనారాయణకు రాజకీయ భిక్ష పెట్టింది వంగవీటి మోహన్‌రంగా అయితే, రాజకీయంగా పైకి తీసుకొచ్చింది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని గుర్తు చేశారు. ఒకప్పుడు రంగాను హత్య చేసి.. తననూ హత్య చేయాలని చంద్రబాబు చూస్తున్నాడని చెప్పిన కన్నా.. ఇప్పుడు ఏ ఒప్పందం మేరకు టీడీపీలో చేరారో చెప్పాలని అడపా శేషు డిమాండ్ చేశారు.

### 14న మచిలీపట్నంలో జనసేన పదో ఆవిర్భావ సభ

వెల్లడించిన నాదెండ్ల

సాక్షి, అమరావతి: జనసేన పార్టీ పదో ఆవిర్భావ సభ మార్చి 14వ తేదీన కృష్ణా జిల్లా మచిలీపట్నంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. బుధవారం మంగళగిరిలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆవిర్భావ దినోత్సవం రోజు పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ మంగళగిరి పార్టీ కార్యాలయం నుంచి వారాహిలో బయలుదేరి సభా ప్రాంగణానికి చేరుకుంటారని చెప్పారు. గత తొమ్మిదోపార్టీ ఆవిర్భావ సభలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వబోమని పవన్‌కళ్యాణ్ చేసిన ప్రకటన రాష్ట్ర రాజకీయాల్లో చాలా మార్పులు తెచ్చిందని, రేపటి సభలో జనసేన పార్టీ భవిష్యత్ కార్యాచరణను వివరిస్తారని తెలిపారు. మచిలీపట్నంకి కిలోమీటర్ దూరంలో జాతీయ రహదారిపై సభా వేదిక ఉంటుందన్నారు.

### విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను రద్దు చేస్తాం

- పాదయాత్రలో నారా లోకేశ్ ప్రకటన
- కూలిన టెంట్.. లోకేశ్ డ్రైవర్ సహా పలువురికి గాయాలు

తిరుపతి రూరల్/పాకాల: తాము అధికారంలోకి వస్తే విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను రద్దు చేస్తామని టీడీపీ నేత నారా లోకేశ్ ప్రకటించారు. ఆ రెండు పథకాలు యూజ్‌లెస్ అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర 400 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నేంద్రగుంట వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యువకులతో ముఖాముఖిలో మాట్లాడారు. విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను రద్దు చేసి కళాశాలలకే నేరుగా ఫీజులు వేస్తామని చెప్పారు. లోకేశ్‌కు బుధవారం త్రుటిలో ప్రమాదం తప్పింది. బుధవారం చంద్రగిరి నియోజకవర్గం పాకాల మండలం ఇరంగారిపల్లిలో పాదయాత్ర చేస్తున్న సమయంలో మధ్యాహ్నం భోజనం కోసం ఏర్పాటు చేసిన పెద్ద టెంట్ ఒక్కసారిగా వచ్చిన గాలికి కూలిపోయింది. దీంతో లోకేశ్ కారు డ్రైవర్ గోపితో పాటు పాకాల మండలానికి చెందిన పలువురికి గాయాలయ్యాయి.

# 108 అంబులెన్స్‌ను ట్రాక్ చేయొచ్చు

## ఓలా, ఉబర్, ర్యాపిడో తరహాలో ట్రాకింగ్

- ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి.. ట్రయల్ రన్ విజయవంతం
- త్వరలో ప్రజలకు అందుబాటులోకి
- బాధితుల ఫోన్ నంబర్‌కు ఎస్ఎంఎస్ ద్వారా లింక్
- లింక్‌పై క్లిక్ చేస్తే అంబులెన్స్ ఎక్కడుంది, ఎంత సేపట్లో వస్తుందో వివరాలు



సాక్షి, అమరావతి: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రాష్ట్ర ప్రజలకు అత్యాధునిక వైద్య సౌకర్యాలు కల్పిస్తున్న ప్రభుత్వం.. ఇప్పుడు 108 అంబులెన్సుల ట్రాకింగ్ విధానాన్ని కూడా అందుబాటులోకి తెస్తోంది. ఓలా, ఉబర్, ర్యాపిడో తరహాలో 108 అంబులెన్స్‌ను కాలర్ (సాయం కోసం ఫోన్ చేసిన వారు) ట్రాక్ చేసే విధానాన్ని వైద్య శాఖ ప్రవేశపెడుతోంది. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. ట్రయల్ రన్ కూడా విజయవంతం కావడంతో ట్రాకింగ్‌సదుపాయాన్ని త్వరలో ప్రజలకు అందుబాటులోకి తేనుంది.

**ఎస్ఎంఎస్ ద్వారా**

రోడ్డు ప్రమాదాలు, గుండె, బ్రెయిన్ స్ట్రోక్, శ్వాసకోశ ఇబ్బందులు, గర్భిణులకు పురిటి నొప్పులు రావడం వంటి సందర్భాల్లో రాష్ట్ర ప్రజలకు వెంటనే 108 అంబులెన్స్ గుర్తొస్తుంది. 108కు ఫోన్ చేస్తే నిమిషాల్లో అంబులెన్స్ వచ్చి సకాలంలో ఆస్పత్రులకు చేరుస్తుంది. ఆపద సమయంలో ఫోన్ చేసిన వారికి 108 అంబులెన్స్ ఎంత దూరం వచ్చిందో, ఇంకా ఎంత సమయం పడుతుందోనని ఆందోళన ఉంటుంది. ప్రస్తుత విధానంలో 108 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసిన వారి ఫోన్ నంబర్ లేదా బాధితుల ఫోన్ నంబర్‌కు వారికి కేటాయించిన వాహనం నంబరు, సిబ్బంది ఫోన్ నంబర్ ఎస్ఎంఎస్ పంపుతున్నారు. ఈ ఫోన్ నంబర్‌కు కాల్ చేసి బాధితులు/సహాయకులు అంబులెన్స్ ఎంత వరకూ వచ్చిందో తెలుసుకుంటున్నారు. నూతన విధానంలో బాధితులకు పంపే ఎస్ఎంఎస్‌లో లింక్‌ను పంపుతారు. ఆ లింక్‌పై క్లిక్ చేస్తే అంబులెన్స్ ఎక్కడ ఉంది, ఎంత సమయంలో వస్తుందో తెలుసుకోవచ్చు. తద్వారా బాధితులకు అంబులెన్సు వస్తోందన్న భరోసా లభిస్తుంది.

**త్వరలోనే అందుబాటులోకి**

కాలర్‌లు అంబులెన్స్ ఎంత దూరం వచ్చిందో ట్రాక్ చేసేలా సాంకేతిక ఏర్పాట్లు చేశాం. ట్రయల్ రన్ విజయవంతం అయింది. త్వరలోనే ట్రాకింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తెస్తాం. అంబులెన్స్ ఎంత దూరం వచ్చిందో తెలుసుకోవడంతో బాధితులు, వారి సహాయకులకు భరోసా లభిస్తుంది.

– ఎం.ఎన్. హరేంధిరప్రసాద్, సీఈవో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ

**748 అంబులెన్స్‌ల ద్వారా సేవలు**

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా '108 అంబులెన్స్'లు 748 ఉన్నాయి. ఇవి రోజుకు సగటున 3,096 ఎమర్జెన్సీ కేసులను ఆస్పత్రులకు తరలిస్తున్నాయి. గత ఏడాది జూలై నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 24 వరకు 7,52,302 ఎమర్జెన్సీ కేసుల్లో అంబులెన్స్‌లు సేవ లందించాయి.

## కమాండ్ కంట్రోల్‌తో రేషన్ పంపిణీపై నిఘా

- జాతీయ సదస్సులో వెల్లడించిన ప్రజాపంపిణీ కమిషనర్ అరుణ్‌కుమార్
- ఏపీని ఆదర్శంగా తీసుకోవాలన్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

సాక్షి, న్యూఢిల్లీ: ధాన్యం సేకరణ, ప్రజాపంపిణీ వ్యవస్థలో అక్రమాలను నివారించడానికి కమాండ్ కంట్రోల్ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఆహార, ప్రజాపంపిణీ శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ వెల్లడించారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ శాఖ మంత్రి పీయూష్ గోయల్ అధ్యక్షతన రాష్ట్రాల ఆహార, ప్రజాపంపిణీ వ్యవస్థ మంత్రులు, కార్యదర్శులతో జాతీయ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, కమిషనర్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో చేపట్టిన పలు అంశాలపై కమిషనర్ అరుణ్‌కుమార్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. రైతుల నుంచి ధాన్యాన్ని మద్దతు ధరకు సేకరించి మిల్లింగ్ చేసిన బియ్యాన్ని మొబైల్ వాహనాల ద్వారా లబ్ధిదారుల ఇళ్లకే పంపించి పంపిణీ చేస్తున్నామన్నారు. ఎంఎల్ఎస్ గోదాములు, రైస్ మిల్లులు, స్టేజి–1, 2 రవాణా, ధాన్యం సేకరణ వంటి అంశాల్లో అక్రమాలు జరగకుండా మంత్రిత్వశాఖ ప్రధాన కార్యాలయంలో రాష్ట్రస్థాయి కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. నిత్యావసర సరుకుల పంపిణీ, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు పంపిణీ చేసే సరుకుల్ని పర్యవేక్షిస్తామన్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఈ–పాస్ పంపిణీ నివేదికలు, సప్లై చైన్ మేనేజిమెంట్ నివేదికలు, ఈ–పీడీఎస్ నివేదికలు, జీపీఎస్ ఆధారంగా వాహన కదలికలు పంపిణీ నివేదికలు, సచివాలయాల ద్వారా రైస్‌కార్డుల సేవల నివేదికలు, కేంద్రానికి పంపే నివేదికలు, ధాన్యం సేకరణ కార్యకలాపాల పర్యవేక్షణ నివేదికలు తీసుకొని తగిన చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. అనంతరం కేంద్రమంత్రి పీయూష్ గోయల్ రాష్ట్రంలో చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రశంసించి మంత్రి కారుమూరి నాగేశ్వరరావును అభినందించారు. ఇతర రాష్ట్రాలు ఈ వ్యవస్థను ఆదర్శంగా తీసుకోవాలని కేంద్ర మంత్రి సూచించారు.

## అసోసియేట్‌లుగా 246 మంది వైద్యులకు ప్రమోషన్

సాక్షి, అమరావతి: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలో 32 స్పెషాలిటీలు, సూపర్ స్పెషాలిటీల్లో 246 మంది వైద్యులకు అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్లుగా ప్రభుత్వం ప్రమోషన్ కల్పించింది. వీరికి పోస్టింగ్‌లు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశామని డీఎంఈ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఉద్యోగోన్నతి కల్పించడం ద్వారా ఖాళీ అయిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయడానికి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసి, తుది మెరిట్ జాబితా కూడా సిద్ధం చేశామని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అభ్యర్థులను ఎంపిక చేసి, 246 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. వైద్య విద్యకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ క్రమంలో బోధనాస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉండకుండా ఎన్ఎంసీ నిబంధనలకు అనుగుణంగా పోస్టులను భర్తీ చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిశాక ఎస్ఆర్ పోస్టులకు కూడా నోటిఫికేషన్ జారీ చేస్తామని వివరించారు.

# అతిథుల ఆగమనం..

▶ మొదటి పేజీ తరువాయి




కార్యకలాపాలు కొనసాగించనున్నారు. మార్చి 3వతేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ప్రారంభమయ్యే సమావేశాల్లో కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్, విద్యుత్‌శాఖ మంత్రి ఆర్‌కే సింగ్, పర్యాటక శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి పాల్గొంటున్నారు. ప్రత్యేక అతిథులుగా కార్పొరేట్ దిగ్గజ ప్రముఖులు రిలయన్స్ గ్రూప్ చైర్మన్ ముఖేష్ అంబానీ, అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమారమంగళం బిర్లా, బజాజ్ ఫిన్‌సర్వ్ ఎండీ, సీఈవో సంజీవ్ బజాజ్, జేఎస్‌డబ్ల్యూ గ్రూపు చైర్మన్ సజ్జన్ జిందాల్, జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ నవీన్ జిందాల్, జీఎంఆర్ గ్రూప్ చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు, రెన్యూ పవర్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సుమంత్ సిన్హా, దాల్మియా భారత్ గ్రూప్ ఎండీ పునీత్ దాల్మియా, సైయెంట్ ఫౌండర్ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, సెంచురీ ప్లేబోర్డ్స్ చైర్మన్ సజ్జన్ భజాంక, గ్లోబల్ అలయన్స్ ఫర్ సస్టైయినబుల్ ప్లానెట్ సెక్రటరీ జనరల్ సత్య త్రిపాఠి, పెగాసస్ క్యాపిటల్ ఫౌండర్ సీఈవో క్రైగ్ కాట్, పార్లే ఫర్ ది అడ్వైజర్స్ ఓషన్స్ సిరిల్ గచ్, శ్రీ సిమెంట్ చైర్మన్ మోహన్ బంగర్, ఒబెరాయ్ గ్రూపు ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అర్జున్ ఒబెరాయ్, టెస్లా కోఫౌండర్ మార్టిన్ ఎబర్‌హార్డ్, భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ ఎల్లా తదితరులు పాల్గొంటున్నట్లు అధికారులు తెలిపారు.

- ముగింపు కార్యక్రమంలో కేంద్ర పోర్టులు, నౌకాయాన శాఖ మంత్రి శర్బానంద సోనావాల్, కేంద్ర సహాయమంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌తో పాటు భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుచిత్రా ఎల్లా, డాక్టర్ రెడ్డీస్ చైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డి, వెల్‌స్పన్ గ్రూపు ఎండీ రాజేష్ మండవేవాలా, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు పాల్గొంటారు. వీరే కాకుండా దేశ విదేశాలకు చెందిన పారిశ్రామిక సంస్థలకు చెందిన ప్రతినిధులు చర్చ కార్యక్రమాల్లో ప్రసంగించనున్నారు.

**పలు అంశాలపై చర్చించనున్న దిగ్గజ ప్రముఖులు**

దిగ్గజ పారిశ్రామికవేత్తలు ఒక్కొక్కరు ఒక్కో అంశంపై మాట్లాడేలా ప్రణాళిక రూపొందించారు. 'మేకిన్ ఇండియా మేక్ ఫర్ ది వరల్డ్' అనే అంశంపై సెంచురీ ప్లేబోర్డ్స్ చైర్మన్ సజ్జన్ భజాంకా, 'డ్రైవింగ్ ఇండియా ఎలక్ట్రికల్ మొబిలిటీ యాంబిషన్స్' అనే అంశంపై టెస్లా కోఫౌండర్, మాజీ సీఈవో మార్టిన్ ఎబర్‌హార్డ్ ప్రసంగించనున్నారు. ''లివరేజింగ్ ఇండియాస్ ఎడ్జ్ ఇన్ గ్లోబల్ మాన్యుఫాక్చరింగ్'' అనే అంశంపై బజాజ్ ఫిన్‌సర్వ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజీవ్ బజాజ్, ''ఏపీలో తయారీ రంగం ప్రయోజనాలు'' అనే అంశంపై జిందాల్ స్టీల్స్ అండ్ పవర్ చైర్మన్ నవీన్‌జిందాల్ మాట్లాడనున్నారు. ''డూయింగ్ సస్టైయినబుల్ బిజినెస్ – ప్రొటెక్టింగ్ ది బ్లూ యూనివర్స్' అనే అంశంపై పార్లే ఫర్ ది వోషన్స్ ఫౌండర్ సీఈవో సిరల్ గచ్, 'హీలింగ్ లివ్స్ ఇన్ ఏపీ'' అనే అంశంపై అపోలో హాస్పిటల్స్ వైస్ చైర్మన్ ప్రీతిరెడ్డి, 'ఏపీ సిమెంటింగ్ ఇండియాస్ ప్రోవెస్' అంశంపై శ్రీసిమెంట్స్ చైర్మన్ హరిమోహన్ బంగర్, ''డ్రైవింగ్ ఇన్నోవేషన్స్ ఇన్ లైఫ్ సైన్సెస్'' అనే అంశంపై భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ ఎల్లా ప్రసంగించనున్నారు.

### 12,000 దాటిన రిజిస్ట్రేషన్స్

విశాఖ గ్లోబల్ సమ్మిట్‌కు విశేష స్పందన లభిస్తోంది. బుధవారం ఒక్కరోజే నాలుగు వేలకుపైగా రిజిస్ట్రేషన్స్ నమోదయ్యాయంటే స్పందన ఎలా ఉందో ఊహించవచ్చు. సమావేశాల్లో పాల్గొనేందుకు ఇప్పటివరకు నమోదు చేసుకున్న వారి సంఖ్య 12,000 దాటిందని అధికారులు వెల్లడించారు. వాస్తవ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నట్లు పరిశ్రమలు, ఐటీశాఖ మంత్రి అమర్నాథ్ తెలిపారు.

## జీఎస్ఐకి 24 చార్టర్డ్ విమానాల్లో ప్రతినిధుల రాక

- వీటికి విశాఖ, రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుల్లో పార్కింగ్
- పరిశ్రమలశాఖ మంత్రి అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఎస్ఐ)–2023 కు అంతర్జాతీయస్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి అమర్‌నాథ్ చెప్పారు. వేదికలన్నీ గురువారం ఉదయానికి సిద్ధమవుతాయన్నారు. విశాఖలో జీఐఎస్ పనుల్ని బుధవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదస్సులో పాల్గొనేందుకు 24కి పైగా చార్టర్డ్ విమానాల్లో దేశవిదేశీ ప్రతినిధులు హాజరవుతున్నారని చెప్పారు. ఈ విమానాలకు విశాఖపట్నం, రాజమహేంద్రవరం విమానాశ్రయాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతినిధులు విశాఖ విమానాశ్రయంలో దిగిన వెంటనే ఆ విమానాలు రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు వెళతాయని చెప్పారు.



సదస్సు ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

## బాబూ.. ఒంటరిగా పోటీ చేసే సత్తా ఉందా?

- దమ్ముంటే సీఎం సవాల్‌ను స్వీకరించండి: మంత్రి కాకాణి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాల్లో ఒంటరిగా పోటీ చేసే సత్తా టీడీపీ, జనసేనకు ఉంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సవాల్‌ను స్వీకరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి వైఎస్సార్‌సీపీ ఒంటరిగానే పోటీ చేస్తోందన్నారు. మీలా పూటకో మాట మార్చే వాళ్లం కాదన్నారు. బుధవారం ఆయన సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. వీరుడ్ని, సూరుడ్ని అని చెప్పుకునే చంద్రబాబుకు ఒంటరిగా పోటీ చేసే సత్తా ఉందా అని ప్రశ్నించారు. పాతవి కాపీ కొట్టడం తప్ప ఒక్కటైనా సొంత తెలివితో చేపట్టిన పథకం ఏదైనా ఉందా అని నిలదీశారు. తాము నిజాలు చెబుతుంటే తట్టుకోలేక కుక్కలతో మొరిగిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో బాబు, కొడుకులను నమ్మే పరిస్థితిలో ప్రజల్లేరన్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి వలస కూలీలను తెచ్చుకొని లోకేశ్ కామెడీ షోలు చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్‌ను, ఆయన పార్టీని ఎవరూ గుర్తించడం లేదన్నారు. పవన్.. తోలు బొమ్మలాటలో జోకర్ లాంటి వాడన్నారు. బేషరతుగా రుణమాఫీ చేస్తానని నమ్మించి రైతులను నిలువునా మోసగించిన చరిత్ర చంద్రబాబుదని మంత్రి మండిపడ్డారు. రైతు భరోసా కింద ఇప్పటికే రూ.27,062 కోట్లు సాయం అందించామన్నారు. రాష్ట్రంలో ఈనాడు, ఇతర పచ్చ పత్రికలకు అర్జంట్‌గా చంద్రబాబును సీఎం చెయ్యాలన్న యావ తప్ప మరో ధ్యాస లేదన్నారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటుంటే.. కేంద్రం వాటా, రాష్ట్రం వాటా అంటూ ప్రజలను మభ్యపెట్టడం విచిత్రంగా ఉందన్నారు.

# పెళ్లికి ఒప్పుకోలేదని యువతి హత్య

- అత్యంత కిరాతకంగా ప్రాణాలు తీసిన యువకుడు
- బెంగళూరులో దారుణం..



లీలా పవిత్ర (ఫైల్)

సాక్షి, బెంగళూరు/కాకినాడ క్రైం: పెళ్లికి నిరాకరించిందన్న కోపంతో ఓ యువకుడు యువతిపై దారుణానికి ఒడిగట్టాడు. ఆమె ఛాతి, పొట్ట, భుజం, గొంతుపై ఇష్టానుసారంగా కత్తితో పొడిచి ప్రాణాలు తీశాడు. మంగళవారం రాత్రి బెంగళూరు ఒమెగా హెల్త్ కేర్ మేనేజిమెంట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆవరణలో జరిగిన ఈ హత్య స్థానికంగా కలకలం రేపింది. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. లీలా పవిత్ర(25)ది ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జగన్నాథపురం. గతంలో కాకినాడలోని ఓ టీవీ చానల్ న్యూస్‌రీడర్‌గా పనిచేసింది. బెంగళూరులో ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం రావడంతో జనవరిలో అక్కడికి వెళ్లింది. ఆమె తల్లి రాధాకృష్ణవేణి గృహిణి కాగా, తండ్రి అబ్బులు హేచరీల వ్యాపారంలో ఉన్నారు. వీరి ఏకైక కుమార్తె లీలాపవిత్ర. బాణాల దివాకర్‌ది శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం రెల్లివరస. తండ్రి చినబాబు రైతు. తల్లి ముత్యాలమ్మ రైల్వేలో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. ప్రస్తుతం వీరు విశాఖలో నివాసముంటున్నారు. విశాఖలో ఎమ్మెస్సీ చదువుతుండగా లీలాకు, దివాకర్‌కు పరిచయమేర్పడి.. అది కాస్తా ప్రేమగా మారింది. దివాకర్ కూడా బెంగళూరులో లీలా పనిచేస్తున్న కంపెనీలోనే ఉద్యోగం పొందాడు. ఇద్దరూ ఆఫీసుకు దగ్గర్లోనే పేయింగ్ గెస్టులుగా ఉంటున్నారు.

**కులాలు వేరు కావడంతో..**

దివాకర్ వేరే కులానికి చెందిన వాడు కావడంతో లీలా పవిత్ర కుటుంబం పెళ్లికి అంగీకరించలేదు. తల్లిదండ్రుల మాట మీరి పెళ్లి చేసుకోలేనని దివాకర్‌కు లీలా తేల్చి చెప్పింది. అంతేకాదు దివాకర్‌ను దూరం పెడుతూ వచ్చింది. అతని మొబైల్ నంబర్‌ను కూడా బ్లాక్ చేసింది. ఇదిలా ఉండగా మంగళవారం దివాకర్ రెండు కత్తులు తీసుకుని ఆమె పని చేస్తున్న కంపెనీ వద్దకొచ్చాడు. ఆమె బయటకు వచ్చాక తనను పెళ్లి చేసుకోవాలంటూ ఒత్తిడి చేశాడు. ఆమె నిరాకరించడంతో తన ప్యాంట్ జేబులో నుంచి కత్తి తీసి విచక్షణ రహితంగా పొడిచి హత్య చేసినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. లీలాను హత్య చేసిన అనంతరం దివాకర్ కూడా అదే కత్తితో ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా.. స్థానికులు అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. లీలా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బెంగళూరులోని బౌరింగ్ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని బెంగళూరు తూర్పు విభాగం అదనపు పోలీస్ కమిషనర్ భీమాశంకర్ ఎస్.గుళేద్ చెప్పారు. ఇదిలా ఉండగా ఈ హత్యోదంతంపై కాకినాడ జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు స్పందించారు. బెంగళూరు పోలీసులతో కేసుపై చర్చిస్తామని తెలిపారు.

# చెలరేగిన దొంగలు

▶ మొదటి పేజీ తరువాయి

కాపలాదారు కృపానిధి (66)పై ఇనుపరాడ్‌తో దాడి చేసి చంపేశాడు. అనంతరం షోరూం షట్టర్లు పగులగొట్టి లోపలికి వెళ్లారు. క్యాష్ కౌంటర్‌లో నగదు లేకపోవడంతో అక్కడ ఉన్న ఒక హెల్మెట్‌ను తీసుకుని మళ్లీ ద్విచక్ర వాహనంపై నగరంలోకి వచ్చారు. అరండల్‌పేట 11/1 రోడ్డులోని మీసేవ కేంద్రం షట్టర్ తెరిచే ప్రయత్నం చేశారు. అది తెరుచుకోకపోవడంతో పదో రోడ్డులోకి వెళ్లారు. అక్కడ ప్రభుత్వ వైన్‌మార్ట్ వద్ద ఉన్న వాచ్‌మెన్ బత్తుల సాంబశివరావు (63)పై దాడిచేసి చంపేశారు. అనంతరం వైన్ మార్ట్ తలుపు తెరిచే ప్రయత్నం చేయగా అది తెరుచుకోలేదు. దీంతో చుట్టుపక్కల నాలుగు షాపుల్లో చోరీకి ప్రయత్నం చేశారు. ఒక సెల్‌ఫోన్ షాపులో రెండు ట్యాబ్‌లు, స్మార్ట్‌వాచ్‌లు దొంగతనం చేశారు. అలికిడికి పక్కనే ఉన్న స్వగృహ స్వీట్‌షాప్ వాచ్‌మెన్ బయటకు వచ్చి కేకలు పెట్టడంతో అతనిపై దాడి చేశారు. అతను తప్పించుకుని అరండల్‌పేట పోలీసు స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు విషయం చెప్పాడు. డ్యూటీలో ఉన్న సెంట్రీ రక్షక్ వాహనంలో వారిని వెంబడించినా తప్పించుకుపోయారు. అనంతరం అరండల్‌పేట రెండో లైన్‌లోనే కూర్చుని మద్యం సేవించిన దుండగులు అక్కడి నుంచి పాత గుంటూరు ఆంధ్రా బ్యాంకు వద్ద పేపర్లు కట్టలు కడుతున్న పత్రిక ఏజెంట్‌పై పేపర్ ధర ఎంత అని అడుగుతూనే రాడ్‌తో దాడి చేశారు. ఆయన సెల్‌ఫోన్ లాక్కుని పరారయ్యారు. సుద్దపల్లి డొంక సమీపంలోని పాలబూత్ యజమాని రవికుమార్ అలియాస్ ఏసుబాబుపై దాడిచేసి గాయపరిచారు. యాదవ హైస్కూల్ వద్ద మరో వ్యక్తిపై దాడి చేశారు. అనంతరం నందివెలుగు రోడ్డులోని శ్మశానాల రోడ్డులో రెండు ఆటో ఫైనాన్స్, రెండు స్టిక్కరింగ్, ఒక కూల్‌డ్రింక్ షాపుల్లో చోరీలకు పాల్పడ్డారు. రెండు గంటల్లోనే నగరమంతా తిరుగుతూ విధ్వంసం సృష్టించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సంఘటన స్థలాల్లో ఆనవాళ్లు సేకరించాయి. ఐజీ త్రివిక్రమ వర్మ, జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, ఇతర అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. నిందితులను పట్టుకోవడానికి 8 బృందాలను రంగంలోకి దింపారు. సీసీ టీవీ ఫుటేజిల్లో నిందితుల్లో ఒకడు పాత నేరస్తుడేనని గుర్తించారు. వెంటనే అతని కుటుంబ సభ్యుల నుంచి సెల్‌ఫోన్ నంబర్ తీసుకొని, సిగ్నల్స్ ఆధారంగా అతడిని పట్టుకున్నారు. అతనిచ్చిన సమాచారంతో రెండో నిందితుడిని కూడా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి చోరీ సొత్తు మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. మైనర్లయిన వారిద్దరిని జువైనల్ హోంకు పంపుతున్నట్లు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ తెలిపారు.

# గ్రామీణుల ఆరోగ్య సంరక్షణకు టాస్క్‌ఫోర్స్

- ప్రతి గ్రామంలో ఎస్‌డీజీ టాస్క్‌ఫోర్స్ కమిటీ
- ఆరోగ్య రంగంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన
- ఎంఎల్‌హెచ్‌పీ నాయకత్వంలో ఏఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లతో టాస్క్‌ఫోర్స్
- రక్తహీనత నివారణ, గర్భిణులు, శిశువుల ఆరోగ్య సంరక్షణ
- జీవనశైలి జబ్బులు నివారణ, చికిత్సలపై దృష్టి
- టాస్క్‌ఫోర్స్ విధులను వివరించిన ప్రభుత్వం
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ డా. కేఎస్ జవహర్ రెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రామీణ ప్రజల ఆరోగ్య సంరక్షణ ద్వారా ఆరోగ్య రంగంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) సాధన కోసం ప్రతి గ్రామంలో ఎస్‌డీజీ టాస్క్‌ఫోర్స్ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ స్థాయిలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్– ఎంఎల్‌హెచ్‌పీ) నాయకత్వంలో ఏఎన్ఎం, ఆశా, అంగన్‌వాడీ వర్కర్, స్కూలు హెల్త్ అంబాసిడర్, గ్రామ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ సభ్యులుగా ఈ కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రధానంగా గర్భిణులు, శిశువులు, మహిళలు, పిల్లల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపం నివారణతో పాటు జీవనశైలి జబ్బుల నివారణ, చికిత్సలపై ఈ టాస్క్‌ఫోర్స్ పనిచేస్తుంది. తద్వారా ఆరోగ్య రంగంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలని ప్రభుత్వం నిర్దేశించింది.

గ్రామీణ ప్రజలకు గ్రామాల్లోనే వైద్య సేవలందించాలనే ఉదాత్తమైన ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌ను ఏర్పాటు చేసింది. వీటిలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ 24 గంటలు అందుబాటులో ఉంటారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్కూల్ హెల్త్ అంబాసిడర్, స్వయం సహాయక సంఘాల సమన్వయంతో గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషిచేస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రతి గ్రామంలో వీరితో ఎస్‌డీజీ టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ విధులను ప్రభుత్వం నిర్దేశించింది. ఈమేరకు క్షేత్రస్థాయి సిబ్బందికి మార్గదర్శకాలు జారీ చేయాలని ఆయా శాఖలకు సీఎస్ సూచించారు. గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహార కౌన్సిలింగ్, రక్తహీనత పర్యవేక్షణ ఐఎఫ్ఏ ట్యాబెలెట్లు పంపిణీ, నిల్వల పర్యవేక్షణను కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సమన్వయంతో అంగన్‌వాడీ వర్కర్లు నిర్వహించేలా మహిళా శిశు సంక్షేమ శాఖ తగిన ఆదేశాలు జారీ చేయాలి. అలాగే ఎస్‌డీజీల సాధనకు పాఠశాల విద్యా శాఖ, సెర్ప్ తగిన ఆదేశాలు జారీ చేయాలని ఆదేశించారు.

**ఎస్‌డీజీ టాస్క్‌ఫోర్స్ విధులు..**

- రక్తహీనత పర్యవేక్షణ, ప్రసూతి మహిళల ఆరోగ్యం, పిల్లల ఆరోగ్యం, జీవనశైలి జబ్బుల నిర్ధారణ, నివారణ, చికిత్స తదితర ఆరోగ్య కార్యకలాపాలపై ఏఎన్ఎం, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు ఎంఎల్‌హెచ్‌పీ మార్గనిర్దేశం చేస్తారు
- పాఠశాలల్లోని పిల్లల ఆరోగ్య వివరాలను పాఠశాల విద్యా శాఖ ఎంఎల్‌హెచ్‌పీకి అందించాలి. కౌమార దశలో ఉన్న బాలికలు, బరువు తక్కువగా ఉన్న పిల్లల్లో రక్తహీనతను స్కూల్ అంబాసిడర్ పర్యవేక్షించడంతో పాటు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో సమన్వయం చేసుకోవాలి. రక్తహీనత గల కౌమార దశలోని బాలికలకు రోజూ ఐఎఫ్ఏ మాత్రలను పంపిణీ చేయాలి. ఇతర పిల్లలకు పోషకాహారం అందించాలి.
- యుక్త వయస్సులోని బాలికలకు శానిటరీ నాప్కిన్ సరఫరా వివరాలు, బరువు తక్కువగా ఉన్న పిల్లలకు మధ్యాహ్న భోజనం వివరాలను ఎంఎల్‌హెచ్‌పీకి పాఠశాల విద్యా శాఖ అందించాలి. ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేయించాలి. ఇందుకు స్కూల్ అంబాసిడర్‌తో ఎంఎల్‌హెచ్‌పీ సమన్వయం చేసుకోవాలి.
- అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవల సామర్థ్యాన్ని పెంచడంతోపాటు గ్రామాల్లో రక్తహీనత పర్యవేక్షణ, గర్భిణులకు ప్రసవానికి ముందు, ప్రసవానంతర సంరక్షణ, నులిపురుగుల నిర్మూలన మందులు పంపిణీ, పిల్లల ఆరోగ్య సంరక్షణ, పౌష్టికాహారం అందించడం వంటి సేవలు సక్రమంగా అందేలా ఎంఎల్‌హెచ్‌పీ సమన్వయం చేసుకోవాలి.
- సెర్ప్ గ్రామ ఆర్గనైజేషన్ సమావేశాల్లో ఎంఎల్‌హెచ్‌పీ భాగస్వామిగా ఉంటూ జీవనశైలి జబ్బుల నివారణ, పరీక్షలు, చికిత్సలు, ఇతర అంశాలపై అవగాహన కల్పించాలి. గర్భిణిలలో రక్తహీనతకు కారణాలు, తల్లి, పిల్లలపై చూపే దుష్ప్రభావాలు వివరించి, గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి.
- ప్రసవానికి ముందు యాంటినేటల్ పరీక్షల సమయంలో యుఎస్‌జీ స్కానింగ్ ప్రాముఖ్యత, ఇమ్యునైజేషన్ ద్వారా రోగ నిరోధకతను పెంచడం ద్వారా వ్యాధుల నివారణపై అవగాహన కల్పించాలి.
- బాల్య వివాహాల నివారణ ద్వారా యుక్త వయస్సు గర్భాలను నిరోధించాలి.
- కుటుంబ నియంత్రణ ప్రణాళిక అమలు చేయాలి
- ప్రతి శుక్రవారం డ్రై డే పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలి
- క్షేత్రస్థాయిలో సిబ్బంది సమన్వయంతో సేవలందించేలా చూడాల్సిన బాధ్యత పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌కు ఉంటుంది.



మీరు చేస్తున్న చర్య మంచిదో, కాదో అని
మీకు సందేహం ఉంటే, దాన్ని చేయకుండా ఉండండి.
– జరాతుష్ట్ర



సాక్షి

గురువారం, మార్చి, 2

# తవ్వి తలకు పోసుకుందామా?

పిచ్చి కుదిరింది... తలకు రోకలి చుట్టమన్నాడట! చరిత్ర పేరుచెప్పి, దేశంలో ప్రతి ఊరి పేరు, వీధి పేరు, స్థలం పేరూ మార్చేయాలని చూస్తున్న వేలంవెర్రిని గమనిస్తే, ఆ నానుడి గుర్తుకొస్తుంది. సర్వోన్నత న్యాయస్థానానికి సైతం అదే గుర్తొచ్చింది. ఆ మాటనే పస లేని పిటిషన్‌తో వచ్చిన ఫిర్యాదీతో సహా పదుగురికీ మరో పద్ధతిలో గుర్తు చేసింది. 'ఆటవిక విదేశీ దురాక్రమణదారులు మార్చిన' చారిత్రక ప్రదేశాల 'అసలు' పేర్లను పునరుద్ధరించడానికి ఒక కమిషన్‌ను ఏర్పాటు చేసేలా కేంద్రాన్ని ఆదేశించాలంటూ బీజేపీ నేత అశ్వినీ ఉపాధ్యాయ్ వేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని సోమవారం సుప్రీమ్ కోర్ట్ కొట్టేసింది. జస్టిస్ జోసెఫ్, నాగరత్నల ధర్మాసనం పిటిషనర్ అత్యుత్సాహాన్ని తప్పుబట్టింది. భారత్ పదేపదే దాడులకు గురైంది నిజమే. విదేశీయులు మనల్ని పాలించినదీ నిజమే. దాన్ని గుర్తిస్తూనే, 'సమాజంలో విభేదాల' సృష్టికి 'చరిత్రను కొంతమేరకే తవ్వి తలకుపోస్తున్న' ప్రయత్నాలను సుప్రీమ్ నిరసించడం సరైన సమయంలో వెలువడింది.

చరిత్ర పట్ల ఏదో నిర్ణీత దృక్పథం పెట్టుకొని, తదనుగుణంగా ప్రజాస్వామ్య, లౌకిక, గణతంత్ర దేశాన్ని గత చరిత్రలో బందీని చేయరాదంటూ పిటిషనర్‌కు కోర్ట్ హితవు చెప్పాల్సి వచ్చింది. వర్తమాన భారతావనిలో పరిష్కరించాల్సిన అనేక అంశాలుండగా, ఈ పేర్ల మార్పిడినే అజెండాగా పాలకులు, వారి భావజాల దాసులు తలకెత్తుకోవడం విచిత్రం. తాజాగా మహారాష్ట్రలో మొఘల్ పాలకులు ఔరంగజేబ్, మీర్ ఉస్మాన్ అలీఖాన్ పేర్ల మీద వెలసిన నగరాలైన ఔరంగాబాద్‌ను ఛత్రపతి శంభాజీ నగర్‌గా, ఉస్మానాబాద్‌ను ధారాశివ్‌గా ఆ రాష్ట్ర పాలకులు మార్చేశారు. గత వారమే కేంద్రం దానికి రాజముద్రా వేసింది. ఇప్పుడిక అహ్మద్‌నగర్‌ను రాణి అహిల్యాదేవి హోల్కర్ పేరిట మార్చాలన్న డిమాండ్ ఊపందుకుంది. సరిగ్గా అదే రోజున పేర్ల మార్పిడిపై సుప్రీమ్ చేసిన ఈ వ్యాఖ్యలు కళ్ళు తెరిపించేలా ఉన్నాయి. ఆత్మశోధనకు ప్రేరేపిస్తున్నాయి.

పేరులో ఏముంది పెన్నిధి అన్నారు పెద్దలు. కానీ, పేరులోనే అంతా ఉంది, ఒక వర్గం పాలకులు వచ్చి మన పేర్లు మార్చేశారంటూ రాగద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రచారం చేయడం నేటి వికృత ధోరణి. పాత పేర్లను మార్చడం ద్వారా సమాజంలో ఒక వర్గం ఏకీకృతమై, తమ వైపు మొగ్గేలా చేసుకోవాలన్న వ్యూహం దేశ రాజకీయాల్లో ఇటీవల ప్రబలుతోంది. ఇది ప్రమాదకరం. ఈ నేపథ్యంలో 'నేను క్రైస్తవుణ్ణి. అయితేనేం, నాకు హిందూయిజమూ ఇష్టం. ఎంతో గొప్పదైన హిందూ ధర్మాన్ని తక్కువ చేయకూడదు' అని జస్టిస్ జోసెఫ్ వ్యాఖ్యానించడం విశేషం. మన దేశానికి పునాదులుగా నిలిచిన సహనం, సౌభ్రాతృత్వం, భిన్నత్వం, సమ్మిళితత్వాలకు ఒక రకంగా ఇది పునరుద్ఘాటన.

భిన్నత్వంలో ఏకత్వానికి ఘనత వహించిన గడ్డపై ఒక విధమైన భావజాలమే ఉండాలనీ, ఈ దేశాన్ని పాలించిన విభిన్న వర్గీయులంతా వట్టి 'దురాక్రమణదారులు, విదేశీ దోపిడీదారులు' అనీ ప్రచారం చేస్తే మూర్ఖత్వమే. అన్ని పేర్లూ మార్చి, అన్ని ముఖాలకూ సున్నం కొట్టి ఒకే ఉనికిని ధ్రువపరచాలనుకోవడం సాంస్కృతిక, భావజాల సామ్రాజ్యవాదమే తప్ప సమానత్వం కానేరదు. గద్దె మీది పెద్దలైనా, సమాజంలోని ఇతరులైనా ఈ ఉన్మాదాన్ని పెంచిపోషిస్తే, సామరస్యం దెబ్బతింటుంది. ఎవరైనా చేయాల్సింది మెరుగైన ప్రజాజీవనానికి తోడ్పడేలా విధానపరమైన మార్పులు తప్ప, ఒకరిపై మరొకరిని ఉసిగొలిపే పేరు మార్పులు కాదు. పాత గాయాలను కెలికి, ప్రజల్లో విభేదాలు సృష్టించే ఇలాంటి చర్యలను న్యాయవ్యవస్థే కాదు... బుద్ధిజీవులతో పాటు రాజకీయ సారథులూ నిర్ద్వంద్వంగా ఖండించాలి.

అయితే, అధికారం చేపట్టిన ప్రతి పార్టీ ఇదే పేర్ల మార్పిడి తప్పు చేస్తోంది. గతంలో కాంగ్రెస్ దేశ రాజధానిలోని ప్రసిద్ధ కన్నాట్ ప్లేస్‌ను రాజీవ్ చౌక్‌గా, కన్నాట్ సర్కిల్‌ను ఇందిరా చౌక్‌గా పేర్లు మార్చింది. రెండు తడవలుగా కేంద్రంలో చక్రం తిప్పుతున్న బీజేపీ గడచిన కొన్ని నెలల్లో ఎన్ని పేర్లు మార్చిందో లెక్కే లేదు. బ్రిటీషు, మొఘల్ పాలకుల గతాన్ని వదిలించుకోవడానికంటూ కొత్త పేర్ల కథను సమర్థించుకొనే ప్రయత్నం చేస్తున్నారు. వర్తమానమే వివాదాలమయం అయినప్పుడు గతం అందుకు భిన్నంగా ఉండే అవకాశం లేదు. వివాదాలు నిండిన ఆ గతాన్ని పట్టుకొని వేలాడి, ఆగతాన్ని వదిలేసి, నవ నామీకరణలకు దిగితే... కాలహరణమే తప్ప ప్రజానీకానికి పైసా ప్రయోజనం లేదు. దాని బదులు పాలనపై శ్రద్ధపెట్టి, అందమైన భవిష్యత్తు దిశగా అడుగులు వేయడం ఇప్పుడు ముఖ్యం.

ప్రస్తుత పాలకులు రాజ్‌పథ్‌ను కర్తవ్యపథ్ అన్నా, మొఘల్ గార్డెన్స్‌ను అమృతోద్యానంగా మార్చినా, ఢిల్లీలోని ఔరంగ్‌జేబ్ రోడ్, యూపీలోని అలహాబాద్, మొఘల్ సరాయ్‌లకు కొత్త పేర్లు పెట్టినా సామాన్యుల జీవితమేమైనా మారిందా? చరిత్రను భూతంగా, ఒక వర్గం పాలకులనంతా పీడకులుగా, హిందువులు తప్ప మిగతా అందరూ 'బయటివాళ్ళు', 'దోపిడీదొంగలు'గా అసత్య చిత్రణ వల్ల లాభం ఎవరికి? ఈ మిడిమిడి వాట్సప్ జ్ఞానంతో, మధ్యతరగతిని రెచ్చగొట్టే భావోద్వేగ రాజకీయ విన్యాసంతో ఓట్లు, సీట్ల లెక్కల్లో తాత్కాలిక ప్రయోజనం సిద్ధించవచ్చు. కానీ, స్వార్థంతో నాటుతున్న నేటి ఈ విషబీజాలు రేపటి సమాజాన్ని చీలుస్తుంటే ఆ శాశ్వత ప్రమాదానికి బాధ్యులెవరు? కులమత విభేదాలకు అతీతమైన నవ భారత నిర్మాణాన్ని నిజంగా స్వప్నించేవారెవరూ ఈ పని చేయరు. పాలకుల స్వప్రయోజనాలతో రోజుకో రకం చరిత్ర చదివితే, అసలు కథ మరుగునపడే దుఃస్థితి దేశానికి దాపురిస్తుంది. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడడమంటే ఇదే!

### గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** తిథి శు.దశమి ఉ.8.03 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** ఆరుద్ర ప.2.04 వరకు, తదుపరి పునర్వసు, **వర్జ్యం:** రా.3.15 నుండి 5.03 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.14 నుండి 11.02 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.42 వరకు, **అమృతఘడియలు:** లేవు

**సూర్యోదయం :** 6.23
**సూర్యాస్తమయం:** 6.02
**రాహుకాలం :** ప.1.30 నుండి 3.00 వరకు
**యమగండం :** ఉ. 6.00 నుండి 7.30 వరకు

# మంచిదేదో జంకు లేకుండా చెప్పాలి!

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

**జంక్ ఫుడ్‌తో వచ్చే అనారోగ్యంపై ప్రజలను హెచ్చరించాలనుకుంటే ఆ హెచ్చరిక ఓ గుర్తు రూపంలో ఉండాలి. ప్యాకేజీ ముందువైపున ముద్రించాలి. వేర్వేరు రంగుల సాయంతో అనారోగ్య స్థాయిని కూడా సూచించగలిగితే ప్రజలు ఓ మోస్తరు ఆరోగ్యాన్నిచ్చే ఆహారాన్ని లేదా అనారోగ్య కారక ఆహారాన్ని వేర్వేరుగా గుర్తించి నిర్ణయాలు తీసుకునే వీలు ఏర్పడుతుంది. ఇలా గుర్తించడం విజయవంతం కావాలంటే జాతీయ స్థాయిలో పౌష్టికతపై ఓనమాలు దిద్దించాలి. ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలి. లేదంటే, జంక్ ఫుడ్ తయారీదారులు తమ మార్కెటింగ్ బలం, నియంత్రణ సంస్థల చెలిమి సాయంతో చిరుధాన్యాలు, ఇతర ఆరోగ్యకరమైన ఆహారాలను కూడా హైజాక్ చేసే ప్రమాదం ఉంది.**

ఐక్యరాజ్య సమితి ఈ ఏడాదిని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో భారతదేశాన్ని చిరుధాన్యాల ఎగుమతి కేంద్రంగా ప్రపంచానికి పరిచయం చేసేందుకు ప్రభుత్వం సర్వశక్తులూ ఒడ్డుతోంది. ఈ సిరి ధాన్యాలు మానవ ఆరోగ్యానికి మాత్రమే కాదు, పర్యావరణానికీ మేలు చేసేవి. క్లిష్ట వాతావరణ పరిస్థితుల్లోనూ పండించగలగడం ఇందుకు కారణం. నిజానికి చిరుధాన్యాలు వందల ఏళ్లుగా భారతీయ ఆహారంలో భాగంగానే ఉన్నాయి. జొన్న, సజ్జ, రాగి వంటివి 1960వ సంవత్సరం వరకూ నలుగురిలో ఒకరు తినేవారు. కానీ, హరిత విప్లవం తరువాత చిరుధాన్యాల వాడకం క్రమేపీ తగ్గిపోయింది. అయితే ఇటీవలి కాలంలో ఈ చిరుధాన్యాలపై ఆసక్తి మళ్లీ పెరుగుతోంది. వాతావరణ మార్పుల ప్రమాదం, మధుమేహం, రక్తపోటు వంటి జీవనశైలి ఆరోగ్య సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో చిరుధాన్యాలను మళ్లీ మన ఆహారంలో భాగం చేసుకోవడం మంచిదని నిపుణులు కొంత కాలంగా సూచిస్తున్న విషయం తెలిసిందే.

చిరుధాన్యాల ఉత్పత్తి, వినియోగం తగ్గుతున్న క్రమంలోనే దేశంలో ఆహారపు అలవాట్లూ మారిపోయాయి. శుద్ధి చేసిన ప్యాకేజ్డ్, 'రెడీ టు ఈట్' ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవడం మొదలైంది. అప్పట్లో వ్యవసాయ ఉత్పత్తులు పాడవకుండా ఉండేందుకు, ఆహార వృథాను అరికట్టేందుకు ఆహార శుద్ధి పరిశ్రమలను ప్రోత్సహించారన్నది మరువరాదు. ఆర్థిక సరళీకరణ విధానాల అమలు ప్యాకేజ్డ్ ఫుడ్ వాడకం మరింత ఎక్కువయ్యేందుకు కారణమైంది. 1991 తరువాత చక్కెర లతో నిండిన పానీయాలు దేశీ మార్కెట్లను ముంచెత్తాయి. అలాగే జంక్ ఫుడ్ అని ఇప్పుడు మనం పిలిచే రకరకాల ఆహార పదార్థాలూ అందుబాటులోకి వచ్చాయి. చక్కెరలు, ఉప్పు, కొవ్వులు ఎక్కువగా ఉన్న అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్స్ కాస్తా ఊబకాయం, అసాంక్రమిక వ్యాధులు ఎక్కువయ్యేందుకు కారణమయ్యాయి.

ఈ పరిస్థితుల్లో చిరుధాన్యాలను మళ్లీ ప్రధాన ఆహారంగా మార్చడం పెద్ద సవాలే. ఒక పక్క రైతులు తమ పంటలు, పద్ధతులు మార్చుకునేందుకు తగిన ప్రోత్సాహాలు అందించడం... ఇంకోవైపు వినియోగదారులను చైతన్యపరచడం, వారి ఆహారపు అలవాట్లను మార్చడం ఆషామాషీ వ్యవహారమేమీ కాదు. భయం ఏమిటంటే... ఎక్కడ ఈ జంక్ ఫుడ్ పరిశ్రమ చిరుధాన్యాలపై ప్రస్తుతమున్న ఆసక్తిని తమకు అనుకూలంగా మార్చుకుంటుందో అని! అసాంక్రమిక వ్యాధులు ప్రబలేందుకు జంక్ ఫుడ్ ఒక కారణమని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎప్పుడైతే స్పష్టం చేసిందో, వీటిని పిల్లలకు అందించేందుకు చేస్తున్న ప్రయత్నాల నియంత్రణకు సూచనలు జారీ చేసిందో... అప్పటినుంచీ జంక్ ఫుడ్ పరిశ్రమ తమ ఉత్పత్తులను ఆరోగ్యకరమైనవనీ, సహజమైనవనీ చెప్పుకొనేందుకు గట్టిగా ప్రయత్నిస్తోంది.



మల్టీ గ్రెయిన్ కుకీలు, చక్కెర తక్కువగా ఉన్న శీతల పానీయాలు, హృదయానికి దోస్తుల్లాటివని చెప్పే వంటనూనెలు, 'పండ్ల' రసాలు అని పేర్లు పెట్టి... ఇంట్లో వండుకునే ఆహారానికీ, పండ్లు, కాయగూరలకూ వీటిని ప్రత్యామ్నాయాలుగా చూపే ప్రయత్నం మొదలైంది. చిరుధాన్యాల ద్వారా కూడా ఈ మాయ చేసేందుకు కంపెనీలు కొన్ని ఇప్పటికే హైదరాబాద్‌లోని ఐసీఏఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ వైపు పరుగులు పెడుతున్నాయి కూడా.

జంక్ ఫుడ్ తయారీదారులు తమ ఉత్పత్తుల ద్వారా కలిగే ఆరోగ్య ప్రయోజనాలను గొప్పగా చెప్పుకొంటూనే కీలక సమాచారాన్ని వినియోగదారుల కంటపడకుండా చూస్తాయి. ఆహారంలోని పదార్థాలు, హానికారక 'అడిటివ్స్'(కలిపినవి) వివరాలు కనిపించకుండా చేస్తాయి. దేశ నియమ నిబంధనల ప్రకారం ఫుడ్ ప్యాకెట్స్‌పై 'పోషక సమాచారం' తప్పనిసరిగా నిర్దిష్ట పద్ధతిలో ప్రచురించాలి. కొవ్వులు, చక్కెర, పిండిపదార్థాలు ఎంత మోతాదుల్లో ఉన్నాయో తెలపాల్సి ఉంటుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఒత్తిడి పుణ్యమా అని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఇప్పుడు 'ఫ్రంట్ ఆఫ్ ప్యాక్ న్యూట్రిషన్ లేబలింగ్'ను ప్రతిపాదించింది. సాధారణంగా ప్యాకెట్ వెనుకభాగంలో ఉండే సమాచారాన్ని ముందు కూడా ప్రచురించాలని ఈ ప్రతిపాదన ఉద్దేశం. దీనివల్ల వినియోగదారులకు మరింత సమాచారం అంది ఆరోగ్యకరమైన అల వాట్లు చేసుకుంటారని అంచనా. శాకాహార, మాంసాహార ఉత్పత్తు లను వేరు చేసేందుకు వాడినట్లు ఇవి కూడా గుర్తుల రూపంలో ఉంటాయి.

జంక్ ఫుడ్ కంపెనీలు, ఎఫ్ఎస్ఎస్ఏఐ కావాలని కోరుకుంటున్న స్టార్ రేటింగ్‌ల విషయంలో ఒక విషయాన్ని ప్రస్తావించాలి. అంత ఆరోగ్యకరం కాదని సూచించేందుకు రెండు స్టార్లను ఇచ్చినప్పుడు కూడా వినియోగదారులు వీటిని తీసుకునేందుకు మొగ్గు చూపుతున్నట్లు అధ్యయనాల ద్వారా తెలిసింది. పైగా ఈ స్టార్ రేటింగులు కొన్ని నియమ నిబంధనలకు లోబడి ఇచ్చేవి కాబట్టి వాటిని పరిశ్రమ వర్గాలు తమకు అనుకూలంగా మర్చుకునే అవకాశముందని అంచనా. వీటికి భిన్నంగా వార్నింగ్ లేబుల్స్(హెచ్చరికలు) మాత్రం అందులో ఉన్న పదార్థాల ఆధారంగా తయారవుతాయి. కుకీలు, పాస్తా, నూడుల్స్ వంటివాటిల్లో కొంత మోతాదులో జొన్నలు, సజ్జలు కలిపినంత మాత్రాన వాటికి ఆరోగ్యకరమైనవన్న ట్యాగ్ తగిలించాల్సిన అవసరమేమీ లేదు కదా!

మరి పోషకాలపై మనకున్న అవగాహన ఎంత? హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జాతీయ పోషకాహార సంస్థ(ఎన్ఐఎన్) అంచనా ప్రకారం అది చాలా తక్కువ. ఫుడ్ లేబుల్‌లోని సమాచారం అప్పు డప్పుడూ చదువుతాము కానీ... కొనుగోళ్ల సమయంలో ఎక్కువగా తయారీ, ఎక్స్‌పైరీ డేట్లనే చూస్తూంటామని ఎన్ఐఎన్ నిర్వహించిన ఒక అధ్యయనంలో అధికులు తెలపడం ఇక్కడ ప్రస్తావనార్హం. ఇదే సమయంలో శాకాహార, మాంసాహారాలను వేరు చేసేందుకు ఉపయోగించే గుర్తులు మాత్రం బాగా ఉపయోగపడుతున్నట్లు వారు ఒప్పుకొంటున్నారు.

ఈ నేపథ్యంలో ఆహారపు అనారోగ్యతను సూచించేందుకు ట్రాఫిక్ సిగ్నళ్ల మాదిరి గుర్తులను వాడాలని కొంతమంది సూచిస్తున్నారు. కానీ కంపెనీలు మాత్రం 'హెల్త్ స్టార్ రేటింగ్' ఉంటే మేలు అంటున్నాయి. అయితే స్టార్ గుర్తు సానుకూలతను సూచిస్తుంది. ఒకట్రెండు అధ్యయనాల ప్రకారం కొందరు బాగా శుద్ధి చేసిన ఆహారం ప్యాకెట్లపై ఎర్రటి గుర్తు పెట్టడం మేలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తాజాగా జాతీయ పోషకాహార సంస్థ కూడా ప్యాకేజీల ముందువైపు సమాచారం ఇవ్వడం మంచిదేనన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

అంటే జంక్‌ఫుడ్‌తో వచ్చే అనారోగ్యంపై ప్రజలను హెచ్చరించాలనుకుంటే ఆ హెచ్చరిక ఓ గుర్తు రూపంలో ఉండాలి. ప్యాకేజీ ముందువైపున ముద్రించాలి. వేర్వేరు రంగుల సాయంతో అనారోగ్య స్థాయిని కూడా సూచించగలిగితే ప్రజలు ఓ మోస్తరు ఆరోగ్యాన్నిచ్చే ఆహారాన్ని లేదా అనారోగ్య కారక ఆహారాన్ని వేర్వేరుగా గుర్తించి నిర్ణయాలు తీసుకునే వీలు ఏర్పడుతుంది. ఈ లేబలింగ్ విజయవంతం కావాలంటే జాతీయ స్థాయిలో పౌష్టికతపై ఓనమాలు దిద్దించాలి. ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలి. లేదంటే జంక్ ఫుడ్ తయారీదారులు తమ మార్కెటింగ్ బలం, నియంత్రణ సంస్థల చెలిమి సాయంతో చిరుధాన్యాలు, ఇతర ఆరోగ్యకరమైన ఆహారాలను కూడా హైజాక్ చేసే ప్రమాదం ఉంది.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!





## సోషల్ మీడియా

### ద్వేషపూరితం



ఆర్మేనియన్ల పట్ల ద్వేషాన్ని రాజ్య స్థాయిలో ప్రచారం చేస్తూ, నిద్రిస్తున్న ఆర్మేనియన్‌ను చంపడం ఒక వీరోచిత చర్యగా చూసే దేశం నుంచి శాంతిని ఊహించడం అసంగతంగా ఉంటుంది. అజర్‌బైజాన్ తన దురాక్రమణను ఆపాలి.

– స్వజానా అవెతిస్యాన్, ఆర్మేనియా నాయకురాలు

### చెట్లకు కాస్తున్నాయా?



బలహీనమైన అమెరికా పెద్దవాళ్లకు చెల్లింపులు జరుపుతోంది: పాకిస్తాన్, ఇరాక్, జింబాబ్వేలకు గత ఏడాదే వందల మిలియన్ల డాలర్లను చెల్లించింది. బలమైన అమెరికా ఇక ప్రపంచానికి ఎంతమాత్రం ఏటీఎం కాబోదు.

– నిక్కీ హేలీ, అమెరికా అధ్యక్ష అభ్యర్థి

### అదే సమస్య



మీడియాతో నా సమస్య ఏమిటంటే, వాళ్లు అబద్ధాలు చెబుతారని కాదు. మొత్తం కథనం కాకుండా, నేను తెలుసుకోవాలనుకునే వాళ్ల తరఫు కథనం మాత్రమే చెబుతారు.

– బిల్ మాహెర్, కమెడియన్

### నమ్మొద్దు



కోవిడ్ ప్రయోగశాలలో నుంచి వచ్చే అవకాశమే లేదు. ఇది మనకు ఎలా తెలుసంటే, ఫ్యాక్ట్ చెకర్స్ వల్ల. అంతేగా... వాళ్లు అన్ని వాస్తవాలను తరచి చూస్తారు కదా! (వ్యంగ్యం)

– ఆడమ్ కరోలా, హోస్ట్

### ఆయనేం సాధువా?



అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా – అత్యున్నత జీవన ప్రమాణాలు కలిగిన లిబియాను యుద్ధంలో ఛితికిపోయిన దేశంగా మార్చాడు. సిరియాలో ఎన్ని బాంబులు వేశాడంటే, ఇంక వేయడానికి బాంబుల కొరత ఏర్పడేట్టుగా. అయినా ఆయన్ని ఇప్పటికీ కొందరు సాధువులా చిత్రిస్తారు.

– సారా అబ్దుల్లా, లెబనాన్ కామెంటేటర్

### ప్రేమించడం తెలియదు



పురుషులు స్త్రీలను ప్రేమించరు. వాళ్లు స్త్రీ అనే 'భావన'ను ప్రేమిస్తారు. స్త్రీల 'ఎముకలు, మాంసం, ఒంపుల'ను ప్రేమిస్తారు. కానీ స్త్రీ సంపర్కంలో ఉండే ఉద్వేగాలు, పోషణ, జాగ్రత్తగా చూసుకోవడం, సానుభూతి సంబంధిత విషయాలకు వచ్చేసరికి– వాళ్లు స్త్రీలను బలహీనులుగా, పిచ్చివాళ్లుగా, మరీ పట్టుకొని వేలాడేవాళ్లుగా చూస్తారు.

– హుడా భంగ్రీ, స్త్రీవాది

### ద్రోహం



ముఖ్యంగా గర్ల్ ఫ్రెండ్స్ వల్ల తప్పుడు అత్యాచార కేసుల్లో ఇరికామనే పురుషులు పదేపదే చెబుతున్నది ఇదీ: పోలీసులు ఈ మగవాళ్ల ఫోన్లను స్వాధీనం చేసుకుంటారు. అది పరస్పర అంగీకార సంబంధం అని వెల్లడయ్యే అన్ని ఛాట్స్‌ను, ఫొటోలను డిలీట్ చేస్తారు. ఇంక బెయిల్‌కూ, ఉపశమనానికీ ఏ రుజువూ ఉండదు. ఇది భయానకం.

– దీపికా నారాయణ్ భరద్వాజ్, డాక్యుమెంటరీ మేకర్

# ఆకాశమే హద్దుగా పారిశ్రామిక ప్రగతికి బాట

అభిప్రాయం



కుమారస్వామి

విభజన తరువాత ఆంధ్ర ప్రదేశ్ తనదైన శైలిలో పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతూ ఉంది. ఇటీవలి సంవత్సరాలలో రాష్ట్రం పారిశ్రామికాభివృద్ధిపై దృష్టి సారించింది. పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించడానికి అనేక కార్యక్రమాలు చేపట్టింది. ఇప్పటికే అనేక విదేశీ కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాయి. కియా మోటార్స్ అనంతపురంలో కార్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఫాక్స్‌కాన్... 'శ్రీ సిటీ'లోని ఎలక్ట్రానిక్స్ తయారీ పార్కులో పెట్టుబడి పెట్టింది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, విప్రో వంటి సంస్థల నుండి కూడా రాష్ట్రం పెట్టుబడులను ఆకర్షించింది. మొత్తంమీద ఏపీలో పారిశ్రామిక దృశ్యం ఆశాజనకంగా ఉంది.

ఆంధ్రప్రదేశ్ అనేక సహజ వనరులను కలిగి ఉంది. 974 కిలోమీటర్ల పొడవైన తీరప్రాంతాన్ని కలిగి ఉంది. ఇది దేశంలో రెండవ పొడవైన తీరం. రాష్ట్రం ఆరు పోర్టులకు లాజిస్టిక్స్ ప్రయోజనాన్ని కలిగి ఉంది. ఇంకా నాలుగు అభివృద్ధి దశలో ఉన్నాయి. ఏపీ ప్రభుత్వం వ్యాపార అనుకూల వాతావరణాన్ని ప్రోత్సహించడానికీ, రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడానికీ పారిశ్రామిక అభివృద్ధి విధానంలో భాగంగా 'సింగిల్ డెస్క్ పాలసీ', 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' వంటి అనేక కార్యక్రమాలను ప్రారంభించింది. జగన్ ప్రభుత్వం వివిధ రకాల సబ్సిడీలు, పన్ను ప్రోత్సాహకాలు వంటి అనేక వ్యాపార అనుకూల విధానాలను అమలు చేసింది.

కార్మిక చట్టాలలో ఐదు చట్టాలను 'రీ ఇంజనీరింగ్' చేసింది. వాడుకలో లేని 26 చట్టాలను రద్దు చేసింది. పరిపాలనలో సమగ్ర మార్పు తీసుకురావడం ద్వారా... వ్యాపారాన్ని ప్రారంభించడానికి సగటు సమయాన్ని 21 రోజులకు తగ్గించింది. 2023న జనవరి 31న జరిగిన కర్టెన్ రైజర్ ఈవెంట్ సందర్భంగా, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' పరంగా అనేక రాయితీలు ఇస్తున్నామన్నారు. ఇవన్నీ పరిశ్రమలు రాష్ట్రంలో పెట్టడానికి తగిన వాతావరణం సృష్టించాయి. దీంతో జాతీయ, అంత ర్జాతీయ పెట్టుబడిదారులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారింది మన రాష్ట్రం.



దేశంలోని 11 పారిశ్రామిక కారిడార్లలో మూడు ఆంధ్రప్రదేశ్‌లో రాబోతున్నాయి. అవి విశాఖపట్నం–చెన్నై, చెన్నై–బెంగళూరు, హైదరాబాద్–బెంగళూరు పారిశ్రామిక కారిడార్లు. విశాఖపట్నం–చెన్నై కారిడార్‌లో 6,739 ఎకరాల్లో 'వైఎస్ఆర్ జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్'ను అభివృద్ధి చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో వస్తున్న 'ఏపీ బల్క్‌డ్రగ్ పార్క్' అటువంటి ఆమోదించబడిన మూడు పార్కులలో ఒకటి. ఓడరేవుల ఆధారిత పారిశ్రామికీకరణ ప్రాజెక్టులలో రూ. 1 లక్ష కోట్లకు పైగా పెట్టుబడి పెట్టాలని భావిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని ప్రధాన పారిశ్రామిక మండలాలు... విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్, అచ్యుతాపురం వద్ద ప్రత్యేక ఆర్థికమండలి (సెజ్), శ్రీ సిటీ సెజ్, కాకినాడ సెజ్. పారిశ్రామిక వృద్ధిని ప్రోత్సహించడానికి రాష్ట్రం అనేక పారిశ్రామిక పార్కులు, క్లస్టర్‌లను కూడా ఏర్పాటు చేసింది. డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) ప్రకారం, 2019లో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజి నెస్ పరంగా భారతదేశంలోని టాప్ 10 రాష్ట్రాలలో ఆంధ్ర ప్రదేశ్ 5వ స్థానంలో ఉంది.

పారిశ్రామిక రంగంలో రాష్ట్రం అద్భుతమైన ప్రగతిని సాధించింది. రాష్ట్రంలో ప్రతి నెలా దాదాపు 3.5 మిలియన్ల మొబైల్ ఫోన్‌లు ఉత్పత్తి చేయబడుతున్నాయి. ఏటా 3 మిలియన్ టీవీలను తయారు చేయగల సామర్థ్యాన్ని ఏపీ కలిగి ఉంది. మరిన్ని పెట్టుబడులకు ప్రముఖ ప్రైవేట్ రంగ కంపెనీలను రాష్ట్రంలోకి తీసుకురావడానికి మార్చి 3, 4 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమిట్' ద్వారా కృషి చేస్తున్నారు.

రాష్ట్రంలో వ్యవసాయం చాలా మందికి ఉపాధి కలిగి స్తోంది. అందువల్ల ఆహార ప్రాసెసింగ్ రంగంలో అనేక అవకాశాలున్నాయి. చేపల ఉత్పత్తిలో 24 శాతం వాటాతో ఆక్వాకల్చర్‌లో దేశంలోనే ఏపీ మొదటి స్థానంలో ఉంది, వరి, మొక్కజొన్న, వేరుశెనగ ఉత్పత్తిలో రెండవ స్థానంలో, పాలు, మాంసం ఉత్పత్తిలో నాల్గవ స్థానంలో ఉంది. ఈ రంగాల్లో పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పది వేలకు పైగా వైఎస్ఆర్ రైతుభరోసా కేంద్రాలను అభివృద్ధి చేసింది.

భారతదేశంలో బెంగళూరు, హైదరాబాద్‌లు ఐటీ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు వాటి స్థానాన్ని ఆక్రమించాలని ప్రయత్నిస్తోంది. విశాఖ పట్నం, తిరుపతి, అనంతపురంలో మూడు ఐటీ కాన్సెప్ట్ నగరాలను అభివృద్ధి చేస్తోంది. అలాగే ఆంధ్ర ప్రదేశ్‌లో కెమికల్స్ – పెట్రోకెమికల్స్ పరిశ్రమకు మంచి అవకాశాలు ఉన్నాయి. భారతదేశంలోని అతిపెద్ద ఆఫ్‌షోర్ క్షేత్రాలు రాష్ట్రంలోని కేజీ బేసిన్‌లో ఉన్నాయి.

పునరుత్పాదక ఇంధన పెట్టుబడులకు రాష్ట్రం ఆకర్షణీయమైన అవకాశాలను అందిస్తోంది. కొన్ని అంచనాల ప్రకారం, రాష్ట్రం 38 జీడబ్ల్యూ సోలార్, 44 జీడబ్ల్యూ పవన శక్తిని వ్యవస్థాపించగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఇవి కాక, చెత్తను రీసైకిల్ చేయడానికి, బయోమాస్, పురపాలక ఘన వ్యర్థాలు, పారిశ్రామిక వ్యర్థాల నుండి విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి స్థానిక ప్రభుత్వాలను సన్నద్ధం చేసింది.

పర్యాటకాభిమానులకు ఆంధ్రప్రదేశ్.. దేశంలో మూడవ అత్యంత ప్రసిద్ధ పర్యాటక కేంద్రం. 2021లో 9.32 కోట్లమంది దేశీయ పర్యాటక సందర్శనలను సాధించింది. హెరిటేజ్ టూరిజం, బౌద్ధ పర్యాటకం, ఎకో – టూరిజం, రూరల్ టూరిజం వంటి థీమ్-ఆధారిత పర్యాట కాన్ని ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటోంది.

విశాఖ 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2023' దేశ, విదేశీ పెట్టుబడిదారుల నుండి గణనీయమైన పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉంది. దీర్ఘకాలంలో అధిక వృద్ధికి అవకాశం ఉన్న 13 రంగాలలో పెట్టుబడిదారులకు ద్వారాలను జగన్ ప్రభుత్వం తెరిచి ఉంచింది. ఈ అవకాశాలను వినియోగించుకుని పెట్టుబడి దారులు భారీ సంఖ్యలో ఇక్కడ పెట్టుబడి పెడితే రాష్ట్ర అభివృద్ధికి ఆకాశమే హద్దవుతుంది.

వ్యాసకర్త 'కదిరి అభివృద్ధి వేదిక' కన్వీనర్
మొబైల్: 94901 22229

(మార్చి 3, 4 తేదీల్లో విశాఖపట్నంలో 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమిట్' జరగనుంది.)

# అల్పుడి ప్రతాపం

కురుక్షేత్ర యుద్ధం మొదలయి పదహారు దినాలు గడిచాయి. భీష్ముడు నేలకొరిగాడు. ద్రోణుడు ప్రాణాలు వదిలాడు. కర్ణుడు, కౌరవ సేనాపతి అయినాడు. శల్యుడిని తనకు రథసారథిగా నియమించమని దుర్యోధనుడిని అడిగాడు. శల్యుడు ముందు ఒప్పుకోలేదు. దుర్యోధనుడు ఎంతగానో బతిమాలిన పిదప ఒప్పుకొన్నాడు.

శల్యుడు సారథిగా యుద్ధ భూమిలో అడుగు పెట్టిన కర్ణుడు తన నుండి అర్జునుని దేవతలు కూడా రక్షించలేరని ప్రగల్భాలు పలుకుతాడు. ఆ సందర్భంలోనే కర్ణుని నిరుత్సాహపరుస్తూ ఒక కథ చెబుతాడు శల్యుడు. ఆ కథ ఆంధ్ర మహాభారతం కర్ణ పర్వం ద్వితీయాశ్వాసంలో ఉన్నది.

సముద్రం దరిదాపుల్లో ఒక ఊరు. ఆ ఊరిలో ఒక సంపన్న గృహస్థు. ఆ గృహస్థుకు పదుగురు కుమారులు. ఒక కాకి వీరు విదిల్చే ఎంగిలి మెతుకులు తిని బాగా బలిసింది.

జ్యోతిర్మయం

ఒకసారి మానస సరోవరం నుండి కొన్ని హంసలు ఆ ప్రాంతానికి వచ్చినాయి. ఈ కాకికి ఆ హంసల గొప్పదనం తెలియదు. తనతో ఎగరటంలో పోటీకి రమ్మని అడిగింది. హంసలు నవ్వి తమకున్న శక్తి సామర్థ్యాలు ఉన్నవి ఉన్నట్లుగా చెప్పినాయి. అయినా కాకి వినలేదు. అప్పుడు ఆ హంసల్లో ఒక హంస, కాకి కోరినట్లుగా పోటీకి సిద్ధమైంది. ఆ రెండు పక్షులు సముద్రం వైపు ఎగురుకొంటూ వెళ్ళాయి. సముద్రం మీద ఎంత దూరం వెళ్లినా హంసకు అలసట కలగలేదు. కాకి మాత్రం అలిసి పోయింది. దిగి సేదదీరుదామంటే కింద అంతా అపార జలం. బలం క్షీణించి నీళ్ళలో పడిపోయే సమయం ఆసన్నమైంది. అప్పుడిక చేసేది లేక హంసను వేడుకొంటుంది రక్షించమని. హంసచేత రక్షించబడిన కాకి, అప్పటి నుండి తన దురహంకారాన్ని విడిచిపెట్టి శాంత చిత్తంతో జీవించటం నేర్చుకొంది. ఈ కథ చెప్పిన శల్యుడు కర్ణుని ఆ కాకితో పోలుస్తాడు.

ఈ కథ అనేక నీతులతో కూడుకొని ఉన్నది. ప్రత్యర్థిని ఎదిరించే ముందు తన పరిమితులను తాను ఎరిగి ఉండాలి. గొప్పవారు తమ గొప్ప తనాన్ని తామే చాటుకోరు. హంసలు ఆ ఉదాత్త గుణాన్ని ప్రదర్శించినాయి. 'అల్పుడెపుడు పల్కు నాడంబరముగాను, సజ్జనుండు పల్కు చల్లగాను' అనే నీతి పద్యానికి ఈ కథ చక్కటి ఉదాహరణగా నిలుస్తుంది.

– దీవి సుబ్బారావు

## క్లుప్తంగా...

### మహాయజ్ఞంపై త్వరలో డాక్యుమెంటరీ

- విశాఖ శ్రీ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి



సాక్షి, న్యూఢిల్లీ/సింహాచలం: విశాఖ శ్రీశారదాపీఠం పర్యవేక్షణలో హరియాణా రాష్ట్రం కురుక్షేత్ర వేదికగా గుంటీ ఆశ్రమ నిర్వహణలో విజయవంతంగా సాగిన లక్ష చండీ మహా యజ్ఞంపై త్వరలో డాక్యుమెంటరీని రూపొందించబోతున్నామని విశాఖ శ్రీశారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి ప్రకటించారు. లక్ష చండీ మహా యజ్ఞాన్ని తొలిసారి నిర్వహించిన ఘనత విశాఖ శ్రీశారదాపీఠానికే దక్కుతుందని చెప్పారు. బుధవారం ఢిల్లీలో స్వాత్మానందేంద్ర మీడియాతో మాట్లాడారు. హిందూ జాతిని జాగృతం చేసేందుకే దేశ నలుమూలల నుంచి వచ్చిన రుత్వికులకు యజ్ఞంలో భాగస్వామ్యం కల్పించామని తెలిపారు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ, సమాజంలో కొందరు పనిగట్టుకుని విశాఖ శ్రీ శారదా పీఠంపై రాజకీయ ముద్ర వేస్తున్నారన్నారు. కానీ రాజశ్యామల అనుగ్రహం అందరికీ ఉండాలనే తమ పీఠం భావిస్తోందని స్పష్టం చేశారు. విశాఖ శ్రీశారదాపీఠానికి వ్యక్తిగత ఆలోచనలు ఉండబోవని, సమాజ హితం కోసం మాత్రమే పని చేస్తుందని వివరించారు.

### మాచ్‌ఖండ్‌లో విద్యుత్ ఉత్పత్తి పునఃప్రారంభం

**ముంచంగిపుట్టు (అల్లూరి సీతారామరాజు జిల్లా):** ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పాదన పునఃప్రారంభమైంది. టీపీ డ్యామ్ వద్ద సారంగ మార్గంలో చెట్టు కొమ్మలు, తుప్పలు చేరి జాలీ గేట్లు దెబ్బతిని నాలుగు రోజులుగా విద్యుత్ ఉత్పాదన నిలిచి పోయింది. దీంతో జెన్‌కో ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ప్రాజెక్టుకు చెందిన 60 మంది సిబ్బంది నాలుగు రోజుల పాటు తీవ్రంగా శ్రమించి, జాలీ గేట్లను సరిచేశారు. బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు రెండు జనరేటర్లు, సాయంత్రం ఆరు గంటలకు మిగిలిన రెండు జనరేటర్లను వినియోగంలోకి తీసుకువచ్చారు. దీంతో ప్రస్తుతం 1, 2, 3, 5 జనరేటర్లతో 72 మెగావాట్లు విద్యుత్ ఉత్పాదన జరుగుతుందని మాచ్‌ఖండ్ ప్రాజెక్టు ఎస్‌ఈ కేవీ నాగేశ్వరరావు తెలిపారు.

### అడ్వొకేట్ అరాచకం

- 11 ఏళ్లుగా భార్య గృహనిర్బంధం
- సెర్చ్ వారెంట్‌తో మహిళను విడిపించిన పోలీసులు



అడ్వొకేట్ భార్య సాయిసుప్రియతో పోలీసులు

**విజయనగరం (క్రైమ్):** నలుగురికీ న్యాయం చేయాల్సిన న్యాయవాదే భార్యను హింసకు గురిచేశాడు. 11 ఏళ్లపాటు భార్యను బాహ్య ప్రపంచానికి దూరం చేశాడు. తమ కుమార్తె అసలు బతికి ఉందో లేదోనన్న సందేహంతో ఆమె తల్లిదండ్రులు విజయనగరం వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. ఎస్పీ ఎం.దీపికను కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. ఇంటికి వెళ్లిన పోలీసులపైనా కేసు పెడతానంటూ న్యాయవాది బెదిరించడంతో చేసేది లేక మేజిస్ట్రేట్ జారీ చేసిన సెర్చ్ వారెంట్‌తో వెళ్లి గృహ నిర్బంధం నుంచి ఆమెను విడిపించారు. సీఐ బి.వెంకటరావు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక కంటోన్మెంట్ బాలాజీ మార్కెట్ సమీపంలోని మార్వాడి వీధిలో ఉంటున్న న్యాయవాది గోదారి మధుసూదనరావు శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన సాయిసుప్రియ అనే మహిళను 2008లో వివాహం చేసుకున్నాడు. 2009లో వీరికి పాప పుట్టింది. డెలివరీ కోసం పుట్టింటికి వెళ్లిన సుప్రియ ఆ తరువాత భర్త దగ్గరకు వచ్చేందుకు నిరాకరించింది. నువ్వు లేకపోతే ఉండలేనంటూ భర్త చెప్పిన మాయమాటలు నమ్మి విజయనగరం వచ్చింది. అప్పటినుంచి భార్యను ఇంట్లోనే బంధించిన మధుసూదనరావు తల్లిదండ్రులతో మాట్లాడటానికి, చూడటానికి కూడా అనుమతించలేదు. ఆమె తల్లిదండ్రులు ఎంత బతిమాలినా బయటినుంచే పంపిచేసేవాడు. ఇలా 11 ఏళ్లపాటు ఈ తంతు సాగింది. దీంతో తమ కుమార్తె సుప్రియ అసలు బతికి ఉందో లేదోనన్న అనుమానించిన తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమవుతూ వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు అతడి ఇంటికి వెళ్లగా.. మీరు దొంగపోలీసులని, ఎఫ్ఐఆర్ ఉంటేనే రావాలని చెప్పి లోపలికి రానీయలేదు. దీంతో బాధితురాలి తల్లిదండ్రులు ఎస్పీ ఎం.దీపికను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీంతో కేసు రిజిస్టర్ చేసిన పోలీసులు కోర్టునుంచి సెర్చ్ వారెంట్ తీసుకుని బుధవారం ఆ ఇంటికి వెళ్లి మహిళను గృహనిర్బంధం నుంచి విముక్తి కల్పించారు.

### 3న డయల్ యువర్ టీటీడీ ఈవో

**తిరుమల:** డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం ఈ నెల 3న ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరుగనుంది. ఈవో ఏవీ ధర్మారెడ్డితో ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తమ సందేహాలను, సూచనలను తెలుపవచ్చు. కాగా, తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 50,392 మంది స్వామివారిని దర్శించుకున్నారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.

## నీతి ఆయోగ్ మెచ్చిన ఆక్వా టెకీ

2020లో స్టార్టప్‌గా ప్రస్థానం ప్రారంభించిన 'ఆక్వా ఎక్స్ఛేంజ్' సంస్థ

- ఆక్వా రైతులకు టెక్ ప్లాట్‌ఫామ్‌ను పరిచయం చేసిన పవన్‌కృష్ణ
- 2,500 మంది రైతులు.. 30 వేల ఎకరాల్లో వినియోగం
- రైతులకు తక్కువ ఖర్చుతో అధిక లాభాలందిస్తున్న సంస్థ




ఆక్వా ఎక్స్ఛేంజ్ సంస్థ

**సాక్షి, విశాఖపట్నం:** ఆక్వా ఎక్స్ఛేంజ్ పేరుతో సాంకేతికతని పరిచయం చేసి.. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జించేలా ఏకంగా 2,500 మంది రైతుల్ని నడిపిస్తున్నారు విశాఖకు చెందిన పవన్ కృష్ణ కొసరాజు. అతడి కృషిని నీతి ఆయోగ్ గుర్తించింది. దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగం పురోభివృద్ధికి దోహదపడుతున్న 75 స్టార్టప్‌లలో ఆక్వా ఎక్స్ఛేంజ్‌కు చోటు కల్పించింది. విశాఖలో చదువుకుని ఐఐటీ మద్రాస్‌లో బీటెక్ పట్టా, బెర్లిన్‌లో ఎంబీఏ, యూఎస్ఏలో ఫైనాన్షియల్ రిస్క్ మేనేజ్‌మెంట్ పట్టా పుచ్చుకున్న పవన్‌కృష్ణ జర్మనీ, భారతదేశాల్లోని వివిధ సంస్థల్లో పనిచేశారు. ఆ తరువాత ఓ స్టార్టప్ కంపెనీ ప్రారంభించాలన్న ఆలోచన వచ్చింది. ఆక్వా రైతులు పడుతున్న ఇబ్బందుల్ని ప్రత్యక్షంగా చూసిన పవన్ వారికి సాంకేతికతను పరిచయం చేయాలన్న సంకల్పంతో ఆక్వా ఎక్స్ఛేంజ్ పేరుతో 2020లో స్టార్టప్‌ను ప్రారంభించారు. విశాఖలో రిజిస్టర్ చేసి విజయవాడలో కార్యాలయం ప్రారంభించారు. కోవిడ్ సమయం కావడంతో కాస్తా ఆలస్యంగానే అడుగులు పడ్డాయి. తన బంధువులైన ఒకరిద్దరు రైతులతో మొదలుపెట్టగా.. వారు సత్ఫలితాలు సాధించడంతో క్రమంగా రైతులు ఆక్వా ఎక్స్ఛేంజ్ వైపు ఆకర్షితులయ్యారు.

### టెక్ పరికరాలు.. లాభాల సిరులు



ఆక్వా రైతులకు ప్రధానంగా ఎదురవుతున్న సమస్యలపైనే పవన్ దృష్టి సారించారు. చెరువుల్లో పెంచే రొయ్యలు, చేపలకు ఆక్సిజన్ పూర్తిస్థాయిలో సరఫరా చేయడం.. మేతను సమపాళ్లలో అందించడం.. విద్యుత్ ఖర్చులు తగ్గించడం.. దిగుబడుల్ని మంచి లాభాలకు కొనుగోలు చేయించడం వంటి నాలుగు అంశాలపై ఆక్వా ఎక్స్ఛేంజ్ పనిచేస్తూ.. రైతుల మన్ననల్ని చూరగొంటోంది. నెక్ట్స్ ఆక్వా పేరుతో భిన్నమైన పరికరాలను ఆవిష్కరించారు. వాటికి పేటెంట్లు కూడా దక్కించుకున్నారు. ఆక్వా ఎక్స్ఛేంజ్ పేరుతో తయారు చేసిన యాప్ ద్వారా ఈ పరికరాల్ని ఆయా రైతులే స్వయంగా మోనిటరింగ్ చేసుకునేలా వ్యవస్థను రూపొందించారు. అద్భుతమైన ఈ టెక్ పరికరాల్ని నెల్లూరు జిల్లా గూడూరు నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకూ 2500 మంది రైతులు 30 వేల ఎకరాల్లో వినియోగిస్తున్నారు.

### కరెంట్ పోయినా.. చింత లేదు

ఈ సంస్థ రూపొందించిన పవర్ మోన్ అనే పరికరాన్ని చెరువు వద్ద ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ సరఫరాను ఆ పరికరమే మోనిటరింగ్ చేసుకుంటుంది. కరెంటు పోయినప్పుడు ఏరియేటర్లు ఆగిపోకుండా ఆ పరికరమే జనరేటర్‌ను ఆన్ చేస్తుంది.



ఆక్వాఎక్స్ఛేంజ్ తయారు చేసిన ఏపీఎఫ్‌సీని పెట్టుకుంటే.. ఆక్వా చెరువుకు ఎంత లోడ్ అవసరమో అంతే విద్యుత్‌ని వినియోగించేలా చేస్తుంది. తద్వారా విద్యుత్ బిల్లు చాలా వరకూ ఆదా అవుతుంది.

### మేతకు ధోకా లేదు...




రొయ్యలకు మేత వేసేందుకు చెరువులోకి పడవలో వెళ్లి.. ఒక వైరుని చేత్తో పట్టుకొని మరో చేత్తో మేతని విసురుతారు. అన్నిచోట్లా మేత ఒకేలా అందకపోవడంతో రొయ్యలు, చేపలు సమస్థాయిలో ఎదగవు. ఫలితంగా దిగుబడిలో ఇబ్బందులు తలెత్తుతుంటాయి. దీనిని అధిగమించేందుకు పవన్ సంస్థ ఆక్వాబాట్ అనే పరికరాన్ని తయారు చేసింది. దీనిని రైతు ఏ ప్రాంతం నుంచైనా స్టార్ట్‌చేసి మేతని అందించవచ్చు. ఈ మెషీన్ చెరువులోని ప్రతి ప్రాంతానికి ఆటోమేటిక్‌గా తిరుగుతూ సమపాళ్లలో మేతని అందిస్తుంటుంది. దీన్ని 6 నెలలకు రైతులకు రూ.20 వేల అద్దెకు అందిస్తున్నారు. సాధారణంగా ఒక చెరువుకు ఒకర్ని నియమించుకుంటే.. ఒక పంటకాలానికి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకూ ఖర్చు అవుతుంది. పవన్ సంస్థ తయారు చేసిన పరికరాల్ని వినియోగించి దాదాపు రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకూ రైతులు ఖర్చుల్ని ఆదా చేసుకుంటున్నారు. ఆక్వాఎక్స్ఛేంజ్‌లో రిజిస్టర్ అవ్వాలంటే నెలకు రూ.150 ఖర్చవుతుంది. వీటిని వినియోగిస్తుండటం వల్ల ప్రతి రైతు విద్యుత్ వినియోగంలో రూ.500 నుంచి రూ.600 వరకూ ఆదా చేస్తున్నారు. విజయవాడ శివారు గన్నవరంలో ఏర్పాటు చేసిన సంస్థ కార్యాలయంలో ప్రస్తుతం 160 మందికి ఉపాధి కల్పించారు. ఇందులో 50 మంది మహిళలుండటం విశేషం.

### 25 వేల మంది రైతులకు చేరువ చేసే దిశగా..



ఆక్వా రైతులకు ఖర్చులు తగ్గించి వారికి భరోసా అందించే దిశగా ప్రారంభించిన స్టార్టప్ విజయవంతంగా నడుస్తోంది. ప్రస్తుతం ఉపయోగిస్తున్న సాంకేతిక డేటా ఆధారంగా రైతులకు బ్యాంకుల నుంచి రుణాలు అందించేందుకు ప్రయత్నాలు ప్రారంభిస్తున్నాం. కేవలం టెక్ పరికరాలు అందించడమే కాదు.. నాణ్యమైన దిగుబడులు సాధిస్తున్న రైతులకు మంచి ధర వచ్చేలా ఎగుమతిదారులకు అనుసంధానం చేసే బాధ్యతను కూడా నిర్వర్తిస్తున్నాం. మొత్తంగా 25 వేల మంది రైతులకు లక్ష ఎకరాలకు చేరువ చేయాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్నాం. తాజాగా ఒడిశాకు కూడా ఆక్వా ఎక్స్ఛేంజ్ సేవలను విస్తరించాం.

– పవన్‌కృష్ణ కొసరాజు, సీఈవో, ఆక్వా ఎక్స్ఛేంజ్

### ఎస్తేరురాణి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం

- కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి
- సీఎం సహాయ నిధి నుంచి రూ.10 లక్షల చెక్కు అందజేత

**తాడేపల్లిరూరల్:** ధనుంజయరాజు అలియాస్ కుక్కలరాజు చేతిలో దారుణ హత్యకు గురైన ఎస్తేరురాణి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చెప్పారు. బుధవారం గుంటూరు జిల్లా తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే చేతులు మీదుగా ఎస్తేరురాణి తల్లి మనోరమకు సీఎం సహాయనిధి కింద రూ.10 లక్షల చెక్కును అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత నెల 12న తాడేపల్లి కరకట్టపై నివాసముండే ధనుంజయరాజు ఎస్తేరురాణిని దారుణంగా నరకడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్టు తెలిపారు. ఎమ్మెల్యే ఆర్కే, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఈ విషయాన్ని సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లడంతో 13వ తేదీ రూ.10 లక్షల సాయాన్ని ప్రకటించారని, ఆ మొత్తాన్ని అందించినట్టు చెప్పారు.



## 'హయగ్రీవ' ఒరిజినల్ భూ రికార్డులు మా ముందుంచండి

- విశాఖ మునిసిపల్ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం
- తుది తీర్పునకు లోబడి ఆ సంస్థ అమ్మకాలు
- తదుపరి విచారణ 16కి వాయిదా

**సాక్షి, అమరావతి:** విశాఖపట్నంలోని యండాడ గ్రామంలో హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్‌కు కేటాయించిన 12.41 ఎకరాలకు సంబంధించిన ఒరిజినల్ భూరికార్డులతోపాటు లేఔట్ ప్లాన్‌ను తమ ముందుంచాలని గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) కమిషనర్ రాజాబాబును హైకోర్టు ఆదేశించింది. అలాగే ఈ భూమిలో హయగ్రీవ సంస్థ చేపట్టిన నిర్మాణాల అమ్మకాలు తాము వెలువరించే తుది తీర్పునకు లోబడి ఉంటాయని మౌఖికంగా స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 16కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావుల ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. యండాడ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 92/3లోని 12.41 ఎకరాల భూమిలో అనాథ శరణాలయం, వృద్ధుల ఆశ్రమం నిర్మించాల్సి ఉండగా.. అందుకు విరుద్ధంగా ఆ భూమిని హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్‌కు కేటాయించారని, ఈ కేటాయింపులను రద్దు చేసి భూమిని వెనక్కి తీసుకునేలా ఆదేశాలివ్వాలంటూ జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్, టీడీపీ నేత పల్లా శ్రీనివాసరావు వేర్వేరుగా పిల్స్ దాఖలు చేశారు. ఈ రెండు వ్యాజ్యాలపై సీజే ధర్మాసనం తాజాగా మరోసారి విచారణ జరిపింది. గత విచారణ సమయంలో ధర్మాసనం ఇచ్చిన ఆదేశాల మేరకు జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు కోర్టు ముందు హాజరయ్యారు.

### నిర్మాణాల నిలుపుదలకు నోటీసులు ఇచ్చాం..

జీవీఎంసీ తరఫు న్యాయవాది ఎం.మాధవరెడ్డి వాదనలు వినిపిస్తూ.. పనులు నిలిపేయాలని హయగ్రీవకు నోటీసులు ఇచ్చామని, ఈ నోటీసుల అమలును సింగిల్ జడ్జి నిలిపేశారని వివరించారు. హయగ్రీవ తరఫు న్యాయవాది ఎస్.అశ్వనీ కుమార్ వాదనలు వినిపిస్తూ.. ఈ భూమి విషయంలో హైకోర్టు తమకు అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి, న్యాయవాది టి.వేణుగోపాల్ వాదనలు వినిపిస్తూ.. నిబంధనలకు విరుద్ధంగా హయగ్రీవ వ్యవహరిస్తుండటంతో ఆ సంస్థ నుంచి భూములను వెనక్కి తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి లేఖ రాశారన్నారు. ఆ లేఖ ఆధారంగా చర్యలు తీసుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని ధర్మాసనాన్ని కోరారు. అనాథాశ్రమం, వృద్ధాశ్రమం నిర్మించాల్సిన భూముల్లో హయగ్రీవ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని ఆరోపించారు. వాదనలు విన్న ధర్మాసనం.. భూముల కేటాయింపులకు సంబంధించిన ఒరిజినల్ రికార్డులతోపాటు లేఔట్ ప్లాన్‌ను తమ ముందుంచాలని జీవీఎంసీ కమిషనర్‌ను ఆదేశించింది.

### చంద్రకళకు శాప్ ఎండీ అభినందన

**సాక్షి, అమరావతి:** జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఫెడరేషన్ కప్ పవర్ లిఫ్టింగ్ పోటీల ఓవరాల్ విభాగంలో పసిడి పతకం సాధించిన క్రీడాకారిణి ఎస్.చంద్రకళను శాప్ ఎండీ హర్షవర్ధన్ అభినందించారు. బుధవారం శాప్ కార్యాలయంలో చంద్రకళ కోచ్ సందీప్‌తో పాటు ఎండీని కలిశారు. ప్రస్తుతం చంద్రకళ నిడమానూరులోని ఎక్సైజ్ డిపోలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు.

### నకిలీ మద్యం కేసులో గోవా వాసి అరెస్ట్

**నెల్లూరు (క్రైమ్):** నకిలీ మద్యంను ఏపీతో పాటు పలు రాష్ట్రాలకు సరఫరా చేస్తున్న ఓ వ్యక్తిని శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు గోవాలో అరెస్ట్ చేసి బుధవారం నెల్లూరుకు తరలించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) నెల్లూరు–1 కార్యాలయంలో ఏఈఎస్ కృష్ణకిశోర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. జిల్లా సెబ్ అధికారిణి కె. శ్రీలక్ష్మి పర్యవేక్షణలో సెబ్ అధికారులు గతేడాది మార్చి 28, 29వ తేదీల్లో నెల్లూరు నగరం, ఇందుకూరుపేట, ఆత్మకూరు సెబ్‌స్టేషన్ల పరిధిలో పొరుగు రాష్ట్రాల మద్యం విక్రయాలపై దాడులు చేశారు. దాడుల్లో పెద్ద ఎత్తున గోవా రాష్ట్రానికి చెందిన 17,898 క్వార్టర్ల నకిలీ మద్యం, కారును స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేశారు. విచారణలో గోవా రాష్ట్రం సౌత్‌గోవా జిల్లా మడ్గావ్‌కు చెందిన ఫ్రాన్సిస్ మైఖేల్ డిసౌజా మద్యంను సరఫరా చేస్తున్నట్లు నిందితులు వెల్లడించారు. పరారీలో ఉన్న నిందితుడిని కోర్టు నుంచి వారెంట్ పొంది మంగళవారం సౌత్ గోవా జిల్లా మడ్గావ్ పట్టణంలోని మున్సిపల్ మార్కెట్ ఏరియాలో అరెస్ట్ చేసి నెల్లూరుకు తరలించారు.

## ఫేస్ రికగ్నిషన్‌తో అక్రమాలకు అడ్డుకట్ట

- పలు విభాగాల వద్ద అమలు చేసిన టీటీడీ



ఫేస్ రికగ్నిషన్ విధానాన్ని అమలు చేస్తున్న టీటీడీ

**తిరుమల:** భక్తులకు మెరుగైన సేవలందించేందుకు టీటీడీ ఫేస్ రికగ్నిషన్ అనే నూతన టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువచ్చింది. భక్తులకు సులభతరంగా సేవలందించడంతో పాటు అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమల్లోకి తెచ్చింది. సర్వదర్శనం భక్తులకు, లడ్డూ కౌంటర్లు, గదులు కేటాయింపు, నగదు రీఫండ్ కౌంటర్ల వద్ద బుధవారం ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేసింది.

**పనితీరు ఇలా..**

ఇప్పటివరకు సర్వ దర్శనం భక్తులకు టోకెన్ జారీ చేసే సమయంలో వారి ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసి, వారి ఫొటో తీసుకుని టోకెన్ జారీ చేస్తున్నారు. వారు దర్శనానికి వెళ్లే సమయంలో ఆధార్ కార్డును పరిశీలించి దర్శనానికి అనుమతిస్తున్నారు. ఇకపై ఫేస్ రికగ్నిషన్ విధానంతో వారికి టోకెన్ జారీ చేసే సమయంలోనే ఫొటో తీసుకుంటారు. వారు దర్శనానికి వెళ్ళే సమయంలో ఫేస్ రికగ్నిషన్ అయిన వెంటనే దర్శనానికి అనుమతిస్తారు. దీంతో ఒకరి టోకెన్‌పై మరొకరు దర్శనానికి వెళ్లేందుకు ప్రయత్నిస్తే..ఫేస్ రికగ్నేషన్‌లో వారి ఫొటో మ్యాచ్ కాదు. దీంతో అక్రమాలకు చెక్ పెట్టవచ్చని టీటీడీ భావిస్తోంది. లడ్డూ టోకెన్లకు సంబంధించి కూడా వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో ప్రవేశించే సమయంలో ఫేస్ రికగ్నిషన్ విధానంలో టోకెన్ జారీ చేస్తారు. అదే పద్ధతిలో దర్శనానంతరం లడ్డూ కౌంటర్ వద్ద కూడా ఫేస్ రికగ్నిషన్ అయిన తర్వాతనే లడ్డూలను అందజేస్తారు. దీంతో అక్రమ పద్ధతిలో లడ్డూలు పొందే దళారీ వ్యవస్థకు చెక్ పెట్టవచ్చునని టీటీడీ భావిస్తోంది. ఇదే విధానాన్ని గదుల కేటాయింపు, వాటిని ఖాళీ చేసిన సమయంలో డిపాజిట్లు తిరిగి చెల్లింపునకు వినియోగించనున్నారు.

**సేవలు సులభతరం**

ఈ విధానం అమలైతే గదులు ఖాళీ చేయడం వేగవంతమవుతుందని అధికారులు భావిస్తున్నారు. గదులను దళారులు రొటేషన్ చేసే పద్ధతికి అడ్డుకట్ట వేయవచ్చునని చెబుతున్నారు. గదులు ఖాళీ చేసిన 48 గంటల్లోనే భక్తుల డిపాజిట్లు వారి ఖాతాలో జమవుతుందని అధికారులు అంటున్నారు. ఫేస్ రికగ్నిషన్ విధానాన్ని విజిలెన్స్ విభాగానికి అనుసంధానం చేస్తే నేర చరిత్ర కలిగిన వారిని సులభతరంగా గుర్తించవచ్చునని, దీంతో తిరుమలలో నేరాలు జరగకుండా నిరోధించే అవకాశముంది.

## కులవాదుల కోసమే అమరావతి ఉద్యమం

- 885వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నాయకులు

**తాడికొండ:** కులవాదుల ఆస్తులకు ధరలు పెంచుకునేందుకే అమరావతి ఉద్యమాన్ని తూతూ మంత్రంగా కొనసాగిస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 885వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. చంద్రబాబు రాష్ట్రానికి మేలు చేస్తాడని విభజన అనంతరం ప్రజలంతా అధికారమిస్తే ప్రజలను మోసం చేసి కులోన్మాదాన్ని పెంచి పోషించాడని మండిపడ్డారు. అమరావతి భూముల కుంభకోణంలో చంద్రబాబుతో కలిసి మంత్రి నారాయణ అసైన్డ్ రైతులకు చేసిన అన్యాయానికి సంబంధించిన ఆధారాలు బయటపడడం హర్షణీయమని, నారాయణతో పాటు బాబునూ అరెస్టు చేసి పూర్తిస్థాయి విచారణ చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. సుప్రీంకోర్టులో మూడు రాజధానులకు మద్దతుగా తీర్పు వస్తుందనే ధీమా అందరిలో ఉందని, రాష్ట్ర ప్రయోజనాల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న వికేంద్రీకరణకు 5 కోట్ల మంది ప్రజలతో పాటు దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తుందన్నారు. పేదవాడికి ఇంగ్లిష్ మీడియం విద్య, ఇళ్ల స్థలాలు అందకుండా తప్పుడు కేసులు వేసిన బాబు అండ్ కోను రాబోయే ఎన్నికల్లో చిత్తుగా ఓడించేందుకు బహుజనులంతా సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులిదాసు, ఎనుమల రాజశేఖర్ పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## 'మిరాకిల్' భూ కబ్జాలు



మిరాకిల్ సాఫ్ట్‌వేర్ ప్రధాన గేటు



ప్రభుత్వానికి చెందిన మైదానంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న వీఆర్వో ఉషారాణి

▶ మొదటి పేజీ తరువాయి

గ్రామ రెవెన్యూ పరిధి 98/2పీ సర్వే నంబరులో 40 సెంట్ల బంజరు భూమి కూడా 'మిరాకిల్' ఆక్రమణలోనే ఉంది. ఈ వ్యవహారం అంతా గత టీడీపీ పాలనలో దఫదఫాలుగా జరిగింది. గత పాలకులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఇటీవల ఆ భూముల చుట్టూ మిరాకిల్ యజమానులు ప్రహరీ నిర్మించి పెద్ద గేట్లు అమర్చడంతో రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. పక్కాగా సర్వే నిర్వహించడంతో మిరాకిల్ ఆక్రమణల వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

**డీ పట్టా భూములనూ వదల్లేదు..**

మిరాకిల్ యజమానుల గుప్పిట్లో డీ పట్టా భూములు కూడా ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. కంచేరు, ముంజేరు, కొంగవానిపాలెం గ్రామాల పరిధిలో మొత్తం 8.52 ఎకరాల వరకు ఉన్నట్లు తెలిసింది. వాటిని స్వాధీనం చేసుకునేందుకు రెవెన్యూ అధికారులు సన్నద్ధమవుతున్నారు.

**నిజమేనంటూనే..**

ఆక్రమణలు నిజమేనని లోపాయికారీగా అంగీకరించిన మిరాకిల్ యాజమాన్యం ప్రభుత్వ భూమి చేజారిపోకుండా ఎత్తుగడలు వేస్తోంది. మిరాకిల్ ఉద్యోగులను, స్థానిక జనసేన కార్యకర్తలను ఆందోళనకు పురిగొల్పుతున్నారు. ప్రభుత్వ భూముల్లో తమ సంస్థ భవనాలేవీ నిర్మించనప్పుడు ఎలా స్వాధీనం చేసుకుంటారని అడ్డగోలుగా వాదిస్తున్నారు. గెడ్డలు కప్పేసి తయారు చేసిన మైదానం యువత క్రికెట్ ఆడుకోవడానికి ఉపయోగపడుతోందంటూ రెవెన్యూ అధికారులతో వాదనకు దిగుతున్నారు.

### ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుంటాం



ముంజేరు, కొంగవానిపాలెం రెవెన్యూ గ్రామాల పరిధిలో ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురైంది. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు క్షేత్రస్థాయి సర్వేతో పాటు డ్రోన్ సర్వే చేశాం. పక్కాగా ఆక్రమణలను గుర్తించాం. ఆ భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం. స్వాధీనం చేసుకోవడానికి పోలీసు శాఖ సాయం కోరాం. అవన్నీ కచ్చితంగా స్వాధీనం చేసుకుంటాం.

– కోరాడ శ్రీనివాసరావు, తహసీల్దారు, భోగాపురం, విజయనగరం జిల్లా

### పింఛన్ల పంపిణీకి వెళ్తూ గుండెపోటుతో వలంటీర్ మృతి

- నంద్యాల జిల్లా జూపాడుబంగ్లాలో విషాదం



రియాజుద్దీన్ (ఫైల్)

**జూపాడుబంగ్లా (నంద్యాల):** పింఛన్ల పంపిణీకి వెళ్తూ ఓ వలంటీర్ బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. నంద్యాల జిల్లాలో మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో అదే గ్రామానికి చెందిన రియాజుద్దీన్(27) 75 ఇళ్లకు వలంటీరుగా పనిచేస్తున్నాడు. బుధవారం మార్చి ఒకటో తేదీ కావటంతో మంగళవారం రాత్రి సచివాలయ సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ ధనుంజయ వద్ద అతని పరిధిలో ఉన్న 33 పింఛన్లకు అవసరమైన రూ.94,500 నగదు తీసుకొన్నాడు. బుధవారం తెల్లవారుజామున పింఛన్ల పంపిణీకి సిద్ధమవుతుండగా కాళ్లు, చేతులు నొప్పి అనిపించడంతో వెంటనే సమాచారాన్ని తన మిత్రులు వినయ్, లోకేష్‌కు తెలిపాడు. వారు వెంటనే 108లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే మార్గమధ్యంలోనే అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఆస్పత్రిలో అతన్ని పరీక్షించిన వైద్యులు గుండెపోటుతో మరణించినట్లు నిర్ధారించారు. తెల్లవారితే వలంటీర్ రియాజుద్దీన్ వచ్చి పింఛను అందిస్తాడని ఆశగా ఎదురుచూసిన పింఛనుదారులు విషయం తెలిసి ఆవేదనకు లోనయ్యారు. అందరికీ తలలో నాలుకలా మెలిగిన వలంటీర్ సేవలను గుర్తు చేసుకొని కన్నీరుమున్నీరయ్యారు. స్థానిక నాయకులు ఆయన కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించారు.

## పొగాకు వ్యాపారుల ఇళ్లలో రెండో రోజూ ఐటీ సోదాలు



టంగుటూరు పొగాకు కంపెనీలో సోదాలు నిర్వహిస్తున్న ఐటీ అధికారులు

**టంగుటూరు:** ప్రకాశం జిల్లాలోని పలువురు పొగాకు వ్యాపారుల ఇళ్లు, గోడౌన్లు, కార్యాలయాల్లో ఐటీ అధికారులు బుధవారం రెండో రోజూ సోదాలు నిర్వహించారు. మంగళవారం నుంచి టంగుటూరులోని గుత్తా వాసుబాబు, రావూరి ప్రవీణ్‌కుమార్, జమ్ములపాలెం ప్రవీణ్ పొగాకు కంపెనీల్లోనూ, ఇళ్లల్లోనూ సోదాలు కొనసాగు తున్నాయి. వారి సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు. గుత్తా వాసుబాబు పొగాకు కంపెనీలో పలు రికార్డులు స్వాధీనం చేసుకుని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. రాత్రి కూడా అధికారులు సోదాలు కొనసాగిస్తున్నారు. బ్యాంకు ఖాతాలు, లాకర్లు పరిశీలించారు. బయటి వారిని లోపలికి రానివ్వడం లేదు. సీఆర్‌పీఎఫ్ పోలీసు బలగాలతో పరిసర ప్రాంతాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## క్లుప్తంగా...

### రూ.6,828 కోట్లతో 70 శిక్షణ విమానాలు

కొనుగోలుకు కేబినెట్ కమిటీ ఆమోదం

**న్యూఢిల్లీ:** భారత వైమానిక దళం(ఐఏఎఫ్) కోసం రూ.6,828 కోట్లతో 70 హెచ్‌టీటీ-40 బేసిక్ శిక్షణ విమానాల కొనుగోలుకు రంగం సిద్ధమైంది. ఈ విమానాలను కొనుగోలు చేయడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ(సీసీఎస్) బుధవారం ఆమోదం తెలియజేసింది. రానున్న ఆరేళ్లలో ఈ విమానాలు ఐఏఎఫ్‌కు అందనున్నాయని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ట్విట్టర్‌లో వెల్లడించారు. హెచ్‌టీటీ-40 విమానాలను ప్రభుత్వ రంగంలోని హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్) ఉత్పత్తి చేయనుందని భారత రక్షణ శాఖ తెలియజేసింది. తక్కువ వేగంతో నడిచే ఈ విమానాలతో వైమానిక దళం సిబ్బందికి మెరుగైన శిక్షణ ఇవ్వొచ్చని పేర్కొంది. హెచ్‌టీటీ-40 విమానాల తయారీలో హెచ్ఏఎల్ సంస్థ ప్రైవేట్ పరిశ్రమలను కూడా భాగస్వాములను చేయనుంది. దీనివల్ల 100కుపైగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల్లో 1,500 మందికి ప్రత్యక్షంగా, 3,000 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని అంచనా.

### ఆర్థిక నేరగాళ్లపై సమష్టి చర్యలు

జీ-20 భేటీలో భారత్ పిలుపు

**గురుగ్రాం (హరియాణా):** పరారీలో ఉన్న ఆర్థిక నేరగాళ్లను రప్పించేందుకు ద్వైపాక్షిక సహకారం చాలదని, ఈ దిశగా దేశాలన్నీ ఉమ్మడిగా చర్యలు తీసుకుంటేనే ఫలితముంటుందని భారత్ పేర్కొంది. ఈ విషయంలో ప్రస్తుతమున్న సంక్లిష్ట నిబంధనలు తదితరాలను తక్షణం సరళీకరించుకోవాలంది. బుధవారం మొదలైన జీ-20 దేశాల అవినీతి వ్యతిరేక వర్కింగ్ గ్రూప్ రెండు రోజుల సదస్సులో కేంద్ర సిబ్బంది శాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్ ఈ మేరకు సూచించారు. విజయ్ మాల్యా మొదలుకుని నీరవ్ మోదీ దాకా పలువురు ఆర్థిక నేరగాళ్లను రప్పించి చట్టం ముందు నిలబెట్టేందుకు భారత్ కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఈ సూచన ప్రాధాన్యం సంతరించుకుంది. ''ఇలాంటి ఆర్థిక నేరగాళ్లు విదేశాలకు తరలించిన మొత్తాలు ఉగ్రవాదం మొదలుకుని మనుషుల అక్రమ రవాణా తదితరాలకు వనరులుగా మారుతున్నాయి. అక్రమ ఆయుధాల వ్యాప్తికి, ప్రజాస్వామిక ప్రభుత్వాలను బలహీనపరచడానికీ ఉపయోగపడుతున్నాయి'' అంటూ మంత్రి ఆందోళన వెలిబుచ్చారు. ''అందుకే ఆర్థిక నేరగాళ్ల ఆస్తులను వీలైనంత త్వరగా ప్రభుత్వాలు రికవర్ చేసుకోవాలి. ఆ దిశగా ప్రపంచ దేశాలన్నీ పని చేయాలి. జీ-20 దేశాలు ఇలాంటి సమాచారాన్ని ఎప్పటికప్పుడు పంచుకోవాలి'' అని సూచించారు.

చైనా యాప్ టిక్‌టాక్‌పై పెరుగుతున్న నిషేధం

పలు దేశాల్లో ప్రభుత్వ ఫోన్లలో టిక్‌టాక్ వాడకంపై నిషేధం..

భారత్‌లో ఇప్పటికే పూర్తిస్థాయిలో నిషేధం

తాజాగా ఆ జాబితాలోకి వచ్చిన కెనడా..

**మన** దేశంలో చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరినీ అలరించిన మొబైల్ ఫోన్ అప్లికేషన్(యాప్) టిక్‌టాక్. యాప్‌లో స్వయంగా వీడియోలు రూపొందించి, సోషల్ మీడియాలో పోస్టుచేసి, లైక్‌లు కొట్టేయడం, కామెంట్లు చూసుకొని మురిసిపోవడం ఒక మధురానుభూతి, ఒక జ్ఞాపకం. చైనాకు చెందిన ఈ యాప్‌పై భారత ప్రభుత్వం నిషేధం విధించడంతో ఇప్పుడు ఎవరికీ అందుబాటులో లేకుండాపోయింది. ప్రపంచవ్యాప్తంగా టిక్‌టాక్‌ను నిషేధిస్తున్న దేశాల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది. అమెరికాలో సగానికిపైగా రాష్ట్రాల్లో ప్రభుత్వ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాల్లో యాప్ వాడకాన్ని నిషేధించారు. అమెరికా సైనిక దళాల్లో యాప్‌పై నిషేధం అమలవుతోంది. తాజాగా ఈ జాబితాలో కెనడా చేరింది. జనానికి నచ్చిన టిక్‌టాక్‌ను ప్రభుత్వాలే వారి నుంచి దూరం చేస్తుండడానికి కారణాలు ఏమిటో తెలుసుకుందాం..

\- సాక్షి, నేషనల్ డెస్క్




# టిక్.. టిక్.. టిక్..

## షేరింగ్‌కు సమయం లేదు మిత్రమా!


### ఎందుకీ నిషేధం?

- టిక్‌టాక్‌ను నిషేధించడానికి ప్రభుత్వాలు చెబుతున్న ప్రధాన కారణం దేశ భద్రత.
- యూజర్ల డేటాతో పాటు బ్రౌజింగ్ హిస్టరీ, లొకేషన్ వంటి వివరాలు నేరుగా చైనా ప్రభుత్వానికి చేరే ప్రమాదం ఉందని వివిధ దేశాలు అనుమానిస్తున్నాయి.
- ఇతర దేశాలపై, అక్కడి ప్రభుత్వాలపై దుష్ప్రచారం చేయడానికి టిక్‌టాక్ యాప్ చైనా చేతిలో ఒక ఆయుధంగా మారు తుందని భావిస్తున్నాయి.
- తప్పుడు ప్రచారం సాగించి, ఎన్నికల ఫలితాలను సైతం ప్రభావితం చేసే అవకాశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.
- టిక్‌టాక్ వల్ల యూజర్ల డేటాకు భద్రత లేదని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వాలు ఇచ్చే ఫోన్లలోనూ టిక్‌టాక్ వాడుతున్నారని, దానివల్ల జాతీయ భద్రత ప్రమాదంలో పడుతుందని అంటున్నారు.
- విదేశాల సమాచారం చైనా చేతుల్లోకి వెళ్తే అక్కడి కంపెనీలు దాన్ని ఒక అవకాశంగా వాడుకొని లబ్ధి పొందుతాయని నిపుణులు పేర్కొంటున్నారు.




### ఏయే దేశాలు నిషేధించాయి?

- 2021 జనవరిలో భారత్ టిక్‌టాక్‌ను పూర్తిస్థాయిలో నిషేధించింది. డేటా ప్రైవసీ, జాతీయ భద్రత కోసమంటూ చైనాకు చెందిన ఇతర యాప్‌లపైనా నిషేధం విధించింది.
- ఇండోనేషియా, బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లో తాత్కాలిక నిషేధం విధించారు. నిర్ధారణ కాని, అనైతిక సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నందుకే ఈ చర్య తీసుకున్నట్లు అక్కడి ప్రభుత్వాలు వెల్లడించాయి.
- అమెరికా, కెనడా, యూరోపియన్ యూనియన్(ఈయూ)లో ప్రభుత్వం ఇచ్చిన అన్ని ఫోన్ల నుంచి టిక్‌టాక్‌ను తొలగించాలంటూ ఉద్యోగులకు ఇటీవలే ఆదేశాలు అందాయి.
- అమెరికాలో 50కిపైగా రాష్ట్రాల్లో ప్రభుత్వ ఎలక్ట్రానిక్ పరికరాల్లో టిక్‌టాక్‌ను బ్యాన్ చేశారు. కేవలం ప్రభుత్వ ఫోన్లలోనే కాదు, సాధారణ ప్రజలు సైతం టిక్‌టాక్ వాడకుండా పూర్తిగా నిషేధించాలని అమెరికాలో కొందరు పార్లమెంట్ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.
- అమెరికా సైనిక దళాల్లో టిక్‌టాక్ వాడకాన్ని ఇప్పటికే నిషేధించారు.




- తైవాన్‌లో ప్రభుత్వ ఫోన్లు, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌లు, డెస్క్‌టాప్ కంప్యూటర్లలో టిక్‌టాక్ యాప్ ఉపయోగించడాన్ని 2022 డిసెంబర్‌లో నిషేధించారు.

### టిక్‌టాక్ వాదనేంటి?

- తమ యాప్ వల్ల డేటా భద్రత ఉండదన్న వాదనను టిక్‌టాక్ యాజమాన్యం ఖండించింది.
- యాప్ కారణంగా డేటా చౌర్యం జరుగుతోందని తేల్చడానికి ఎలాంటి ఆధారాల్లేవని స్పష్టం చేసింది.
- యూజర్ల వ్యక్తిగత సమాచారం ఇతరుల చేతుల్లోకి వెళ్లే అవకాశమే లేదని, యాప్‌ను నిశ్చింతగా వాడుకోవచ్చని భరోసా ఇచ్చింది.
- కొన్ని దేశాలు టిక్‌టాక్‌ను నిషేధించడం విచారకరమని పేర్కొంది. డేటా ప్రైవసీకి తాము అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించింది.
- యాప్‌ను నిషేధించడం యూజర్లను తప్పుదోవ పట్టించడమే అవుతుందని యాజమాన్యం ఆక్షేపించింది.
- నిషేధం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని ఆరోపించింది.
- కొన్ని పాశ్చాత్య దేశాలు అభద్రతాభావంతో టిక్‌టాక్‌ను తొలగిస్తున్నాయని, అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నాయని చైనా ప్రభుత్వం విమర్శిస్తోంది. యాప్‌పై నిషేధం విధించడం ఆయా దేశాల్లో వ్యాపార వాతావరణాన్ని దెబ్బతీయడం ఖాయమని తేల్చిచెప్పింది.

### అసలు ఏమిటీ యాప్?

చైనాకు చెందిన బైట్‌డ్యాన్స్ అనే కంపెనీ 'డౌయిన్' పేరిట 2016 సెప్టెంబర్‌లో యాప్‌ను ప్రారంభించింది. తొలుత చైనాలోనే అందుబాటులోకి వచ్చిన ఈ యాప్ యూజర్లను విశేషంగా ఆకట్టుకుంది. రికార్డుస్థాయిలో డౌన్‌లోడ్లు జరిగాయి. దాంతో బైట్‌డ్యాన్స్ కంపెనీ 2017లో అంతర్జాతీయ వెర్షన్‌ను ప్రారంభించింది. దీనికి టిక్‌టాక్ అనే పేరుపెట్టింది. 2018 ఆగస్టు నుంచి యాప్ ప్రపంచమంతటా బాగా వ్యాప్తిలోకి వచ్చింది. చైనాలో ఇది డౌయిన్ పేరిటే కొనసాగుతోంది. తక్కువ నిడివితో కూడిన వీడియోల షేరింగ్ కోసం టిక్‌టాక్ యాప్‌ను రూపొందించారు. ప్రాథమికంగా లిప్ సింకింగ్, డ్యాన్సింగ్ వీడియోలను ఇతరులతో పంచుకొనే వీలుంది. 3 సెకండ్ల నుంచి 10 నిమిషాల నిడివిల వీడియోలు ఉంటాయి. యూజర్ల అభిరుచులు, ఆసక్తిని బట్టి వీడియోలు ప్రత్యక్షం కావడం ఇందులోని మరో ప్రత్యేకత. ప్రపంచవ్యాప్తంగా 40కిపైగా భాషల్లో టిక్‌టాక్ యాప్ అందుబాటులో ఉంది.

### టిక్‌టాక్.. 60 నిమిషాలే

18 ఏళ్లలోపు వారికి వర్తింపు

**వాషింగ్టన్:** టిక్‌టాక్ వల్ల వినియోగదారుల డేటా భద్రతకు ముప్పు వాటిల్లుతోందని ఒకవైపు ఆరోపణలు వెల్లువెత్తుతుండగా, మరోవైపు యాప్ యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. 18 ఏళ్లలోపు యూజర్లు ఒకరోజులో కేవలం ఒక గంటపాటే యాప్‌ను వినియోగించేలా పరిమితి విధించినట్లు టిక్‌టాక్ ట్రస్ట్ అండ్ సేఫ్టీ అధినేత కార్మాక్ కీనన్ బుధవారం ప్రకటించారు. గంట సమయం దాటిన తర్వాత వీడియోలు ఆగిపోతాయని తెలిపారు. గంట తర్వాత మళ్లీ యాప్‌లో వీడియోలు చూడాలంటే పాస్‌కోడ్ ఎంటర్ చేయాల్సి ఉంటుందని అన్నారు. ఇక 13 ఏళ్లలోపు యూజర్లు పాస్‌కోడ్ ఎంటర్ చేసిన తర్వాత మరో 30 నిమిషాలపాటు మాత్రమే వీడియోలు తిలకించేందుకు వీలుంటుందని, ఆ తర్వాత ఆగిపోతాయని పేర్కొన్నారు.

### చక్కని ప్రణాళిక, మెరుగైన నగరాలు

దేశాభివృద్ధికి కీలకం: మోదీ



**న్యూఢిల్లీ:** చక్కని ప్రణాళికతో నిర్మితమైన నగరాలే దేశ భవితను నిర్దేశిస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర్యం వచ్చిన ఈ 75 ఏళ్లలో అలాంటి కనీసం 75 నగరాలను నిర్మించుకున్నా ప్రపంచ వేదికపై భారత్ ఎప్పుడో గొప్ప స్థాయికి చేరి ఉండేదన్నారు. కేంద్ర బడ్జెట్‌పై చర్చా పరంపరలో భాగంగా బుధవారం 'పట్టణ ప్రణాళిక, అభివృద్ధి, పారిశుద్ధ్యం'పై వెబినార్‌లో ఆయన మాట్లాడారు. దేశం శరవేగంగా పట్టణీకరణ చెందుతున్న నేపథ్యంలో భవిష్యత్తుపై దృష్టిలో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవడం చాలా ముఖ్యమని నొక్కిచెప్పారు. ''రాబోయే పాతికేళ్లలో దేశ ప్రగతి పట్టణ ప్రణాళికపై ఆధారపడి ఉంటుంది. ''మన నగరాలు వ్యర్థ, నీటి ఎద్దడి రహితంగా, అన్ని వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా ఉండటం చాలా ముఖ్యం. చక్కని ప్రణాళిక అందుకు కీలకం. కొత్త నగరాల అభివృద్ధి, ఉన్నవాటి ఆధునికీకరణ కూడా పట్టణాభివృద్ధిలో కీలకమే. దీన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రాల్లో పట్టణ ప్రణాళిక వ్యవస్థ బలోపేతం, ప్రైవేట్ రంగంలో నైపుణ్యాన్ని అందుకు సమర్థంగా వినియోగించుకోవడం, పట్టణ ప్రణాళికను అత్యున్నతంగా తీర్చిదిద్దే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నిర్మాణానికి ఏం చేయాలో దృష్టి పెట్టాలి. ఎందుకంటే ప్రణాళిక సరిగా లేకున్నా, దాని అమలులో విఫలమైనా పెను సమస్యలకు దారితీయడం ఖాయం'' అని సూచించారు. పట్టణాభివృద్ధికి ఈ బడ్జెట్లో రూ.15 వేల కోట్లు కేటాయించామని గుర్తు చేశారు. టైర్-2, టైర్-3 నగరాల ప్రణాళిక, అభివృద్ధిలో పెట్టుబడులు పెరగాల్సిన అవసరముందన్నారు.

## 'ఈశాన్య' ఫలితాలు నేడే

త్రిపుర, నాగాలాండ్, మేఘాలయల్లో కౌంటింగ్

**న్యూఢిల్లీ:** మూడు ఈశాన్య రాష్ట్రాలు త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు గురువారం వెలువడనున్నాయి. ఈశాన్యాన మరింతగా విస్తరించాలన్న అధికార బీజేపీ ఆశలు ఏ మేరకు నెరవేరాయన్నది ఈ ఫలితాలతో తేలనుంది. ముఖ్యంగా ఈసారి అందరి దృష్టీ ప్రధానంగా త్రిపురపైనే నెలకొంది. అక్కడ పాతికేళ్ల వామపక్ష పాలనకు తెర దించుతూ అభివృద్ధి నినాదంతో బీజేపీ 2018లో సొంతంగా అధికారంలోకి రావడం తెలిసిందే. దాంతో ఈసారి బీజేపీని ఎలాగైనా నిలువరించేందుకు చిరకాల శత్రుత్వాన్ని పక్కన పెట్టి మరీ లెఫ్ట్, కాంగ్రెస్ జట్టు కట్టి బరిలో దిగాయి. ఇక నాగాలాండ్, మేఘాలయల్లో కూడా బీజేపీ అధికార సంకీర్ణంలో భాగస్వామిగా ఉంది. అయితే మేఘాలయలో ఎన్నికల ముందు అధికార నేషనల్ పీపుల్స్ పార్టీతో బంధం తెంచుకుని సంకీర్ణం నుంచి బయటికొచ్చింది. అంతేగాక తొలిసారిగా మొత్తం 60 స్థానాలకూ పోటీ చేసింది! నాగాలాండ్‌లో మరోసారి ఎన్డీపీపీతో కలిసి బరిలో దిగింది. అక్కడ బీజేపీ అధికారం నిలుపుకుంటుందని, త్రిపురలో ఏకైక పెద్ద పార్టీగా మెజారిటీకి చేరువగా వస్తుందని ఎగ్జిట్ పోల్స్ పేర్కొనడం తెలిసిందే. ఇక త్రిపురలో హంగ్ తప్పకపోవచ్చని అంచనా వేశాయి. కొత్తగా తెరపైకి వచ్చిన టిప్రా మోతా కనీసం 15 స్థానాలకు పైగా గెలుచుకుని కింగ్‌మేకర్‌గా మారొచ్చని జోస్యం చెప్పాయి.

## భారత చట్టాలకు లోబడి పని చేయాల్సిందే

బీబీసీ ఉదంతంపై బ్రిటన్‌కు జై శంకర్ స్పష్టీకరణ


జై శంకర్, క్లెవర్లీ

**న్యూఢిల్లీ:** భారత్‌లో పని చేసే సంస్థలన్నీ ఇక్కడి చట్టాలకు, నియమ నిబంధనలకు లోబడి నడుచుకోవాల్సిందేనని బ్రిటన్‌కు కేంద్రం స్పష్టం చేసింది. రెండు రోజుల జీ-20 మంత్రుల సదస్సులో పాల్గొనేందుకు భారత్ వచ్చిన బ్రిటన్ విదేశాంగ మంత్రి జేమ్స్ క్లెవర్లీ బుధవారం విదేశాంగ మంత్రి జై శంకర్‌తో భేటీ అయ్యారు. పలు ద్వైపాక్షిక అంశాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. బీబీసీపై పన్ను ఎగవేత ఆరోపణలు, ఢిల్లీ, ముంబైల్లోని ఆ సంస్థ కార్యాలయాల్లో సీబీఐ సర్వే ఉదంతాన్ని ఈ సందర్భంగా క్లెవర్లీ ప్రస్తావించారు. ఏ సంస్థలైనా ఇక్కడి పూర్తిగా చట్టాలకు లోబడి పని చేయాలని జై శంకర్ గట్టిగా బదులిచ్చినట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. పలు అంతర్జాతీయ పరిణామాలపైనా తామిద్దరం లోతుగా చర్చలు జరిపామంటూ అనంతరం జై శంకర్ ట్వీట్ చేశారు.

## మళ్లీ ఎల్పీజీ బండ మోత

ఒకేసారి రూ.50 పెంపు

**న్యూఢిల్లీ:** మూడు ఈశాన్య రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే ప్రజలపై కేంద్ర ప్రభుత్వం ఎల్పీజీ ధరల భారం మోపింది. బుధవారం ఒకేసారి రూ.50 పెంచుతూ నిర్ణయం వెలువరించింది. గత ఎనిమిది నెలలకాలంలో ఎల్పీజీ ధరలను పెంచడం ఇదే తొలిసారికావడం గమనార్హం. ప్రభుత్వరంగ ఇంధన రిటైలర్లు ప్రకటించిన ధరల తాజా నోటిఫికేషన్ ప్రకారం ఢిల్లీలో 14.2 కేజీల ఎల్పీజీ సిలిండర్ ధర రూ.50 పెరిగి రూ.1,103కి చేరుకుంది. ఉజ్వల పథకంలోలేని గృహ వినియోగదారులంతా సబ్సిడీలేని ధరకే సిలిండర్ కొనుగోలు చేస్తుండటంతో తాజా పెరుగుదల ప్రజలకు మరో ఆర్థికభారమైంది. ప్రధాన్‌మంత్రి ఉజ్వల యోజన పథకం కింద నమోదై ఉచిత గ్యాస్ కనెక్షన్ పొందిన నిరుపేదలకు ఒక్కో సిలిండర్‌పై రూ.200 సబ్సిడీ ప్రభుత్వం అందజేస్తోంది. అంటే ఢిల్లీలో 'ఉజ్వల' పేదలకు



రూ.903కే సిలిండర్ అందిస్తారు.

**వాణిజ్య సిలిండర్ రూ.350పెంపు**

అంతర్జాతీయ ధరలకు తగ్గట్లు నెలనెలా ధరలు మార్చే వెసులుబాటు ప్రభుత్వరంగ చమురు రిటైలర్లకు కేంద్రప్రభుత్వం కల్పించింది. అయినాసరే గృహవినియోగ ఎల్పీజీ ధరను 2022 జూలై నాలుగో తేదీ తర్వాత సవరించలేదు. అయితే, బుధవారం వాణిజ్య వినియోగ ఎల్పీజీ ధరను ఏకంగా రూ.350.5 పెంచడంతో 19 కేజీల సిలిండర్ ధర ఒక్కసారిగా రూ.2,119.5కు ఎగబాకింది. ధరల పెంపుపై విపక్షాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. 'మోదీ సర్కార్‌లో ఎగిసిన ద్రవ్యోల్బణం సగటు జీవి వెన్నువిరుస్తుంటే తాజా పెంపు జేబుకు పెద్ద చిల్లు పెడుతోంది' అని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తంచేశారు. ' మా ప్రభుత్వమొస్తే ఈ దోపిడీ ఆగిపోతుంది. రాజస్తాన్‌లో మాదిరి దేశ ప్రజలకు రూ.500లోపు ధరకే సిలిండర్ అందిస్తాం' అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి గౌరవ్ వల్లభ్ హామీఇచ్చారు. ప్రజలకు మోదీ ప్రభుత్వం ఇచ్చిన హోలీ బహుమతి ఇది అంటూ శివసేన ఉద్ధవ్ ఠాక్రే వర్గం ఎద్దేవాచేసింది. పెట్రో ధరలను మాత్రం పెంచలేదు. గత 11 నెలలుగా ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ.96.72 వద్ద, లీటర్ డీజిల్ ధర రూ.89.62 వద్ద స్థిరంగా ఉన్నాయి. 15 రోజులకు ఒకసారి పెట్రో ధరలను అంతర్జాతీయ ఇంధన ధరలకు అనుగుణంగా పెంచే అవకాశం కల్పించినా ఇంధన రిటైలర్లు గత ఏడాది ఏప్రిల్ ఆరోతేదీ నుంచి ఇంతవరకు పెంచలేదు. కానీ కేంద్ర ఎక్సయిజ్ సుంకం తగ్గడంతో గత ఏడాది మే 22న పెట్రోల్, డీజిల్ ధరలు కాస్తంత తగ్గాయి.

### 'నిత్యానంద కైలాస'ను పరిగణించం: ఐరాస

**జెనీవా:** భారత్‌లో లైంగిక వేధింపుల ఆరోపణల కేసులు ఎదుర్కొంటూ దేశం వదిలి పారిపోయిన నిత్యానంద స్వామి నెలకొలిపినట్లు చెబుతున్న 'యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ కైలాస (యూఎస్‌కే)' దేశం తరఫున ఇద్దరు ప్రతినిధులు జెనీవాలో గత నెల 24న ఐక్యరాజ్య సమితికి చెందిన ఒక చర్చాగోష్టిలో పాల్గొనడం చర్చనీయాంశమైంది. ఐరాస గుర్తించని దేశం తరఫు వ్యక్తులు ఆ కార్యక్రమంలో ఎలా భాగస్వాములయ్యారని విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై ఐరాస స్పష్టతనిచ్చింది. 'యూఎస్‌కే ప్రతినిధులు వాస్తవానికి ఒక దేశం తరఫున ఆ చర్చలో పాల్గొనలేదు. కేవలం ఒక స్వచ్ఛంద సంస్థగా వాళ్లు వచ్చి మాట్లాడారు. వాటిని పరిగణనలోకి తీసుకోవట్లేదు' అని ఐరాస బుధవారం స్పష్టంచేసింది. ' జెనీవా చర్చాగోష్టిలో ముందస్తు అనుమతితో ఎవరైనా వచ్చి మాట్లాడొచ్చు. పలు సమస్యలు, ఇతి వృత్తాలపై వెలువడే భిన్నాభిప్రాయాలతో కూడిన ముసాయిదా అది. ఐరాసలో కైలాస దేశ శాశ్వత మహిళా రాయబారిగా చెప్పుకున్న విజయప్రియ నిత్యానంద అభిప్రాయాలను పట్టించుకోబోం' అని జెనీవాలోని ఐరాస మానవహక్కుల హై కమిషనర్ చెప్పారు.

### గ్రీస్‌లో గూడ్స్, రైలు ఢీకొని...

## 36 మంది సజీవ దహనం



**తెంపే (గ్రీస్):** గ్రీస్‌లో ఎదురెదురుగా వస్తున్న ప్రయాణికుల, సరకు రవాణా రైళ్లు ఢీకొన్న దుర్ఘటనలో 36 మంది ప్రాణాలు కోల్పోయారు. 85 మందికిపైగా గాయాలపాలయ్యారు. ఉత్తర గ్రీస్‌లోని తెంపే పట్టణ సమీపంలో మంగళవారం అర్ధరాత్రివేళ ఈ ఘోరం సంభవించింది. హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న సహాయక బృందాలు అవిశ్రాంతంగా కష్టపడుతున్నాయి. చెల్లాచెదురుగా, తలకిందులుగా పడిన బోగీల నుంచి క్షతగాత్రులను బయటకు తీసుకొచ్చి ఆస్పత్రులకు తరలించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. మూడు బోగీలకు మంటలు అంటుకోవడంతో అందులోని 36 మంది ప్రయాణికులు సజీవదహనమయ్యారు. వేగంగా రైళ్లు ఢీకొనడంతో బోగీల కిటికీలు, అద్దాలు పగిలి ప్రయాణికుల మృతదేహాలు కొన్ని వాటిల్లోంచి విసిరేసినట్లు 140 అడుగుల దూరంలో పడ్డాయని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. ప్యాసింజర్ రైలులో 350 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనకు నైతిక బాధ్యతగా రవాణ మంత్రి కోస్టాస్ కరమాన్లిస్ రాజీనామా చేశారు.

### ముకేశ్ అంబానీకి విదేశాల్లోనూ జెడ్ ప్లస్ భద్రత

**న్యూఢిల్లీ:** రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీకి, ఆయన కుటుంబ సభ్యులకు భారత్‌లోనే గాక విదేశాల్లోనూ జెడ్ ప్లస్ భద్రత కల్పించాలని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. అందుకయ్యే ఖర్చులను అంబానీయే భరించాలని పేర్కొంది. న్యాయమూర్తులు జస్టిస్ కృష్ణ మురారీ, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

### అమెరికా ఎగుమతుల మండలిలో ఇద్దరు భారతీయులు

**వాషింగ్టన్:** అమెరికా ప్రభుత్వ విభాగంలో మరో ఇద్దరు భారతీయ అమెరికన్లకు కీలక పదవులు దక్కాయి. అమెరికా అంతర్జాతీయ వాణిజ్యానికి సంబంధించి ప్రధాన జాతీయ సలహా మండలి ఎక్స్‌పోర్ట్ కౌన్సిల్‌కు కార్పొరేట్ రంగానికి చెందిన పునీత్ రంజన్, రాజేశ్ సుబ్రమణియమ్‌లను ఎన్నుకున్నట్లు వైట్‌హౌస్ బుధవారం ప్రకటించింది. రంజన్ గతంలో డెలాయిట్ కన్సల్టింగ్‌కు సీఈవోగా పనిచేశారు. ప్రస్తుతం డెలాయిట్ గ్లోబల్ సీఈఓ ఎమిరిటస్‌గా ఉన్నారు. ఫెడ్ఎక్స్‌కు సీఈవో, అధ్యక్షునిగా సుబ్రమణియమ్ కొనసాగుతున్నారు. సుబ్రమణియమ్‌ను ఈ ఏడాది భారతప్రభుత్వం ప్రవాసీ భారతీయ సమ్మాన్ అవార్డ్‌తో సత్కరించింది. అమెరికా అంతర్జాతీయ వాణిజ్యం పనితీరు, ఎగుమతులను ప్రోత్సహించడం, వ్యాపార, పరిశ్రమల, వ్యవసాయ, కార్మిక, ప్రభుత్వ విభాగాల మధ్య తలెత్తే సమస్యలపై చర్చించి ఈ ఎగుమతుల మండలి పరిష్కారానికి కృషిచేస్తుంది. ఈ అంశాలపై అధ్యక్షుడు బైడెన్‌కు సలహాలు, సూచనలు చేస్తోంది.

## కేజ్రీవాల్ కేబినెట్లోకి కొత్త ముఖాలు


సౌరభ్ భరద్వాజ్ ఆతిషి

ఆతిషి, సౌరభ్‌కు అవకాశం • 5 నుంచి ఇంటింటి ప్రచారం

**న్యూఢిల్లీ:** జైలుపాలై రాజీనామా చేసిన ఇద్దరు కీలక మంత్రులు మనీశ్ సిసోడియా, సత్యేంద్ర జైన్ స్థానాలను వెంటనే భర్తీ చేస్తూ ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పార్టీ ఎమ్మెల్యేలు ఆతిషి (41), సౌరభ్ భరద్వాజ్ (43)లను మంత్రులుగా నియమించాలని లెఫ్టినెంట్ గవర్నర్‌కు సీఎం అరవింద్ కేజ్రీవాల్ బుధవారం సిఫార్సు చేశారు. ఎల్జీ వాటిని రాష్ట్రపతి ఆమోదానికి పంపినట్టు సమాచారం. సిసోడియా, జైన్ మంగళవారం రాజీనామా చేయడం తెలిసిందే. ఉప ముఖ్యమంత్రి హోదాలో సిసోడియా ఏకంగా 18 శాఖల బాధ్యతలు చూశారు. ఆయనను మద్యం కుంభకోణం కేసులో సీబీఐ ఆదివారం అరెస్టు చేసింది. ఇక మనీ లాండరింగ్ కేసులో 2022 మేలో అరెస్టై జైల్లో ఉన్న జైన్ కూడా మంగళవారం దాకా శాఖల్లేని మంత్రిగా కొనసాగారు. అప్పటిదాకా ఆయన శాఖలను కూడా సిసోడియానే చూస్తూ వచ్చారు. కేజ్రీవాల్ కేబినెట్లో ఆతిషి తొలి మహిళా మంత్రి కానున్నారు.

**మమ్మల్నెవరూ ఆపలేరు: కేజ్రీవాల్**

ఆప్ ఎమ్మెల్యేలు, కౌన్సిలర్లతో కేజ్రీవాల్ బుధవారం తన నివాసంలో భేటీ అయ్యారు. తాజా పరిణామాలపై లోతుగా చర్చించారు. సిసోడియా అరెస్టు రాజకీయ కక్షసాధింపులో భాగమేననే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఇందుకోసం మార్చి 5 నుంచి ఆప్ ఎమ్మెల్యేలంతా ఇంటింటి ప్రచారం, వీధుల్లో సమావేశం వంటివి చేపట్టనున్నారు. భేటీ అనంతరం కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడారు. జైన్, సిసోడియాలను అరెస్టులు ఢిల్లీ సర్కారు చేస్తున్న మంచి పనులను ఎలాగైనా అడ్డుకోవాలన్న ప్రధాని మోదీ వ్యూహంలో భాగమేనని ఆరోపించారు. ''కానీ మా టైమొచ్చింది. ఆప్ ఓ తుఫాను. మమ్మల్నెవరూ ఆపలేరు'' అన్నారు. అణగదొక్కేందుకు చూసిన కొద్దీ తాము రెట్టించిన వేగంతో పని చేస్తామన్నారు.

**కేజ్రీ తప్పుకునేదెప్పుడు: బీజేపీ**

'పావులు తప్పుకున్నాయి. మరి రాజు సంగతేమిటి?' అని బీజేపీ ప్రశ్నించింది. ఢిల్లీ మద్యం పాలసీ అవకతవకల్లో కీలక పాత్ర పోషించిన కేజ్రీవాల్ సీఎం పదవికి ఎప్పుడు రాజీనామా చేస్తారో చెప్పాలని డిమాండ్ చేసింది.

### కొత్త లుక్‌లో రాహుల్



బ్రిటన్ పర్యటనలో రాహుల్ మంగళవారం గడ్డం ట్రిమ్ చేసుకుని, చక్కని సూట్‌లో కొత్త లుక్‌లో కనిపించారు. భారత్ జోడో యాత్ర కొనసాగినంతకాలం రాహుల్ నెరసిన గడ్డంతో ఉన్న విషయం తెల్సిందే. కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయంలో ఆయన ప్రసంగించనున్నారు. బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులతో చర్చాగోష్ఠిలో పాల్గొంటారు.

### మూగబోయిన ట్విట్టర్ పిట్ట




**న్యూయార్క్:** ట్విట్టర్ మళ్లీ మొరాయించింది. గంటలపాటు స్తంభించిపోయింది. ట్విట్టర్ సేవలకు అంతరాయం కలగడం కొన్ని నెలలుగా పరిపాటిగా మారడం తెల్సిందే. సంస్థను మస్క్ హస్తగతం చేసుకున్నాక వేలాది ఉద్యోగులకు ఉద్వాసన పలికారు. దాంతో ఉన్న కాస్త సిబ్బందికి నిర్వహణ తలకు మించిన భారంగా మారినట్లు కనిపిస్తోంది. తాజాగా 200 మంది ఇంజనీర్లను మస్క్ తొలగించారు. వీరిలో ప్రాడక్ట్ మేనేజర్లు, ఇంజనీర్లు, డేటా సైన్స్ విభాగ సిబ్బంది ఉన్నారు. బ్లూ వెరిఫికేషన్ చందా, త్వరలో అమలు చేయబోయే పేమెంట్స్ ప్లాట్‌ఫామ్‌లకు సారథిగా ఏస్తర్ క్రాఫోర్డ్‌నూ సాగనంపారు. తాజా ఉద్యోగుల ఉద్వాసన పర్వంలో సేల్స్ విభాగ చీఫ్ క్రిస్ రేడీని మస్క్ వెళ్లగొట్టడం గమనార్హం.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
గురువారం । 2 । మార్చి । 2023

## నేడు బీదర్‌కు అమిత్ షా



బనశంకరి: శాసనసభ ఎన్నికలు దగ్గర పడుతుండటం తో ప్రచారాలు ఊపందుకుంటున్నాయి. రాష్ట్రంలో బీజేపీని గెలిపించడానికి జాతీయ నేతలు వరుస పర్యటనలతో కసరత్తు చేస్తున్నారు. గురువారం జరిగే కేంద్ర హోం మంత్రి అమిత్‌షా బెంగళూరు పర్యటనలో మార్పు చోటుచేసుకుంది. బెంగళూరుకు బదులుగా ఆయన బీదర్‌కు వెళతారు. ఢిల్లీ నుంచి గురువారం రాత్రి 10 గంటలకు బీదర్ విమానాశ్రయానికి చేరుకుని ఎయిర్‌పోర్ట్ గెస్ట్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకుంటారు. శుక్రవారం విజయ సంకల్ప యాత్ర సభ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.

# ఆఫీసులకు తాళం సేవలకు విఘాతం

**వేతనాల పెంపు కోసం ఉద్యోగుల సమ్మె**
- రాష్ట్రమంతటా ఆఫీసులు, ఆస్పత్రులకు గైర్హాజరు
- తీవ్ర ఇబ్బందులు పడిన ప్రజలు
- 17 శాతం మధ్యంతర పెంపు: సర్కారు
- మధ్యాహ్నం తరువాత స్ట్రైక్ విరమణ



బుధవారం ధార్వాడలో తహసీల్దార్ ఆఫీసు మూతపడిన దృశ్యం



ధార్వాడ తహసీల్దార్ ఆఫీసులో ఓ వృద్ధుడు



చంటి పిల్లలతో హావేరి జిల్లా ఆస్పత్రి నుంచి వెనక్కి వెళ్తున్న మహిళలు

శివాజీనగర: సుస్తీ చేసి సర్కారీ ఆస్పత్రికి వెళ్తే చూసేవారు లేరు, పని మీద ఆఫీసుకు వెళ్తే మాట్లాడే దిక్కు లేదు. ఒక్కరోజులో ఎన్నో లక్షల మంది ప్రజలకు ఈ అవస్థలకు తప్పలేదు. ఏడవ వేతన కమిషన్ సిఫార్సుల ప్రకారం జీతాల పెంపు, ఎన్‌పీఎస్ రద్దుకు డిమాండ్ చేస్తూ రాష్ట్రమంతటా ప్రభుత్వ ఉద్యోగులు బుధవారం చేపట్టిన నిరవధిక సమ్మె వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం నుంచి విధులకు గైర్హాజరయ్యారు. శక్తి కేంద్రం విధానసౌధ, వికాససౌధతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు బంద్ అయ్యాయి. క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్న ప్రభుత్వం హెచ్చరికలు పనిచేయలేదు. రాష్ట్రమంతటా ప్రభుత్వ కార్యాలయాలకు ఉద్యోగులు గైర్హాజరు కావడంతో సేవలు స్తంభించి ప్రజలు అవస్థలు పడ్డారు. ఆసుపత్రుల్లోను అడ్మిట్ అయిన రోగులు, అత్యవసర సేవలు మినహాయించి, కొత్తగా వచ్చే రోగులను బయటకు తరిమేయడంతో చికిత్స లభించక లబోదిబోమన్నారు. ఆర్థిక, రెవెన్యూ, విద్యా, వైద్య సహా అన్ని విభాగాల ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు.

**సౌధాలు నిర్మానుష్యం**

విధానసౌధ, వికాససౌధ, బహుళ అంతస్తుల భవనాల్లో నిర్మానుష్యం నెలకొంది. ఆఫీసుల తాళాలను తెరవలేదు. ఉదయం అనేక మంది ఉద్యోగులు గైర్హాజరుకాగా, సమ్మె 99 శాతం విజయవంతమైందని సచివాలయ ఉద్యోగులసంఘం అధ్యక్షుడు గురుస్వామి తెలిపారు. విధానసౌధ మహాత్మాగాంధీ విగ్రహం వద్ద మౌన ప్రదర్శన నిర్వహించారు. బెంగళూరుతో సహా జిల్లాలు, తాలూకాల్లో ఉద్యోగులు ధర్నాలు చేశారు.

**ఏప్రిల్ నుంచి కొత్త వేతనాలు**

సమ్మె నేపథ్యంలో ప్రభుత్వం ఉద్యోగులను ప్రసన్నం చేసుకునే పనిలో పడింది. మూల వేతనంలో 17 శాతం పెంపును మధ్యంతర పరిహారంగా ఇవ్వడానికి ఆమోదించింది. ఏప్రిల్ 2023 నుంచి అన్వయిస్తుందని ఉన్నతాధికారులు తెలిపారు. మధ్యాహ్నం సర్కారు ఈ మేరకు ప్రకటించగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు షడాక్షరి నేతృత్వంలో సమావేశమై సమ్మెను ఉపసంహరించుకున్నట్లు తీర్మానించారు.


ఉద్యోగులు 40 శాతం మధ్యంతర పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 7వ వేతన కమిషన్ నివేదిక పొందిన తరువాత పూర్తి స్థాయిలో వేతనాల పెంచుతామని హామీ ఇచ్చారు, ఉద్యోగులందరూ విధులకు హాజరవుతారని షడక్షరి తెలిపారు. కాగా ఇంకా ఎక్కువ మధ్యంతర పరిహారం కావాలని ఉద్యోగ సంఘ నేతల్లో గొడవ జరిగింది.

**2 నెలల్లో పెన్షన్‌పై నివేదిక: సీఎం**

సీఎం బొమ్మై విలేకరులతో మాట్లాడుతూ మూల వేతనంలో 17 శాతం పెంపును ప్రకటించారు. రేస్ కోర్సు రోడ్డు నివాసంలో ఆర్థిక శాఖ అధికారులతో భేటీ అయ్యారు. ఉద్యోగులు సమ్మెను ఉపసంహరించుకోవాలని ఆయన విన్నవించారు. కొత్త పెన్షన్ పథకం ఇతర రాష్ట్రాల్లో ఏ విధంగా ఉంది. అక్కడ ఆర్థిక పరిణామాలను అధ్యయనం చేసి 2 నెలల్లో నివేదిక తెప్పించడానికి కమిటీ వేశామని, ఆపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

**ఉద్యోగ నేతల రగడ**

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సీ.ఎస్. షడాక్షరి, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గురుస్వామి మధ్య గొడవ జరిగింది. మధ్యంతరంగా 17 శాతం వేతనం పెంపును సర్కారు ప్రకటించగా షడక్షరి ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాలు సమ్మెను విరమించాయి. అయితే గురుస్వామి ససేమిరా అంటూ 25 శాతం వేతనం పెంచాలి, అంతవరకూ సమ్మెను కొనసాగించనున్నట్లు తెలిపారు. షడక్షరి ఏకపక్షంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఇందుకు ఆగ్రహం వ్యక్తం చేసిన షడాక్షరి, అతను ఒక ప్రభుత్వ ఉద్యోగి, తాత్కాలిక అధ్యక్షుడు మాత్రమే. ప్రచారం కోసం ఇలా చెబుతున్నారని అన్నారు.



నిర్మానుష్యంగా విధానసౌధ



బెంగళూరులో బీబీఎంపీ, ప్రభుత్వ ఉద్యోగుల నిరసన ప్రదర్శన



ధార్వాడ సివిల్ ఆస్పత్రిలో వైద్య సిబ్బంది లేక రోగుల పడిగాపులు



బోసిపోయిన బెంగళూరు విధానసౌధ

## న్యూస్‌రీల్

### దొరికిన చిరుతను వదిలేశారు



కోళ్లఫారంలో చిక్కిన చిరుత

దొడ్డబళ్లాపురం: కోళ్ల ఫారంలో కోళ్లను విందు చేసుకోవడానికి వెళ్లిన చిరుత లోపలే బందీ అయ్యింది. మంగళవారం రాత్రి కనకపుర తాలూకా మూలెగుంది గ్రామంలో ప్రకాశ్ అనే వ్యక్తికి చెందిన కోళ్లఫారంలోకి చిరుత వెళ్లింది. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు వెంటనే కోళ్ల ఫారం తలుపులు మూసివేసి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. బుధవారం ఉదయం సాతనూరు అటవీ అధికారి ఆశ, సిబ్బందితో వచ్చి ఫారం తలుపులు తీసి చిరుతను పారిపోయేలా చర్యలు తీసుకున్నారు. అయితే చిరుతను బంధించకపోవడంపై స్థానికులు ఆక్రోశం వ్యక్తంచేశారు. అది మళ్లీ దాడి చేయవచ్చని భయం వ్యక్తంచేశారు.

### యడ్డిని సీఎం అభ్యర్థిగా ప్రకటించాలి: డీకే

దొడ్డబళ్లాపురం: బీజేపీకి దమ్ముంటే యడియూరప్పను సీఎం అభ్యర్థిగా ప్రకటించాలని కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ సవాలు విసిరారు. బుధవారం హాసన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన...నిన్నటి వరకూ సీఎం బొమ్మై నేతృత్వంలో ఎన్నికలను ఎదుర్కొంటామని ప్రకటించిన బీజేపీ కొత్తగా యడియూరప్ప నేతృత్వంలో ఎన్నికలకు వెళ్తామని చెబుతుండడం విడ్డూరంగా ఉందన్నారు. దమ్ముంటే ముఖ్యమంత్రి అభ్యర్థిగా యడియూరప్పను ప్రకటించాలన్నారు. కోవిడ్ కష్ట సమయంలో రాష్ట్రానికి వచ్చి పలకరించని ప్రధాని మోదీ నేడు ఎన్నికలు వస్తుండడంతో తరచుగా వచ్చారన్నారు. 1972 నుంచి మల్లికార్జున ఖర్గే రాజకీయాలలో ఉన్నారని, ఆయన గురించి చులకనగా మాట్లాడడం క్షమించరాని నేరమన్నారు.

### పార్టీ మారిన మాజీ ఐపీఎస్



బీజేపీ కండువాతో భాస్కర్‌రావు

బనశంకరి: విశ్రాంత ఐపీఎస్ అధికారి భాస్కర్ రావ్ బీజేపీలో చేరారు. బుధవారం బీజేపీ ప్రధాన కార్యాలయంలో రాష్ట్రాధ్యక్షుడు నళీన్ కుమార్ కటీల్ సమక్షంలో పార్టీ జెండా స్వీకరించారు. కొన్ని నెలల కిందట వీఆర్‌ఎస్ తీసుకున్న ఆయన ఆప్ పార్టీలో చేరడం తెలిసిందే. ఇంతలోనే కాషాయంలోకి మారారు. భాస్కర్ రావ్ మాట్లాడుతూ సనాతన ధర్మం, జాతీయత పై ప్రేమ ఉందని, బీజేపీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. ఆమ్‌ఆద్మీపార్టీకి కర్ణాటకలో ఎదుగుదల లేదని, తన సమయం, వయసును వ్యర్థం చేసుకోరాదని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మొదట ఆయన ఆమ్‌ఆద్మీ పార్టీలో చేరి రాజకీయ అనుభవం పొందారని, డబుల్ ఇంజన్ ప్రభుత్వంతో కర్ణాటక అభివృద్ధి సాధ్యమని నమ్మి బీజేపీలో చేరారని కటీల్ అన్నారు. ఆయన ఎలాంటి పదవినీ ఆశించలేదని చెప్పారు.

### డబుల్ ఇంజిన్‌తో లాభం సున్నా: సిద్దు

దొడ్డబళ్లాపురం: బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులను మోసం చేస్తోందని, బడ్జెట్‌లో 7వ వేతన కమిషన్ సిఫార్సులకు నిధులు కేటాయించకుండా బుకాయిస్తోందని కాంగ్రెస్ మాజీ ముఖ్యమంత్రి సిద్దరామయ్య అన్నారు. బెళగావిలో బుధవారం మాట్లాడుతూ 7వ వేతన కమిషన్‌ను అమలు చేయాలని డిమాండు చేసారు. తమ హయాంలో 6వ వేతన కమిషన్ అమలు చేసామన్నారు. అప్పుడే పది వేల కోట్ల రూపాయలు ప్రభుత్వంపై భారం పడిందన్నారు. ఈ ప్రభుత్వానికి ఉద్యోగులపై ఏ మాత్రం కనికరం లేదన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల పరిపాలనలో ధరలు ఆకాశాన్నంటాయని, రైతుల ఆదాయం ఏ మాత్రం పెరగలేదన్నారు. ప్రజలకు 600 హామీలు ఇచ్చిన ప్రధాని మోదీ ఎన్ని నెరవేర్చారని ప్రశ్నించారు.

### మా గుర్రాన్ని కట్టివేయలేరు: మంత్రి అశోక్

శివాజీనగర: బీజేపీ అశ్వమేధ యాగం ప్రారంభమైంది, మా గుర్రాన్ని కట్టివేయడం కాంగ్రెస్ వారికి చేత కాదు అని రెవెన్యూ మంత్రి ఆర్.అశోక్ అన్నారు. బుధవారం మల్లేశ్వరంలో బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మరోసారి బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం తీసుకురావాలని మా నాయకులు సూచించారు. అందుకోసమే విజయసంకల్ప యాత్రను నాలుగు దిక్కుల ద్వారా చేస్తున్నామని చెప్పారు. 3 న దేవనహళ్లి ప్రభుత్వ కాలేజీ ఆవరణలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా రథయాత్రను ప్రారంభిస్తారని తెలిపారు. విస్తృతంగా సభలు, సమావేశాలు నిర్వహిస్తామని అన్నారు.

## మాదేశ సన్నిధిలో సంకల్పయాత్ర

- ప్రారంభించిన బీజేపీ అధ్యక్షుడు నడ్డా



జెండా ఊపుతున్న నడ్డా



సభలో పాల్గొన్న ప్రజలు

మైసూరు: మలే మహదేశ్వర దేవుని దర్శనం, ఆశీర్వాదం లభించింది. యాత్ర ద్వారా బీజేపీకి మళ్లీ మెజారిటీ వచ్చి అధికారంలోకి వస్తుంది అని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. బుధవారం చామరాజనగర జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం మలె మహదేశ్వర బెట్టలో పూజలు చేసి బీజేపీ విజయ సంకల్ప రథయాత్రను ఆయన ప్రారంభించారు. రాష్ట్రం నాలుగు దిక్కుల ప్రారంభం అయ్యే ఈ యాత్ర ద్వారా 224 నియోజకవర్గాల్లో ప్రచారం సాగిస్తామని, 150కి పైగా రోడ్‌షోలు, బహిరంగ సభలు నిర్వహిస్తామన్నారు. బెళగావిలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ రథయాత్రను ప్రారంభిస్తారన్నారు. ఓటు బ్యాంకు, కుల, అవినీతి రాజకీయాలకు కాంగ్రెస్ పార్టీ పెట్టింది పేరని విమర్శించారు. నరేంద్ర మోదీ ప్రభుత్వ హయాంలో ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక శక్తిగా మనదేశం ఎదిగిందని, గతంలో పదవ స్థానంలో ఉండగా, మొబైల్ ఉత్పత్తి, పారిశ్రామిక రంగం అభివృద్ధితో దేశం ఎంతో ప్రగతి సాధించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఎం బొమ్మై, యడియూరప్ప, కేంద్ర మంత్రి శోభ కరంద్లాజే, మంత్రులు పాల్గొన్నారు.

## తల్లి మృతదేహంతో 2 రోజులు

- నగరంలో విషాదఘటన

శివాజీనగర: బెంగళూరులో ఒక హృదయ విదారక సంఘటన చోటు చేసుకుంది. తల్లి మరణిస్తే, ఆ సంగతి తెలియక 11 సంవత్సరాల బిడ్డ రెండు రోజుల పాటు శవం వద్దే ఉన్నాడు. ఇంటి నుంచి దుర్వాసన వచ్చిన తరువాతనే పొరుగువారికి విషయం తెలిసింది. గంగానగరలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ప్రభుత్వ పాఠశాల వద్ద అణ్ణమ్మ అనే వితంతు మహిళ (40) ఉంటోంది. మాటలు రాని అణ్ణమ్మ కూలి పని చేసి బిడ్డను పోషిస్తుండేది. రెండు రోజుల క్రితం అణ్ణమ్మ నిద్రలోనే మరణించింది. తల్లి నిద్ర లేవలేదని ఆమె కొడుకు అనుకున్నాడు. తల్లి ఇంకా నిద్రిస్తుందని చెప్పి బంధువుల ఇంటికెళ్లి కడుపు నింపుకునేవాడు. రెండు రోజుల తరువాత ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో ఇరుగుపొరుగు వెళ్లి చూడగా అణ్ణమ్మ మృతి చెందినట్లు తెలిసింది. పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి స్థల పరిశీలన చేసి ఇది సహజ మరణమని తెలిపారు.

## తాళం వేసి గుట్టుగా రిజిస్ట్రేషన్లు

- దేవనహళ్లిలో ఎమ్మెల్యే కోసం విడ్డూరం



తాళం వేసిన రిజిస్ట్రార్ కార్యాలయం

దొడ్డబళ్లాపురం: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు బుధవారంనాడు సమ్మెలో ఉంటే, దేవనహళ్లి పట్టణంలో రిజిస్ట్రార్ ఆఫీసులో మాత్రం భూ రిజిస్ట్రేషన్లు జరిగాయి. సామాన్యుల కోసం ఇలా చేశారనుకుంటే పొరపాటే. ఎమ్మెల్యే కోసం సమ్మెను కూడా కాదని చకచకా పనిచేశారు. ఆఫీసు లోపల ఎమ్మెల్యే, అధికారులు రిజిస్ట్రేషన్ పని కానిస్తుండగా బయట అంతా మామూలుగా కనిపించేందుకు తలుపులకు తాళం వేసి ఉంచారు. విషయం తెలుసుకున్న ఆమ్ ఆద్మీ కార్యకర్తలు ఎమ్మెల్యే అక్రమంగా డాక్యుమెంట్లు దిద్దడానికి వచ్చారని ఆరోపిస్తూ ధర్నా చేశారు. సమ్మెకాలంలో ప్రజలకు లభించని సేవలు ఎమ్మెల్యేకి ఎలా అందిస్తున్నారని ఉద్యోగులను నిలదీసారు. గొడవ పెద్దదవుతుందని భావించిన ఎమ్మెల్యే గన్‌మెన్, అనుచరులు తాళం పగలగొట్టడానికి ప్రయత్నించగా వాగ్వాదం చోటుచేసుకుంది. తాళం వేసిన వారే వచ్చి తీయాలని ఆప్ కార్యకర్తలు పట్టుబట్టారు. చాలాసేపటి తరువాత పోలీసులు జోక్యం చేసుకుని తలుపులు తీయించారు. బయట నుంచి రిజిస్ట్రార్ కార్యాలయానికి తాళం వేసిన ఉద్యోగులు బయట ధర్నా చేస్తుండగా కొందరు సిబ్బంది మాత్రం లోపల ఎమ్మెల్యే నిసర్గ నారాయణ స్వామిని కూర్చోబెట్టి రిజిస్ట్రార్ పనులు చేసివ్వడం వివాదాస్పదంగా మారింది.

## కమనీయం..కరిబసవ రథోత్సవం



భక్తజనం నడుమ సాగుతున్న చంద్రమౌళీశ్వరస్వామి బ్రహ్మరథోత్సవం

- రథోత్సవానికి తరలివచ్చిన ప్రజలు

ఉరవకొండ: ఈశ్వరా...పరమేశ్వరా శంభో శంకరా అంటూ భక్త జనం ప్రణమిల్లుతుండగా...ఉరవకొండ గవిమఠ చంద్రమౌళీశ్వరుడి రథ చక్రాలు ముందుకు కదిలాయి. స్వామి వారి రథోత్సవాన్ని తిలకించి వేలాది మంది భక్తులు తరలివచ్చి తన్మయం చెందారు. తేరు చూడాలని ఇంటింటా బంధువులు రావడంతో సందడి నెలకొంది. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలో ప్రసిద్ధి గాంచిన ఉరవకొండ గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మ రథోత్సవం బుధవారం నేత్రపర్వంగా సాగింది. మధ్యాహ్నం 3 గంటలపైన గవిమఠం పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి, ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి, చౌకి మఠం పీఠాధిపతి కళ్యాణస్వామి, దేవదాయ శాఖ అధికారులు భారీ ఊరేగింపు నడుమ చంద్రమౌళీశ్వరస్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా రథం వద్దకు తీసుకొచ్చారు. విశేష పూజలు చేసి విగ్రహాన్ని తేరులో ప్రతిష్ఠించారు. శంభోశంకర అంటూ భక్తులు బృహత్ రథాన్ని లాగుతూ ఎదురు బసవన్న గుడి వద్దకు తీసుకెళ్లి అక్కడ పూజల అనంతరం తిరిగి యథాస్థానానికి చేర్చారు. పలు జిల్లాల నుంచి భక్తులు, పెద్దసంఖ్యలో ప్రముఖులు పాల్గొని తరించారు.



ఉత్సవ విగ్రహంతో స్వాములు



తేరు వేడుకను తిలకిస్తున్న జనం

## ఉపరాష్ట్రపతి విస్తృత పర్యటన



బెంగళూరు ఐఐఎంలో జరిగిన సదస్సులో ప్రసంగిస్తున్న ఉపరాష్ట్రపతి ధన్‌కడ్

శివాజీనగర: ఉప రాష్ట్రపతి జగదీప్ ధనకడ్ ఆ పదవిని చేపట్టాక తొలిసారిగా సిలికాన్ సిటీ పర్యటనకు వచ్చారు. బుధవారం బెంగళూరులో పలు కార్యక్రమాలతో తీరిక లేకుండా గడిపారు. ఉదయం బసవనగుడి బుల్ టెంపుల్ రోడ్డులో ఉన్న పెద్ద గణేశ దేవాలయాన్ని సందర్శించారు. సతీసమేతంగా చేరుకొన్న ఉపరాష్ట్రపతికి డోలు, నాదస్వరం ద్వారా స్వాగతించారు. ఈ సమయంలో ఆయన ఉత్సాహంగా డోలు వాయించి, తరువాత హార్మోనియం తీసుకొని వాయించి అందరినీ సంభ్రమానికి గురిచేశారు. తరువాత దొడ్డ గణపతికి పూజలు చేశారు. పలు ప్రైవేటు విద్యా సంస్థలతో పాటు ఐఐఎం-బీలో జరిగిన సదస్సుల్లో పాల్గొని ప్రసంగించారు.

## క్లుప్తంగా

### అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి, మేయర్, ఉపమేయర్లు

సాక్షి,బళ్లారి: 36వ వార్డులో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి భూమిపూజ చేశారు. బుధవారం ఆయన మేయర్ రాజేశ్వరి, కార్పొరేటర్లు, అధికారులతో కలిసి అగ్నిమాపక కార్యాలయం నుంచి సుధా క్రాస్ వరకు రూ.2.5 కోట్లతో చేపట్టనున్న రోడ్డు పనులకు భూమిపూజ చేసి పనులను నాణ్యతగా చేపట్టి గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు సూచించారు.

### పేదబాలలకు ఉచిత విద్య

గౌరిబిదనూరు: ప్రజలకు ఉత్తమమైన విద్యతో పాటుగా నాణ్యమైన వైద్య సేవలు సైతం అవసరమని ముద్దేనహళ్లి శ్రీ సత్యసాయి ట్రస్ట్ ముఖ్యులు సద్గురు మధుసూధన సాయి తెలిపారు. మంగళవారం సాయంత్రం నగరగెరె హోబళి వాటంకొత్తపల్లిలో సత్యసాయి పాఠశాలలో నూతనంగా సాయి స్వాస్థ్య క్షేమ కేంద్రాన్ని ప్రారంభించి ప్రసంగించారు. గ్రామీణ ప్రదేశాలలో పేద విద్యార్థులకు సంస్థ ద్వారా ఉచిత చదువును అందిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే శివశంకరరెడ్డి మాట్లాడుతూ తమ తాలూకాలో ఉచిత వైద్యం, ఆధ్యాత్మిక సేవలు ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో నరసింహమూర్తి, డా. సతీశ్ బాబు, సత్యనారాయణరావ్ పాల్గొన్నారు.

### ఓటరుగా నమోదు చేసుకోండి

రాయచూరు రూరల్: జిల్లాలో ఓటరుగా యువత పేరు నమోదు చేసుకోవాలని కలెక్టర్ చంద్ర శేఖర్ నాయక్ సూచించారు. ఆయన బుధవారం వ్యవసాయ వర్సిటీలో ఏర్పాటు చేసిన స్వీప్ సమితి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. వర్సిటీ వీసీ హనుమంతప్ప, జెడ్పీ సీఈఓ శశిధర్, ఎస్పీ నిఖిల్‌లున్నారు.

### చివరి ఆయకట్టుకు నీరివ్వాలి



మాట్లాడుతున్న చామరస మాలిపాటిల్

రాయచూరు రూరల్: ఎడమ కాలువ చివరి ఆయకట్టుకు నీరందించాలని రైతు సంఘం అధ్యక్షుడు చామరస మాలిపాటిల్, ఎమ్మెల్యేలు రాజా వెంకటప్ప నాయక్, శివరాజ్ పాటిల్ పేర్కొన్నారు, బుధవారం పాత్రికేయుల భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నీటి గేజ్‌ను నిర్వహించి ఆయకట్టు భూములకు నీరందేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

### గంజాయి కేసులో మహిళకు జైలుశిక్ష

శివమొగ్గ: గంజాయి తరలిస్తూ పట్టుబడిన మహిళకు నాలుగేళ్ల కఠిన కారాగార శిక్ష ఖరారు అయింది. అలాగే రూ. 25 వేల జరిమానా విధిస్తూ శివమొగ్గ ప్రధాన జిల్లా, సెషన్స్ కోర్టు జడ్జి మల్లికార్జునగౌడ తీర్పు చెప్పారు. భద్రావతి తాలూకాకు చెందిన నయీమ్ ఖానమ్(32) అనే మహిళ 2019 మే 7న బస్సులో వెళ్తుండగాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమె బ్యాగ్‌ను పరిశీలించగా సుమారు 7 కేజీల గంజాయి లభించింది. విచారణలో నేరం రుజువైంది. జరిమానా చెల్లించకపోతే మరో ఆరునెలలు జైలువాసం అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

### కబ్జారాయుళ్లపై చర్యలేవీ?



ఆందోళన చేస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: మావినకెరె చెరువును కబ్జా చేసిన వారిపై చర్యలు చేపట్టాలని దళితసేన జిల్లాధ్యక్షుడు విశ్వనాథ్ పట్టి డిమాండ్ చేశారు. ఆయన బుధవారం చెరువు వద్ద ఆందోళన చేపట్టి మాట్లాడారు. చారిత్రాత్మకమైన ఈ చెరువును ఇష్టానుసారంగా కబ్జా చేసినా ప్రజాప్రతినిధులు నోరు మెదపక పోవడాన్ని ఖండించారు. నగరసభ, జిల్లాధికార యంత్రాంగం కబ్జాలను తొలగించి చెరువును రక్షించాలని ఒత్తిడి చేశారు.

### లారీపై కూలిన ఇనుప కమ్మీ

- త్రుటిలో తప్పిన ముప్పు

హుబ్లీ: నగరంలో భారీ లోడింగ్ వాహనాలను అడ్డుకోవడానికి అక్కడక్కడ ప్రధాన రోడ్లలో పెద్ద పెద్ద పరిమాణంలో ఇనుప కమ్మీలను ఏర్పాటు చేశారు. అలాంటి ఓ ఇనుప కమ్మీ విరిగి ఉన్నఫళంగా మంగళవారం రాత్రి హుబ్లీ రైల్వే స్టేషన్ నుంచి గదగ్ రోడ్డును కలిపే మార్గంలో నడుస్తున్న లారీపై పడింది. ఈ ఘటనతో హుబ్లీ అంబేడ్కర్ సర్కిల్‌లో త్రుటిలో పెను ముప్పు తప్పింది. ఎటువంటి ప్రాణహాని జరగలేదు.

### 'ఉపాధి' పని దినాలను పెంచాలి

రాయచూరు రూరల్: వ్యవసాయ కూలీ కార్మికులకు నరేగ పని దినాలను పెంచాలని అఖిల భారత రైతు వ్యవసాయ కార్మికుల సంఘం అధ్యక్షుడు మల్లనగౌడ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం పాత్రికేయుల భవనంలో విలేకరులతో మాట్లాడారు. మిగులు భూములను ప్రభుత్వం పేదలకు పంపిణీ చేయాలన్నారు. ఏపీఎంసీ, కార్మిక, భూసంస్కరణలు, విద్యుత్ చట్టాన్ని రద్దు చేయాలని ఆయన ఒత్తిడి చేశారు.

# ఉద్యోగుల సమ్మెతో కార్యాలయాలు వెలవెల

- ఆఫీసుల్లో సిబ్బంది లేక బోసిపోయిన వైనం
- వేతన సవరణ మధ్యంతర ఆదేశాలపై హర్షం



రాయచూరులో బోసిపోయిన కార్యాలయాలు



గంగావతిలో నగరసభ కార్యాలయానికి తాళం వేసిన దృశ్యం

రాయచూరు రూరల్: జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు బుధవారం సమ్మెలో పాల్గొనడంతో ప్రభుత్వ కార్యాలయాలన్నీ బోసిపోయాయి. ప్రభుత్వం ఉద్యోగులకు ఏడో వేతన కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం సమ్మె ప్రారంభించారు. నగరంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు లేక కార్యాలయాలు వెలవెలబోయాయి.

**విధులకు ప్రభుత్వ ఉద్యోగుల డుమ్మా**

గంగావతి: నగరంతో పాటు తాలూకాలో ప్రభుత్వ ఉద్యోగుల సమ్మె విజయవంతమైంది. ఉద్యోగులు తమ విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. నగరసభ కార్యాలయానికి తాళాలు వేసిన దృశ్యం కనిపించింది. తమ డిమాండ్లను సాధించేంత వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శరణేగౌడ పోలీస్ పాటిల్ తెలిపారు.

**ప్రభుత్వ ఉద్యోగుల సమ్మె విజయవంతం**

కోలారు : వేతన కమిషన్ అమలు, ఎన్‌పీఎస్ రద్దు కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం విజయవంతమైంది. నగరంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆస్పత్రి, కళాశాలలు మూసివేశారు. ఎస్‌ఎన్‌ఆర్ జిల్లా ఆస్పత్రిలో అత్యవసర సేవలు మాత్రం కొనసాగాయి. ఉద్యోగులు లేక ప్రభుత్వ కార్యాలయాలలో కుర్చీలు ఖాళీగా కనిపించాయి. ఇదే సమయంలో ముఖ్యమంత్రి ఉద్యోగులకు 17 శాతం వేతన సవరణ చేస్తూ మధ్యంతర ఆదేశాలు ఇవ్వడంపై ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సురేష్‌బాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు సమ్మెను విరమిస్తున్నట్లు తెలిపారు.

**జిల్లా ఆస్పత్రిలో ఓపీ రోగుల పాట్లు**

ఉద్యోగుల సమ్మె కారణంగా ఎస్‌ఎన్‌ఆర్ జిల్లా ఆస్పత్రిలో ఓపీ విభాగంతో పాటు ఇతర విభాగాల సిబ్బంది గైర్హాజరు కావడంతో ఆస్పత్రికి వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలువురు రోగులు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లారు. పేదరోగులకు ఇబ్బంది కావడంతో పలువురు ఉద్యోగులపై శాపనార్థాలు పెట్టారు.

**వేతన పెంపుపై ఉద్యోగ సంఘాల హర్షం**

బళ్లారిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంఘం డిమాండ్లలో ఒకటైన 17 శాతం మేరకు వేతనాలు పెంచుతూ ఆదేశాలను జారీ చేయడంపై జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘాల్లో హర్షం వ్యక్తమైంది. రాష్ట్ర వ్యాప్తంగా తమ డిమాండ్లను పరిష్కరించాలని ఉద్యోగులు విధులు బహిష్కరించి సమ్మెకు దిగిన నేపథ్యంలో ప్రభుత్వం వారి వేతనాలను పెంచుతూ ఆదేశాలివ్వడంపై సంఘం జిల్లాధ్యక్షులు శివాజీరావ్, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. కాగా ఉద్యోగుల సమ్మెతో ప్రభుత్వ ఆస్పత్రులు, వివిధ కార్యాలయాల్లో రోగులు, ప్రజలు బుధవారం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు వేతన పెంపుదలతో సమ్మెను విరమించుకోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పినట్లయింది.



కోలారులో ఉద్యోగుల సమ్మెతో ఖాళీగా ఉన్న ఎస్ఎన్ఆర్ ఆస్పత్రి ఓపీ విభాగం

**నల్లబ్యాడ్జీలతో విధులకు జిల్లా సిబ్బంది హాజరు**

హుబ్లీ: ఏడో వేతన కమిషన్ అమలు కోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు బుధవారం నుంచి ప్రారంభించిన నిరవధిక సమ్మెకు ధార్వాడ జిల్లాలో కూడా మద్దతు లభించింది. ఈ క్రమంలో రోగులు ఇబ్బంది పడరాదన్న సదుద్దేశంతో నల్లబ్యాడ్జీలతో ధార్వాడ జిల్లా ఆస్పత్రి ఎమర్జెన్సీ విభాగాల సిబ్బంది తమ విధులకు హాజరయ్యారు. మిగతా ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది విధులకు హాజరు కాకుండా రాష్ట్ర వ్యాప్త సమ్మెకు తమ పూర్తి మద్దతు ప్రకటించారు. దీంతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు పూర్తిగా మూతబడ్డాయి. జనసందడితో కనిపించే జిల్లాధికారి కార్యాలయం కూడా బోసిపోయింది. ఇక్కడ అన్ని విభాగాల ఉద్యోగులు తమ కార్యాలయాలకు తాళాలు వేసి విధులకు గైర్హాజరయ్యారు. దీంతో జిల్లాధికారి కార్యాలయం ప్రధాన గేట్ మాత్రం తెరచి ఉండగా మిగిలిన విభాగాలు పూర్తిగా మూతపడ్డాయి.

**శాంతియుతంగా ప్రభుత్వ ఉద్యోగుల సమ్మె**

హొసపేటె: డిమాండ్లను నెరవేర్చాలని ఒత్తిడి చేస్తూ బుధవారం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెకు ప్రభుత్వ ఉద్యోగులు హాజరై విధులకు గైర్హాజయ్యారు. సమ్మెతో నగరంలోని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలను స్వచ్ఛందంగా మూసివేసి మద్దతు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు యథావిధిగా రోగులకు వైద్య సేవలు అందించారు. తహసీల్దార్ కార్యాలయంలో విధుల్లో ఉన్న సిబ్బందిని ఉద్యోగుల సంఘం నేతలు బయటకు పంపించి కార్యాలయానికి తాళం వేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జి.మల్లికార్జునగౌడ మాట్లాడుతూ తాము చేపడుతున్న సమ్మెకు ఉద్యోగులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా సంఘం నేతలు కడ్లె వీరభద్ర, బసవరాజ, జోషి పరశురామ తదితరులు పాల్గొన్నారు.



కోలారులో ఆస్పత్రి ముందు ఆందోళన చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు



బళ్లారిలో హర్షం వ్యక్తం చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగ సంఘం నేతలు

### ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బసవరాజ్ తదితరులు

గంగావతి: మల్లిగెవాడలో పాఠశాల వార్షికోత్సవం, స్నేహ సమ్మేళనాన్ని బుధవారం కనకగిరి ఎమ్మెల్యే బసవరాజ్ దఢేసూగూరు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పాత, కొత్త విద్యార్థుల మధ్య స్నేహశీలతను పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం శ్లాఘనీయం అన్నారు. అధ్యాపకవర్గం, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

### గ్రామాల్లో కేఆర్‌పీపీ ప్రచారం జోరు



మాట్లాడుతున్న గాలి జనార్దన్‌రెడ్డి

గంగావతి రూరల్: నియోజకవర్గంలోని గ్రామాల్లో కేఆర్‌పీపీ వ్యవస్థాపకులు, మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. బుధవారం దాసనాళ గ్రామంలో కాశీ శివలింగేశ్వర స్వామి, ఆంజనేయస్వామి ఆలయాల దర్శనానంతరం గ్రామస్తులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలను తెలుసుకుని రాబోయే రోజుల్లో వాటి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఉడుమకల్, గడ్డి, బండ్రాల్, చిక్కబెనకల్, లింగదహళ్లి, హెచ్.ఆర్.జీ క్యాంపు, హేమగుడ్డ గ్రామాల్లో ప్రచారంతో పాటు పార్టీలో చేరిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా, తాలూకా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### పక్షుల దాహం తీరుద్దాం

బనశంకరి: మండువేసవిలో ప్రాణిపక్షులకు ఆహారం, నీరు అందించాలని వీరవనిత ఒనక ఓబవ్వ కన్నడ సేనాసమితి అధ్యక్షుడు రమేశ్‌రాజు మనవిచేశారు. జయనగర నాలుగో బ్లాక్‌లో వీరవనిత ఒనక ఓబవ్వ కన్నడ సేనాసమితి కార్యాలయం ముందు మట్టికుండల్లో నీటి వసతిని కల్పించారు. ప్రతి ఒక్కరూ ఇళ్లు, కార్యాలయాల వద్ద మట్టిపాత్రలు, సిమెంటుతొట్టెల్లో నీరు, ఆహారం ఏర్పాటుచేయాలని కోరారు. అనేక పక్షి జాతులు అంతరించిపోతున్నాయని, భవిష్యత్ తరాల కోసం వాటి సంరక్షణ చాలా అవసరమన్నారు.

### వీధి నాటక ప్రదర్శనకు శ్రీకారం



వీధినాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

కంప్లి: ఎమ్మిగనూరులో ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి ఆవరణలో ఆరోగ్య సేవలపై వీధి నాటకాన్ని ప్రదర్శించారు. ఆశా కార్యకర్త కమలమ్మ తప్పెట వాయించి ప్రారంభించారు. ఉపాధ్యాయులు ఎస్.రామప్ప, ఆశా కార్యకర్తలు ఈరమ్మ, భవనమ్మ, హొన్నమ్మ, కన్యాకుమారి, నేత్రకళా సంఘం పదాధికారులు పాల్గొన్నారు.

## రూ.3 లక్షల మిగులు బడ్జెట్‌కు ఆమోదం



బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న అధ్యక్షురాలు లలిత



మాట్లాడుతున్న కౌన్సిలర్ జయణ్ణ, ఇతర కౌన్సిలర్లు

రాయచూరు రూరల్: నగరసభకు 2023–24వ సంవత్సరానికి రూ.3 లక్షల మిగులు బడ్జెట్‌ను నగరసభ అధ్యక్షురాలు లలిత ప్రవేశపెట్టారు. బుధవారం ప్రభుత్వ ఉద్యానవనంలో జరిగిన సమావేశంలో బడ్జెట్ ప్రతులను విడుదల చేసి ఆమె మాట్లాడారు. నగరంలో తాగునీటి ఎద్దడి నివారణకు, రోడ్లు, విద్యుత్ దీపాల అమరిక, మురుగు కాలువల స్వచ్ఛతకు ప్రాధాన్యత కల్పించినట్లు తెలిపారు. ఈ ఏడాదిలో రూ.61.12 కోట్ల ఆదాయం రాగా రూ.61.08 కోట్లను వ్యయం చేయనున్నట్లు తెలియజేస్తూ రూ.3 లక్షల మిగులు బడ్జెట్‌కు ఆమోదం పొందారు. నగరసభను కార్పొరేషన్ చేశామని అబద్ధాలు చెప్పడాన్ని మానుకోవాలని కౌన్సిలర్లు జయన్న, దరూరు బసవరాజ్, శ్రీనివాసరెడ్డి సూచించారు. సమావేశంలో ఉపాధ్యక్షురాలు నరసమ్మ, కమిషనర్ గురులింగప్ప, సభ్యులు శశిరాజ్, నాగరాజ్, ప్రశాంతి, లక్ష్మి, సరోజమ్మ, కవిత, రేఖ, సమీర్, ఉమాలున్నారు.

## మరణంలోను వీడని బంధం

- మనవడి మృతదేహం చూసి తాతకు గుండెపోటు
- విజయపుర జిల్లా వందాల గ్రామంలో విషాదం



మనవడు, తాత(ఫైల్)

సాక్షి,బళ్లారి: మరణంలోనూ ఆ తాతా మనవడి బంధం వీడలేదు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మనవడి మృతదేహాన్ని చూసి బాధను తట్టుకోలేక తాత గుండెపోటుతో మృతి చెందిన ఘటన విజయపుర జిల్లాలో చోటు చేసుకుంది. వివరాలు.. మంగళవారం రాత్రి విజయపుర జిల్లా గొళసంగి సమీపంలోని వందాల గ్రామానికి చెందిన అభిషేక్(18) అనే పీయూసీ చదువుతున్న యువకుడు బైక్‌పై వెళుతుండగా టిప్పర్ ఢీకొనడంతో మృతి చెందాడు. దీంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రులతో పాటు మృతుడి తాత బసప్ప(74) అనే వృద్ధుడు మనవడి మృతదేహాన్ని చూసి చలించిపోయాడు. గుండె లోతుల్లో నుంచి ఉబికి వస్తోన్న బాధను తట్టుకోలేక పోయిన తాత చివరికి క్షణాల్లో గుండెపోటుకు గురయ్యాడు. అతనిని ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు మృతి చెందాడు. మరణంలో కూడా తాతా, మనవడి బంధం వీడలేదని కన్నీటిపర్యంతమవుతూ కుటుంబ సభ్యులు, బంధువులు ఇద్దరి అంత్యక్రియలను ఒకే చోట నిర్వహించారు.

## తుంగభద్ర నదిలో చేప పిల్లల విడుదల



చేప పిల్లలను విడుదల చేస్తున్న అధికారులు

కంప్లి: మత్స్యకారుల సౌకర్యార్థం బుధవారం తుంగభద్ర నదిలో మత్స్యశాఖ అధికారులు 3 లక్షల చేప పిల్లలను విడిచారు. అనంతరం బళ్లారి మత్స్యశాఖ అపర నిర్దేశకులు డీ.తిప్పేస్వామి మాట్లాడుతూ కంప్లి మత్స్యకారుల సహకార సంఘం కార్యాలయ నిర్మాణానికి కేఎంఆర్‌సీ గ్రాంట్ నుంచి రూ.45 లక్షలు అందించామన్నారు. తాలూకాలో 17 మంది మత్స్యకారులకు తలా రూ.10 వేల విలువ చేసే మత్స్యపరికరాలను అందించామన్నారు. కంప్లి, ఎమ్మిగనూరు భాగంలో వంద హెక్టార్లలో చేపల చెరువులు నిర్మించే లక్ష్యం ఉందన్నారు. ఇప్పటికే 50 హెక్టార్లలో చెరువులను నిర్మించారన్నారు. మత్స్యశాఖ ఉపనిర్దేశకులు ఎస్.బసవనగౌడ, సహకార సంఘం సహాయక డైరెక్టర్ జీఎస్.షడాక్షరి శివణ్ణ, మునిరాబాద్ చేపపిల్లల పాలన కేంద్రం డైరెక్టర్ కన్నభాగ్య, రియాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

## మానవాళి రక్షణకు రక్తాన్ని చిందించిన ఏసుక్రీస్తు



అభ్యర్థుల తరఫున ప్రార్థనలు చేస్తున్న రెవ.డా.జె. సామ్యేల్ కిరణ్ తదితరులు

గంగావతి రూరల్ : సమస్త మానవాళి రక్షణ కోసం సిలువ ఎక్కి రక్తాన్ని చిందించిన, పరిశుద్ధాత్మ కలిగిన దేవాది దేవుడు ఏసుక్రీస్తు అని ఆంధ్రప్రదేశ్ బైబిల్ మిషన్ అధ్యక్షులు గుంటూరు రెవ.డా: జె. సామ్యేల్ కిరణ్ పేర్కొన్నారు. ఆయన శ్రీరామనగర్ సమీపంలోని మరళిబసన్న క్యాంపులో వెలసిన బైబిల్ మిషన్ రెండో రోజు సభలను ఉద్దేశించి మాట్లాడారు. ఏసుక్రీస్తు ఆశీర్వాదంతో చెడు మార్గంలో ఉన్న వారు సన్మార్గంలోకి వస్తారన్నారు. ప్రభువు వాక్యంపై నమ్మకం ఉంచితే అది మిమ్ములను సనాతన సన్మార్గంలో నడిపిస్తుందన్నారు. పాప క్షమాపణ కలిగిన దేవుని రక్షణ అందరికీ లభిస్తుందన్నారు. అనంతరం కళ్యాణ రాష్ట్ర ప్రగతి పార్టీ కనకగిరి అభ్యర్థి డాక్టర్ చారుల్ దాసరి, సింధనూరు అభ్యర్థి మల్లికార్జున నెక్కంటిలను పాస్టర్లు ప్రార్థనలతో ఆశీర్వదించారు. ఆంధ్రప్రదేశ్ బైబిల్ మిషన్ సెక్రటరీ రాజమండ్రి రెవ.కె.ప్రశాంత్‌కుమార్, తెలంగాణ పాల్వంచ రెవ.డి మహిమాకర్షణ కుమార్, జాయింట్ సెక్రటరీ గుమ్మిలేరు రెవ.జి.ఆగమనరావు, గవర్నింగ్ బాడీ మెంబర్ ఆరుగొలను రెవ.ఎం.డేవిడ్ పాల్, పాస్టర్ విశ్వాస్, ఆనంద్‌రావు, గారపాటి రామకృష్ణరావు, బళ్లారి వెంకటరమణ, సుధాకర్, వందలాది మంది క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు.

## వేడుకగా జిల్లా కసాప సమ్మేళన ఊరేగింపు





కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బసవలింగ స్వామీజీ, ఊరేగింపులో పాల్గొన్న సాంస్కృతిక కళా బృందాలు

బళ్లారిఅర్బన్: నగరంలో రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన కన్నడ సాహిత్య సమ్మేళనంలో భాగంగా బుధవారం భువనేశ్వరి దేవి చిత్రపటంతో పాటు సమ్మేళన అధ్యక్షులు డాక్టర్.అరవింద్ పాటిల్‌ను ఊరేగించారు. బ్యాండు వాయిద్యాల, కళా బృందాలతో ఎస్ఎన్ పేట్ వెంకటేశ్వర దేవస్థానం వద్ద ఊరేగింపును ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. కూల్ కార్నర్, కోర్టు రోడ్డు మీదుగా రాయల్ సర్కిల్, బెంగళూరు రోడ్డు, కాళమ్మ సర్కిల్, వడ్డరబండ, కేసీ రోడ్డు మీదుగా రాఘవ కళామందిరానికి చేరుకుంది. కసాప జిల్లా అధ్యక్షులు నిష్టిరుద్రప్ప, మేయర్ రాజేశ్వరి, డాక్టర్ శివలింగప్ప, కొట్రప్ప, సిద్ధరామేశ్వరగౌడ, మీనక్షి చంద్రశేఖర్, ఎస్.పన్నారాజ్, బసవరాజ్ బిసిలహళ్లి, మల్లనగౌడ, లక్ష్మీపవన్‌కుమార్ పాల్గొన్నారు.

**బళ్లారిలో అఖిల భారత సమ్మేళనం జరపాలి**

గనుల ఖిల్లా సరిహద్దు ప్రాంతమైన బళ్లారి జిల్లాలో అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం జరుపుకోవాలని కొట్టూరు స్వామి మఠం బసవలింగస్వామి పేర్కొన్నారు. బుధవారం రాఘవ కళామందిరంలో ఏర్పాటు చేసిన 22వ అఖండ జిల్లా కన్నడ సాహిత్య సమ్మేళనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురిని ఘనంగా సన్మానించారు. డాక్టర్ జేఎం నాగయ్య, బుడా అధ్యక్షులు ఎస్.మారుతీ ప్రసాద్, మాజీ అధ్యక్షులు పాలన్న, వీరశేఖర్‌రెడ్డి, ప్రభుకుమార్, సిద్మల్ మంజునాథ్, రమేష్‌గౌడ పాటిల్, జేఎస్.బసవరాజ్‌స్వామి పాల్గొన్నారు.

## కోలారు వార్తలు...

### వైభవంగా కోటె యల్లమ్మ దేవి వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మాలూరు: ప్రతియేటా మాదిరిగా ఈ యేడాది కూడా లక్కూరులోని పురాతన కోటె యల్లమ్మ దేవి ఆలయంలో వార్షికోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూలతో అలంకరణ, పూజలను చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

### విపక్ష ఎమ్మెల్యేలపై సర్కార్ వివక్ష



రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రూపా శశిధర్

కేజీఎఫ్: రాష్ట్ర ప్రభుత్వం పాలక పక్ష ఎమ్మెల్యేలకు అధిక నిధులను విడుదల చేస్తూ విపక్ష ఎమ్మెల్యేలపై వివక్ష చూపుతోందని, నిధుల కోసం తాము ప్రభుత్వాన్ని వేడుకోవాల్సి వస్తోందని ఎమ్మెల్యే రూపా శశిధర్ ఆరోపించారు. బుధవారం బెమెల్ ఫ్యాక్టరీ వద్ద రూ.4.5 కోట్లతో జరుగుతున్న డబల్ రోడ్డు మరమ్మతు పనుల నాణ్యతను పరిశీలించి ఆమె మాట్లాడారు. బెమెల్ ఫ్యాక్టరీ గత 25 ఏళ్లుగా రూ.72 కోట్ల పన్ను బకాయి ఉన్న నేపథ్యంలో నగర అభివృద్ధి ఎలా సాధ్యమన్నారు. నగరసభ బకాయిలను చెల్లించాలని కలెక్టర్ లేఖ రాసినా, కోర్టు తీర్పు వెలువరించినా బెమెల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నగరసభ అధ్యక్షుడు వళ్లల్ మునిస్వామి, సభ్యుడు మాణిక్యం, సనా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### చేసే పనిలో కులాన్ని వెతకొద్దు

కోలారు : ఏ పని చేసినా కులాన్ని వెతకరాదని, ప్రభుత్వ పనిని దేవుడి పనిగా భావించాలని, అదే శరణ పరంపరకు మనం అందించే గౌరవమని ఆర్డీవో వెంకటలక్ష్మి తెలిపారు. బుధవారం రంగమందిరంలో ఏర్పాటు చేసిన కాయక శరణ జయంతిలో ఆమె మాట్లాడారు. శరణుల ఆదర్శాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కన్నడ, సంస్కృతి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, టి విజయ కుమార్, పండిత్ మునివెంకటప్ప, చంద్రశేఖర్, రాజప్ప తదితరులు పాల్గొన్నారు.

## పనివేళల పెంపును ఖండిస్తూ ధర్నా



గంగావతిలోని బస్టాండ్ సర్కిల్‌లో ధర్నా చేస్తున్న కార్మికులు , సీఐటీయూ కార్యకర్తలు

కోలారు : ప్రభుత్వం కార్మికుల పనివేళలు పెంచడాన్ని ఖండిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం మెక్కె సర్కిల్ వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు నారాయణస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో ఫ్యాక్టరీల చట్టం–1938కి సవరణ తెచ్చి కార్మికుల పని వేళలను 9 గంటల నుంచి 12 గంటలకు పెంచారన్నారు. మహిళలతో రాత్రి సమయాల్లో కూడా పని చేయించుకోవడానికి అవకాశం కల్పించారని ఆరోపించారు. పని వేళలను 12 గంటలకు పెంచడం ద్వారా కార్మికులను వివక్షకు గురి చేస్తున్నారన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి శ్రీనివాస్ మాట్లాడుతూ పెంచిన పనివేళలను వెంటనే తగ్గించాలని లేని పక్షంలో ఆందోళన తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయకృష్ణ, కార్మిక నాయకులు ఎ ఆర్ బాబు, అప్పయ్యణ్ణ, హనుమంతరావ్, హెచ్ బి కృష్ణప్ప. కేశవరావ్, నారాయణప్ప పాల్గొన్నారు.

**పని గంటలను పెంచడంపై నిరసన**

గంగావతి: కార్మికుల పనిగంటలను పెంచి అన్యాయం చేయడాన్ని నిరసిస్తూ బస్టాండ్ సర్కిల్ సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేత నిరుపాది మాట్లాడుతూ సీఎం బసవరాజ్ బొమ్మై సర్కారు రోజు 8 గంటల నుంచి 12 గంటల వరకు పనిగంటలను పెంచడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. దీనిని వెంటనే ప్రభుత్వం వాపసు తీసుకోవాలని, లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### యూనిఫాం పంపిణీ

శ్రీనివాసపురం: ముళబాగిలు పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సభాంగణంలో బుధవారం 300 మంది విద్యార్థులకు దాత ఎస్ఆర్ ధర్మేష్ ఉచితంగా యూనిఫాం పంపిణీ చేశారు. నగరసభ అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, బీఈఓ గంగరామయ్య, హెచ్ఎం సొణ్ణప్ప, ఉపాధ్యాయిని పద్మావతి, రైతు సంఘం నాయకుడు బంగారి మంజు, రోటరి సంస్థ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

### పునీత్ మాలధారణ షురూ



మాలధారణ చేసిన పునీత్ అభిమానులు

హొసపేటె: పునీత్ సర్కిల్‌లో అభిమానులు పునీత్ మాలాధారణ దీక్షను ప్రారంభించారు. బుధవారం అభిమానులు కాషాయ వస్త్రాలను ధరించి మాలధారులతో కలిసి పునీత్ విగ్రహానికి పూలమాలలు వేశారు. పునీత్ చిత్రపటాలను చేత పట్టుకొని పూజలు జరిపించారు. ఈ నెల 17న పునీత్ జన్మదినం సందర్భంగా మాలధారులు దీక్ష చేపట్టారు. 18న బెంగళూరులోని పునీత్ సమాధి వద్దకు చేరుకొని దీక్షను విరమిస్తున్నట్లు అభిమాని జోగితాయప్ప తెలిపారు.

### మేనిఫెస్టో ప్రతుల అందజేత

గంగావతి రూరల్: నగరంలోని 1వ వార్డు పంపానగరంలో పాండురంగ దేవస్థానం దర్శనం అనంతరం ఇంటింటికీ జేడీఎస్ పంచరత్న యోజన మేనిఫెస్టో విడుదల కార్యక్రమాన్ని తాలూకా అధ్యక్షులు శేఖ్ నబీ సాబ్ ప్రారంభించారు. నగరంలో ఇంటింటికీ జేడీఎస్ పంచరత్న యోజన కరపత్రాలను ఓటర్లకు అందిస్తూ గతంలో వారు చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ ప్రచారం ప్రారంభించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జేడీఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా జేడీఎస్ ఉపాధ్యక్షులు రుద్రగౌడ, తాలూకా ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, గ్రామీణ ఎస్సీ, ఎస్టీ సెల్ కృష్ణప్ప, మహ్మద్ యూసుఫ్, చంద్రశేఖర్, తాజుద్దీన్, అన్వర్ తారీక్ పాటిల్, బాషా మస్కి, నసీర్, దస్తగిరి, అణ్ణప్ప పాల్గొన్నారు.

### ధార్మిక ఆచరణలు అవసరం

శ్రీనివాసపురం : ధార్మిక ఆచరణల శాస్త్రీయ నేపథ్యాన్ని అందరూ తెలుసుకోవాలని ధార్మికవేత్త వెల్లాల సత్యనారాయణశాస్త్రి తెలిపారు. బుధవారం తాలూకాలోని రాయల్పాడు గ్రామంలోని గంగమ్మ ఆలయం ముందు ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ చేపట్టిన సామూహిక అష్టలక్ష్మీ పూజలో పాల్గొని ఆయన మాట్లాడారు. అష్టలక్ష్మీ ఆరాధన మనకు శాంతి, సమృద్ధి, జ్ఞాన, ధైర్య, శక్తి, యశస్సును అందిస్తుందన్నారు. వేద పండితుడు డీఆర్ మంజునాథ్ శాస్త్రి, రమేష్, సుమంత్, సంస్థ యోజనాధికారి ఎస్ సురేష్‌గౌడ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మీటర్ లేకపోతే ఆటో సీజ్



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ

**శివమొగ్గ:** శివమొగ్గ నగరంలో సంచరించే ఆటోలకు మీటర్లు లేకపోతే సీజ్ చేస్తామని ట్రాఫిక్ సీఐ జయశ్రీ ఎస్.మానె హెచ్చరించారు. నగరంలోని పశ్చిమ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ఆటో డ్రైవర్ల సంఘం పదాధికారులతో జయశ్రీ బుధవారం సమావేశమై పలు సూచనలు చేశారు. ఆటో డ్రైవర్లు తమ ఆటోలకు మీటర్ అమర్చుకోవాలన్నారు. ప్రయాణికుల నుంచి నిర్ణీత నగదు కంటే అధికంగా వసూలు చేయరాదని హెచ్చరించారు.

### బైక్ సీటు కింద పాము

**శివమొగ్గ:** బైక్ సీటు కింద ఒక పామును గుర్తించారు. శివమొగ్గ అశోక నగర డీఏఆర్ క్వార్టర్స్‌లో అనిల్‌కుమార్ ఇంటి ముందు నిలిపి ఉంచిన ద్విచక్రవాహనం సీటు కింద చిన్న పాము కనిపించింది. ఎంత ప్రయత్నించినా అది బైక్ నుంచి బయటకురాలేదు. దీంతో వెంటనే స్నేక్ కిరణ్‌కు సమాచారం అందించారు. అక్కడికి వచ్చిన కిరణ్ సురక్షితంగా ఆ పామును పట్టుకుని దూరంగా వదిలేశాడు.

### సిమ్ కార్డు విరగ్గొట్టాడని హత్య

**దొడ్డబళ్లాపురం:** సిమ్ కార్డు విరగ్గొట్టాడనే కోపంతో ఒక వ్యక్తి తన బంధువును హత మార్చాడు. ఈ ఘటన కలబుర్గి జిల్లా కమలాపుర తాలూకా కాళమందర్గి గ్రామంలో చోటుచేసుకుంది. భరత్ సుభాష్ తన బంధువు మల్లికార్జున్‌కు చెందిన మొబైల్ తీసుకుని సిమ్‌కార్డు తీసి విరగ్గొట్టాడు. కోపోద్రిక్తుడైన మల్లికార్జున్ రాతితో సుభాష్ తలపై బాది హత్య చేశాడు. ఈ సమయంలో ఇద్దరూ మద్యం తాగి ఉన్నారని పోలీసులు తెలిపారు.కేసు దర్యాప్తులో ఉంది.

### బాయిలర్ పేలి ముగ్గురికి గాయాలు

**బనశంకరి:** బాయిలర్ పేలి ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు..ఆనేకల్ తాలూకా బొమ్మసంద్రలో బాల్‌ఫార్మా కంపెనీలో బుధవారం ప్రమాదవశాత్తూ పెద్ద శబ్దంతో బాయిలర్ పేలింది. విధుల్లో ఉన్న కార్మికులపై రసాయనాలు, ద్రావకాలు పడ్డాయి. ప్రదీప్, మురగన్, కిరణ్ అనే కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను విక్టోరియా ఆసుపత్రికి తరలించారు. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

### కానిస్టేబుల్ సస్పెండ్

**దొడ్డబళ్లాపురం:** సహోద్యోగులపై ఫిర్యాదు చేసేలా ప్రోత్సహించారనే ఆరోపణలపై ఒక కానిస్టేబుల్ సస్పెండ్ అయ్యాడు. వివరాలు... చోరీ ఆరోపణకు సంబంధించి ఆటో డ్రైవర్‌పై చిక్కమగళూరు జిల్లా మూడిగెరె పోలీస్‌స్టేషన్ కానిస్టేబుళ్లు లోహిత్, వసంత్‌లు దాడి చేశారు. దీంతో ఆ ఇద్దరినీ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఇదిలా ఉండగా సస్పెండ్ అయిన కానిస్టేబుళ్లపై ఫిర్యాదు చేసి డబ్బు తీసుకోవాలని స్థానికులపై మంజునాథ్ అనే కానిస్టేబుల్ ఒత్తిడి తెచ్చాడు. ఈ విషయాన్ని ఎస్పీ ఉమాప్రశాంత్ సీరియస్‌గా తీసుకొని మంజునాథ్‌ను సస్పెండ్ చేశారు.

### 10న సామూహిక వివాహాలు



పెళ్లి దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి

**బాగేపల్లి:** 22 ఏళ్లుగా తాను చేస్తున్న సమాజ సేవ ఎంతో తృప్తినిచ్చిందని ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి తెలిపారు. ఏటా తరహాలోనే ఈ ఏడాది కూడా ఈనెల 10న శ్రీ లక్ష్మి వేంకటరమణ స్వామి దేవాలయంలో 21 జంటలకు సామూహిక వివాహాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాబోయే వధూవరులకు బుధవారం ఆయన తన ఇంటిలో పెళ్లి దుస్తులతో పాటు రూ. 10 వేల నగదును ఎమ్మెల్యే సుబ్బారెడ్డి పంపిణీ చేశారు. సామూహిక వివాహాల్లో తన కుమారుడు పెళ్లి కూడా జరుగుతుందన్నారు.

### రెండు వర్గాల ఘర్షణ

**దొడ్డబళ్లాపురం:** బాగల్‌కోటలో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుని నలుగురు మహిళలు, నలుగురు యువకులు గాయపడ్డారు. బసవరాజు, హనుమంతు, వీరి స్నేహితులు డప్పు కొడుతుండగా మరో వర్గానికి చెందిన వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో వాగ్వాదం, తోపులాట జరిగి ఘర్షణకు దారి తీసింది. పోలీసులు క్షతగాత్రులను జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

### వృద్ధురాలి అనుమానాస్పద మృతి

**చింతామణి:** అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. బట్లపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని కాపల్లి గ్రామంలో చౌడమ్మ(65) అనే వృద్ధురాలు నివాసం ఉంటోంది. ఈమెకు భర్త చనిపోయాడు. సంతానంలేదు. ఇటీవల మానసికంగా దెబ్బతింది. ఈక్రమంలో చౌడమ్మ తన ఇంటిలో ఉరివేసుకున్న స్థితిలో మృతి చెందింది. ఆమె మృతిపై అనుమానం ఉందని బంధువు రెడ్డప్ప ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

# సమస్యలు తీర్చాలి..పన్నులు తగ్గాలి!

- రాజధాని నగర బడ్జెట్ నేడే
- కొత్త పథకాలపై ఆశాభావం



ట్రాఫిక్, చెత్త, కాలుష్యం, రవాణా అన్నింటా నగరవాసులకు ఇబ్బందులే





కొత్త బడ్జెట్‌పై నగరవాసుల ఆశలు తీర్చేనా?

**బనశంకరి:** పేరుకు గార్డెన్ సిటీ, కానీ సమస్యలు అనేకం. గుంతలు తేలిన రహదారులు, విపరీతమైన ట్రాఫిక్ సమస్య, ఎక్కడపడితే అక్కడ చెత్త, పేదలు, బడుగులకు ఇబ్బందులు అనేకం. ఓ మోస్తరు వర్షం వస్తే లేఔట్లే జలమయం, వేలాది ఇళ్లలోకి నీరు... ఇలా ఉంది సిలికాన్ సిటీ ముఖచిత్రం. ఈ పరిస్థితుల్లో బెంగళూరు పాలికె (బీబీఎంపీ) 2023–24 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌ను గురువారం ప్రకటించనుంది. పై సమస్యలకుఎంతమాత్రం పరిష్కారం చూపుతారో తేలిపోనుంది. ఉదయం 11.30 గంటలకు నగరంలోని టౌన్‌హాల్‌లో బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్, బీబీఎంపీ ఆర్థిక విభాగం కమిషనర్ జయరామ్ రాయపుర ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్ కార్యక్రమాన్ని పాలికె వెబ్‌సైట్, బీబీఎంపీ కమిషనర్ ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్ లింక్ ద్వారా లైవ్‌లో వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు.

**కొత్తవి ఏమేం ఉంటాయి?**

ఈసారి బీబీఎంపీ బడ్జెట్‌లో వృద్ధులకు ఆశ్రయం కల్పించే శ్రవణ వసతి యోజన, ఉద్యోగ మహిళలకు వసతి కల్పించడానికి సావిత్రిబాయి పూలే పేర్లతో పథకం అమలు చేసే అవకాశం ఉంది. ఇందిరా క్యాంటీన్లను కొనసాగిస్తారా, లేదా అనేది తేలిపోనుంది. విద్య, ఆరోగ్యం, సంక్షేమ కార్యక్రమాలపై బడ్జెట్‌కు ప్రాధాన్యత ఇవ్వవచ్చు. ఆస్తిపన్ను తగ్గే అవకాశం ఉంది. నగరంలోని 243 వార్డులనుంచి భూగర్భ డ్రైనేజీ, ఫుట్‌పాత్, రోడ్లు, వీధి దీపాల ఏర్పాటుతో పాటు వివిధ సమస్యలపై 16,261 సలహాలు అందాయి.

**రూ. 10 వేల కోట్ల పద్దు**

బడ్జెట్ పద్దు రూ.10 వేల కోట్ల దాకా ఉండవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం 2023–24 బడ్జెట్‌లో బీబీఎంపీకి సుమారు రూ.6 వేల కోట్ల నిధులను కేటాయించింది. ఈ నిధులతో పాటు బీబీఎంపీకి లభించే ఆదాయ వనరులు ఉన్నాయి. బీబీఎంపీ చట్టం ప్రకారం మార్చి మొదటివారంలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలి. మూడువారాల్లో ప్రభుత్వం ఆమోదిస్తే ఏప్రిల్ 1 నుంచి కొత్త పథకాలను అమల్లోకి తీసుకురావాలి. గత ఏడాది బడ్జెట్ రూపకల్పనలో అధికారుల గందరగోళం వల్ల చివరిరోజైన మార్చి 31 అర్ధరాత్రి వికాససౌధలో హడావుడిగా బడ్జెట్‌ను ప్రకటించడం విమర్శల పాలైంది.

**అధికారుల ద్వారా మూడోసారి**

కార్పొరేటర్ల పదవీకాలం 2020 సెప్టెంబరుతో పూర్తయింది, అప్పటినుంచి రాష్ట్ర ప్రభుత్వం పాలికె ఎన్నికలను జరపకపోవడంతో ప్రత్యేక అధికారులే పరిపాలన సాగిస్తున్నారు. ప్రజాప్రతినిధులు లేకుండా 2021 నుంచి బడ్జెట్‌ను అధికారులే ప్రవేశపెడుతున్నారు.

### కంచెలో చిక్కుకుని చిరుత మృతి

**మైసూరు:** కంచెకు చిక్కుకుని మూడేళ్ల ఆడ చిరుత మరణించింది. ఈ ఘటన మైసూరు జిల్లా నంజనగూడు తాలూకా కగ్గలిహుండి గ్రామంలో జరిగింది. చంద్రశేఖర్ అనే వ్యక్తి తన చెరకు పంటను అటవీ ప్రాణుల నుంచి రక్షించుకునేందుకు బ్రేకు వైర్లతో కూడిన తీగను కంచెగా వేశాడు. తోటలోకి ప్రవేశించేందుకు ఆడ చిరుత ప్రయత్నించి ఆ కంచెలో చిక్కుకుపోయింది. బయటకు వచ్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేసి చివరికి ప్రాణాలు విడిచింది. నంజనగూడు జోన్ అటవీ అధికారి కిరణ్ కుమార్, సిబ్బంది వెళ్లి చిరుత కళేబరాన్ని స్వాధీనం చేసుకున్నారు. పొలం యజమానిపై కేసు నమోదు చేశారు.

### నగల మెరుగు పేరుతో వంచన

- ముగ్గురి అరెస్ట్

**మైసూరు:** నగల మెరుగు పేరుతో వంచనకు పాల్పడుతున్న రాజకుమార్ (29), ప్రవీణ్ కుమార్ (32), లలన్ కుమార్ (26) అనే నిందితులను కొడగు పోలీసులు అరెస్టు చేశారు. బంగారు, పాలిష్ చేసేందుకు వినియోగిస్తున్న సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కొడగు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి బంగారు ఆభరణాలను పాలిష్ చేస్తామని చెప్పి సామగ్రి, యాసిడ్‌ను ఉపయోగించి కొంచెం బంగారాన్ని కరిగించి మోసం చేశారు. దీనిపై కుశాల నగర గ్రామీణ పోలీసుస్టేషన్ పరిధిలో కేసు నమోదైంది. హెబ్బాలె గ్రామంలో నిందితులను అరెస్ట్ చేశారు.

### మైసూరు-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే 12న ప్రారంభం

**మైసూరు:** మైసూరు–బెంగళూరు పది లైన్ల రోడ్డును ఈనెల12న ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించనున్నారని ఎంపీ ప్రతాప్ సింహ తెలిపారు. మైసూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ మండ్య వద్ద గెజ్జలగెరె హైవేపై ప్రధాని చాపర్ ల్యాండ్ అవుతుందని చెప్పారు. అనంతరం పక్కనే బహిరంగ సమావేశంలో 11 గంటలకు మోదీ పాల్గొంటారన్నారు. హైవే సర్వీసు రోడ్డు నిర్మాణం విషయంపై ఎంపీ స్పందిస్తూ.. ఈ సర్వీసు రోడ్డు గురించి కొందరు హైకోర్టును ఆశ్రయించగా స్టే విధించిందన్నారు. కోర్టు స్టే ఎత్తివేస్తే సర్వీసురోడ్డు నిర్మాణం చేస్తామన్నారు.

### బస్సులో నగలు చోరీ

**గుత్తి:** కర్ణాటక బస్సులో దేవి అనే మహిళకు చెందిన 30 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన దేవి, ఫక్కీరప్ప దంపతులు గుంతకల్లులో జరిగిన బంధువుల పెళ్లికి వెళ్లారు. పెళ్లి ముగిశాక డోన్‌కు వెళ్లేందుకు గుంతకల్లులో కర్ణాటక ఆర్టీసీ బస్సు ఎక్కారు. గుత్తి ఆర్టీసీ బస్టాండ్‌లో దేవి తన పర్సును చెక్ చేసుకుంది. రెండు బంగారు ఉంగరాలు, బంగారు చెంప చారు కనిపించలేదని వాపోయింది.

# నేటి నుంచి ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు



అంకురార్పణంలో కొలువు దీరిన శ్రీవారు(ఫైల్)



బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తుల కోసం స్వాగత తోరణం

- అంకురార్పణ చేయనున్న అర్చకులు

**కదిరి:** ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు గురువారం(2వ తేదీన)ఆలయ ప్రాంగణంలో అంకురార్పణ చేయనున్నారు. బ్రహ్మోత్సవాల్లో అంకురార్పణ ఘట్టానికి విశేష ప్రాధాన్యముంది. బ్రహ్మోత్సవాలు విజయవంతం కావాలని సంకల్పించడంతో పాటు స్వామివారి ఆశీస్సులు కోరుతూ సూర్యుడు అస్తమించిన తర్వాత అంకురార్పణ చేస్తారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో నిర్వహించే ఈ కార్యక్రమంలో అగ్నిహోమం ద్వారా బ్రహ్మ, గరుడ, శేష, సుదర్శన, వక్రతుండ, సోమ, శంత, ఇంద్ర, ఇసాన, జయ అనే సకల దేవతలను ఆహ్వానిస్తారు.

### నవధాన్యాలతో మొలక

సకల దేవతల ఆహ్వానం అనంతరం భూమాతను ప్రార్థిస్తూ పాలిక(కొత్తకుండ)లను మట్టితో నింపుతారు. చంద్రున్ని ప్రార్థిస్తూ అర్చక బృందం అందులో నీరు పోసి నవ ధాన్యాలు చల్లుతారు. ఈ పాలికలకు నూతన వస్త్రాన్ని అలంకరించి పుణ్యాహవచనం చేస్తారు. అనంతరం అర్చకులు సోమరాజ మంత్రం, వరుణ మంత్రం, విష్ణుసూక్తం పఠిస్తారు. బ్రహ్మోత్సవాల్లో అర్చక పండితులు రోజూ ఈ పాలికల్లో కొద్దిగా నీరు పోసి నారు పెరిగేలా చూస్తారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు స్వాగతం పలికేందుకు పట్టణం నలుమూలలా స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు.

# రోగుల కష్టాలు వర్ణనాతీతం





తుమకూరులో మూతపడిన ఆస్పత్రిలోని ఓపీ కౌంటర్, చిక్కలో డాక్టర్లు లేక వెనుతిరుగుతున్న రోగులు

**తుమకూరు:** ఏడో వేతన సంఘం, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్‌తో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పిలుపునిచ్చిన బంద్ తుమకూరు జిల్లాలో విజయవంతమైంది. అత్యవసర సేవలు మినహాయించి అన్ని ప్రభుత్వ కార్యాలయాలు బుధవారం మధ్యాహ్నం వరకు పూర్తిగా బంద్ అయ్యాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళనల్లో పాల్గొన్నారు. చికిత్స లభించక గ్రామాలనుంచి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 17 శాతం మేర వేతనాల పెంపునకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో మధ్యాహ్నం నుంచి కార్యాలయాలు తెరుచుకున్నాయి.

**చిక్కబళ్లాపురం:** ప్రభుత్వ ఉద్యోగుల సమ్మెలో భాగంగా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది అత్యవసర సేవలు మినహా మిగతా అన్ని సేవలను బహిష్కరించారు. ఓపీ బంద్ కావడంతో గ్రామీణ ప్రాంతాలనుంచి వచ్చిన రోగులు నిరాశతో వెనుదిరిగారు.

**శిడ్లఘట్ట:** గోడిన మార్కెట్, ప్రభుత్వ ఆస్పత్రి అత్యవసర విభాగం మినహాయించి తాలూకాలోని అన్ని కార్యాలయాల ఉద్యోగులు విధులకు గైర్హాజరయ్యారు. సంఘం తాలూకా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, పదాధికారులు పాల్గొన్నారు.

**మండ్య:** కలెక్టరేట్, జిల్లా పంచాయతీ, తాలూకా కార్యాలయం తదితర అన్ని ఆఫీసుల తలుపులు మూసేశారు. అత్యవసర సేవలు మినహాయించి మిగిలిన అన్ని సేవలను మండ్య జిల్లాల్లో నిలిపేశారు. ఉద్యోగులు ఎవరూ విధులకు హాజరు కాలేదు. పదాధికారులు బైక్ ర్యాలీ నిర్వహించారు. మిమ్స్‌లో ఓపీ విభాగం యథావిధిగా పని చేసింది.

**బనశంకరి:** ప్రభుత్వ ఉద్యోగుల సమ్మెకు మద్దతు నిస్తూ బీబీఎంపీ అధికారులు, ఉద్యోగుల క్షేమాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో 17 వేలమందికి పైగా ఉద్యోగులు విధులను బహిష్కరించారు. అధ్యక్షుడు అమృతరాజ్ మాట్లాడుతూ ఉద్యోగులు కరోనా సమయంలో ప్రాణాలు పణంగా పెట్టి విధులు నిర్వహించరారని, వారి డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని అన్నారు.



మండ్యలో ఉద్యోగుల ర్యాలీ

### మళ్లీ అధికారంలోకి వస్తాం

**శిడ్లఘట్ట:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి పనులు, పథకాలు వచే ఎన్నికల్లో కూడా బీజేపీని మళ్లీ అధికారంలోకి వస్తాయని శిడ్లఘట్ట ఇంచార్జి డాక్టర్ మంజునాథ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు చిక్కదాసరహళ్లి శ్రీ లక్ష్మి విద్యా సంస్థ ఆవరణలో బుధవారం ఆయన ప్రగతి రథాన్ని ప్రారంభించి మాట్లాడారు.

## హోసూరు వార్తలు..

### సీఎం జన్మదిన వేడుకలు



బేళగొండపల్లిలో కేక్ కటింగ్

**కెలమంగలం:** తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ 70వ జన్మదిన సందర్భంగా బుధవారం క్రిష్ణగిరి జిల్లా వ్యాప్తంగా డీఎంకే నాయకులు సంబరాలు జరుపుకొన్నారు. డెంకణీకోట తాలూకా బేళగొండపల్లి గ్రామంలో తళి యూనియన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన కేక్ కత్తిరించి అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనియన్ అధ్యక్షులు చంద్రప్ప ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

### వేర్వేరుగా ఇద్దరు మిస్సింగ్

**హోసూరు:** హోసూరు, తళి ప్రాంతాల్లో వేర్వేరుగా ఇద్దరు అదృశ్యమయ్యారు. డెంకణీకోట తాలూకా తళి సమీపంలోని తళికొత్తనూరు గ్రామానికి చెందిన శశికళ (19) అనే యువతి గత రెండురోజుల క్రితం సారండపల్లికి వెళ్లి కనిపించకుండాపోయింది. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో గాలించినా జాడ తెలియకపోవడంతో తల్లి తళి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే మత్తిగిరి ప్రాంతానికి చెందిన కూలికార్మికుడు రమేష్, మంగళవారం ఉదయం సొంతపనిపై హోసూరు బస్టాండుకెళ్లి మళ్లీ ఇంటికి రాలేదు. అతని కొడుకు కిరణ్ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

### ఆరోగ్య బీమా కార్డుల పంపిణీ



**హోసూరు:** హోసూరు సమీపంలోని పేరండపల్లి పంచాయతీలో ముఖ్యమంత్రి ఆరోగ్యబీమా కార్డుల వితరణ కార్యక్రమం బుధవారం జరిగింది. పంచాయతీ అధ్యక్షురాలు మంజుల క్రిష్ణప్ప బలహీన వర్గాల కుటుంబాలకు బీమా కార్డులను అందజేశారు. లబ్ధిదారులు బీమా కార్డులను సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖాధికార్లు, పంచాయతీ ఉపాధ్యక్షులు నంజప్ప, ప్రజాప్రతినిధులు తేన్‌మొళి, మహమ్మద్‌అలీ, సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### వ్యవసాయ పథకాల తనిఖీ

**హోసూరు:** క్రిష్ణగిరి జిల్లా ఊత్తంగేరి సమితిలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ ద్వారా జరుగుతున్న పథక పనులను జిల్లా కలెక్టర్ దీపక్ జేకబ్ పరిశీలించారు. 70 శాతం రాయితీతో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్‌లను పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందజేస్తున్న పథకాలు, రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# తులకన్ చెరువును తెంచేశారు



పరిశీలిస్తున్న అధికారులు



ఆయకట్టు భాగంలో రైతులు సాగు చేస్తున్న పంటలు

- నీరు మొత్తం ఖాళీ
- కాంట్రాక్టర్ల తొందరపాటు
- రైతులు లబోదిబో

**కెలమంగలం:** గత 20 ఏళ్లుగా రైతులు పంట సాగు కోసం ఎదురుచూస్తూ వచ్చారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాల కారణంగా చెరువు నిండడంతో ఉత్సాహంగా రైతులు వేసవి పంటలు సాగు చేపట్టారు. కానీ కాంట్రాక్టర్లు రైతులను నిలువునా ముంచేశారు. ఈ ఘటన డెంకణీకోట పట్టణ పంచాయతీ పరిధిలో చోటు చేసుకొంది. డెంకణీకోట పట్టణ పంచాయతీ పరిధిలోని లక్కసంద్రం వద్ద ఉన్న తులకన్ చెరువు గత 20 ఏళ్లుగా వర్షాలు లేకపోవడంతో ఎండిపోయింది. గత ఏడు కురిసిన భారీ వర్షాలకు చెరువు నిండడంతో ఆయకట్టు రైతులు ఉత్సాహంతో ఈ ఏడాది పంటలు పండించుకోవచ్చునని రైతులు వ్యవసాయపనుల్లో నిమగ్నమయ్యారు. ఈ సమయంలో చెరువును క్లీన్ చేసేందుకు టెండర్ తీసుకున్నామని కొందరు కాంట్రాక్టర్లు వచ్చి జేసీబీ యంత్రంతో చెరువు కట్టను బద్దలగొట్టి నిలువ ఉన్న నీటిని బయటకు మళ్లించారు.

**రెండోసారి వచ్చి గండి**

గమనించిన స్థానిక రైతులు అడ్డుకోవడంతో కాంట్రాక్టర్లు అక్కడి నుంచి వెళ్లిపోయారు. మళ్లీ జనసంచారం లేని సమయంలో ఘటనా స్థలానికి చేరుకొని చెరువు కట్టను బద్దలుగొట్టి ఉన్న నీటిని పూర్తిగా బయటకు వదిలారు. విషయం గమనించిన రైతులు సంబంధిత శాఖాధికార్లకు, డెంకణీకోట తహసీల్దార్‌కు సమాచారం అందజేశారు. స్పందించిన తహసీల్దార్ సంబంధిత శాఖాధికార్లతో కలిసి ఘటనా స్థలానికెళ్లి పరిశీలించారు. చెరువులో ఉన్న నీటిపై ఆధారపడి వేసవి పంటలు పండిస్తున్నామని, ఉన్నఫళంగా నీటిని బయటకు పంపడంతో బోరుబావుల్లో నీరు ఇంకిపోవడంతో పాటు రైతులు తీవ్రంగా నష్టపోతామని, చెరువుకు నీటిని నింపాలని తహసీల్దార్‌ను కోరారు.

# పశువులకు గాలికుంటు టీకాలు

**హోసూరు:** క్రిష్ణగిరి జిల్లా బర్గూరు సమితిలోని చిన్న మట్టారపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ ద్వారా గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ దీపక్ జేకబ్ ప్రారంభించారు. 21 రోజుల పాటు క్రిష్ణగిరి జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో పశువైద్య కేంద్రాల ద్వారా ఏర్పాటు చేసే ఈ శిబిరంలో పశుపోషకులు వ్యాధి నివారణ టీకాలను వేయించుకోవాలని సూచించారు. పశువైద్య శాఖాధికార్లు రాజేంద్రన్, మరియసుందరం, అరుణ్ రాజ్, మురుగన్, రాజ పాల్గొన్నారు.

**పాఠశాలకు వాటర్ ఫిల్టర్ అందజేత**

హోసూరు పట్టణంలోని కామరాజ్‌కాలనీలో దివ్యాంగుల పాఠశాలలో 40 మంది విద్యార్థులు చదువుతున్నారు. పిల్లలకు సురక్షిత మంచి నీరు అందేలా జేసీఐ స్వచ్ఛంద స్థ ద్వారా తాగునీటి శుద్ధీకరణ యంత్రాన్ని బుధవారం అందజేశారు. సంస్థ అధ్యక్షులు రాజేష్ సుబ్రమణి, క్రిష్ణన్, సుదర్శన్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రవాణా ఉద్యోగుల నిరాహారదీక్ష

**శివాజీనగర:** సమ్మె సమయంలో సస్పెండ్ అయిన కేఎస్ ఆర్టీసీ, బీఎంటీసీ, కల్యాణ కర్ణాటక, ఎన్ డబ్ల్యూకే ఆర్టీసీ ఉద్యోగులను తిరిగి విధుల్లో చేర్చుకోవాలని, బదిలీ, ఇతర శిక్షలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగుల సమాన మనస్సుల వేదిక ఉద్యమించింది. ఈమేరకు వేదిక నాయకులు బుధవారం ఫ్రీడం పార్క్‌లో నిరవధిక దీక్షలు చేపట్టారు. రాష్ట్ర రోడ్డు రవాణా ఉద్యోగుల సమాఖ్య కార్యాధ్యక్షుడు విశ్వనాథ్ సీడీ మాట్లాడుతూ న్యాయసమ్మత ఉద్యోగుల డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలన్నారు.

### మిస్సింగ్ అయిన వ్యక్తి మృతి

**బనశంకరి:** జగ్జీవన్‌రామ్‌నగర పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రైనేజీలో మధుసూదన్ (33) అనే వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైంది. మార్కండేశ్వరనగర నివాసి మధుసూదన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. 9 రోజుల నుంచి అతడు కనిపించలేదు. కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించారు. భర్త అదృశ్యం గురించి భార్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే సమయంలో డ్రైనేజీలో మృతదేహం లభ్యమైంది. పోలీసులు మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నివేదిక అందిన అనంతరం మృతికి గల కారణాలు వెల్లడవుతాయన్నారు.

### అధ్వాన పాలనకు కాంగ్రెస్ కూడా కారణమే

**దొడ్డబళ్లాపురం:** రాష్ట్రంలో అధ్వాన పాలనకు బీజేపీతోపాటు కాంగ్రెస్ కూడా కారణమని మాజీ సీఎం కుమారస్వామి అన్నారు. బుధవారం ఆయన చిక్కమగళూరులో మీడియాతో మాట్లాడారు. తాను సీఎంగా ఉన్న సమయంలో తాజ్ వెస్ట్ ఎండ్ హోటల్‌లో ఎక్కువ కాలం గడిపానని ఆరోపిస్తున్నారని, అయితే తాను ప్రజలతో రోజుకు కనీసం 15 సమావేశాలు నిర్వహించినట్లు గుర్తు చేశారు. సిద్ధరామయ్య మధ్యాహ్నం ఒంటిగంట వరకూ మాత్రమే కార్యాలయంలో ఉండేవారన్నారు.

### సీసీ రోడ్ల పనులకు భూమిపూజ

**శిడ్లఘట్ట:** తాగునీరు, రోడ్లు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించినప్పుడే పల్లెల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే వి.మునియప్ప అన్నారు. దేవరమళ్లూరు, వై.హుణసేనహళ్లి గ్రామ పంచాయతీ పరిధిలో రూ.4 కోట్లతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు, బూదాళ, వీరాపుర గ్రామాల్లో రూ. కోటితో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. బీజేపీ ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగడం లేదని విమర్శించారు.

### బేకరి అద్దాలు బద్దలు కొట్టి హల్‌చల్

**బనశంకరి:** పెట్రోల్‌కు డబ్బు ఇవ్వలేదని ఓ వ్యక్తి ఓ బేకరిపై దాడికి పాల్పడిన ఘటన అన్నపూర్ణేశ్వరినగర పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. మాళగాళ వద్ద రఘునాథ్‌శెట్టి అనే వ్యక్తి బేకరి నిర్వహిస్తున్నారు. ప్రకాష్ అనే వ్యక్తి నిత్యం అక్కడే బ్రెడ్, స్వీట్లు కొనేవాడు. మంగళవారం బేకరి వద్దకు వెళ్లి పెట్రోల్‌కు డబ్బు కావాలని అడిగాడు. లేదని రఘునాథ్‌శెట్టి పేర్కొనగా అక్కడినుంచి వెళ్లిపోయాడు. తిరిగి అర్ధరాత్రి రఘునాథ్‌శెట్టి ఇంటివద్దకు ప్రకాష్ కత్తి తీసుకొని వెళ్లి గొడవపడ్డాడు. పోలీసులు వచ్చి ప్రకాష్‌ను మందలించి పంపించారు. బుధవారం ఉదయం బేకరీ వద్దకు వెళ్లిన ప్రకాష్ డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అనంతరం అద్దాలు బద్దలు కొట్టాడు. ఘటనపై రఘునాథ్‌శెట్టి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### కార్మికుల పనివేళలను కుదించాలి



ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు, నాయకులు

**మైసూరు:** కార్మికుల పని వేళలను 8 గంటలకు కుదించాలని డిమాండ్ చేస్తూ మైసూరు జిల్లా సమితి సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ నాయకులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా కార్మికుల పనివేళలను 8నుంచి అదనంగా మూడు గంటలు పెంచారన్నారు. దీంతో కార్మికులు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. పనివేళలను తిరిగి 8గంటలకు కుదించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

# రోగులు రావద్దని ఆస్పత్రి గేటు బంద్



ప్రభుత్వాసుపత్రి గేటును మూసివేస్తున్న సిబ్బంది

**పావగడ:** ఉద్యోగుల సమ్మె పేరుతో మానవత్వం లేకుండా రోగులను బయటకు గెంటేసిన సంఘటన తుమకూరు జిల్లా పావగడ ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగింది. జబ్బులకు వైద్యం చేయించుకుందామని వచ్చిన రోగులను ఆస్పత్రి సిబ్బంది గేటు వద్దే వెనక్కి పంపించి గేటును మూసి వేశారు. రోగులు తీవ్ర నిరాశతో వెనుతిరిగారు. సిబ్బంది కర్కశత్వంపై పలువురు శాపనార్థాలు పెట్టారు.



నీటిలోని క్లోరైడ్స్ భూమిపైకి అధికంగా చేరటం వల్ల పొలాలు చౌడు భూములుగా మారిపోతున్నాయి. రాష్ట్రంలోని సముద్రతీర ప్రాంతాలు.. ఉప్పుటేరులు.. కొల్లేరు ప్రాంతభూములు.. రొయ్యల చెరువులు.. వాటి సమీప భూముల్లో చౌడు పేరుకుపోతోంది. ఆ భూముల్లో విత్తనాలూ సరిగా మొలకెత్తవు. దీనికి చెక్ పెడుతూ ఎంపీఎం-103 పేరిట మచిలీపట్నం వ్యవసాయ పరిశోధనా స్థానం నూతన వరి వంగడాన్ని అభివృద్ధి చేసింది. చౌడు భూముల్లోనూ సిరులు పండించేందుకు మార్గం సుగమం చేసింది.

ఎంసీఎం-103 వంగడాన్ని అభివృద్ధి చేసిన మచిలీపట్నం వ్యవసాయ పరిశోధనా స్థానం

# చౌడు నేలలకు సరైన వరి

సాక్షి, అమరావతి: చౌడు నేలలు.. దేశంలో 1.73 కోట్ల ఎకరాల్లో విస్తరిస్తే మన రాష్ట్రంలో 10 లక్షల ఎకరాల్లో విస్తరించాయి. కొన్నేళ్లుగా తీరప్రాంతంలో విస్తరిస్తున్న రొయ్యల సాగు, విచక్షణా రహితంగా రసాయన ఎరువులు వాడటం వల్ల పచ్చటి పొలాలు చౌడుబారిపోతున్నాయి. ఈ నేలల్లో లవణ సాంద్రత 3 పీహెచ్ కంటే ఎక్కువగా ఉండటం వల్ల సాధారణ వరి వంగడాలు సాగుచేస్తే తరచూ తెగుళ్ల బారినపడటంతోపాటు కనీస దిగుబడులు కూడా రావు. ఈ సమస్యను అధిగమించే లక్ష్యంతో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన మచిలీపట్నం వ్యవసాయ పరిశోధనా స్థానం చౌడుతో పాటు చీడలను తట్టుకుంటూ అధిక దిగుబడులనిచ్చే ఎంసీఎం-103 సన్న బియ్యం రకం అభివృద్ధి చేశారు. ఇటీవలే మార్కెట్‌లోకి విడుదల చేసిన ఈ వంగడాన్ని రబీలో ప్రయోగాత్మకంగా సాగు చేశారు.

**హెక్టార్‌కు 6 నుంచి 6.5 టన్నుల దిగుబడి**

రెండో పంటకు అనువైన ఎంసీఎం-103 వంగడాన్ని బీపీటీ-5204, ఎంటీయూ-4870 రకాలను సంకరపర్చి అభివృద్ధి చేశారు. దీని పంట కాల పరిమితి 140-145 రోజులు. చౌడు తీవ్రతను బట్టి హెక్టార్‌కు 4.5 నుంచి 5.5 టన్నులు.. సాధారణ భూముల్లో హెక్టార్‌కు 6 నుంచి 6.5 టన్నుల దిగుబడులు వస్తాయి. చౌడు తీవ్రత 4 నుంచి 8 డిగ్రీల లవణ సాంద్రత వద్ద సాగు చేసినా సిఫార్సు చేసిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడులకు ఢోకా ఉండదు. దోమపోటు, పొడ, అగ్గితెగుళ్లను తట్టుకుంటుంది. గింజ రాలదు. కాండం దృఢంగా ఉండి నేరుగా విత్తే పద్ధతిలో సాగు చేయడానికి అనువైనది. 1000 గింజల బరువు 14.5 గ్రాములు. నాణ్యత కల్గిన గింజ శాతం 66.70 % . దమ్ము చేసిన తర్వాత ఎకరాకు 36:24:24 నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వేసుకుంటే చేను పడి పోకుండా ఉంటుంది. 15, 20 రోజులకొకసారి 2 గ్రాముల జింకు సల్ఫేట్‌ను పిచికారీ చేసుకోవాలి. భూమిలో జీలుగ చల్లి కలియ దున్నడం వలన చౌడు తగ్గుతుంది.

### బీపీటీ కంటే ఐదు బస్తాల అధికం



మా భూముల్లో చౌడు తీవ్రతతో మొక్కలు చనిపోవడం వల్ల తిరిగి ఊడ్చాల్సి వచ్చేది. మొక్కలు సరిగా ఎదగక ఎరువులు ఎక్కువగా వాడాల్సి వచ్చేది. గతేడాది బందరు పరిశోధనా కేంద్రం నుంచి ఎంసీఎం-103 విత్తనాన్ని తీసుకొని ఊడ్చా. లవణ సాంద్రత 6 పీహెచ్ వద్ద కూడా మొక్కలు చనిపోలేదు. ఎక్కువ పిలకలు వేసింది. ఒక కోటా మందులు మాత్రమే వేశాను, ఎకరాకు 35 బస్తాల దిగుబడి వచ్చింది. బీపీటీ కంటే 5 బస్తాలు అధికంగా దిగుబడి వచ్చింది.

– జి.సురేష్, మోదుమూడి, అవనిగడ్డ మండలం, కృష్ణా జిల్లా

### పరిశోధనా కేంద్రంలో విత్తనం



రాష్ట్రంలో చౌడు ప్రాంతాల్లో వరి సాగు చేస్తున్న రైతులు ఈ రకాన్ని సాగు చేసి అధిక ఆదాయం పొందవచ్చు. ఈ రకం వంగడం కోసం రైతులు మచిలీపట్నంలోని వ్యవసాయ పరిశోధనా కేంద్రాన్ని నేరుగా లేదా ఫోన్ నంబర్ 94901 95904లో సంప్రదించి పొందవచ్చు.

– ఎం.గిరిజారాణి, సీనియర్ శాస్త్రవేత్త, వ్యవసాయ పరిశోధనా స్థానం, మచిలీపట్నం

# 9 నుంచి టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షలు

- 20 వరకు నిర్వహణ
- 1–9 తరగతి విద్యార్థులకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్–4 పరీక్షలు
- పరీక్షల షెడ్యూళ్లను ప్రకటించిన పాఠశాల విద్యా శాఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పదో తరగతి విద్యార్థులకు పాఠశాలల్లో ప్రీ ఫైనల్ పరీక్షలు ఈ నెల 9 నుంచి 20 వరకు నిర్వహించనున్నారు. ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్ –2 కాంపోజిట్ పేపర్ మినహాయించి అన్ని పరీక్షలను ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు నిర్వహిస్తారు. ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్ –2 కాంపోజిట్ పేపర్ ఒక్కటే ఉదయం 9.30 గంటల నుంచి 11.15 గంటల వరకు ఉంటుంది. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ బుధవారం షెడ్యూళ్లను ప్రకటించారు. అలాగే 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్–4 పరీక్షలను కూడా ఇవే తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ పరీక్షల మూల్యాంకనాన్ని పూర్తి చేసి విద్యార్థులు సాధించిన మార్కులను స్కూల్ ఎడ్యుకేషన్ పోర్టల్‌లో నిర్ణీత గడువులోగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

**పదో తరగతి విద్యార్థుల ప్రీ ఫైనల్ పరీక్షల షెడ్యూల్ ఇలా..**

| తేదీ | సబ్జెక్టు | మార్కులు |
|---|---|---|
| 09-03-2023 | ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-1 (గ్రూప్ ఏ) | 100 |
| | ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-1 (కాంపోజిట్ కోర్సు) | 70 |
| 10-03-2023 | సెకండ్ లాంగ్వేజ్ | 100 |
| 14-03-2023 | ఇంగ్లిష్ | 100 |
| 15-03-2023 | మ్యాథమెటిక్స్ | 100 |
| 16-03-2023 | సైన్స్ | 100 |
| 17-03-2023 | సోషల్ స్టడీస్ | 100 |
| 18-03-2023 | ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2 (కాంపోజిట్ కోర్సు) | 30 |
| | ఓఎస్సెస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1 | 100 |
| 20-03-2023 | ఓఎస్సెస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2 | 100 |

**1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఎఫ్ఏ-4 పరీక్షల షెడ్యూల్ ఇలా..**

| తేదీ | సెషన్-1 | సెషన్-2 |
|---|---|---|
| 09-03-2023 | 3 నుంచి 5 తరగతులకు ఓఎస్సెస్సీ | -- |
| 10-03-2023 | తెలుగు, ఫస్ట్ లాంగ్వేజ్ | మ్యాథమెటిక్స్ |
| 14-03-2023 | ఇంగ్లిష్ | ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ |

**6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు ఎఫ్ఏ-4 పరీక్షల షెడ్యూల్ ఇలా..**

| | |
|---|---|
| 09-03-2023 | ఓఎస్సెస్సీ, ఓఎస్సెస్సీ-1, ఓఎస్సెస్సీ-2 |
| 10-03-2023 | తెలుగు, మ్యాథమెటిక్స్ |
| 14-03-2023 | హిందీ, జనరల్ సైన్స్ |
| 15-03-2023 | ఇంగ్లిష్, సోషల్ స్టడీస్ |



### రాష్ట్రానికి ప్రతిష్టాత్మక మారికో ఇన్నోవేషన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న విజయ్ కుమార్

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో రాష్ట్రంలో ఉద్యమంలా సాగుతున్న ప్రకృతి వ్యవసాయానికి మరో ప్రతిష్టాత్మక పురస్కారం లభించింది. సామాజిక, ఆర్థిక, పర్యావరణ వ్యవస్థలపై అత్యంత ప్రభావం చూపే వ్యక్తులు, సంస్థలకు రెండేళ్లకోసారి 'మారికో ఇన్నోవేషన్ ఫౌండేషన్' ఇచ్చే 'మారికో ద్వైవార్షిక ఇండియా ఇన్నోవేషన్–2023 ' అవార్డు ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వానికి దక్కింది. ముంబైలో బుధవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో రైతుసాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ టి.విజయ్‌కుమార్ ఈ అవార్డును అందుకున్నారు. ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలో 3,730 గ్రామ పంచాయతీల్లో 6.30 లక్షల మంది రైతులు ప్రకృతిసాగు చేస్తున్నారు. వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలోని అన్ని పంచాయితీలకు ఈ ప్రాజెక్టును విస్తరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషిచేస్తోంది.

# ఇంధన సామర్థ్యంలో ఏపీనే టాప్

## ఇతర రాష్ట్రాలకు దిక్సూచిగా ఆంధ్రప్రదేశ్

సాక్షి, అమరావతి: ఇంధన పొదుపు, సామర్థ్యంలో వినూత్న ప్రణాళికలతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. భారీ స్థాయిలో ఇంధనాన్ని ఆదా చేయడం ద్వారా ఇతర రాష్ట్రాలకు దిక్సూచిగా మారింది. ఏపీని చూసి నేర్చుకోవాలని ఇతర రాష్ట్రాలకు కేంద్రం చెప్పే స్థాయికి చేరుకుంది. ఇంధన సామర్థ్య కార్యక్రమాల అమలుకు ఏపీ అనుసరిస్తున్న 'రాష్ట్ర స్థాయి స్టీరింగ్ కమిటీ (ఎస్ఎల్ఎస్సీ)'కి జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది. ఏపీని ఆదర్శంగా తీసుకుని 18 రాష్ట్రాలు ఈ విధానాన్ని అనుసరిస్తున్నాయని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ (బీఈఈ) తెలిపింది. బీఈఈ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఈ విషయాన్ని ప్రకటించింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో మూడేళ్లుగా ఏటా రూ.3,914 కోట్ల విలువైన 5,608 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఆదా చేస్తోంది. ఇందులో ఒక్క పాట్ పథకం ద్వారానే 3,430 మిలియన్ యూనిట్ల విద్యుత్తును పొదుపు చేసింది. 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన సంరక్షణ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) ప్రత్యేకమైన ఐవోటీ ఆధారిత విద్యుత్తు పర్యవేక్షణ డివైస్‌ను రాష్ట్రంలోని 65 ఎంఎస్ఎంఈల్లో ప్రవేశపెట్టింది. ఇది యావత్ దేశం దృష్టిని ఆకర్షించింది.

**'ఏపీఎస్ఈసీఎం'కు ప్రశంసలు**

రాష్ట్రంలోని అన్ని స్థాయిల్లో ఇంధన సామర్థ్య కార్యక్రమాల అమలు, పర్యవేక్షణకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలోని కమిటీయే ఈ ఎస్ఎల్ఎస్సీ. ఈ కమిటీ నేతృత్వంలో ఇంధన సామర్థ్య చట్టాన్ని రాష్ట్ర స్థాయిలో అమలు చేయడంలో కీలక పాత్ర పోషించిన ఏపీఎస్ఈసీఎం సేవలను బీఈఈ డీజీ అభయ్ భాక్రే ప్రశంసించారు. ఏపీ మోడల్ ఎస్ఎల్ఎస్సీ విధానాన్ని ఉత్తరప్రదేశ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఒడిశా, హరియాణ, తమిళనాడు, తెలంగాణ సహా 18 రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని వెల్లడించారు. ఇంధన సామర్థ్యం, సంరక్షణ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, భాగస్వాముల్లో చైతన్యం తెస్తున్న ఏపీఎస్ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డిని బీఈఈ డైరెక్టర్ జనరల్‌తోపాటు క్లైమేట్ అండ్ ఎనర్జీ లీడ్ బ్రిటిష్ హై కమిషన్ లిబ్బి గ్రీన్, ఈఈఎస్ఎల్ ఎండీ విశాల్ కపూర్ అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అంకిత భావంతో పనిచేయడం వల్లే ఏపీఎస్ఈసీఎం దేశంలోనే ప్రతిష్టాత్మక జాతీయ ఇంధన సంరక్షణ అవార్డు–2022, ఇతర అవార్డులను గెలుచుకుందని భాక్రే చెప్పారు. ఏపీఎస్ఈసీఎం ద్వారా బీఈఈ తొలిసారిగా విశాఖపట్నంలో ఇన్వెస్ట్‌మెంట్ బజార్ నిర్వహించి, ఇతర రాష్ట్రాలకు మార్గాన్ని చూపిందన్నారు. ఫలితంగా దేశం మొత్తం మీద రూ.2,500 కోట్ల విలువైన 73 ఇంధన సామర్థ్య ప్రాజెక్టులను గుర్తించామని చెప్పారు. ఇందులో ఒక్క ఏపీలోనే రూ.400 కోట్ల విలువైన 30 ప్రాజెక్టులు ఉన్నాయని తెలిపారు. ఏపీఎస్ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ..దేశంలోనే అగ్రస్థానంలో నిలిచేలా ప్రోత్సహిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బీఈఈ డైరెక్టర్, కార్యదర్శికి, ఏపీఎస్ఈసీఎం చైర్మన్ కె.ఎస్.జవహర్ రెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.



ఎ.చంద్రశేఖరరెడ్డిని అభినందిస్తున్న బీఈఈ డైరెక్టర్ జనరల్ అభయ్ భాక్రే

# టాప్ 50 వర్సిటీల్లో జగనన్న విదేశీ విద్యా దీవెన

**గత జీవోలో సవరణలు చేస్తూ ఉత్తర్వులు జారీ**

సాక్షి, అమరావతి: జగనన్న విదేశీ విద్యా దీవెన ద్వారా విదేశాల్లోని టాప్ యూనివర్సిటీల్లో చదువుకునే విద్యార్థులకు మరింత మెరుగ్గా ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించేందుకు వీలుగా గతంలో జారీ చేసిన జీవోలో సవరణలు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2023 –24 నుంచి టాప్ 50 ర్యాంక్‌ల్లో నిలిచిన ఉన్నత విద్యాసంస్థల్లో 21 సబ్జెక్టులకు విదేశీ విద్యా దీవెన వర్తిస్తుంది. జ్ఞానభూమి పోర్టల్‌లో టాప్ 50 ర్యాంకులు సాధించిన వాటి జాబితాను ప్రకటిస్తారు. ఆ జాబితాలోని టాప్ 50 సంస్థల్లో 21 సబ్జెక్టుల్లో అడ్మిషన్లు పొందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు నూరు శాతం లేదా రూ.1.25 కోట్ల వరకు ఫీజు రీయింబర్స్ చేయనున్నట్లు తెలిపారు. ఇతర విద్యార్థులకు నూరు శాతం లేదా రూ.కోటి వరకు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుంది. క్యూఎస్ ప్రపంచ ర్యాంకింగ్‌లో టాప్ 50 ర్యాంకులు పొందిన విదేశాల్లోని ఉన్నత విద్యా సంస్థల జాబితాను జ్ఞానభూమి పోర్టల్‌లో ఏటా ప్రకటిస్తారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో జగనన్న విదేశీ విద్యా దీవెన కింద ప్రయోజనం పొందిన విద్యార్థులకు కోర్సు పూర్తయ్యే వరకు లబ్ధి కొనసాగించనున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపారు.

# భారతమాలకు రహదారులు

- నాలుగు వరుసలుగా మూడు జాతీయ రహదారులు
- పారిశ్రామిక ప్రగతికి దిక్సూచి
- అవుటర్ రింగ్ రోడ్డు మాదిరి ఫ్లై ఓవర్‌లు
- వేగం పుంజుకున్న భూసేకరణ
- యుద్ధ ప్రాతిపదికన పనులు
- రెండేళ్లలో పూర్తి చేయాలనే సంకల్పం
- కాకినాడ తీరంతో ఉమ్మడి తూర్పు అనుసంధానం



నాలుగు రోడ్లు జంక్షన్ విస్తరణ పనులు చేపడుతున్న కాకినాడ రూరల్ కొత్తూరు వద్ద ఏడీబీ రహదారి

సాక్షిప్రతినిధి, కాకినాడ: భారతమాల ప్రాజెక్టు వేగం పుంజుకుంది. గడువులోగా దీనిని పూర్తి చేయాలనే సంకల్పంతో అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పారిశ్రామిక ప్రగతికి దోహదపడేలా రూపొందించిన ఈ ప్రాజెక్టుల కోసం యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రధానంగా కాకినాడ యాంకరేజ్ పోర్టు, తొండంగి సమీపాన గేట్‌వే ఆఫ్ పోర్టు కాకినాడను ఒకపక్క విశాఖపట్నం, మరోపక్క ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలను అనుసంధానించాలనేది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. ఇందుకు మూడు జాతీయ రహదారులను భారతమాల ప్రాజెక్టు కింద నాలుగు వరుసలుగా తీర్చిదిద్దుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఒకటి లేదా, రెండేళ్లలో పనులను పూర్తి చేయాలని జాతీయ రహదారుల సంస్థ గట్టిగా అడుగులేస్తోంది. ఇందులో భాగంగా భూ సేకరణ, టెండర్ల ఖరారు పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి.

**వడివడిగా..**

కాకినాడ అచ్చంపేట జంక్షన్ నుంచి యాంకరేజ్ పోర్టు వరకు 13.20 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల రహదారి అందుబాటులోకి రానుంది. ఏడాది వ్యవధిలో ప్రాజెక్టును పూర్తి చేయాలనే సంకల్పంతో పనుల వేగం పెంచారు. ఇక్కడ భూసేకరణ అవసరం లేకుండానే ఉన్న రోడ్డునే నాలుగు లేన్లుగా ఆధునీకరిస్తున్నారు. టెండర్లు ఖరారు కావడంతో రూ.90 కోట్ల అంచనాతో పనులు కూడా మొదలయ్యాయి. ప్రస్తుత రోడ్డును ఇరువైపులా వెడల్పు చేస్తూ నాలుగు వరుసలుగా చేపట్టడంలో అధికారులు నిమగ్నమయ్యారు.

**అవుటర్ రింగ్ రోడ్డు తరహాలో..**

- కాకినాడ వాకలపూడి లైట్‌హౌస్ నుంచి అన్నవరం మీదుగా కోల్‌కతా–చెన్నై జాతీయ రహదారితో అనుసంధానించనున్నారు.
- 40.32 కిలోమీటర్లు నిడివి కలిగిన ఈ నాలుగు వరుసల జాతీయ రహదారిని తొలుత రూ.776.82 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టారు.
- కాకినాడ పోర్టు, కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి, కాకినాడ గేట్‌వే పోర్టు, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ మీదుగా ఈ జాతీయ రహదారి వెళ్లనుంది.
- వాకలపూడి జంక్షన్‌లో ఒక ఫ్లై ఓవర్, అన్నవరం , కాకినాడ సెజ్, హార్బర్‌ల వద్ద అండర్‌పాస్‌లను నిర్మించాల్సి ఉంటుంది.
- హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డు తరహాలో ఈ జాతీయ రహదారి ఏర్పాటు కానుంది.
- ఇప్పుడు రహదారి అంచనా వ్యయం రూ.1400 కోట్లకు పెరిగింది.
- ఎక్కువగా భూ సేకరణ చేయాల్సి వస్తోంది. ఇందుకు రూ.160 కోట్లకుగాను ఇప్పటికే రూ.56 కోట్లు విడుదల చేశారు.
- రెండేళ్లలోపు అందుబాటులోకి తీసుకురావాలనేది లక్ష్యంగా పెట్టుకున్నారు.
- తొండంగి, శంఖవరం, యు కొత్తపల్లి, కాకినాడ రూరల్ మండలాల్లోని 21 గ్రామాల మీదుగా ఈ జాతీయ రహదారి సాగుతుంది.

**చకచకా భూసేకరణ**

ఉమ్మడి తూర్పులో పారిశ్రామికాభ్యున్నతికి సామర్లకోట–అచ్చంపేట జాతీయ రహదారి బాటలు వేయనుంది. రూ.395.60 కోట్ల అంచనాతో 12.25 కిలోమీటర్ల మేర ఈ జాతీయ రహదారి కోసం 33 ఎకరాల ప్రైవేటు భూమి, 21 ఎకరాల ప్రభుత్వ భూమి అవసరమవుతోంది. ఇందుకు నోటిఫికేషన్ కూడా విడుదలైంది. ఈ హైవేలో సగం గ్రీన్‌ఫీల్డ్ (పొలాల మధ్య) ఉంటుంది. కాకినాడ–పెద్దాపురం ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్ వద్ద ప్రారంభమై ఎఫ్‌సీఐ గోడౌన్స్, సుగర్ ఫ్యాక్టరీ, కెనాల్ రోడ్డు మీదుగా ఉండూరులో ఇది కలవనుంది. అచ్చంపేట జంక్షన్‌లో ఒక ఫ్లైఓవర్ నిర్మించాల్సి ఉంది. చురుగ్గా భూ సేకరణ చేపడుతున్నారు. 13 కిలోమీటర్ల మేర పనులు మొదలయ్యాయి. 33.92 హెక్టార్ల భూమి సేకరించి ఏడాదిలోపు ఈ హైవే పనులను పూర్తి చేయనున్నారు. ఈ రహదారి సామర్లకోట, కాకినాడ రూరల్ మండలాల్లో ఆరు గ్రామాల మీదుగా ప్రయాణిస్తుంది. నాలుగు వరుసల మూడు ప్రధాన జాతీయ రహదారులతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలతో తీరానికి అనుసంధానమవుతుంది. తద్వారా పారిశ్రామిక ప్రగతికి మార్గం సుగమమం అవుతుంది.

### ఫ్లై ఓవర్లు..అండర్‌పాస్‌ల వల్ల పెరిగిన అంచనా వ్యయం

మూడు హైవేలను గడువులోగా పూర్తి చేస్తాం. భారతమాల ప్రాజెక్టులో చేపట్టిన ఈ రోడ్ల వల్ల విశాఖపట్నం, ఉమ్మడి గోదావరి జిల్లాల మధ్య అనుసంధానమేర్పడుతుంది. వాకలపూడి లైట్ హౌస్ నుంచి అన్నవరం వరకు వస్తోన్న జాతీయ రహదారికి మధ్యలో కాకినాడ సెజ్, ఉప్పాడ హార్బర్ ప్రాంతాల్లో ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు నిర్మించాల్సి ఉంది. ఈ కారణంగానే అంచనా వ్యయం రూ.1400 కోట్లకు పెరిగింది. సేకరించిన ప్రైవేట్ భూములకు వెంటనే పరిహారం చెల్లిస్తున్నాం.

– సురేంద్రనాథ్, ప్రాజెక్టు డైరెక్టర్, జాతీయ రహదారులు విభాగం

మానవ నాగరికత పాత రాతియుగం నుంచి మొదలైందని చరిత్ర చెబుతోంది. అంటే.. కొన్ని లక్షల సంవత్సరాల నుంచే రాయితో మన మనుగడ సాగుతోందన్న మాట. రాళ్లతోనే నిప్పు రాజేయడం, రాతి ఆయుధాలు, రాళ్లతో చేసిన గృహోపకరణాలు మానవ జీవనంలో భాగంగా ఉండేవి. శ్రమైక జీవన సౌందర్యం వెల్లివిరిసేది. రాతి గృహోపకరణాల వినియోగం ద్వారా శరీరానికి మన ప్రమేయం లేకుండానే వ్యాయామం లభించేది. ఆహార పదార్థాలకు అద్భుత రుచి సమకూరేది. ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమయ్యేది. కానీ కాలం మారింది. బిజీ జీవనంతో పాటు మనిషి సుఖమెరిగాడు. రాతి గృహోపకరణాల స్థానంలో యంత్రాలు రంగప్రవేశం చేశాయి. ఫలితంగా శరీరానికి వ్యాయామం తగ్గింది. దాని కోసం మళ్లీ జిమ్‌లను, ఏరోబిక్ సెంటర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. అయితే ఇటీవలి కాలంలో మళ్లీ రాతి గృహోపకరణాలు మన జీవితంలోకి వస్తున్నాయి. కొంత ఆధునికతను అద్దుకుని వస్తున్న ఇవి ప్రజాదరణ చూరగొంటున్నాయి. వీటి అమ్మకాలు, వినియోగం కూడా పెరుగుతున్నాయి.



పాలఖండ్యాంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న రాతి గృహోపకరణాలు

# ఆధునిక రాతి యుగం



సన్నికల్లు చెక్కుతూ..


- రాతి గృహోపకరణాలకు మళ్లీ ఆదరణ
- స్టీల్ హ్యాండిల్స్ తో సులువుగా వాడుకునేలా
- శరీరానికి వ్యాయామం.. జిహ్వకు రుచి
- స్థానికంగా తయారీతో పాటు చెన్నై నుంచి దిగుమతి

శ్రీకాకుళం డెస్క్:

నేటి తరానికి ఆ పేర్లు పలకాలంటేనే ఇబ్బంది. ఇంట్లో ఏదో మూలన ఉన్నా వాటి పనితీరు తెలుసుకోవాలంటేనే అనాసక్తి. శిల్పి శిలను చెక్కి శిల్పంగా మార్చినట్లు.. బండరాయిని తీసుకుని మన అవసరాలకు అనుగుణంగా గృహోపకరణాలు రూపొందించారు పూర్వీకులు. వాటిని వినియోగించి అటు ఆరోగ్యంగా.. ఇటు శారీరకంగా శ్రమించి జీవితకాలాన్ని గడిపారు. ఇంతకీ ఏమిటవీ అనేదేగా మీ ప్రశ్న. అవే నండీ ఇంట్లో మూలకు చేరిన తిరగలి.. రుబ్బురోలు.. గొడ్డ.. సన్నిరాయి తదితరాలు. మళ్లీ వీటి వినియోగం ఇటీవల కాలంలో పెరుగుతోంది. సులువుగా వినియోగించేందుకు స్టీల్ హ్యాండిల్స్‌ను అమర్చి ఈ గృహోపకరణాలను 'చెక్కు'తున్నారు.

**పాలఖండ్యాంలో 30.. పాకివలసలో 20..**

శ్రీకాకుళం నుంచి రాజాం వెళ్లే మార్గంలో పాలఖండ్యాం వద్ద రోడ్డు పక్కన ఈ సంప్రదాయ రాతి గృహోపకరణాలు మనకు దర్శనమిస్తాయి. 8దుకాణా ల్లో వివిధ రకాల సైజుల్లో తిరగళ్లు.. రుబ్బు రోళ్లు.. సన్నిగొడ్డలు.. ఇక్కడ విక్రయిస్తున్నారు. 30 ముస్లిం కుటుంబాలు వీటి తయారీపై ఆధారపడి జీవనంసాగిస్తున్నాయి. రోజూ పరిసర గ్రామాలకు ఆటోలపై సరుకును తీసుకువెళ్లి విక్రయిస్తున్నారు తయారీదారులు. కొన్నింటిని చెన్నై నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. అలాగే కోటబొమ్మాళి మండలం పాకివలసలో 20 ముస్లిం కుటుంబాలు వీటి తయారీపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి.



**నిమ్మాడ నుంచి రాయి..**

వీటి తయారీకి నల్లజనపరాయిని వినియోగిస్తున్నారు. ఈ రాయి కోసం టెక్కలి సమీపంలో ఉన్న నిమ్మాడ పరిశ్రమల నుంచి రాయిని సేకరిస్తున్నారు. క్రషింగ్‌లో పగిలిపోయిన బండలను అడుగుల లెక్కన కొనుగోలు చేస్తున్నట్లు తయారీదారుడు సయ్యద్ రంజాన్ తెలిపారు.

### చక్కటి వ్యాయామం..



తిరగలి వినియోగం వలన నడుం, వీపు, చేతి కండరాలు, పొట్టముందు భాగం ఛాతీ కండరాలకు చక్కటి వ్యాయామం. వెన్నుపూస ఫ్లెక్సిబులిటీ పెరుగుతుంది. ఇది ఏరోబిక్ ఎక్సర్‌సైజ్. రోలును నిలబడి వినియోగించడం వల్ల చేయి, భుజంతో పాటు ఛాతీ భాగానికి మంచి వ్యాయామం. ఇది మోడరేట్ ఇంటెన్సిటీ ఏరోబిక్ ఎక్సర్ సైజ్. వీటిని దినచర్యలో భాగంగా చేసుకుంటే సర్వైకల్ స్పాండిలైటిస్, లంబా స్పాండిలైటిస్ రాకుండా నిరోధించవచ్చు. కండరా ల బలహీనతల వల్ల వచ్చే వ్యాధులు నిరోధించవచ్చు.

– డాక్టర్ బగాది రఘు, ఎంపీటీ ఇన్ ఆర్థోపెడిక్స్

### ధరలు ఇలా..

రాతి గృహోపకరణాల ధరలు సైజును బట్టి రూ.500 నుంచి రూ.800 వరకు ఉన్నాయి.

### ప్రయోజనాలెన్నో



శారీరక శక్తిని వినియోగిస్తే విద్యుత్ శక్తిని ఆదా చేయవచ్చు. తద్వారా పర్యావరణానికి మేలు.

- ఎలక్ట్రిక్ సాధనాలైన మిక్సీ, గ్రైండర్‌లను వినియోగించి చేసే వంటలకంటే వీటిని ఉపయోగించడం వల్ల రుచిలో చాలా తేడా ఉంటుంది.
- తయారు చేసిన ఆహార పదార్థాల నిల్వ సామర్థ్యం ఎక్కువ.
- పోషకాలు అలాగే ఉంటాయి.
- చక్కగా శుభ్రం చేసుకునే సదుపాయం ఈ రాతి వస్తువుల సొంతం.



### అమ్మకాలు పెరిగాయి..



నల్లజనపరాయితో వీటిని చాలా ఏళ్లుగా తయారు చేస్తున్నాం. ఇటీవలి కాలంలో వీటి అమ్మకాలు బాగా పెరిగాయి. చిన్న చిన్న రోళ్లను పెళ్లిళ్లకు గిఫ్ట్ ఆర్టికల్స్‌గా ఇచ్చే సంస్కృతి పెరిగింది. కొన్నింటిని మేము తయారు చేస్తున్నాం. మరికొన్ని చెన్నై నుంచి తీసుకువచ్చి విక్రయిస్తున్నాం.

–సయ్యద్ రంజాన్, తయారీ దారు, పాలఖండ్యాం

### ఆ రుచే వేరు..



వీటిని ఉపయోగించి చేసే పచ్చళ్లు, ఇతర వంటకాలు భలే రుచిగా ఉంటాయి. నేను చిన్ననాటి నుంచి వీటినే వినియోగిస్తున్నాను. కరెంట్ షాక్‌లు ఇతర ఇబ్బందులుండవు. చక్కగా శుభ్రం చేసుకోవచ్చు. శారీరక వ్యాయామం కూడా.

–కుప్పుబోడెమ్మ, పాలఖండ్యాం

### వినియోగిస్తే మంచిది..



ఉరుకుల పరుగుల జీవనంలో మహిళకు శారీరక శ్రమ తగ్గింది. ఒబెసిటీ పెరిగిపోతోంది. ప్రతి పనికీ ఓ మెషీన్ వచ్చి చేరింది. సంప్రదాయ గృహోపకరణాల వినియోగం తగ్గింది. ముఖ్యంగా గర్భిణులు రాతి పరికరాలను వినియోగిస్తే మంచి వ్యాయామం. ఏడోనెల వరకు ఇలాంటి పరికరాలతో పనులు చేసుకోవచ్చు. శారీరక శ్రమతో ప్రసవం సులువవుతుంది.

– జి.జ్ఞాన ప్రసూన, గైనికాలజిస్ట్, జిల్లా ఆస్పత్రి టెక్కలి

■ సైబర్‌టాక్

# ఫోన్ హ్యాక్ అయ్యిందా?!



ప్రతీకాత్మక చిత్రం

**తెలుసుకోవడం ఎలా..?**
● ఫోన్ చాలా స్లో అవుతుంది. ఫోన్ త్వరగా వేడెక్కుతుంది. ● డేటా వినియోగం బాగా పెరుగుతుంది. ● యూ ట్యూబ్ లేదా ఆన్‌లైన్ వీడియోలు బఫర్ అవ్వవు. ● వెబ్ పేజీలు లోడ్ అవడానికి టైమ్ పడుతుంది. ● ప్రోగ్రామ్స్, యాప్స్ క్రాష్ అవుతాయి. ● గాడ్జెట్ సడెన్‌గా రీస్టార్ట్ అవుతుంది. ● విచిత్రమైన, ఊహించని మెసేజీలు వస్తుంటాయి.

**ఎలా చెక్ చేయాలి?**
● ఆండ్రాయిడ్ ఫోన్ అయితే సెట్టింగ్స్- యాప్స్, నోటిఫికేషన్స్- కెమెరా/ మైక్రోఫోన్ (ఏదైనా తెలియని యాప్‌కి యాక్సెస్ ఉందో లేదో తనిఖీ చేయండి) ● యాపిల్ ఫోన్ అయితే సెట్టింగ్స్- ప్రైవసీ-కెమెరా/మైక్రోఫోన్ (ఏదైనా తెలియని యాప్‌కి యాక్సెస్ ఉందో లేదో చెక్ చేయాలి)

సైబర్ టాక్

**గీతిక (పేరుమార్చడమైనది) డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. ఈ మధ్య తన క్లాస్‌మేట్ (నందు) చేసే మెసేజ్‌లు ఆమెకు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. తను ఎక్కడ ఉన్నా, ఏం చేస్తున్నా అందుకు సంబంధించిన సమాచారాన్ని తిరిగి తనకే పోస్ట్ చేస్తున్నాడు. ఎవరికైనా చెబుదామంటే ఎవరూ నమ్మరు. పైగా తననే నిందిస్తారు. తను ఊళ్లో లేకపోయినా తనకు సంబంధించిన ప్రతి విషయాన్నీ తిరిగి తనకే పంపిస్తున్నాడు. ఏమైనా అంటే, నాకు అన్నీ తెలుసు.. అన్నట్టు ప్రవర్తిస్తున్నాడు. ఇది ఇబ్బందికరంగా ఉండటమే కాదు భయంగానూ ఉంటోంది.**

గీతిక లాగే చాలా మంది ఇబ్బందులకు లోనయ్యే సమస్య ఇది. తమ ఫోన్ హ్యాక్ అయిందనే విషయాన్ని ఏ మాత్రం పసిగట్టలేరు. అంత స్మార్ట్‌గా మన చేతుల్లో ఉండే స్మార్ట్ ఫోనుల్లో దొంగలు దూరుతున్నారు జాగ్రత్త.

స్మార్ట్ ఫోన్‌లలో చాలా మంది చేసే కొన్ని తప్పులు ఏంటంటే..
- మనం ఏం చేస్తున్నామో మిగతా అంతా చూసేలా చేయడం.
- అలెక్సా వంటి టూల్స్ వాటంతట అవే రన్ అయ్యేలా చేయడం
- ఎప్పుడూ యాప్స్ సైన్ ఇన్‌లోనే ఉండటం
- స్మార్ట్ ఫోన్ యాక్సెస్ ఏదైనా ఓకే చేయడం.

### వెంటనే తెలుసుకోవాలంటే...
- ఆండ్రాయిడ్ వినియోగదారులు అయితే.. సెట్టింగ్స్- యాప్స్, నోటిఫికేషన్లు (ఏదైనా తెలియని యాప్‌లో స్పై, మానిటర్, ట్రాక్ ట్రోజన్ .. మొదలైన పేర్లు ఉన్నాయేమో చెక్ చేయండి. ఒకవేళ అలాంటివి కనిపిస్తే వెంటనే వాటిని తీసేయండి. ఇది తెలుసుకోవడానికి సెట్టింగ్స్, ప్లేస్ – గూగుల్ ప్లే, ప్రొటెక్షన్ స్కాన్ చేయండి.
- ఐవోఎస్ వినియోగదారులు అయితే.. అన్ని పాస్‌వర్డ్‌లను మార్చాలి. నెట్‌వర్క్ సెట్టింగ్స్‌ను రీసెట్ చేయాలి. ఐఓఎస్ రీసెంట్ వెర్షన్‌ను అప్‌డేట్ చేయాలి.

### ఏం చేయాలి?
- మీ ఫోన్ పరిమితులను మీకు మీరుగా నిర్దేశించుకోండి.
- ఐఓఎస్ యాప్స్‌ని వెంటనే అప్‌డేట్ చేయండి.
- ఉపయోగంలో లేనప్పుడు మీ గ్యాడ్జెట్స్‌ను లాక్ చేసి ఉంచండి.
- వైఫై, బ్లూ టూత్ వాడకంలో జాగ్రత్తలు పాటించండి.
- బ్యాంకింగ్, సామాజిక మాధ్యమాల కోసం రెండురకాల ప్రామాణీకరణలను పాటించండి.
- డేటాను తరచూ బ్యాకప్ చేయండి.
- సెక్యూరిటీ యాంటీవైరస్, మాల్వేర్ అప్లికేషన్లను ఉపయోగించండి
- మీరు ఇన్‌స్టాల్ చేసే యాప్స్‌ను ప్లే స్టోర్ నుంచి మాత్రమే ఎంచుకోండి.

### స్మార్ట్‌ఫోన్లో స్నూపింగ్‌కి అనుమతించేవి...
- పిల్లలు వాడుతున్న స్మార్ట్ ఫోన్ల ద్వారా వారు ఏ ప్రాంతంలో ఉన్నారో తెలుసుకోవడానికి ట్రాక్ చేయగల యాప్స్ ఉంటాయి.
- కంపెనీ గ్యాడ్జెట్‌లలో ఇన్‌స్టాల్ చేయబడిన మానిటరింగ్ సాఫ్ట్‌వేర్, వాటిని కంపెనీ ప్రయోజనాల కోసమే ఉపయోగించాలి కాబట్టి ఈ హక్కును రిజర్వ్ చేసుకోవచ్చు.
- ఆర్డర్ డెలివరీని ట్రాక్ చేయడం, డెలివరీని పర్యవేక్షించడానికి కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి నిఘా అవసరం కావచ్చు.

### కొన్ని రకాల సమస్యలు
- హాని కలిగించే యాప్స్, స్పై వేర్, పబ్లిక్ వైఫై, ఉపయోగించని యాప్స్, ఫిషింగ్, పాస్‌వర్డ్ సెక్యూరిటీ లేనివి .. వంటి వాటి వల్ల సమస్యలు కలగవచ్చు.

### ముఖ్యమైన పోర్టల్స్
- మీ ఫోన్ IMEI నెంబర్‌ని https://www.imei.info/ చెక్ చేయండి.
- మీ పేరుపై ఎన్ని ఫోన్ నెంబర్లు ఉన్నాయో చెక్ చేసుకోవడానికి https://tafcop.dgtelecom.gov.in



ఇన్‌పుట్స్: **అనీల్ రాచమల్ల,**
డిజిటల్ వెల్‌బియింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్

■ గెలుపు దారి

# అంజలి చెప్పిన సమాధానం

పరీక్షల్లో అత్తెసరు మార్కులు వచ్చే అమ్మాయి...
మాస్టర్ ప్రశ్న అడిగితే బిత్తరచూపులు చూసే అమ్మాయి...
క్లాసురూమ్‌లో కూర్చొని పాఠం వినడాన్ని భారంగా భావించే అమ్మాయి 'భవిష్యత్ ఎలా ఉండబోతుంది?' అనే ప్రశ్నకు సమాధానం చెప్పడం ఎవరికైనా కష్టం కాకపోవచ్చు.
మరి అదే అమ్మాయి చదువుపై శ్రద్ధ చూపితే...
సమాధానం చెప్పడం అంజలి సూద్‌కు మాత్రమే సాధ్యమవుతుంది.





● అంజలి సూద్

అంజలి సూద్ అమెరికాలోని ఫ్లింట్ నగరం(మిచిగాన్)లో పుట్టింది. తల్లిదండ్రులు పంజాబ్ నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. చిన్నప్పుడు పరీక్షలలో అంజలి చాలా పొదుపుగా తెచ్చుకునే మార్కులను చూసి 'ఈ అమ్మాయి హైస్కూల్ దాటి కాలేజీ గడప తొక్కడం కష్టమే' అనుకునే వారు పెద్దలు. క్లాసరూమ్‌లో టీచర్ ఎప్పుడైనా పాఠానికి సంబంధించిన ప్రశ్న ఏదైనా వేస్తే ఆమె జవాబు చెప్పిన సందర్భం అంటూ లేదు.

అలాంటి అమ్మాయి కాస్తా కాలక్రమంలో మారింది. చదువు మీద శ్రద్ధ పెట్టింది. మార్కులు పెంచుకుంటూ పోయింది.

'బాగా చదువుతున్నావు' అనే ప్రశంస ఆమెకు మరింత బలాన్ని ఇచ్చి ఇక వెనక్కి తిరిగి చూసుకునే అవసరం లేకుండా చేసింది.

'వార్టన్ స్కూల్ ఆఫ్ ది యూనివర్శిటీ ఆఫ్ పెన్సిల్వేనియా'లో ఫైనాన్స్ అండ్ మేనేజ్‌మెంట్ చదువుకున్న అంజలి హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ చేసింది.

చదువు పూర్తయిన తరువాత ఫైనాన్స్, మీడియా, ఇ-కామర్స్‌కు సంబంధించిన సంస్థల్లో పనిచేసింది. అంజలి ప్రతిభ గురించి ఆ నోటా ఈ నోటా విన్న ఆన్‌లైన్ వీడియో మార్కెటింగ్ సంస్థ 'విమియో' తమ సంస్థలోకి ఆహ్వానించింది. 'హెడ్ ఆఫ్ గ్లోబల్ మార్కెటింగ్' 'జనరల్ మేనేజర్' (కోర్ క్రియేటర్ బిజినెస్) హోదాల్లో పనిచేసింది. విమియో బిజినెస్ (మార్కెటింగ్, బ్రాండ్స్‌కు మెంబర్‌షిప్ ప్లాన్)లాంటి ఎన్నో కార్యక్రమాలను లాంచ్ చేసి సక్సెస్ అయింది.

అంజలి సృజనాత్మక ఆలోచనలు, వ్యాపార ఎత్తుగడలు నచ్చి సంస్థ ఆమెను 'సీయీవో' స్థానంలో కూర్చోబెట్టింది. సీయీవోగా కొత్త స్ట్రాటజీతో ముందుకు దూసుకు వెళ్లింది. వీడియో క్రియేటర్స్ కోసం కొత్త సాఫ్ట్‌వేర్‌ను, టూల్స్‌ను ప్రవేశ పెట్టింది.

'మనం చేస్తున్న బిజినెస్ మాత్రమే' అన్నట్లుగా కాకుండా చుట్టుపక్కల ఏం జరుగుతోందో గమనించడం అంజలి అలవాటు. వీడియో ఎడిటింగ్ అండ్ వీడియో మార్కెటింగ్ సంస్థ 'మాజిస్టో'ను కొనుగోలు చేయడం 'విమియో'కు కలిసొచ్చింది.

34 ఏళ్ల వయసులోనే సీయీవోగా బాధ్యతలు చేపట్టి 'విమియో'ను వరల్డ్స్ లార్జెస్ట్ ఆన్‌లైన్ యాడ్-ఫ్రీ వీడియో ప్లాట్‌ఫామ్‌గా ఉన్నతస్థానంలో నిలిపింది అంజలి.

'నేను ఈ స్థాయికి వస్తానని ఎప్పుడూ అనుకోలేదు. చేసిన పనికి గుర్తింపు లభిస్తే చాలు అనుకునేదాన్ని. ఆ గుర్తింపే నన్ను ఇక్కడ వరకు తీసుకువచ్చింది. ఒక పెద్ద బాధ్యత మనల్ని వెదుక్కుంటూ వచ్చినప్పుడు నేను చేయగలనా? అని భయపడడం కంటే ఎందుకు చేయలేను అని అనుకోవడంలోనే సక్సెస్ మంత్ర దాగి ఉంది' అంటుంది అంజలి.

■ సృజన



● శైలజ కేజ్రీవాల్

# కలల జిందగీ

**'బాంబేకు వెళ్లి ఏంచేస్తావు? బాధతో తిరిగి వస్తావు. అంతకుమించి సాధించేది లేదు' అని నిరాశపరిచారు చుట్టాలు పక్కాలు.**
**భయపడి ఉంటే... కలల రెక్కలు కత్తిరించి ఉంటే... టీవీ మీడియా, సినిమా రంగంలో తన కంటూ ఒక పేరు తెచ్చుకునేది కాదు శైలజ కేజ్రీవాల్....**

శైలజ కేజ్రీవాల్‌కు గేమ్‌లో భాగం కావడం కంటే 'గేమ్ చేంజర్'గా పేరు తెచ్చుకోవడం అంటే ఇష్టం. ఆ ఇష్టమే తనని కోల్‌కత్తా నుంచి ముంబైకి తీసుకువచ్చింది. సాహిత్యంలో డిగ్రీ చేసిన శైలజకు మాస్ సినిమాల నుంచి సమాంతర సినిమాల వరకు అన్ని రకాల సినిమాలు అంటే ఇష్టం.

'కలంటూ కనని కన్నులు ఎందుకు!' అన్నట్లుగా ఉండేది ఆమె ధోరణి.

వినోదరంగంలో పేరు తెచ్చుకోవాలనేది శైలజ కల. ఆ కలల దారిని వెదుక్కుంటూ ఒక ఫైన్ మార్నింగ్ ముంబైలో అడుగు పెట్టింది. స్టూడియోల చుట్టూ తిరగడం కాకుండా ముందు ఉద్యోగం చూసుకుంది. ఒక బడిలో టీచర్‌గా చేరింది. ఆ తరువాత టీవీ రంగంలోకి అడుగు పెట్టింది.

'జిందగీ' (జీ నెట్‌వర్క్ చానల్) శైలజకు ఎంతో పేరు తీసుకువచ్చింది.

రెండు దేశాల మధ్య శత్రుత్వం ఉన్నప్పుడు వార్తల్లో, వ్యాసాల్లో, టీవీల్లో ఆ దేశాలకు సంబంధించిన ప్రముఖులే ఎక్కువ కనిపిస్తుంటారు. మరి సరిహద్దుకు అవతల ఉన్న సామాన్యులు ఎలా ఉంటారు? వారి జీవన విధానం ఎలా ఉంటుంది? వారి ప్రవర్తన ఎలా ఉంటుంది...అనే అంశాల ఆధారంగా 'జిందగీ'కి శ్రీకారం చుట్టింది శైలజ.

'జిందగీ' ప్రారంభానికి ముందు 'ట్రోలింగ్ తప్పదు' అని చాలామంది హెచ్చరించారు.

అయితే విమర్శల కంటే ప్రశంసలే ఎక్కువగా లభించాయి.

'అచ్చం మనలాంటి జీవితాలే వారివి కూడా' అనే మాటలు వినిపించాయి.

రైటింగ్, వాయిస్ ఓవర్, ప్రొడక్షన్‌లలో విలువైన అనుభవాలను మూటగట్టుకున్న శైలజకు కాలంతోపాటు నడవడం, కాలానికంటే కాస్త ముందుగా ఆలోచించడం అంటే ఎంత ఇష్టమో, గత వైభవాన్ని వర్తమానంలోకి తీసుకురావడం అంటే కూడా అంతే ఇష్టం.

'మన దేశంలో సినిమా థియేటర్లు కనిపిస్తాయిగానీ నాటకరంగ థియేటర్లు కనిపించవు. నాటకరంగానికి అద్భుతమై చరిత్ర ఉంది. ఆ చరిత్ర గొప్పదనాన్ని వర్తమానంలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాను' అంటుంది శైలజ.

> సృజనాత్మక ప్రయాణంలో ఎన్నో అద్భుతమైన రత్నాలు దొరుకుతాయి. వాటిని ఎలా ఉపయోగించుకున్నామనే దానిపైనే ఫలితం ఆధారపడి ఉంటుంది. రచన నుంచి వాయిస్ ఓవర్ వరకు ఎన్నో పనులు చేశాను. అయితే అవి ఒకదానికి ఒకటి సంబంధంలేని భిన్నమైన పనులు కావు. వాటిలో అంతర్లీనత ఉంటుంది. దాన్ని పట్టుకోగలిగితే మనలోని సృజనను మెరుగుపరుచుకోవచ్చు. కొత్త ప్రయోగాలు చేయడానికి ముందు భయం ఎదురొస్తుంది. ఆ భయాన్ని అధిగమించాల్సిన అవసరం ఉంది.

> కాలేజీలో చదువుకున్న సాహిత్యం వృథా పోలేదు. నా వృత్తి జీవితంలో ఎక్కడో ఒకచోట ఉపయోగపడుతూనే ఉంది. రైటర్‌గా ఉన్నప్పుడు కంటెంట్‌పై దృష్టి పెడతాను. ప్రొడ్యూసర్‌గా ఉన్నప్పుడు క్రియేటర్స్‌పై నమ్మకాన్ని పెట్టుకుంటాను.
> – శైలజ కేజ్రీవాల్

బ్యూటిప్స్

# ఐస్‌క్యూబ్స్‌తో అందం



ఐస్‌క్యూబ్స్‌తో చర్మానికి సరి కొత్త అందాన్ని తీసుకురావచ్చు. చర్మం, మెడ మీద ఉండే నొప్పులు తగ్గిపోతాయి. దీంతోపాటు నలుపు మచ్చలు, ముఖం మీద పేరుకున్న మట్టి తొలగిపోతాయి. రక్త ప్రసరణ మెరుగవటంతో పాటు చర్మంలోని నూనె శాతాన్ని తగ్గించే ఈ ఐస్ క్యూబ్స్ బ్యూటీ టిప్స్‌ను తెలుసుకుందాం.

● ఒక బౌల్‌లో నీళ్లు తీసుకుని అందులో గుప్పెడు తులసి ఆకుల్ని నలిపి వేయాలి. ఆ తర్వాత రెండు స్పూన్ల అలొవెరా జెల్‌ను వేసి బాగా కలపాలి. ఆ నీటిని ఐస్‌క్యూబ్స్ ట్రేలో వేసి ఫ్రిజ్‌లో ఉంచాలి. ఈ ఐస్‌క్యూబ్స్‌తో చర్మాన్ని రుద్దితే ముఖ చర్మం తాజాగా మెరవడంతోపాటు వేడివల్ల వచ్చిన మచ్చలు తొలగి పోతాయి. ● ఐస్‌క్యూబ్స్ ట్రేలో ఒక కప్పు రోజ్‌వాటర్‌తో పాటు కప్పు మంచి నీళ్లు కలపాలి. దీనిని ఫ్రీజర్‌లో ఉంచాలి. ఆ ఐస్‌క్యూబ్స్‌తో మెల్లగా చర్మంపై రుద్దితే ముడతలు తగ్గిపోతాయి. స్కిన్ ఇన్‌ఫెక్షన్స్ దరి చేరవు. దీంతోపాటు ముఖం ఫ్రెష్‌గా ఉన్నట్లు అనిపిస్తుంది. ● ఒక బౌల్‌లో మెత్తగా దంచిన దోసకాయ ముక్కలను వేయాలి. దీనికి ఐదారు చుక్కల నిమ్మరసం కలపాలి. ఇందులో ఐస్ క్యూబ్స్ వేసి కొన్ని గంటల పాటు ఫ్రిజ్‌లో ఉంచి.. తీసిన తర్వాత వీటితో ముఖంపై రబ్ చేయాలి. దీనివల్ల రక్తప్రసరణ సాఫీగా జరిగి నొప్పులు, మొటిమలు తగ్గిపోతాయి. కమిలినట్లుగా ఉన్న ముఖం తాజాగా మారుతుంది. ● చర్మ సౌందర్యానికి కుంకుమ పువ్వుకి సాటి లేదు. కుంకుమ పువ్వును కొంచెం రోజ్ వాటర్‌లో కలపాలి. ఈ రెండిటినీ బాగా కలిపాక.. ఐస్ క్యూబ్స్ ట్రేలో వేసి క్యూబ్స్ తయారు చేసుకోవాలి. వాటితో ముఖం మీద సున్నితంగా మర్దన చేస్తే పిగ్మెంటేషన్, నల్లటి మచ్చలు, మొటిమలు తగ్గిపోతాయి. ముఖ్యంగా స్కిన్‌టోన్ మారిపోతుంది.

■ సక్సెస్ స్టోరీ

# సంకల్పమే సగం బలం

**కుటుంబ సమస్యలు**
**అనారోగ్య సమస్యలు**
**చెడు అలవాట్లు**
**మనల్ని ఎప్పుడూ కుదురుగా ఉండనివ్వవు.**
**వీటికి భయం తోడైతే ఇక చెప్పనే అక్కరలేదు.**
**అలాంటిది మరణం అంచుల్లో ఉండి కూడా**
**ఏమాత్రం భయం లేకుండా**
**సమస్యను ధైర్యంగా ఎదుర్కొని,**
**తనలాంటి మరికొందరికి**
**స్వస్థత చేకూర్చే పనిలో సఫలమవుతోంది మరియ.**

నియతి వి. మరియ ఉండేది ముంబైలో. గురుగ్రామ్‌లో పుట్టి పెరిగిన మరియ ఇంజినీరింగ్ పూర్తి చేశాక ఉద్యోగం వెతుక్కుంటూ ముంబై వెళ్లింది. ఎయిర్ ఇండియాలో ఉద్యోగం వచ్చింది. మూడేళ్లు ఆ ఉద్యోగంలో కొనసాగింది. అప్పుడే కోలుకోలేని అనారోగ్యం,,, క్యాన్సర్ బారిన పడినట్టు తెలుసుకున్న మరియ మానసికంగా ఓడిపోకూడదని నిర్ణయించుకుంది. ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాలు, తన జీవితాన్ని చక్కదిద్దుకున్న వైనం, పది వేల మందికి పైగా స్వస్థత చేకూర్చిన ఆమె ప్రయాణం గురించి తెలుసుకుంటే ఆ సంకల్ప శక్తి మనలోనూ ప్రవేశిస్తుంది. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...



● కార్పొరేట్ ట్రైనర్‌గా...



● నియతి. వి. మరియ

### మలుపులు

''నాది ఆనందకరమైన జీవితమే. అమ్మానాన్నలకు మేం ముగ్గురు కూతుళ్లం. నాన్న బ్యాంకు ఉద్యోగి, అమ్మ టీచర్. ఇంజినీరింగ్ పూర్తిచేసి, ఎయిర్‌లైన్స్ కంపెనీలో ఉద్యోగిగా ఉన్నాను. ఆఫీసులో ఉన్నప్పుడు ఓరోజు గొంతులో గడ్డలాగా అనిపించింది. మొదట టాన్సిల్స్ అనుకున్నాను. అయినప్పటికీ ముందు జాగ్రత్తగా చెక్ చేసుకుంటూనే ఉన్నాను. కానీ, రోజు రోజుకూ గడ్డ పెరుగుతూనే ఉంది. సెలవుల్లో ఇంటికి వెళ్లగానే అమ్మానాన్నకు చెప్పాను. డాక్టర్ సలహా మేరకు పరీక్షలు చేయించుకున్నాను. హెల్త్ రిపోర్ట్స్ చూడగానే నా కాళ్ల కింద నేల కదిలిపోయినట్టుగా అనిపించింది. అప్పటివరకు క్యాన్సర్ అంటే 'ఇతరులకు వచ్చే జబ్బు' అని అనుకునేదాన్ని. క్యాన్సర్ అంటే మరణం అని సినిమాల్లోనూ చూశాను. ఇప్పుడది నా ఒంట్లోనే ఉంది.

### అంగీకరించక తప్పలేదు!

క్యాన్సర్ జబ్బు నా ఒంట్లోనే ఉందని అంగీకరించడానికే చాలా కాలం పట్టింది. చికిత్స తీసుకోవడం మొదలుపెట్టాను. అయితే, కీమోథెరపీకి భయపడ్డాను. అందుకే, హోమియోపతి, ఆయుర్వేద చికిత్సలు కూడా తీసుకున్నాను. రోజులు నెలల్లోకి మారుతున్నాయి. మళ్లీ రిపోర్ట్స్ తీస్తే క్యాన్సర్ నాల్గవదశలో ఉందని తేలింది. డాక్టర్ కీమోథెరపీ తప్పదన్నారు. కీమోథెరపీ గురుగ్రామ్‌లో మొదలైంది. మొత్తం ఆరు సెషన్స్. నాల్గవ సెషన్ పూర్తయ్యేనాటికి జుట్టు 90 శాతం రాలిపోయింది. సెషన్స్ పూర్తయ్యాక తిరిగి ఉద్యోగంలో చేరాను. విగ్ పెట్టుకొని ఆఫీసుకు వెళ్లేదాన్ని. ఈ పరిస్థితి నన్ను శారీరకంగా మానసికంగా కుంగదీసింది.

### భయపడద్దు

ముస్ముందు కీమోథెరపీని ఎలాగైనా నివారించాలనుకున్నాను. అందుకు, ఇంటర్‌నెట్‌లో చాలా శోధించాను. ఈ క్రమంలో హీలింగ్ ప్రాసెసింగ్ పద్ధతులు నా కంటపడ్డాయి. వీటి గురించి తెలుసుకున్న కొద్దీ నాలో నాకే ఓ కొత్తశక్తి వచ్చి చేరినట్టు అనిపించేది. వాటిని ఆచరణలో పెట్టాను. ఆఫీసు వర్క్ పూర్తయ్యాక ఒక రోజు థెరపిస్ట్ దగ్గరకు వెళ్లాను. ఒక విధంగా చెప్పాలంటే అక్కడి సెషన్స్ నా జీవితాన్ని మార్చేశాయి. క్యాన్సర్‌కు భయపడకూడదని, దానితో పోరాడాలని గట్టిగా నిర్ణయించుకున్నాను.

> **మరింత సాధన**
> రకరకాల అనారోగ్య సమస్యలతో ఉన్నవారు నేనిచ్చే సూచనలతో తమ జీవితాల్లో సానుకూల మార్పు వచ్చిందని చెప్పేవారు. దీంతో నాకు ఎంతగానో సాయంగా ఉన్న హీలింగ్ ప్రక్రియలను మరింత గా సాధన చేయడం మొదలుపెట్టాను. ఫలితంగా అనారోగ్యం నుంచి కోలుకున్నాను. పెళ్లి చేసుకొని, ఓ బిడ్డకు తల్లినయ్యాను.

### మనసు– శరీరం

నా ఆరోగ్యం బాగోలేదని అర్థమయ్యాక క్యాన్సర్ అనుభవం నుంచి మనసుకు– శరీరానికి మధ్య గల సంబంధం గురించి తెలుసుకున్నాను. మానసికంగా బలహీనంగా ఉంటే అది శరీరంపైన ఎలాంటి చెడు ప్రభావమైనా చూపుతుంది. ఇందు కోసం హిప్నోథెరపీ గురించి క్షుణ్ణంగా తెలుసుకున్నాను. దీని ద్వారా అంచెలంచెలుగా నన్ను నేను మెరుగు పరుచుకున్నాను. దీనివల్ల చేకూరుతున్న ప్రయోజనాలు, నాలో వస్తున్న మార్పులు చుట్టూ ఉన్నవారిలో ఆసక్తిని రేకెత్తించాయి. దీంతో తెలిసిన వారు, నా సూచనల కోసం వచ్చేవారు.

చేస్తున్న ఎయిర్ ఇండియా ఉద్యోగాన్ని విడిచిపెట్టి, 'ఇదయా కాన్షియస్ లివింగ్'ను ప్రారంభించాను. ఈ పదేళ్లలో దాదాపు ప్రపంచం నలుమూలల వ్యక్తులతో కలిసి పనిచేశాను. ఇప్పటి వరకు పదివేలకు పైగా వ్యక్తుల జీవితాల్లో ఆరోగ్యకరమైన మార్పు తీసుకురాగలిగాను. ప్రజలకు పూర్తి స్వస్థతా చికిత్సపై అవగాహన కలిగించడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. గూగుల్ లాంటి కంపెనీల్లో కార్పొరేట్ ట్రైనర్‌గా పనిచేశాను. హిప్నోబర్తింగ్ ద్వారా ప్రసవ సమయంలో ఎలాంటి పద్ధతుల ద్వారా సుఖ ప్రసవం అవుతుందో కూడా నేర్పిస్తుంటాను. ఎవ్వరైనా సరే ఏ అనారోగ్య సమస్య వచ్చినా ముందు మానసికంగా కుంగిపోకూడదు. మనసు దృఢంగా ఉంటే ఎలాంటి యుద్ధంలోనైనా గెలవగలరు'' అని వివరిస్తుంది మరియ.



## ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే ముంబై ఇండియన్స్ జట్టుకు కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్‌ను నియమించారు. భారత కెప్టెన్ అయిన హర్మన్‌ప్రీత్ ఇటీవల టి20 ప్రపంచకప్ సందర్భంగా 150 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు ఆడిన తొలి క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పిన సంగతి తెలిసిందే. బీసీసీఐ ఆధ్వర్యంలో డబ్ల్యూపీఎల్ తొలి సీజన్ ఈనెల 4 నుంచి 26 వరకు ముంబైలో జరుగుతుంది. లీగ్ తొలి రోజు తొలి మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్‌తో ముంబై ఇండియన్స్ ఆడుతుంది.

## ఇంగ్లండ్‌ను గెలిపించిన మలాన్

బంగ్లాదేశ్‌తో మిర్పూర్‌లో బుధవారం జరిగిన తొలి వన్డేలో ఇంగ్లండ్ మూడు వికెట్లతో గెలిచింది. 210 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ 48.4 ఓవర్లలో 7 వికెట్లకు 212 పరుగులు చేసి నెగ్గింది. డేవిడ్ మలాన్ (114 నాటౌట్; 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ సెంచరీతో ఇంగ్లండ్‌ను గెలిపించాడు. తొలుత బంగ్లాదేశ్ 47.2 ఓవర్లలో 209 పరుగులకు ఆలౌటైంది. ఆర్చర్, వుడ్, మొయిన్ అలీ, ఆదిల్ రషీద్ రెండేసి వికెట్లు తీశారు.



# భారత్ 109 ఆలౌట్

- ఆసీస్ స్పిన్ ఉచ్చులో గిలగిల
- దెబ్బ తీసిన కునెమన్, లయన్
- రాణించిన ఖాజా; ఆసీస్ 156/4

**నిజంగానే నిజం!** **109 పరుగులకే ఆలౌటైంది ఆస్ట్రేలియా కాదు... భారతే! గత రెండు టెస్టుల్లో ఎదురులేని టీమిండియా జోరు చూసినోళ్లకు ఇది కచ్చితంగా షాకే! చూసినోళ్లకే కాదు... మైదానంలో ఆడుతున్న భారత్‌కూ ఊహించని షాక్. గత రెండు టెస్టుల్లో తమ భరతం పట్టిన ఆతిథ్య జట్టును ఆసీస్ దెబ్బ తీసింది. అనంతరం బ్యాటింగ్‌లో నిలకడగా ఆడుతూ తొలిరోజే పటిష్టమైన ఆధిక్యానికి శ్రీకారం చుట్టింది.**



ఖాజా

ఇండోర్: తనదైన రోజున ఓ ఆటగాడిని లేదంటే జట్టుని అంత తేలిగ్గా తీసుకోరాదనేది ఇండోర్ టెస్టు మొదలైన రోజును చూస్తే ఇట్టే అర్థమవుతుంది. ఆస్ట్రేలియా స్పిన్ ద్వయం కునెమన్ (5/16), లయన్ (3/35) టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌ను ఒక్క సెషన్‌లోనే కుదేలు చేసింది. దీంతో మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ 33.2 ఓవర్లలో 109 పరుగులకే కుప్పకూలింది. కోహ్లి (52 బంతుల్లో 22; 2 ఫోర్లు) టాప్ స్కోరర్! అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆస్ట్రేలియా 54 ఓవర్లలో 4 వికెట్లకు 156 పరుగులు చేసింది. 47 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. చేతిలో ఇంకా 6 వికెట్లున్నాయి. ఓపెనర్ ఉస్మాన్ ఖాజా (147 బంతుల్లో 60; 4 ఫోర్లు) రాణించాడు. జడేజాకు 4 వికెట్లు దక్కాయి.

**రాహుల్ స్థానంలో గిల్**

కెప్టెన్ రోహిత్ ఫామ్‌లో లేని రాహుల్‌ను కాదని శుబ్‌మన్ గిల్‌తో ఇన్నింగ్స్ ఓపెన్ చేశాడు. సీమ్ బౌలింగ్‌ను చక్కగా ఎదుర్కోవడం, బౌండరీలు సులువుగా రావడంతో అనుభవజ్ఞుడైన స్మిత్ ఆరో ఓవర్లోనే స్పిన్నర్ కునెమన్‌ను దించాడు. ఈ ఎత్తు ఫలితమివ్వగా... కెప్టెన్ రోహిత్ (23 బంతుల్లో 12; 3 ఫోర్లు) స్టంపౌటయ్యాడు. తన మరుసటి ఓవర్లో గిల్ (18 బంతుల్లో 21; 3 ఫోర్లు)ను పెవిలియన్ చేర్చాడు. దీంతో కెప్టెన్ స్మిత్ బంతిని పూర్తిగా స్పిన్నర్ల చేతుల్లోనే పెట్టాడు. లయన్ కూడా తన తొలి ఓవర్లోనే వెటరన్ పుజారా (1)ను అసాధారణ టర్న్‌తో బౌల్డ్ చేశాడు. 36 పరుగులకే టాపార్డర్ పెవిలియన్‌కెళ్లింది. లయన్ తన తదుపరి ఓవర్లో జడేజా (4)ను బోల్తా కొట్టించాడు. స్లో డెలివరీని బౌండరీ కొట్టాలనుకుంటే అక్కడే ఉన్న కునెమన్ చురుగ్గా అందుకున్నాడు. మరుసటి ఓవర్లో... అదికూడా కేవలం 2 బంతుల వ్యవధిలోనే శ్రేయస్ అయ్యర్ (0) విస్మయపరిచే రీతిలో వెనుదిరిగాడు. కునెమన్ బంతి అయ్యర్ బ్యాట్ అంచును తగిలి వికెట్లను తాకీతాకనట్లుగా వెళ్లింది. బెయిల్ నెమ్మదిగా కిందకు పడటం... ఈ లోపు కీపర్ నుంచి బంతి వికెట్ల వైపు రీబౌండ్ కావడంతో అయ్యర్ తాను అవుట్ కాదనే భ్రమలో ఉండిపోయాడు. టీవీ అంపైర్ రీప్లే చూసి అవుటివ్వడంతో క్రీజు వీడక తప్పలేదు. 11.2 ఓవర్లలో 45 పరుగులకే సగం (5) వికెట్లు కూలడంతో భారత్ కష్టాల్లో పడింది. అందరి కంటే ఎక్కువ బంతులు, ఎక్కువసేపు క్రీజులో నిలిచిన కోహ్లిని మూడో స్పిన్నర్ మర్ఫీ ఎల్బీగా పంపాడు. కోహ్లి రివ్యూకెళ్లినా ఫలితం లేకపోయింది. శ్రీకర్ భరత్ (17; 1 ఫోర్, 1 సిక్స్) కూడా త్వరగానే అవుటయ్యాడు. 84/7 స్కోరు వద్ద లంచ్‌కెళ్లిన భారత్... రెండో సెషన్ మొదలైన కాసేపటికే 100 పరుగుల్ని కష్టంగా దాటి... అంతలోపే ఆలౌటైంది.

**2** కపిల్ దేవ్ తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లో 500 వికెట్లు తీసుకోవడంతోపాటు 5000 పరుగులు పూర్తి చేసిన రెండో భారతీయ క్రికెటర్‌గా రవీంద్ర జడేజా నిలిచాడు.

**1** టెస్టుల్లో వరుసగా రెండు ఇన్నింగ్స్‌లలో ఎక్స్‌ట్రాలు ఇవ్వని తొలి జట్టుగా ఆస్ట్రేలియా నిలిచింది. ఢిల్లీలో జరిగిన రెండో టెస్టు నాలుగో ఇన్నింగ్స్‌లో, మూడో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ బౌలర్లు ఎక్స్‌ట్రాలు ఇవ్వలేదు.




పుజారా బౌల్డ్

### స్కోరు వివరాలు

**భారత్ తొలి ఇన్నింగ్స్:** రోహిత్ (స్టంప్డ్) క్యారీ (బి) కునెమన్ 12; గిల్ (సి) స్మిత్ (బి) కునెమన్ 21; పుజారా (బి) లయన్ 1; విరాట్ కోహ్లి (ఎల్బీడబ్ల్యూ) (బి) మర్ఫీ 22; రవీంద్ర జడేజా (సి) కునెమన్ (బి) లయన్ 4; శ్రేయస్ అయ్యర్ (బి) కునెమన్ 0; భరత్ (ఎల్బీడబ్ల్యూ) (బి) లయన్ 17; అక్షర్ పటేల్ (నాటౌట్) 12; అశ్విన్ (సి) క్యారీ (బి) కునెమన్ 3; ఉమేశ్ యాదవ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) కునెమన్ 17; సిరాజ్ (రనౌట్) 0; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం** (33.2 ఓవర్లలో ఆలౌట్) 109. **వికెట్ల పతనం:** 1-27, 2-34, 3-36, 4-44, 5-45, 6-70, 7-82, 8-88, 9-108, 10-109. **బౌలింగ్:** మిచెల్ స్టార్క్ 5-0-21-0, కామెరాన్ గ్రీన్ 2-0-14-0, కునెమన్ 9-2-16-5, నాథన్ లయన్ 11.2-2-35-3, మర్ఫీ 6-1-23-1.

**ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** ట్రావిస్ హెడ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జడేజా 9; ఉస్మాన్ ఖాజా (సి) గిల్ (బి) జడేజా 60; లబుషేన్ (బి) జడేజా 31; స్టీవ్ స్మిత్ (సి) భరత్ (బి) జడేజా 26; హ్యాండ్స్‌కాంబ్ (బ్యాటింగ్) 7; గ్రీన్ (బ్యాటింగ్) 6; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (54 ఓవర్లలో 4 వికెట్లకు) 156. వికెట్ల పతనం:** 1-12, 2-108, 3-125, 4-146. **బౌలింగ్:** అశ్విన్ 16-2-40-0, రవీంద్ర జడేజా 24-6-63-4, అక్షర్ పటేల్ 9-0-29-0, ఉమేశ్ యాదవ్ 2-0-4-0, సిరాజ్ 3-0-7-0.

## తొలి రౌండ్‌లోనే శ్రీజ ఓటమి



గోవా: ప్రపంచ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) గోవా కంటెండర్ అంతర్జాతీయ టోర్నమెంట్ నుంచి జాతీయ చాంపియన్, భారత స్టార్ ఆకుల శ్రీజ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో ప్రపంచ 83వ ర్యాంకర్ శ్రీజ 2-11, 13-11, 8-11, 2-11తో ప్రపంచ 39వ ర్యాంకర్ హనా గొడా (ఈజిప్ట్) చేతిలో ఓడిపోయింది. ఇతర మ్యాచ్‌ల్లో భారత నంబర్‌వన్, ప్రపంచ 34వ ర్యాంకర్ మనిక బత్రా 11-4, 11-8, 11-5తో టిన్ టిన్ హో (ఇంగ్లండ్)పై, సుతీర్థ ముఖర్జీ 11-7, 11-7, 8-11, 11-8తో సుహానా సైని (భారత్)పై గెలిచి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు.

## 'నంబర్‌వన్' అశ్విన్

ఐసీసీ టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్



దుబాయ్: ఆస్ట్రేలియాతో రెండో టెస్టులో ఆరు వికెట్లు పడగొట్టిన ప్రదర్శన... భారత మేటి స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌ను మళ్లీ ప్రపంచ నంబర్‌వన్ బౌలర్‌గా చేసింది. బుధవారం విడుదల చేసిన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) బౌలర్ల ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ పేస్ బౌలర్ జేమ్స్ అండర్సన్‌ను రెండో స్థానానికి పంపించి అశ్విన్ నంబర్‌వన్ స్థానాన్ని అందుకున్నాడు. 36 ఏళ్ల అశ్విన్ తొలిసారి 2015లో టాప్ ర్యాంక్‌లో నిలిచాడు. ఆ తర్వాత పలుమార్లు అతను ఈ ఘనత సాధించాడు. గత మూడు వారాల్లో టాప్ ర్యాంక్‌లో ముగ్గురు వేర్వేరు బౌలర్లు నిలవడం విశేషం. అండర్సన్‌కంటే ముందు ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఈ స్థానంలో ఉన్నాడు. ఇప్పటివరకు 90 టెస్టులు ఆడిన అశ్విన్ 463 వికెట్లు పడగొట్టాడు. ఈ చెన్నై స్పిన్నర్ 864 రేటింగ్ పాయింట్లతో తాజాగా అగ్రస్థానానికి చేరుకోగా... అండర్సన్ 859 పాయింట్లతో రెండో స్థానానికి పడిపోయాడు. కమిన్స్ మూడో స్థానానికి చేరుకోగా... భారత్‌కే చెందిన బుమ్రా నాలుగో ర్యాంక్‌లో, షాహీన్ అఫ్రిది (పాకిస్తాన్) ఐదో ర్యాంక్‌లో ఉన్నారు. టెస్టు ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో రవీంద్ర జడేజా తొలి స్థానంలో, అశ్విన్ రెండో స్థానంలో, అక్షర్ పటేల్ ఐదో స్థానంలో ఉన్నారు.

## యశస్వి డబుల్ సెంచరీ



గ్వాలియర్: రంజీ చాంపియన్ మధ్యప్రదేశ్ జట్టుతో జరుగుతున్న ఇరానీ కప్ మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ ఇండియా జట్టు భారీ స్కోరు దిశగా సాగుతోంది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి రెస్ట్ ఆఫ్ ఇండియా 87 ఓవర్లలో 3 వికెట్లకు 381 పరుగులు సాధించింది. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (2) విఫలమయ్యాడు. యశస్వి జైస్వాల్ (259 బంతుల్లో 213; 30 ఫోర్లు, 3 సిక్స్‌లు) డబుల్ సెంచరీతో... అభిమన్యు ఈశ్వరన్ (240 బంతుల్లో 154; 17 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగిపోయారు. వీరిద్దరు రెండో వికెట్‌కు 371 పరుగులు జోడించడం విశేషం. సౌరభ్ కుమార్ (0 బ్యాటింగ్), బాబా ఇంద్రజిత్ (3 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. మధ్యప్రదేశ్ బౌలర్ అవేశ్ ఖాన్ రెండు వికెట్లు తీశాడు.

## క్వార్టర్స్‌లో సాకేత్–యూకీ జోడీ



దుబాయ్: 'లక్కీ లూజర్' హోదాలో మెయిన్ 'డ్రా'లో చోటు సంపాదించిన సాకేత్ మైనేని–యూకీ బాంబ్రీ (భారత్) జోడీ దుబాయ్ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్–యూకీ బాంబ్రీ ద్వయం 6-3, 7-5తో మెలో (బ్రెజిల్)–జ్వెరెవ్ (జర్మనీ) జోడీపై నెగ్గింది. 73 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో సాకేత్–యూకీ మూడు ఏస్‌లు సంధించి, మూడుసార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేశారు. వాస్తవానికి క్వాలిఫయింగ్ చివరి రౌండ్‌లో సాకేత్–యూకీ ఓడిపోయి మెయిన్ 'డ్రా'కు అర్హత పొందలేకపోయారు. అయితే మెయిన్ 'డ్రా' నుంచి ఒక జోడీ వైదొలిగింది. దాంతో క్వాలిఫయింగ్ చివరి రౌండ్‌లో ఓడిన సాకేత్–యూకీలకు మెయిన్ 'డ్రా'లో చోటు ఇచ్చారు. మరో మ్యాచ్‌లో రోహన్ బోపన్న (భారత్)–ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) 5-7, 6-4, 7-10తో మెక్‌టిక్–పావిచ్ (క్రొయేషియా) చేతిలో ఓడిపోయారు.

## దక్షిణాఫ్రికాకు ఆధిక్యం

సెంచూరియన్: వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టులో రెండో రోజు ఆట ముగిసేసరికి దక్షిణాఫ్రికా జట్టు 179 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 314/8తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా 342 పరుగులవద్ద ఆలౌటైంది. అనంతరం అన్రిచ్ నోర్జే (5/36), రబడ (2/44), కోట్జీ (2/45) ధాటికి వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 212 పరుగులకే పరిమితమైంది. 130 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా ఆట ముగిసే సమయానికి 4 వికెట్లు కోల్పోయి 49 పరుగులు చేసింది. మార్క్‌రమ్ (35 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.

# సినిమా



● ఎన్టీఆర్, రామ్‌చరణ్

## ఆస్కార్ వేదికపై నాటు నాటు...

● రామ్‌చరణ్ రిటర్న్ గిఫ్ట్

ఆస్కార్ వేదికపై తెలుగు 'నాటు నాటు' మారుమోగనుంది. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన చిత్రం 'ఆర్ఆర్ఆర్'. 95వ ఆస్కార్ అవార్డ్స్‌లో 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో ఈ చిత్రంలోని 'నాటు నాటు' పాట నామినేట్ అయిన సంగతి తెలిసిందే. మార్చి 12న (భారతీయ కాలమానం ప్రకారం మార్చి 13) జరగనున్న ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవంలో 'నాటు నాటు..' పాటను పాడిన గాయకులు కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్ లైవ్‌లో పాడనున్నట్లు ఆస్కార్ కమిటీ అధికారికంగా ప్రకటించింది. యం.యం. కీరవాణి స్వరపరిచిన ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించగా ప్రేమ్ రక్షిత్ కొరియోగ్రఫీ చేసిన విషయం తెలిసిందే.

**అమెరికాలోనే 'ఆర్ఆర్ఆర్' టీమ్**

ఆస్కార్ అవార్డుల వేడుక దగ్గర పడటంతో 'ఆర్ఆర్ఆర్' టీమ్ ప్రమోషనల్ యాక్టివిటీస్‌ను వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. ఇందుకోసం రాజమౌళి, ఆయన సతీమణి రమ, కీరవాణి తదితరులు అమెరికాలో ఉన్నారని తెలిసిది. ఆస్కార్‌కి సంబంధించిన వరుస ఈవెంట్స్‌లో పాల్గొనేందుకు రామ్‌చరణ్ కూడా ఈ నెల 12కు వరకు యూస్‌లోనే ఉంటారట. మరో హీరో ఎన్టీఆర్ వీరిని త్వరలో జాయిన్ కానున్నారు. అలాగే ఇటీవల ఆస్కార్ నిర్వాహకులు అవార్డుల నామినీల కోసం ఏర్పాటు చేసిన లంచ్‌కు కీరవాణి, చంద్రబోస్ హాజరైన విషయం తెలిసిందే. ఈ నెల 9న అమెరికాలో నామినీల కోసం డిన్నర్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ విందులో కీరవాణి, చంద్రబోస్ పాల్గొననున్నారు.

**ఎన్టీఆర్... చరణ్... హుక్ స్టెప్?**

ఆస్కార్ వేదికపై 'నాటు నాటు' పాటను లైవ్‌లో సింగర్స్ రాహుల్ సిప్లిగంజ్, కాలభైరవ పాడతారు కాబట్టి డ్యాన్స్ పెర్ఫార్మెన్స్ కూడా ఉంటే బాగుంటుందని పలువురు నెటిజన్లు పోస్ట్ చేస్తున్నారు. వీటికి తోడు ఇటీవల ఓ అమెరికా మీడియాకు రామ్‌చరణ్ ఇంటర్వ్యూ ఇస్తూ...''ఇప్పటివరకు ప్రేక్షకులు మాకు చాలానే ఇచ్చారు. నా ప్రేమను ప్రేక్షకులకు చూపించడానికి 'నాటు నాటు' పాటను ఆస్కార్ లైవ్‌లో ప్రదర్శించడం ఓ మార్గంలా భావిస్తున్నాను. ఇది నేను వారికి ఇచ్చే రిటర్న్ గిఫ్ట్‌లా అనుకుంటున్నాను'' అని పేర్కొన్నారు. దీంతో ఆస్కార్ వేదికపై 'నాటు నాటు' పాటకు ఎన్టీఆర్, చరణ్ డ్యాన్స్ చేస్తారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. అయితే మరో ఇంటర్వ్యూలో రామ్‌చరణ్ 'నాటు నాటు' పాట గురించి మాట్లాడుతూ– ''ఈ పాట చిత్రీకరణ సమయంలో దాదాపు 300మంది ప్రొఫెషనల్ డ్యాన్సర్లు సెట్స్‌లో ఉన్నారు. 7 రోజుల రిహార్సల్స్ తర్వాత 17 రోజుల పాటు ఈ పాటను షూట్ చేశాం.. 'నాటు నాటు' పాటను మేం ప్రదర్శించిన ప్రతిచోటా మంచి స్పందన లభిస్తోంది. అలా అని అన్ని చోట్లా చేయలేం. ఇక ఆస్కార్ నిర్వాహకులు రిక్వెస్ట్ చేస్తే, టైమ్ కలిసొస్తే 'నాటు నాటు' పాట పెర్ఫార్మ్ చేస్తాం. అయితే పాట మొత్తం ప్రదర్శించడం అనేది కష్టం. ఎందుకంటే ఈ పాటకు స్టెప్స్ వేసే టైమ్‌లో చాలా బ్రీత్ కావాలి, ఎనర్జీ ఉండాలి. కానీ చాన్స్ ఉంటే 'నాటు నాటు'లోని 'హుక్ స్టెప్'ను ఎందుకు ప్రయత్నించకూడదు? అను కుంటున్నాను'' అని పేర్కొన్నారు. మరి.. ఎన్టీఆర్, చరణ్‌ల లైవ్ పెర్ఫార్మెన్స్ ఉంటుందా? లేదా అనేది 13న తెలిసిపోతుంది.

## స్టైలిష్ రావణాసుర



● రవితేజ

హీరో రవితేజ వేసవిలో థియేటర్లలో సందడి చేయనున్నారు. ఆయన హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'రావణాసుర'. ఈ చిత్రంలో సుశాంత్ కీలక పాత్ర చేయగా, మేఘా ఆకాష్, అనూ ఇమ్మాన్యుయేల్, ఫరియా అబ్దుల్లా, దక్షా నగార్కర్, పూజిత పొన్నాడ హీరోయిన్లుగా నటించారు. అభిషేక్ నామా, రవితేజ నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 7న రిలీజ్ కానుంది. ఈ చిత్రం టీజర్‌ని ఈ నెల 6న రిలీజ్ చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించి, ఓ పోస్టర్ విడుదల చేసింది. ''స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'రావణాసుర'. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, భీమ్స్ సిసిరోలియో, కెమెరా: విజయ్ కార్తీక్ కన్నన్.



● సుధీర్‌బాబు

## మాస్ దుర్గ

సుధీర్‌బాబు మూడు పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మామా మశ్చీంద్ర'. హర్షవర్ధన్ దర్శకత్వంలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు తెలుగు, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దుర్గ, పరశురామ్, డీజే.. ఈ మూడు పాత్రల్లో కనిపిస్తారు సుధీర్ బాబు. మాస్‌గా కనిపించే దుర్గ లుక్‌ని బుధవారం రిలీజ్ చేశారు. ''డిఫరెంట్ కాన్సెప్ట్‌తో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది. ఈ నెల 4న పరశురామ్ లుక్‌ని, 7న డీజే లుక్‌ని రిలీజ్ చేయనున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: చేతన్ భరద్వాజ్, కెమెరా: పీజీ విందా, సమర్పణ: సోనాలి నారంగ్, సృష్టి (సృష్టి సెల్యులాయిడ్).

## పెళ్లి సందడి



● మనోజ్

మంచు మనోజ్ పెళ్లి సందడి మొదలైంది. దివంగత ఎమ్మెల్యేలు భూమా నాగిరెడ్డి, శోభా నాగిరెడ్డి దంపతుల రెండో కుమార్తె భూమా మౌనికా రెడ్డితో మనోజ్ వివాహం రేపు జరగనుంది. వివాహ వేడుకల్లో భాగంగా మెహందీ వేడుక బుధవారం జరిగింది. కాగా కొద్దిమంది బంధువులు, సన్నిహితులు, శ్రేయోభిలాషుల సమక్షంలో హైదరాబాద్‌లో వీరి వివాహం జరగనుందని తెలిసింది. ఇక సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం 'వాట్ ది ఫిష్' అనే సినిమా చేస్తున్నారు మనోజ్.

## తెలివైన తీక్షణ



● ప్రియాంక

ప్రముఖ నటుడు ఉపేంద్ర భార్య, నటి ప్రియాంకా ఉపేంద్ర టైటిల్ రోల్ చేస్తున్న చిత్రం 'డిటెక్టివ్ తీక్షణ'. ఆమె కెరీర్‌లో 50వ చిత్రంగా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాకు త్రివిక్రమ్ రఘు దర్శకుడు. గుత్తముని ప్రసన్న, జి. మునివెంకట్ చరణ్, బి. పురుషోత్తం నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, బెంగాలీ భాషల్లో రిలీజ్ కానున్న ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ప్రియాంక మాట్లాడుతూ– ''డిటెక్టివ్ తీక్షణ' ప్రస్తుత పరిస్థితులకు అద్దం పట్టేలా ఉంటుంది. ఒక మహిళా పోలీసాఫీసర్ ఎంత ఇంటిలిజెంట్‌గా ఓ క్రైమ్‌ను సాల్వ్ చేసిందనేది ఆసక్తికరంగా ఉంటుంది. మహిళలకు ఈ సినిమా ఓ స్ఫూర్తిలా ఉంటుంది'' అని చెప్పారు.

## సైకో థ్రిల్లర్



● ధన్సిక

'కబాలి' ఫేమ్ సాయి ధన్సిక ప్రధాన పాత్రలో నటించిన చిత్రం సైకో థ్రిల్లర్ 'దక్షిణ'. 'మంత్ర', 'మంగళ' చిత్రాల దర్శకుడు ఓషో తులసీరామ్ తెరకెక్కించిన ఈ చిత్రాన్ని అశోక్ షిండే నిర్మించారు. ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా అశోక్ షిండే మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో సాయి ధన్సిక పవర్‌ఫుల్ ఐపీఎస్ అధికారి పాత్రలో నటించారు. 'మంత్ర', 'మంగళ' తరహాలో 'దక్షిణ' కూడా ట్రెండ్ సెట్ చేస్తుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: బాలాజీ, కెమెరా: నర్సింగ్.



● అనుష్క ● నవీన్

## మిస్ రవళి శెట్టి.. మిస్టర్ సిద్ధు పొలిశెట్టి

అనుష్క, నవీన్ పొలిశెట్టి జంటగా ఓ సినిమా రానున్న విషయం తెలిసిందే. పి. మహేష్ బాబు దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్‌పై వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రానికి 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. అనుష్క, నవీన్ పాత్రల పేర్లు కలిసి వచ్చేలా టైటిల్‌ని ప్రకటించి, ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. ''ఈ సినిమాలో సిద్ధు పొలిశెట్టి అనే స్టాండప్ కమెడియన్‌గా నవీన్, అన్విత రవళి శెట్టి అనే చెఫ్ పాత్రలో అనుష్క నటించారు. ''మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' టైటిల్ సినిమా కథకు సరిపోయేలా ఉంటుంది. ఈ చిత్రాన్ని వేసవిలో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: రధన్, కెమెరా: నీరవ్ షా.

## మిస్టరీ ఏంటి?



● రవిశంకర్

రవిశంకర్, జేడీ ఆకాష్, సయ్యద్ ఇర్ఫాన్, సుమితా బజాజ్, సహర్ అఫ్సహ, వీరు ప్రధాన పాత్రల్లో హెచ్ఎమ్ శ్రీనందన్ దర్శకత్వం వహించిన చిత్రం 'కరాళ'. బోదాసు నర్సింహ నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధమైంది. ఈ చిత్రం కన్నడలో 'బీగా' పేరుతో ఈ నెల 3న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో 'కరాళ' చిత్రం ట్రైలర్‌ను నిర్మాతలు ప్రసన్న కుమార్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ విడుదల చేశారు. బోదాసు నర్సింహ మాట్లాడుతూ– ''నాకు సినిమాపై అవగాహన లేదు. శ్రీనందన్ చెప్పిన కథ నచ్చి, నిర్మించాను'' అన్నారు. ''సైంటిఫిక్ మిస్టరీ చిత్రమిది'' అన్నారు శ్రీనందన్. సహనిర్మాత పిట్ల భాస్కర్, సంగీతదర్శకుడు శ్రీ గురు తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి నేపథ్య సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: ఎమ్‌బి అల్లికట్టి, వీనస్ నాగరాజ్ మూర్తి.

## పోలీస్ మీటర్



● కిరణ్

కిరణ్ అబ్బవరం, అతుల్య రవి జంటగా నటించిన తాజా చిత్రం 'మీటర్'. ఈ చిత్రం ద్వారా రమేష్ కాదూరి దర్శకునిగా పరిచయమవుతున్నారు. చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రాన్ని ఏప్రిల్ 7న విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. చిరంజీవి (చెర్రీ), హేమలత పెదమల్లు మాట్లాడుతూ– ''మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'మీటర్'. ఈ చిత్రంలో కిరణ్ అబ్బవరం పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించబోతున్నారు'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సాయి కార్తీక్, కెమెరా: వెంకట్ .సి దిలీప్–సురేష్ సారంగం, సమర్పణ: మైత్రీ మూవీ మేకర్స్ (నవీన్ ఎర్నేని, రవి శంకర్ యలమంచిలి).

## ప్రేమిస్తే ప్రశాంతం



● గగన్, అవ్యక్త

గగన్ విహారి, అవ్యక్త జంటగా బి. రామచంద్ర శ్రీనివాస కుమార్ దర్శకత్వంలో ఆరంభమైన చిత్రం 'గాంగేయ'. ఎం. విజయ శేఖర్ రెడ్డి సమర్పణలో విజయ గౌతమి ఆర్ట్ మూవీస్‌పై టి. హేమకుమార్ రెడ్డి నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి ఎం. విజయ శేఖర్ రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, డైరెక్టర్ సముద్ర క్లాప్ కొట్టారు. బి. రామచంద్ర శ్రీనివాస కుమార్ మాట్లాడుతూ– ''రామానాయుడు గారిలా కుటుంబ సమేతంగా చూసేలా ఈ సినిమాను నిర్మిస్తున్నాం. మనిషి మనిషిని ప్రేమిస్తేనే శాంతి ఉంటుందనే పాయింట్‌తో తీస్తున్నాం'' అన్నారు. ''గాంగేయ'ని తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో నిర్మిస్తున్నాం'' అన్నారు టి. హేమకుమార్ రెడ్డి. ''చాలా మంచి కథతో ఈ చిత్రం రాబోతోంది'' అన్నారు ఎం. విజయ్ శేఖర్ రెడ్డి.

**స్టాక్ మార్కెట్లు**

దేశీ సూచీలు

| సెన్సెక్స్ ▲ | నిఫ్టీ ▲ |
|---|---|
| 449 | 147 |
| 59,411 | 17,451 |

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

| సూచీ | విలువ | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 11,430 | ▽ | 25 |
| డోజోన్స్ | 32,732 | ▲ | 75 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,915 | ▲ | 39 |
| డాక్స్ | 15,305 | ▽ | 60 |
| సాంఘై | 3,312 | ▲ | 33 |
| నికాయ్ | 27,517 | ▲ | 71 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

**బులియన్** రూ.లలో — ముంబై

| | | |
|---|---|---|
| బంగారం (24 క్యారట్) | 56,140 | ▲ 1017 |
| బంగారం (22 క్యారట్) | 55,915 | ▲ 1015 |
| వెండి (కిలో) | 64,246 | ▲ 1476 |

**ఫారెక్స్ రేట్లు** రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | | 81.73 | 83.40 |
| £ | బ్రిటన్ పౌండ్ | | 97.78 | 101.06 |
| € | యూరో | | 85.97 | 89.01 |
| ¥ | జపాన్ ఎన్ (100) | | 59.61 | 61.52 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | | 54.59 | 56.98 |
| S$ | సింగపూర్ డాలర్ | | 60.33 | 62.28 |
| SAR | సౌదీ రియాల్ | | 21.00 | 22.68 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | | 21.56 | 23.36 |
| ¥ | చైనా యువాన్ | | 10.89 | 12.96 |

## కెనరా బ్యాంక్‌కు ఎంఎస్‌ఎంఈ ఎక్సలెన్స్ అవార్డు



హైదరాబాద్: ప్రభుత్వ రంగ కెనరా బ్యాంక్‌ను 'ఎంఎస్‌ఎంఈ బ్యాంకింగ్ ఎక్సలెన్స్ అవార్డు 2022' వరించింది. దేశంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా వ్యాపారాలను ప్రోత్సహించే దిశగా బ్యాంక్ అందించిన సేవలకుగానూ ఈ ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. ఢిల్లీలోని చాంబర్ ఆఫ్ ఇండియన్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ఈ అవార్డు అందించింది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ చేతుల మీదుగా బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ భవేంద్ర కుమార్ ఈ అవార్డును అందుకున్నారు.

## ఇక ఒలెక్ట్రా ఈ-టిప్పర్స్..



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మేఘా ఇంజినీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అనుబంధ కంపెనీ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ భారత్‌లో తొలిసారిగా తయారు చేసిన 6x4 హెవీ డ్యూటీ ఎలక్ట్రిక్ టిప్పర్స్‌కు హోమోలోగేషన్ ధ్రువీకరణ లభించింది. ఆటోమోటివ్ రీసర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నుంచి ఈ సర్టిఫికెట్ సాధించింది. రహదారులకు టిప్పర్ అనువైనదో లేదో తెలుసుకునేందుకు పర్వత ప్రాంతాలు, ఎత్తయిన ప్రదేశాలు, మైనింగ్, క్వారీల్లో పరీక్షలు చేసి ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారు. దేశంలోనే మొట్టమొదటి సర్టిఫైడ్ హెవీ డ్యూటీ ఈ-టిప్పర్‌గా ఇది నిలిచిందని ఒలెక్ట్రా సీఎండీ కె.వి.ప్రదీప్ తెలిపారు. 20 ఈ-టిప్పర్ల సరఫరాకై ఒక సంస్థతో చర్చలు తుది దశలో ఉన్నాయని చెప్పారు. వివిధ వేరియంట్లలో ఈ వాహనాన్ని విడుదల చేస్తామన్నారు. నిర్మాణం, మౌలిక సదుపాయాలు, మైనింగ్, క్వారీ రంగాల్లో ఇది గణనీయమైన మార్పును తేనుందని వివరించారు.

# జీఎస్‌టీ వసూళ్లు రూ.1.49 లక్షల కోట్లు

**ఫిబ్రవరి గణాంకాల వెల్లడి • 2022 ఇదే నెలతో పోల్చితే 12 శాతం అధికం**

న్యూఢిల్లీ: భారత్ వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు ఫిబ్రవరిలో 2022 ఇదే నెలతో పోల్చితే 12 శాతం పెరిగి రూ.1.49 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. దేశీయ ఆర్థిక క్రియాశీలత, వినియోగ వ్యయాల పటిష్టత దీనికి కారణం. అయితే 2023 జనవరితో పోల్చితే (రూ.1.55 లక్షల కోట్లు. జీఎస్‌టీ ప్రవేశపెట్టిన 2017 జూలై 1 తర్వాత రెండవ అతి భారీ వసూళ్లు) వసూళ్లు తగ్గడం గమనార్హం. అయితే ఫిబ్రవరి నెల 28 రోజులే కావడం కూడా ఇక్కడ పరిశీలనలోకి తీసుకోవాల్సిన అంశమని ఆర్థిక శాఖ వర్గాలు పేర్కొన్నాయి. విభాగాల వారీగా చూస్తే...

- మొత్తం రూ.1,49,577 కోట్ల వసూళ్లలో సెంట్రల్ జీఎస్‌టీ రూ.27,662 కోట్లు.
- స్టేట్ జీఎస్‌టీ రూ.34,915 కోట్లు.
- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.75,069 కోట్లు (వస్తు దిగుమతులపై రూ.35,689 కోట్లుసహా).
- సెస్ రూ.11,931 కోట్లు (వస్తు దిగుమతులపై రూ.792 కోట్లుసహా). కాగా, జీఎస్‌టీ ప్రారంభమైన తర్వాత సెస్ వసూళ్లు ఈ స్థాయిలో జరగడం ఇదే తొలిసారి.
- 'ఒకే దేశం- ఒకే పన్ను' నినాదంతో 2017 జూలైలో పలు రకాల పరోక్ష పన్నుల స్థానంలో ప్రారంభమైన జీఎస్‌టీ వ్యవస్థలో 2022 ఏప్రిల్‌లో వసూళ్లు రికార్డు స్థాయిలో రూ.1,67,650 కోట్లుగా నమోదయ్యాయి.




**2022 ఏప్రిల్ నుంచి ఇలా...**

| నెల | జీఎస్‌టీ ఆదాయం (రూ.కోట్లలో) |
|---|---|
| ఏప్రిల్ 2022 | 1,67,650 |
| మే | 1,40,885 |
| జూన్ | 1,44,616 |
| జూలై | 1,48,995 |
| ఆగస్టు | 1,43,612 |
| సెప్టెంబర్ | 1,47,686 |
| అక్టోబర్ | 1,51,718 |
| నవంబర్ | 1,45,867 |
| డిసెంబర్ | 1,49,507 |
| జనవరి 2023 | 1,55,922 |
| ఫిబ్రవరి | 1,49,577 |

# ఫిబ్రవరిలో 3.35 లక్షల వాహన అమ్మకాలు

న్యూఢిల్లీ: వ్యక్తిగత రవాణాకు బలమైన డిమాండ్ కొనసాగడంతో ఫిబ్రవరిలో 3.35 లక్షల ప్యాసింజర్ వాహనాలు అమ్ముడయ్యాయి. గతేడాది ఇదే నెల విక్రయాలతో పోలిస్తే ఇది 11 శాతం అధికం. ఆటోమొబైల్ రంగంలో ఇప్పటి వరకు ఫిబ్రవరిలో నమోదైన అత్యధిక టోకు అమ్మకాలు రికార్డు ఇవే కావడం విశేషం. మారుతీ సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటర్స్ ఎంఅండ్ఎం, కియా మోటార్స్, టయోటో కిర్లోస్కర్ కంపెనీలు చెప్పుకోదగిన స్థాయిలో అమ్మకాలు జరిపాయి. ఇదే నెలలో ద్విచక్ర విక్రయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. హీరో మోటోకార్ప్, రాయల్ ఎన్‌ఫీల్డ్ విక్రయాలు పెరిగాయి. బజాజ్ ఆటో, హోండా మోటోసైకిల్ అండ్ స్కూటర్ ఇండియా( హెచ్ఎంఎస్ఐ) టీవీఎస్ మోటార్ అమ్మకాలు నిరాశపరిచాయి. వాణిజ్య వాహనాలకు గిరాకీ లభించింది.

| కంపెనీ | ఫిబ్రవరి 2023 | ఫిబ్రవరి 2022 | వృద్ధి/క్షీణత(%) |
|---|---|---|---|
| మారుతీ సుజుకీ | 1,72,321 | 1,64,056 | (+)5 |
| హ్యుందాయ్ | 57,851 | 53,159 | (+)9 |
| టాటా మోటార్స్ | 79,705 | 77,733 | (+)3 |
| ఎండ్అండ్ఎం | 58,801 | 54,455 | (+)8 |
| హోండా కార్స్ | 6,086 | 7,187 | (-)15 |
| టయోటా కిర్లోస్కర్ | 15,338 | 8,745 | (+)75 |
| కియా మోటార్స్ | 24,600 | 18,121 | (+)36 |
| బజాజ్ ఆటో | 2,80,226 | 3,16,020 | (-)11 |
| హీరో మోటోకార్ప్ | 3,94,460 | 3,58,254 | (+)10 |
| టీవీఎస్ మోటార్స్ | 2,76,150 | 2,81,714 | (-)2 |
| హోండా | 2,47,175 | 3,12,650 | (-)21 |
| వోల్వో ఐషర్ | 7,289 | 5,856 | (+)24 |
| అశోక్ లేలాండ్ | 17,568 | 13,281 | (+)32 |
| ఎస్కార్ట్స్ | 7,811 | 6,114 | (+)27 |
| మహీంద్రా ట్రాక్టర్స్ | 58,801 | 54,455 | (+)8 |



# ఎట్టకేలకు లాభాలొచ్చాయ్

- 8 రోజుల వరుస నష్టాలకు బ్రేక్
- కనిష్ట స్థాయిల వద్ద కొనుగోళ్లు
- మెప్పించిన స్థూల ఆర్థిక గణాంకాలు
- కలిసొచ్చిన ప్రపంచ పరిణామాలు
- అన్ని రంగాల షేర్లకూ డిమాండ్



ముంబై: ఎనిమిది వరుస నష్టాల ముగింపు తర్వాత బుధవారం స్టాక్ సూచీలు లాభపడ్డాయి. అంతర్జాతీయ సానుకూల సంకేతాలు కలిసిరాగా.., దేశీయ స్థూల ఆర్థిక గణాంకాలు మార్కెట్ వర్గాలను మెప్పించాయి. అధిక వెయిటేజీ రిలయన్స్, టీసీఎస్, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ షేర్లు రెండుశాతం రాణించి సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ఉదయం సెన్సెక్స్ 174 పాయింట్ల లాభంతో 59,136 వద్ద, నిఫ్టీ 56 పాయింట్లు పెరిగి 17,360 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. తొలి అరగంట కాస్త తడబడినా.., వెంటనే తేరుకోగలిగాయి. యూరప్ మార్కెట్ల లాభాల ప్రారంభం మరింత విశ్వాసాన్నిచ్చింది. ఇటీవల దిద్దుబాటులో భాగంగా కనిష్టాలకు దిగివచ్చిన నాణ్యమైన షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఎగబడ్డారు. ఒక దశలో సెన్సెక్స్ 513 పాయింట్లు బలపడి 59,475 వద్ద, నిఫ్టీ 164 దూసుకెళ్లి 17,468 వద్ద ఇంట్రాడే గరిష్టాలను తాకాయి. ట్రేడింగ్ చివరి వరకు స్థిరమైన లాభాల్లో కదలాడాయి. ఫలితంగా సెన్సెక్స్ 449 పాయింట్లు పెరిగి 59,411 వద్ద, నిఫ్టీ 147 పాయింట్ల లాభంతో 17,451 వద్ద ముగిశాయి. అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ముఖ్యంగా మెటల్, ప్రభుత్వరంగ బ్యాంకింగ్ షేర్లకు భారీ డిమాండ్ నెలకొంది. విస్తృత స్థాయి మార్కెట్లోని చిన్న, మధ్య తరహా షేర్లకు రాణించడంతో మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్స్‌లు వరుసగా 1.38%, 1.35శాతం చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.424 కోట్ల షేర్లను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,499 కోట్ల షేర్లను కొన్నారు. ఆసియాలో సింగపూర్ మినహా అన్ని దేశాల సూచీలు లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు అరశాతం పెరిగాయి.

- సెన్సెక్స్ సూచీ 449 పెరగడంతో బీఎస్‌ఈ ఎక్స్ఛేంజీలో రూ.3.28 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది.
- అదానీ గ్రూప్‌లోని మొత్తం పది కంపెనీల షేర్లు లాభపడ్డాయి. అత్యధికంగా అదానీ ఎంటర్‌ప్రైజెస్ 15% బలపడింది. అదానీ ట్రాన్స్‌మిషన్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ విల్మార్, అదానీ పవర్, అదానీ టోటల్ గ్యాస్, ఎన్‌డీటీవీ షేర్లు ఐదుశాతం పెరిగి అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి. అంబుజా సిమెంట్స్ 3.32%, ఏసీసీ 2.14%, అదానీ పోర్ట్స్ ఒకటిన్నరశాతం చొప్పున లాభపడ్డాయి. దీంతో గ్రూప్ మొత్తం కంపెనీల మార్కెట్ వ్యాల్యుయేషన్ రూ.7.56 లక్షల కోట్లకు చేరింది.

### ఎఫ్అండ్ఓలో చమురు, గ్యాస్

**ఎన్ఎస్ఈకి సెబీ గ్రీన్‌సిగ్నల్**

స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్ఎస్ఈ లైట్ స్వీట్ క్రూడ్‌గా పిలిచే డబ్ల్యూటీఐతోపాటు.. నేచురల్ గ్యాస్ ఫ్యూచర్స్ కాంట్రాక్టులను ప్రవేశ పెట్టనుంది. ఇందుకు సెబీ నుంచి అనుమతి పొందినట్లు ఎన్ఎస్ఈ తాజాగా వెల్లడించింది. త్వరలోనే వీటి ఎఫ్అండ్ఓ లావాదేవీలను ప్రారంభించనున్నట్లు పేర్కొంది.

# దక్షిణాదికి లుపిన్ డయాగ్నోస్టిక్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డయాగ్నోస్టిక్స్ సేవల్లో ఉన్న లుపిన్ డయాగ్నోస్టిక్స్ దక్షిణాదిలో అడుగుపెట్టింది. రీజినల్ రెఫరెన్స్ ల్యాబొరేటరీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది. దీంతో సంస్థ ఖాతాలో దేశవ్యాప్తంగా ల్యాబ్స్ సంఖ్య 24కు చేరిందని లుపిన్ డయాగ్నోస్టిక్స్ సీఈవో రవీంద్ర కుమార్ బుధవారమిక్కడ మీడియాకు తెలిపారు. 'నవీ ముంబైలో నేషనల్ రెఫరెన్స్ ల్యాబొరేటరీ ఉంది. 380కిపైగా ఎక్స్‌క్లూజివ్ కలెక్షన్ సెంటర్లు (లుపిమిత్ర) ఉన్నాయి. 400 మందికి పైచిలుకు సిబ్బంది పనిచేస్తున్నారు. లుపిమిత్ర కేంద్రాల ఏర్పాటుకు ఫ్రాంచైజీలను ఆహ్వానిస్తున్నాం. ఏడాదిలో దేశవ్యాప్తంగా 100 ల్యాబ్స్ నెలకొల్పుతాం. ప్రతి ల్యాబ్ ఏర్పాటైన 18 నెలల్లోనే ఎన్ఏబీహెచ్ ధ్రువీకరణ పొందాలన్నదే మా లక్ష్యం' అని ఆయన వివరించారు.

# యాక్సిస్ గూటిలో సిటీ రిటైల్

- దేశీ బిజినెస్ కొనుగోలు పూర్తి
- రూ. 11,603 కోట్లు చెల్లింపు

న్యూఢిల్లీ/ముంబై: విదేశీ సంస్థ సిటీ బ్యాంకు రిటైల్ బిజినెస్ కొనుగోలు పూర్తయినట్లు ప్రయివేట్ రంగ దేశీ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ తాజాగా పేర్కొంది. దేశీయంగా సంస్థాగత క్లయింట్ల బిజినెస్‌ను మినహాయించిన డీల్ ప్రకారం తుదిగా రూ. 11,603 కోట్లు చెల్లించినట్లు వెల్లడించింది. గతేడాది మార్చిలో యాక్సిస్ తొలిసారిగా కొనుగోలు అంశాన్ని ప్రకటించింది. దీనిలో భాగంగా 2.4 మిలియన్ సిటీ కస్టమర్లను యాక్సిస్ పొందింది. డీల్ కుదిరే సమయానికి ఈ సంఖ్య 3 మిలియన్లుగా నమోదైనట్లు యాక్సిస్ ఎండీ, సీఈవో అమితాబ్ చౌధురి తెలియజేశారు. తమ ఖాతాదారులుగా మారిన సిటీ కస్టమర్ల బ్యాంక్ ఖాతాలు, చెక్ బుక్కులు, ప్రొడక్టు లబ్ధి తదితరాలు యథావిధిగా కొనసాగనున్నట్లు వివరించారు. మొత్తం 8.6 మిలియన్ కార్డులతో నాలుగో పెద్ద క్రెడిట్ కార్డుల సంస్థగా నిలుస్తున్న యాక్సిస్ మరో 2.5 మిలియన్ క్రెడిట్ కార్డులను జత చేసుకుంది. తద్వారా మూడో ర్యాంకుకు చేరింది. రూ. 4 లక్షల కోట్ల రిటైల్ బుక్ కలిగిన యాక్సిస్ సిటీబ్యాంక్ ఇండియాకు చెందిన 3 మిలియన్ కస్టమర్లతోపాటు.. 18 పట్టణాలలో గల 7 కార్యాలయాలు, 21 బ్రాంచీలు, 499 ఏటీఎంలను సొంతం చేసుకుంది. రెండు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందంమేరకు సిటీ బ్రాండును 18 నెలలపాటు యాక్సిస్ బ్యాంక్ వినియోగించుకోనుంది.



# విదేశీ విద్యకు ఉపకారం

**నేషనల్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్‌కు ప్రకటన విడుదల**

విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనేది ఎంతో మంది విద్యార్థుల అభిలాష. కానీ పేదరికం, ఆర్థిక సమస్యల కారణంగా ముందడుగు వేయలేక పోతున్నారు. ఇలాంటి విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ స్కీమ్‌ను తీసుకువచ్చింది.ఈ స్కీమ్ ద్వారా విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే పేద విద్యార్థులకు ఆర్థిక చేయూతను అందిస్తుంది. మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్.. నేషనల్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను కోరుతోంది. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

**స్కాలర్‌షిప్స్**

### అర్హతలు

ఈ స్కాలర్‌షిప్ స్కీమ్ ద్వారా పీజీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలనుకునే విద్యార్థులు కనీసం బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ కోర్సు అభ్యసించిన కాలేజీ వివరాలు దరఖాస్తులో పొందుపరచాలి. అదేవిధంగా పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసే విద్యార్థులు పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. పీజీ చదివిన విద్యాసంస్థ వివరాలను దరఖాస్తులో రాయాలి. అలాగే సంబంధిత డిగ్రీ, పీజీల్లో కనీసం 60% మార్కులను పొంది ఉండాలి.

### వయసు

2023, ఏప్రిల్ 01 తేదీ నాటికి 35 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలి. కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలు మించకూడదు. ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని అప్‌లోడ్ చేయాలి.

### మొత్తం స్కాలర్‌షిప్‌లు

అర్హులైన విద్యార్థులకు ప్రతి ఆర్థిక సంవత్సరం 125 స్కాలర్‌షిప్‌లను అందిస్తారు. వీటిలో ఎస్సీ-115, ఎస్టీలకు(డినోటిఫైడ్, సంచార,సెమీ సంచార తెగలు) 06 , భూమిలేని వ్యవసాయ కూలీలకు, సంప్రదాయ కళాకారులకు-4 కేటాయిస్తారు. ప్రతి ఏటా మొత్తం స్కాలర్‌షిప్‌ల్లో మహిళలకు 30 శాతం కేటాయిస్తారు.

మాస్టర్ డిగ్రీలో చేరిన వారికి మూడేళ్లు; పీహెచ్‌డీ విద్యార్థులకు నాలుగేళ్ల కాలానికి ఈ స్కాలర్‌షిప్‌లను అందిస్తారు. ట్యూషన్ ఫీజు, మెయింటనెన్స్ అలవెన్స్, అత్యవసర ఖర్చులు, వీసా ఫీజు, ఎక్విప్‌మెంట్ అలవెన్స్, మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియం తదితర ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందిస్తారు.

### అవసరమైన డాక్యుమెంట్స్

దరఖాస్తు సమయంలో పదో తరగతి సర్టిఫికేట్, కులధ్రువీకరణ పత్రం, ఫోటో, స్కాన్డ్ సిగ్నేచర్, ప్రస్తుతం/శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం, ప్రొవిజనల్ సర్టిఫికేట్, అర్హత పరీక్షకు సంబంధించి ప్రతి సెమిస్టర్‌లో మార్క్‌షీట్స్, ప్రూఫ్ ఆఫ్ సీజీపీఏ/ఎస్‌జీపీఏ,ఫారిన్ యూనివర్సిటీ ఆఫర్ లెటర్ ఉండాలి.

### విదేశీ వర్సిటీ వివరాలు

ప్రవేశం పొందిన విదేశీ యూనివర్సిటీ/విద్యాసంస్థ వివరాలను దరఖాస్తులో తెలియజేయాలి. అన్‌కండిషనల్ ఆఫర్ లెటర్‌ను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలి. ఒకటికంటే ఎక్కువ యూనివర్సిటీల్లో ప్రవేశం లభిస్తే.. వాటిలో ఒకదాన్ని ఎంపిక చేసుకొని సంబంధిత వివరాలను తెలియజేయాలి. అభ్యర్థి ఇప్పటికే వీసా పొంది ఉంటే.. ఆ వివరాలను కూడా దరఖాస్తులో పొందుపరచాలి. లేదా వీసాకు దరఖాస్తు చేసుకున్నట్లయితే ఆ వివరాలను రాయాలి. సంబంధిత పోర్టల్‌లో ఉన్న మార్గదర్శకాలను పాటిస్తూ పూర్తి వివరాలను తెలియజేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు దరఖాస్తు చేసే సమయంలో ఈమెయిల్, మొబైల్ నంబర్‌లను సరిగా రాయాల్సి ఉంటుంది.

### ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- దరఖాస్తులకు చివరి తేదీ: 31.03.2023
- వెబ్‌సైట్: https://nosmsje.gov.in

# విద్య, ఉద్యోగ సమాచారం

## పీవీ ఎన్ఆర్‌వీయూ, రాజేంద్రనగర్‌లో పీహెచ్‌డీ కోర్సులు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం.. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 12 సీట్లు.

» **సబ్జెక్టులు:** వెటర్నరీ అనాటమీ, వెటర్నరీ పారాసిటాలజీ, వెటర్నరీ పాథాలజీ, వెటర్నరీ ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ, యానిమల్ జెనెటిక్స్ అండ్ బ్రీడింగ్, లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్, పౌల్ట్రీ సైన్స్, వెటర్నరీ గైనకాలజీ అండ్ అబ్‌స్టేట్రిక్స్, వెటర్నరీ మెడిసిన్, వెటర్నరీ సర్జరీ అండ్ రేడియాలజీ, అనిమల్ న్యూట్రిషన్.

» **అర్హత:** సంబంధిత విభాగంలో ఎంవీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. » **వయసు:** 01.07.2023 నాటికి 50 ఏళ్లు మించకూడదు.

» **ఎంపిక విధానం:** ఐసీఏఆర్-ఏఐసీఈ-జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్(పీహెచ్‌డీ)-2022 ర్యాంకు ఆధారంగా సీటు కేటాయిస్తారు.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.03.2023.

» **వెబ్‌సైట్:** www.tsvu.nic.in

# ప్రఖ్యాత సంస్థలో.. వినూత్న కోర్సులు!

» ప్రవేశ ప్రకటన విడుదల చేసిన ఐఎస్ఐ
» యూజీ, పీజీ, పీహెచ్‌డీ, పీజీ డిప్లొమాల్లో అడ్మిషన్స్

**దేశంలో పేరున్న విద్యా సంస్థల్లో ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్ఐ) ప్రధానమైంది. ఈ ఇన్‌స్టిట్యూట్ అందించే మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్ కోర్సులకు మంచి డిమాండ్ ఉంది. ఐఎస్ఐకి కోల్‌కతా, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, తేజ్‌పూర్, గిరిడీల్లో క్యాంపస్‌లున్నాయి. వీటిలో యూజీ, పీజీ స్థాయిలో కోర్సులు అందిస్తున్నారు. వీటిలో ప్రవేశాలకు సంబంధించి ఇటీవల నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఐఎస్ఐ కోర్సుల ప్రత్యేకత, అర్హతలు, ప్రవేశ విధానం తదితర వివరాలు..**



**కెరీర్ గైడెన్స్**

### కోర్సులు ఇవే

ఐఎస్ఐ ప్రాంగణాల్లో బీస్టాట్, ఎంస్టాట్, బీమ్యాథ్స్, ఎంమ్యాథ్స్, ఎంటెక్, పీజీ డిప్లొమా, పీహెచ్‌డీ కోర్సులు అందిస్తున్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులు, ఫైనల్ ఇయర్ చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశ పరీక్షలో చూపిన ప్రతిభ, ఇంటర్వ్యూ ఆధారంగా అడ్మిషన్ లభిస్తుంది.

### స్టయిపెండ్

ఐఎస్ఐలో డిగ్రీ కోర్సుల్లో చేరినవారికి నెలకు రూ.5 వేలు, పీజీ విద్యార్థులకు నెలకు రూ.8వేలు, ఎంటెక్ కోర్సుల విద్యార్థులకు నెలకు రూ.12,400 స్టయిపెండ్ చెల్లిస్తారు. ఇంజనీరింగ్ కోర్సుల్లో జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్)కు ఎంపికైతే నెలకు రూ.31,1000తోపాటు హెచ్ఆర్ఏ; సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌కు ఎంపికైతే నెలకు రూ.35,000తోపాటు హెచ్ఆర్ఏ అందిస్తారు. అన్ని కోర్సుల విద్యార్థులకూ ఏటా కాంటింజెన్సీ గ్రాంట్ లభిస్తుంది. తక్కువ ధరకు వసతి, భోజన సౌకర్యాలు పొందొచ్చు. కోర్సు చివర్లో క్యాంపస్ నియామకాలు నిర్వహిస్తారు. ఈ సంస్థల్లో కోర్సులు పూర్తిచేసుకున్నవారికి ఆకర్షణీయ వేతనాలతో ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయి.

### యూజీ కోర్సులు-అర్హతలు

- **బీస్టాట్:** ఈ కోర్సుకు సంబంధించి 63 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్ చదివి ఉండాలి. కోల్‌కతా క్యాంపస్‌లో ఆనర్స్ విధానంలో కోర్సు నిర్వహిస్తున్నారు. కోర్సు వ్యవధి మూడేళ్లు.
- **బీమ్యాథ్స్:** ఈ కోర్సులో 63 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్ పూర్తిచేయాలి. బెంగళూర్ క్యాంపస్‌లో ఆనర్స్ విధానంలో కోర్సు నిర్వహిస్తున్నారు. ఈ కోర్సు వ్యవధి మూడేళ్లు.

### పీజీ కోర్సులు ఇవే

- **మాస్టర్ ఆఫ్ స్టాటిస్టిక్స్:** ఈ స్పెషలైజేషన్‌లో 38 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్టుగా ఏదైనా మూడేళ్ల డిగ్రీ లేదా బీఈ/బీటెక్ చదివుండాలి. ఈ కోర్సు మొదటి సంవత్సరం కోల్‌కతా, చెన్నై, ఢిల్లీల్లో.. అలాగేరెండో ఏడాది కోర్సును కోల్‌కతా క్యాంపస్‌లో అందిస్తారు.
- **మాస్టర్ ఆఫ్ మ్యాథమాటిక్స్:** ఇందులో 36 సీట్లు ఉన్నాయి. మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా ఏదైనా మూడేళ్ల డిగ్రీ లేదా బీఈ/బీటెక్ కోర్సు పూర్తిచేసినవారు దరఖాస్తుకు అర్హులు. ఈ కోర్సు కోల్‌కతా క్యాంపస్‌లో అందిస్తున్నారు.
- **ఎంఎస్ క్వాంటిటేటివ్ ఎకనామిక్స్:** ఏదైనా డిగ్రీ కోర్సుతోపాటు ఇంటర్‌లో మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా చదివుండాలి. కోల్‌కతా, ఢిల్లీ క్యాంపస్‌ల్లో ఈ కోర్సును అందిస్తున్నారు. ఢిల్లీ-35 సీట్లు, కోల్‌కతా క్యాంపస్‌లో 21 సీట్లు ఉన్నాయి.
- **ఎంఎస్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ సైన్సెస్:** ఈ కోర్సుకు సంబంధించి 20 సీట్లు ఉన్నాయి. డిగ్రీలో మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా చదివుండాలి. లేదా ఏదైనా విభాగంలో బీఈ/బీటెక్ పూర్తిచేయాలి. బెంగళూరు, హైదరాబాద్ క్యాంపస్‌ల్లో నిర్వహిస్తున్నారు. తొలి రెండు సెమిస్టర్లు బెంగళూరు, మూడో సెమిస్టరు హైదరాబాద్ క్యాంపస్‌లో చదువుతారు.
- **ఎంఎస్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్:** ఈ కోర్సులో 12 సీట్లున్నాయి. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు.బెంగళూరు క్యాంపస్‌లో ఈ కోర్సు అందుబాటులో ఉంది.
- **వ్యవధి:** పీజీ కోర్సుల కాల వ్యవధి రెండేళ్లుగా ఉంది.

### ఎంటెక్ కోర్సులు

- **కంప్యూటర్ సైన్స్(సీఎస్):** బీఈ/బీటెక్ లేదా ఇంటర్‌లో మ్యాథ్స్‌తో ఏదైనా పీజీ చదివిన వారు అర్హులు. కోల్‌కతా క్యాంపస్ ఈ కోర్సును ఆఫర్‌చేస్తుంది. ఐఎస్ఐ పరీక్షతో-30 మందిని, గేట్ స్కోర్‌తో 15 మందిని చేర్చుకుంటారు.
- **క్రిప్టాలజీ అండ్ సెక్యూరిటీ(సీఆర్ఎస్):** బీఈ/బీటెక్ లేదా ఇంటర్‌లో మ్యాథ్స్‌తో ఏదైనా పీజీ చదివినవారు అర్హులు. కోల్‌కతా క్యాంపస్‌లో కోర్సు అందిస్తున్నారు. ఐఎస్ఐ పరీక్షతో 20 మందికి, గేట్ స్కోర్‌తో ఐదు మందికి అవకాశం కల్పిస్తారు.
- **క్వాలిటీ, రిలయబిలిటీ అండ్ ఆపరేషన్ రీసెర్చ్( క్యూఆర్ఓఆర్):** ఈ కోర్సులో 32 సీట్లు ఉన్నాయి. స్టాటిస్టిక్స్‌లో మాస్టర్ డిగ్రీ ఉండాలి. దీంతోపాటు ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ చదివుండాలి. లేదా మ్యాథ్స్‌లో మాస్టర్ డిగ్రీతోపాటు డిగ్రీలో స్టాటిస్టిక్స్, ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ చదివుండాలి. లేదా బీఈ/బీటెక్ ఉండాలి. కోల్‌కతా క్యాంపస్ ఈ కోర్సును అందిస్తోంది.

### పీజీ డిప్లొమాలు

- పీజీ డిప్లొమా కోర్సుల కాలవ్యవధి ఏడాదిగా ఉంది.
- **పీజీ డిప్లొమా ఇన్ స్టాటిస్టికల్ మెథడ్స్ అండ్ అనలిటిక్స్:** మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ లేదా బీఈ/బీటెక్ చదివిన వాళ్లు దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సు వ్యవధి ఏడాది. చెన్నై, తేజ్‌పూర్ క్యాంపస్‌ల్లో అందిస్తున్నారు. చెన్నైలో-25, తేజ్‌పూర్‌లో 18 సీట్లు ఉన్నాయి.
- **పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ అండ్ రూరల్ మేనేజ్‌మెంట్ విత్ స్టాటిస్టికల్ మెథడ్స్ అండ్ ఎనలిటిక్స్(పీజీడీఏఆర్ఎస్ఎంఏ):** ఏడాది కాలవ్యవధి కలిగిన ఈ కోర్సును గిరిడీ(జార్ఖండ్) క్యాంపస్ అందిస్తోంది. ఇందులో 18 సీట్లు ఉన్నాయి. డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. ఇంటర్‌లో మ్యాథ్స్ లేదా స్టాటిస్టిక్స్ చదివుండాలి. ఈ కోర్సుకు స్టయిపెండ్ లేదు.
- **పీజీ డిప్లొమా ఇన్ అప్లయిడ్ స్టాటిస్టిక్స్:** ఇందులో 30 సీట్లు ఉన్నాయి. గత విద్యాసంవత్సరం నుంచి ఐఎస్ఐ అప్లయిడ్ స్టాటిస్టిక్స్‌లో ఏడాది వ్యవధి కలిగిన పీజీ డిప్లొమా కోర్సును ఆన్‌లైన్‌లో కోర్స్ ఎరాతో కలిసి అందిస్తోంది. ఇంటర్‌లో మ్యాథ్స్ చదివి, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **పీజీ డిప్లొమా ఇన్ బిజినెస్ అనలిటిక్స్:** ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ (ఐఎస్ఐ),కోల్‌కతా; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ( ఐఐటీ), ఖరగ్‌పూర్; ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం), కోల్‌కతా-ఈ మూడు సంస్థలూ కలిసి రెండేళ్ల పీజీ డిప్లొమా ఇన్ బిజినెస్ అనలిటిక్స్ కోర్సు అందిస్తున్నాయి. అర్హత: కనీసం 60శాతం మార్కులతో బీటెక్/ఎంటెక్ /ఎమ్మెస్సీ /ఎంకాం/ఎంబీఏ పూర్తిచేసుకున్నవారు అర్హులు. ప్రస్తుతం ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

### ఎంపిక విధానం

ఐఎస్ఐ ఆయా కోర్సులను బట్టి ప్రత్యేకమైన ఎంపిక విధానాన్ని అనుసరిస్తోంది. ప్రవేశ పరీక్షలో చూపిన ప్రతిభ, ఇంటర్వ్యూ, ఇంటర్‌లో సాధించిన మార్కులు, పని అనుభవం తదితరాల ఆధారంగా కోర్సులోకి తీసుకుంటారు.

### పరీక్ష ఇలా

ఐఎస్ఐ ప్రవేశ పరీక్షను 150 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో 50 ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు మూడు మార్కులు. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. వెర్బల్ ఎబిలిటీ నుంచి -15 ప్రశ్నలు, లాజికల్ రీజనింగ్-05 ప్రశ్నలు, డేటాఇంటర్ ప్రిటెషన్ అండ్ డేటా విజువలైజేషన్ -05 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 25 ప్రశ్నలుంటాయి. పరీక్ష వ్యవధి 3 గంటలు.

### ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 10.03.2023
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 05.04.2023
- అడ్మిట్ కార్డులు: 2023, ఏప్రిల్ 26 నుంచి
- ఐఎస్ఐ అడ్మిషన్ టెస్ట్ తేదీ: మే 14, 2023
- వెబ్‌సైట్: https://www.isical.ac.in

## క్లుప్తంగా...

### బాహుబలి పుట్టగొడుగు !



పుట్టగొడుగు సహజంగా 5–6 అంగుళాల ఎత్తు, దాదాపు 10 గ్రాముల బరువు ఉంటాయి. సీజనల్‌గా ఆకాశం ఉరిమిన సమయాల్లో పెరటి తోటల్లో, పొలాల గట్లపై ఈ పుట్టగొడుగులు కనిపిస్తుంటాయి. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలోని నూరాణి మసీదులో 1.60 కిలోల బరువు, 21 అంగుళాల ఎత్తు ఉన్న భారీ పుట్టగొడుగు కనిపించి ఆశ్చర్యానికి గురిచేసింది. తాజాగా తన సహజ తెలుపు రంగులో ఉన్న ఈ పుట్టగొడుగు చూపరులను ఆకట్టుకుంది. – యర్రగొండపాలెం

### ఏపీలో 13 శాతం పెరిగిన జీఎస్టీ వసూళ్లు


**సాక్షి, న్యూఢిల్లీ:** వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లలో ఏపీ గణనీయ వృద్ధిని సాధించినట్లు కేంద్ర ఆర్థిక శాఖ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. గతేడాది ఫిబ్రవరిలో ఏపీలో జీఎస్టీ వసూళ్లు రూ.3,157 కోట్లు ఉండగా, అది ఈ ఏడాది 13 శాతం మేర పెరిగి రూ.3,557 కోట్లకు చేరిందని పేర్కొంది. తెలంగాణలో గతేడాది రూ.4,113 కోట్లుగా ఉన్న జీఎస్టీ వసూళ్లు 8 శాతం మేర పెరిగి రూ.4,424 కోట్లుగా ఉందని వెల్లడించింది.

### 6 మండలాల విభజన

**సాక్షి, అమరావతి:** పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్రంలోని ఆరు మండలాలను ప్రభుత్వం విభజించింది. అనంతపురం మండలాన్ని అనంతపురం అర్బన్, రూరల్ మండలాలుగా, ఒంగోలు మండలాన్ని ఒంగోలు అర్బన్, రూరల్‌గా, విజయనగరం మండలాన్ని విజయనగరం అర్బన్, రూరల్‌గా, చిత్తూరు మండలాన్ని చిత్తూరు అర్బన్, రూరల్‌గా, నంద్యాల మండలాన్ని నంద్యాల అర్బన్, రూరల్ మండలాలుగా, మచిలీపట్నం మండలాన్ని మచిలీపట్నం నార్త్, మచిలీపట్నం సౌత్ మండలాలుగా పునర్విభజించింది. ఈ మేరకు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ బుధవారం వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీచేశారు. ఆయా మండలాల్లో అర్బన్ ప్రాంతం, రూరల్ ప్రాంతాలు ఉండడం, జనాభా పెరిగిన నేపథ్యంలో వాటిని అర్బన్, రూరల్ మండలాలుగా విభజించాలన్న ప్రతిపాదనలు ఇన్నాళ్లకు ఆచరణకు వచ్చాయి. వీటిపై అభ్యంతరాలుంటే 30 రోజుల్లోపు ఆయా జిల్లాల కలెక్టరేట్లలో ఇవ్వాలని సూచించారు.

# విదేశీ విద్య మరింత భారం

**మరోవైపు డాలర్‌తో రూపాయి పతనంతో మరిన్ని కష్టాలు**



## బ్యాంకులు వడ్డీ రేట్లు భారీగా పెంచడంతో రుణాల ఊబిలో విద్యార్థులు


- ఉద్యోగాలు రాక, మధ్యలో కంపెనీల తొలగింపులతో ఇబ్బందులు
- దేశంలో 2022లో రూ.15,445 కోట్లకు చేరిన విద్యా రుణాలు
- అందులో రూ.7,576 కోట్లు విదేశాల్లో చదువుల కోసమే మంజూరు
- 2022లో విదేశాలకు వెళ్లిన భారత విద్యార్థులు 7.50 లక్షల మంది

**సాక్షి, అమరావతి:** విదేశీ విద్య భారత విద్యార్థులకు మరింత భారమవుతోంది. ఇప్పటికే డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ అంతకంతకూ పతనమవుతోంది. దీంతో భారత విద్యార్థులు అమెరికాలో చదువుకోవాలంటే మరిన్ని ఎక్కువ రూపాయలను ఖర్చు పెట్టుకోవాల్సి వస్తోంది. మరోవైపు బ్యాంకులు రుణాలపై వడ్డీరేట్లను పెంచడంతో విద్యా రుణాలు తడిసి మోపెడవుతున్నాయి. విదేశాల్లో చదివితే ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయని, అత్యధిక వేతనాలు వస్తాయన్న ఆశతో వెళ్తున్న విద్యార్థుల్లో అత్యధికులు చివరకు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. చదువులు ముగిసిన వెంటనే విద్యార్థులు మంచి కొలువులు సాధిస్తే సరి.. లేకపోతే వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. విదేశీ చదువులు ముగిస్తున్న వారిలో కేవలం నాలుగో వంతు మందికి మాత్రమే ఆయా దేశాల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయని గణాంకాలు తెలుపుతున్నాయి. కంపెనీలు ఆర్థిక పరిస్థితులతో కొందరిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నాయి. తక్కిన వారంతా స్వదేశానికి తిరిగొచ్చి ఇక్కడ ఉద్యోగాలు వెతుక్కుంటున్నారు. మరోవైపు ఇక్కడి వేతనాలు, విదేశీ చదువుల కోసం చేసిన అప్పులకు పొంతన లేకపోవడంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఇక ఆ కొలువులూ దక్కని వారి కుటుంబాలు ఆ అప్పులు తీర్చడానికి సతమతమవుతున్నాయి. గత ఐదారేళ్లలో ఒక్క కరోనా సమయంలో మినహాయిస్తే ఏటా కనీసం 4 లక్షల వరకు విద్యార్థులు చదువుల కోసం విదేశాలకు వెళ్తున్నారు.

#### కరోనా తగ్గుముఖం పట్టాక..

కరోనా తగ్గుముఖం పట్టడంతో విదేశీ చదువులకు వెళ్తున్న విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగింది. దీంతో సహజంగానే ఆ మేరకు రుణాల శాతం కూడా ఎక్కువైంది. 2019లో 5.86 లక్షల మంది భారత విద్యార్థులు విదేశాల్లో చదువుల కోసం వెళ్లారు.

**విదేశాల్లో చదువుల కోసం వెళ్లిన వారి సంఖ్య ఇలా..**




2020లో ఆ సంఖ్య ఒక్కసారిగా సగానికి తగ్గి 2.59 లక్షలకు పడిపోయింది. కరోనా వ్యాప్తి కారణంగా అనేక దేశాల్లో రాకపోకలపై నిషేధాలు, విద్యా సంస్థల మూత ఇందుకు కారణాలుగా నిలిచాయి. 2021 నుంచి కరోనా తగ్గుదలతో క్రమేణా మళ్లీ విదేశాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య పెరిగింది. 2022లో ఆ సంఖ్య గతంలో ఎన్నడూ లేనంత స్థాయికి చేరింది. గతేడాది 7.5 లక్షల మంది విదేశాలకు వెళ్లారని కేంద్ర ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.


#### ప్రభుత్వ రంగ బ్యాంకుల నుంచే అధిక రుణాలు

విదేశాల్లో చదువులకోసం వెళ్లే విద్యార్థులు ఫీజుల కోసం అత్యధికంగా ప్రభుత్వ బ్యాంకుల రుణాలపైనే ఆధారపడుతున్నారు. దాదాపు 95 శాతం మంది విద్యార్థులు ఈ రుణాల ఆధారంగానే విదేశీ విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తున్నారని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇటీవల కేంద్రం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. దేశంలో 2021లో విదేశీ విద్య కోసం ప్రభుత్వరంగ బ్యాంకులు అందించిన రుణాల మొత్తం రూ.4,503.61 కోట్లుగా ఉంది. 2020లో మంజూరు చేసిన రుణాలతో పోల్చి చూస్తే ఇది 23.5 శాతం తక్కువ. కరోనా కారణంగా 2020లో విదేశీ విద్యకు ఆటంకాలు ఏర్పడడంతో విద్యా రుణాల మంజూరు కూడా భారీగా తగ్గింది. 2022లో రుణాల మంజూరు అమాంతం పెరిగింది. గతేడాది ప్రభుత్వ రంగ బ్యాంకులు విదేశాల్లో చదువుల కోసం వెళ్లే విద్యార్థులకు రూ.7,576.02 కోట్లను మంజూరు చేశాయి. 2021లో మంజూరు చేసిన రుణాలతో పోల్చి చూస్తే ఇది 68.2 శాతం అధికం. 2022లో మొత్తం విద్యా రుణాలు రూ.15,445.62 కోట్లు ఇవ్వగా అందులో దాదాపు సగం మేర అంటే రూ. 7,576.02 కోట్లు విదేశీ విద్యకోసం ఇచ్చినవే.

#### చెల్లించడానికి ఇబ్బందులు

ఇటీవల కాలంలో వడ్డీ రేట్లు భారీగా పెరగడంతో ఆ ప్రభావం విద్యా రుణాలపైన పడుతోందని పలువురు నిపుణులు పేర్కొంటున్నారు. తీసుకున్న రుణం వడ్డీతో కలిపి తడిసి మోపెడవుతోందని, దీన్ని తీర్చడానికి సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరిస్తున్నారు. ఉద్యోగాల్లో చేరి అధిక వేతనాలు తీసుకుంటున్న వారే తిరిగి కట్టలేని పరిస్థితి ఉందని చెబుతున్నారు. అలాంటిది అరకొర వేతనాలు, లేదా అసలు ఉద్యోగమే లేని వారి కుటుంబాలు మరిన్ని కష్టాలు ఎదుర్కొంటున్నాయని అంటున్నారు.

**విదేశీ విద్యా రుణాల పెరుగుదల శాతం ఇలా..**




**2022లో విదేశీ చదువుల కోసం వెళ్లిన విద్యార్థుల సంఖ్య ఇలా..**

| | |
|---|---|
| యూఎస్ఏ | 1,90,512 |
| కెనడా | 1,85,955 |
| యూకే | 1,32,709 |
| ఆస్ట్రేలియా | 59,044 |
| జర్మనీ | 20,684 |
| రష్యా | 19,784 |
| సింగపూర్ | 17,085 |
| బంగ్లాదేశ్ | 17,006 |
| కిర్గిస్తాన్ | 14,728 |
| ఫిలిప్పీన్స్ | 11,261 |
| కజికిస్తాన్ | 8,895 |
| ఫ్రాన్స్ | 6,406 |

### ఈ వేసవిలో సాధారణ ఉష్ణోగ్రతలే

- అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం తక్కువే
- ఎల్‌నినో లేదు.. నెమ్మదిగా బలహీనపడుతున్న లానినో
- హీట్‌వేవ్ సమయంలో స్వల్పంగా పెరగనున్న ఉష్ణోగ్రతలు
- భారత వాతావరణశాఖ వెల్లడి



**సాక్షి, అమరావతి:** ఈ వేసవిలో రాష్ట్రంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు భారత వాతావరణశాఖ స్పష్టం చేసింది. తీవ్రమైన ఎండలు ఉండే అవకాశాలు తక్కువేనని తెలిపింది. ఎల్‌నినో పరిస్థితుల వల్ల ఎండల తీవ్రత పెరుగుతుందని, వర్షాభావం నెలకొంటుందని కొన్ని ప్రైవేటు వాతావరణ సంస్థలు అభిప్రాయపడ్డాయి. కానీ భారత వాతావరణశాఖ బుధవారం విడుదల చేసిన నివేదికలో ఎల్‌నినో ప్రభావం ఉన్నట్లు నిర్ధారించలేదు. గత మూడు, నాలుగేళ్లుగా కొనసాగుతున్న లానినో బలహీనపడుతోందని, అదే సమయంలో ఎల్‌నినో న్యూట్రల్‌గా ఉందని స్పష్టం చేసింది. లానినో ఉంటే విస్తృతంగా వర్షాలు పడతాయి. ఎల్‌నినో ఉంటే వర్షాభావం నెలకొని కరువు పరిస్థితులు ఏర్పడతాయి. వాతావరణశాఖ తాజా నివేదికలో ఎల్‌నినో న్యూట్రల్‌గా ఉందని చెప్పిన నేపథ్యంలో ఉష్ణోగ్రతలు సాధారణంగానే ఉంటాయి. అంటే గత సంవత్సరంలో ఉన్న వాతావరణ పరిస్థితులే ఈసారి ఉండే అవకాశం ఉంది. 44 నుంచి 46 డిగ్రీల మేర అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంటుంది. గత సంవత్సరం కూడా ఇవేస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత ఏడాది ఉమ్మడి నెల్లూరు జిల్లా గూడూరులో అత్యధికంగా 45.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అదే సమయంలో హీట్‌వేవ్ ఉంటుందని వాతావరణశాఖ తెలిపింది. అంటే మొత్తంగా చూసుకున్నప్పుడు సాధారణ ఉష్ణోగ్రతలు నమోదైనా అక్కడక్కడ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు రికార్డవుతున్నాయి. చలిగాలులు కూడా ఉండడం వల్ల ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలలోపే ఉంటున్నాయి. వచ్చే 10–15 రోజుల్లో ఉష్ణోగ్రతలు నెమ్మదిగా పెరిగే అవకాశం ఉంది. అలాగే వడగాలుల తీవ్రత కూడా పెరుగుతుందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.



Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.